పరిణత వాణి

(ఏడవ సంపుటి)

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాద్

పరిణతవాణి

(ఏడవ సంపుటి)

(65 ఏళ్ళకు పైబడిన తెలుగు భాషా సాహిత్యరంగ ప్రముఖుల ఆత్మకథా ప్రసంగ వ్యాసాలు)

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణ రెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

డా. జె. చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్-500001.

ఫోన్ నెం.: 040-24753724

PARINATHAVANI
(VOLUME - VII)
(A Collection of Autobiographical Speeches of Eminent Telugu Literary Persons)

ప్రథమ ముద్రణ : మార్చి, 2015

పుటల సంఖ్య : 200

ప్రతులు : 1000

మూల్యం : రూ. 125

డిటిపి : ఆర్. అనురాధ రఘురాం

ప్రతులకు:
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాద్
ఫోన్: +91-40-24753724

ముద్రణ:
సాయిలిఖిత ప్రింటర్స్
ఖైరతాబాద్, హైదరాబాద్.
ఫోన్: 040-65545979

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఎ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex. M.P.
M.A., Ph.D., D.Litt.
PRESIDENT
Andhra Saraswatha Parishath
Tilak Road,
Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

అవతారిక

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కాళోజి నారాయణరావు, శ్రీ బూర్గుల రామకృష్ణారావు, శ్రీ లోకనంది శంకర నారాయణ రావు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943 మే 26 న రూపుదిద్దుకుని ఈ రోజు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా॥దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతో పాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నవి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి

స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలవరించింది. 2013 లో పరిషత్తు సప్తతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించింది. తెలంగాణ ప్రత్యేకతలోని వివిధ పార్శ్వాలను ఆవిష్కరించే సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నిపుణుల ప్రసంగ వ్యాసాలను "వ్యాసగుళుచ్ఛం" పేరుతో పరిషత్తు రెండు భాగాలు వెలువరించింది. వివిధ రంగాలలో తెలంగాణ వైశిష్ట్యాన్ని విశదీకరించే "తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం" పై సదస్సు వంటి కార్యక్రమాలను పరిషత్తు ఏర్పాటు చేసింది.

తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నం సాకారమై 2014 జూన్ 2 వ తేదీన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణను సర్వతోముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయడం హర్షణీయం. తెలంగాణ భాషా సాహిత్య కళా సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఏడు దశాబ్దాలకు పైగా అంకితభావంతో ముందుకు సాగుతున్న ఆంధ్ర సారస్వత పరిషత్తు బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు పాత్రలో భాగంగా విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నది. వాటిలో కొన్ని- తెలంగాణ మాండలిక పదాలు – ప్రయోగ వైశిష్ట్యం, తెలంగాణ ప్రాచీన తెలుగు కవుల కవితా ప్రాభవం, తెలంగాణ చిత్రకళ, శిల్పకళల వైభవం, తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలపై సదస్సు, తెలంగాణ కవయిత్రుల, కథయిత్రుల రాష్ట్రస్థాయి సమ్మేళనం.

తెలంగాణ వైభవోన్నతిపై పరిషత్తు ప్రత్యేక గ్రంథప్రచురణను చేపట్టింది. ఈ పరంపరలో ప్రస్తుత గ్రంథం 'పరిణతవాణి' ఏడవ సంపుటి. పరిషత్తు సప్తతి మహోత్సవాల సందర్భంగా ఆరవ సంపుటి వెలువడింది. అరవై అయిదేళ్లు పైబడిన ప్రముఖుల స్వీయ సాహిత్య, జీవిత విశేషాల కథనమే 'పరిణతవాణి' ప్రసంగం. పరిషత్తు నిర్వహిస్తున్న ఈ ప్రామాణిక ప్రసంగాల కార్యక్రమం సహృదయుల ప్రశంసలందుకుంటున్నది. తెలంగాణలో తెలుగు సాహిత్యాన్ని

పరిపుష్టం గావించిన ఆచార్య ఎన్.గోపి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీ వరవరరావు, డా. తిరుమల శ్రీనివాసాచార్య, శ్రీమతి పోల్కంపల్లి శాంతాదేవి, శ్రీ జి.వెంకటరామారావు, ఆచార్య ఎస్.లక్ష్మణమూర్తి ఇటీవల చేసిన 'పరిణతవాణి' ప్రసంగాలను ఈ సంపుటి ద్వారా పాఠకులకు అందిస్తున్నాం. ఈ సాహితీ ప్రముఖులకు నా హార్దికాభినందనలు. ప్రసంగాలలో వ్యక్తమయ్యే వీరి కృషి, రచనాగరిమ, అనుభవాలు, ఆశయాలు ఆదర్శ కరదీపికలుగా భాసిస్తూ యువతరాన్ని ఉద్దీపింప చేయగలవని ఆశిస్తున్నాను.

పరిషత్తు వెలువరిస్తున్న ఈ గ్రంథం ఎప్పటిలాగా అందరి మన్ననలను పొందగలదని విశ్వసిస్తున్నాను.

(డా. సి. నారాయణ రెడ్డి)
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాదు,
తేది :15-03-2015.

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : 040-24753724

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విభిన్నమైన కార్యక్రమాల్లో పుస్తక ప్రచురణ విశిష్టమైంది. పరిషత్తు ప్రచురించిన గ్రంథాల పట్టికను చూస్తే ఎంత గొప్పవైన ప్రచురణలు వచ్చాయో తెలుస్తుంది. పరిషత్తు ఆధ్వర్యంలో తెలుగు పరీక్షల నిర్వహణ, భాషా సాహిత్య సాంస్కృతిక వికాసానికి దోహదం చేసే సదస్సుల నిర్వహణ, పెద్దల పేరిట నిర్వహించే సంస్మరణ ప్రసంగాలు, పరిణతవాణి ప్రసంగ పరంపర కొనసాగుతూ అనుబంధంగా పుస్తక ప్రచురణ జరుగుతున్నది. 2013 సంవత్సరంలో పరిషత్తు అధ్యక్షులు డా. సి.నారాయణరెడ్డి నేతృత్వంలో సప్తతి పూర్తి సందర్భంగా ఏడాది పొడవునా అనేకమైన ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. 'తెలంగాణ తెలుగు సాహిత్య వికాసం', 'తెలంగాణ ప్రాచీన కవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు-ప్రయోగ రీతులు', 'తెలంగాణ ప్రాచీన నృత్య రీతులు', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'తెలంగాణ కవయిత్రులు, కథయిత్రుల సమ్మేళనం' వంటి అనేక సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తరుణంలో తెలంగాణలో సాహిత్య చైతన్యాన్ని పెంపొందించే కృషిలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహించాలని పరిషత్తు భావించింది. నవ్య స్ఫూర్తితో ప్రచురణల్ని కూడా వెలువరించాలని నిర్ణయించింది. గత సంవత్సరం పరిణతవాణి ప్రసంగాలతో కూడిన తాజా సంపుటి, 'తెలంగాణ సాహిత్య వికాసం', 'వ్యాసగుళుచ్ఛం' రెండు సంపుటాలు ప్రచురించడం జరిగింది. వాటిని పాఠకులు ఆదరించారు.

తెలంగాణ ప్రత్యేకరాష్ట్రంగా ఆవిర్భవించింది. ఈ నూతన యుగోదయవేళ తెలంగాణకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధ్యయనం జరగాలి. ఆ అధ్యయనానికి కావలసిన పఠనసామాగ్రిని సమకూర్చుకోవాలి. ఇప్పటివరకు

ఉమ్మడి చరిత్రలో అంతర్భాగంగా వుండి తగినంత ప్రాధాన్యం లభించలేదని ప్రజల్లో వున్న అసంతృప్తిని పోగొట్టాలి. ఆ దిశగా ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న విశిష్ట కార్యక్రమాల నిర్వహణలో ప్రచురణ ఒకటి. ఆ ప్రచురణల్లో 'తెలంగాణ సాహిత్యచరిత్ర', 'తెలంగాణ ప్రాచీనకవుల కవితా ప్రాభవం', 'తెలంగాణ మాండలిక పదాలు–కావ్యప్రయోగాలు', 'కుతుబ్‌షాహీల తెలుగు సాహిత్యసేవ', 'మాఊరు మాట్లాడింది', 'తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు', 'సురవరం ప్రతాపరెడ్డి వ్యాసావళి', 'తెలంగాణ ప్రముఖుల పరిణతవాణి' 'బంజారాల వివాహ ఆచార పద్ధతులు' 'యాభైసంవత్సరాల జ్ఞాపకాలు' 'తెలంగాణ చరిత్ర' 'తెలుగు జానపద సాహిత్యం–స్త్రీల గేయాల్లో సంప్రదాయం' ఈ సంవత్సరం వెలువడుతున్నాయి.

పరిణతవాణి ప్రసంగ పరంపరకు పరిషత్తు అధ్యక్షులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు డా.సి.నారాయణ రెడ్డి రూపకల్పన చేసినారు. 1994 నుంచి 2015 వరకు 21 సంవత్సరాల్లో 65 మంది సాహితీ ప్రముఖులు స్వీయ సాహిత్య, జీవిత విశేషాలను స్ఫూర్తిదాయకరమైనరీతిలో పరిషత్తు వేదికమీద ప్రసంగించినారు. ఈ ప్రసంగాలను ఎప్పటికప్పుడు సంపుటాలుగా ప్రచురిస్తూ నేటితరానికి పెద్దలిచ్చిన సందేశసారంగా అందిస్తున్నాం. ఇప్పటికే ఆరు సంపుటాలు వచ్చినాయి. ఇప్పుడు ఏడవ సంపుటి వెలువడుతున్నది. ప్రత్యేకంగా చెప్పుకోదగిన విషయమేమిటంటే ఈ సంపుటిలోని ఏడుగురు ప్రముఖులు తెలంగాణ ముద్దుబిడ్డలు. ఇది అచ్చంగా పరిణత తెలంగాణవాణి. పరిషత్తు అందిస్తున్న ఈ ప్రచురణను అందుకోవాలని పాఠకులను కోరుతున్నాను.

ప్రచురణల పరిశీలక సంఘం సభ్యులుగా తమ పూర్తి సహకారాన్ని అందించిన ఆచార్య ఎస్వీ రామారావు, డా.తిరుమల శ్రీనివాసాచార్య, డా.డి.చంద్రశేఖర్ రెడ్డి గార్లకు కృతజ్ఞతలు.

(డా॥ జె. చెన్నయ్య)
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాదు
తేది : 17–03–2015

ప్రసంగ వ్యాస సూచిక



డా॥ ఎన్. గోపి

నేను నల్లగొండ జిల్లాలోని భువనగిరి పట్టణంలో జన్మించాను. పేరుకు తాలూకానే గాని అప్పుడదొక పెద్ద గ్రామంలా ఉండేది. భువనగిరి నల్లగొండకు 80 కిలోమీటర్లు. హైదరాబాద్‌కు 45 కిలోమీటర్ల దూరంలో వరంగల్ రహదారిలో ఉంది. ఇక్కడ ఒక పెద్ద ఏకశిల మీద అద్భుతమైన ఖిల్లా నిర్మాణమై ఉంది. భువనగిరి గుట్ట అంటే పెద్ద ప్రసిద్ధి. రెండవ రాష్ట్ర కూట రాజు త్రిభువనమల్లుని పేరిట త్రిభువనగిరిగా ఏర్పడిందనీ, 'త్రి' రాలిపోయి భువనగిరి మిగిలిందని చరిత్ర. దీనికి భోనయ్య, గిరమ్మల పేరిట భోనగిరి అనే పేరు వచ్చిందనే ఐతిహ్యం కూడా వుంది.

నేను జూన్ 1948లో జన్మించాను. రికార్డుల్లో కూడా ఇదే ఉంది. దీని ప్రకారం ఇప్పటికి నా వయస్సు అరవై ఆరున్నర సంవత్సరాలు. కాని మా ఇంట్లో నేను 1950లో పుట్టానని అంటుండేవారు. ఆ రోజుల్లో బోర్డు పరీక్షల్లో నెలలు తక్కువ కాకుండా వయస్సు ఎక్కువ వేయించేవారు. ఆ రకంగా ఈ ప్రాంతంలో చాలామందికి రెండు పుట్టినతేదీలు ఉంటాయి. సారస్వత పరిషత్ అధ్యక్షులు డా॥ సి.నారాయణరెడ్డి గారు నా నమోదైన తేదీని బట్టే ఈ ప్రసంగ పరంపరలో పాల్గొనవలసిందిగా ఆదేశించారు.

ఇవాళటి నా ఉపన్యాస సందర్భంలో నేనొక విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నాను. నా సాహిత్య జీవితంలో ఎక్కువభాగం నారాయణరెడ్డి గారితో ముడిపడి ఉంది. అయితే వారి ఆధ్యక్షతలోనే నేను ఇవాళ నా జీవిత, సాహిత్య

విశేషాలను గురించి మాట్లాడవలసి వస్తుంది. ఇది నా జ్ఞాపకశక్తికీ, నిజాయితీకీ ఒక పరీక్ష. ఈ పరీక్షలో నేను నెగ్గడమే కాకుండా నెగ్గినట్టు మీకనిపించినప్పుడు ఇవాళటి నా ప్రసంగానికి ఒక సార్థకత లభిస్తుంది.

నక్క లక్ష్మమ్మ, నక్క చెన్నయ్య మా అమ్మా, నాయనల పేర్లు. నేను ఓ దిగువ మధ్యతరగతి చేనేత కుటుంబంలో పుట్టాను. దిగువ తరగతిఅన్నా తప్పులేదు. మా తండ్రిగారి సొంత గ్రామం యాదగిరిగుట్ట దగ్గర ఉన్న రాజపేట. అక్కడి నుంచి బట్టల మూటలు మోసుకుంటూ భువనగిరి దాకా నడుచుకుంటూ వచ్చి బట్టలమ్మేవాడు. దాదాపు ముప్పై కిలోమీటర్ల నడక. రాత్రి పొద్దుపోతే ఉండటానికి భువనగిరిలో ఆయన ఓ ఇల్లు కట్టుకున్నాడు. అది మున్నూరుకాపుల ఇండ్ల మధ్య రెడ్డివాడకు పక్కన ఉంది. పద్మశాలివాడలో లేదన్నమాట. అందులోనే నేను జన్మించాను.

మా నాయనకు ఇద్దరు భార్యలు. పెద్దామెకు దీర్ఘకాలికమైన కడుపు నొప్పి ఉండేది. దానిని భరించలేక ఉరిపెట్టుకుని చనిపోయిందట. ఆమె బతికున్నప్పుడే ఓ పేదపిల్లను తీసుకవచ్చి మా నాయనతో పెళ్ళి చేసింది మా పెద్దమ్మ. ఆ పేదపిల్లే మా అమ్మ. వయస్సులో మా నాయనకూ అమ్మకూ 20 ఏళ్ళు వ్యత్యాసముండేది. ఆమెది భువనగిరి దగ్గర అనంతారం. మా భువనగిరి పెద్ద చెరువు దాటి ఓ కోసు దూరం నడిస్తే అనంతారం వచ్చేది. మా అమ్మ తండ్రిని నేను చూడలేదు గాని మా అమ్మమ్మ మాత్రం నా డిగ్రీ వయస్సుదాక బతికే ఉంది. మా నాయన తరఫున ఏడుగురు అన్నదమ్ములు. మా నాయన ఆఖరివాడు. మా చిన్న పెద్దనాయన తప్ప మిగిలినవాళ్ళందరు నేత కార్మికులే. వారందరు అనాజిపురం, ఆలేరు, మంతపురి, జనగాం ప్రాంతాలకు వ్యాపించి ఉండేవారు. ఒక పెద్దనాయనది నూలు వ్యాపారం కాబట్టి ఆయన కుటుంబం కొంత స్థితిమంతంగా ఉండేది. అప్పటి భాషలో వాళ్ళు తెల్లసాలోళ్లు. వాళ్లతో పోలిస్తే మేము నల్ల సాలోళ్ల కింద లెక్క.

మా తల్లిదండ్రులకు మేము అయిదుగురు పిల్లలం. ఇద్దరు అక్కలు, ఒక అన్న, ఒక తమ్ముడు. పెద్దక్క నక్క ఆండాళమ్మ. రజాకార్ల కాలంలో హత్యకు

గుర్తైంది. ఆ సంగతి తరువాత చెబుతాను. మా అన్నయ్య కృష్ణమూర్తి. సెంట్రల్ రైల్వేలో ఆఫీసర్‌గా చేసి పన్నెండేళ్ళ క్రితం పదవీ విరమణ చేశాడు. మా అక్క లక్ష్మినరసమ్మ, తమ్ముడు వెంకటేశంలు ఉపాధ్యాయులుగా రిటైరయ్యారు. ఆ రోజుల్లో మా అన్నయ్య హెచ్.ఎస్.సి.లో జిల్లా మొత్తంలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. అప్పట్లో అదో రికార్డు. ఆయనకు సాహిత్యాభిరుచి ఉండేది. ఆయన వల్లనే నేను కూడా చదువులో చాలా చురుగ్గా ఉండేవాడిని. ఎప్పుడూ ద్వితీయశ్రేణి ఎరుగను. మా ఇల్లు పద్మశాలివాడలో లేకపోవడంవల్ల పద్మశాలీలకు సహజంగా ఉండే మృదుత్వం నాకు అబ్బలేదు. పైగా మేమున్నవాడలో తెలివైన విద్యార్థిని కావడం వల్ల దానికి సంబంధించిన పొగరు కూడా కొంత ఉండేది. హెచ్.ఎస్.సి. తరువాత మా అన్నయ్య పాలిటెక్నిక్ చదవడానికి హైద్రాబాద్ వెళ్లవలసి వచ్చింది. అప్పటికి మా పేదరికం శిఖరస్థాయిలో ఉంది. కాని మా అమ్మ పట్టుదలతో ఆమె కాళ్ళకున్న తోడాలు (లావుగా ఉండే వెండి కడియాలు) అమ్మి అన్నయ్యను పట్నం పంపించడం జరిగింది. ఆ తోడాలను నేనూ, మా నాయనా కలిసి మూర్తిగారి బ్రహ్మయ్య అనే కంసాలి ప్రముఖుడి ఇంటికి పోయి అమ్మి వచ్చినట్లు గుర్తు. ఈకాలంలోనే నేను ఓ కిరాణా జనరల్ దుకాణంలో మూన్నెళ్ళపాటు గుమాస్తాగా పనిచేశాను. నెలకు 15 రూ. జీతం. ఇప్పటికీ ఆ దుకాణం ఉంది.

ఇంతలో మా నాయన అనారోగ్యంతో మూలనపడ్డాడు. జీవితాంతం మూటలు మోస్తూ తిరగడం వల్ల మోకాళ్ళు అరిగిపోయాయి. మధుమేహం ముదిరిపోయింది. మూడేళ్ళు మంచంలోనే ఉండిపోయాడు. అవి మాకు దుర్భరమైన రోజులు. తిండికి కూడా కష్టంగా ఉండేది. ఈ కాలంలోనే కొడవలి పట్టుకొని వ్యవసాయ క్షేత్రాల్లో కూలిపనికి పొయ్యేది మా అమ్మ. ఈలోపల నా పన్నెండవ (మల్టీపర్పస్) తరగతి ముగిసింది. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నాకు సీటువచ్చింది. సహజంగానే మా నాయన కాదన్నాడు. ఒకరోజు రెడ్డివాడలోంచి లైబ్రెరీకి వెళ్తున్నప్పుడు దీనవదనంతో ఉన్న నన్ను పులిమామిడి వెంకటరెడ్డి పలకరించాడు. ఆయనో పెద్ద దొర. భూస్వామి. నా చదువు విషయం తెలుసుకుని ఆయన మా ఇంటికి బయలుదేరాడు. ఆజానుబాహువు. ఆయన నడుస్తుంటే చెట్లు

కూడా పక్కకు జరిగేవి. ఆయన మా ఇంటికి వచ్చి మా నాయనతో "చెన్నయ్యగారూ నీ కడుపులో వజ్రాలు పుట్టినయి. మీవోడ్ని పట్నం పంపియి. ఎట్లుంటె గట్లయితది" అన్నడు. అంత పెద్ద దొర ఇంటికివచ్చి అంటుంటే మా నాయన కాదనలేదుగాని ఎట్ల చదువుకుంటనో నాకు గానీ, ఆయనకు గాని తెలియదు.

నేను భువనగిరిలో మూడు స్కూళ్ళలో విద్యను అభ్యసించాను. ప్రాథమిక విద్యను కాసమొళ్ళబడిలో చదివాను. మాధ్యమిక విద్య మరో స్కూల్లో, 9 నుండి 12 వరకు హయ్యర్ సెకండరీ పాఠశాలలో చదివాను. అదిప్పుడు జూనియర్ కాలేజిగా ఉంది. ఈ పాఠశాలకు పెద్ద క్రీడా మైదానం ఉంది. జిల్లా స్థాయి టోర్నమెంట్‌లు ఇక్కడే జరిగేవి. జిల్లా మొత్తంలో ఒక్క భువనగిరికి మాత్రమే ఆ రోజుల్లో రైల్వే స్టేషన్ ఉండేది.

నేను ఏడో తరగతిలో ఉండగానే మా తాలూకా శాఖా గ్రంథాలయంలో డిపాజిట్ కట్టాను. అప్పుడు ఐదు రూపాయలుండేది. నేను రోజూ శ్రద్ధగా లైబ్రెరీకి వెళ్ళి పత్రికలు చదువుతూ ఇంటికి పుస్తకాలు తెచ్చుకునేవాడిని. స్నేహబృందంలో నాకు పుస్తకాల పురుగని పేరుండేది. ఐదేళ్ళలో మా లైబ్రెరీలో ఉన్న మూడువేల పుస్తకాలను ఏదో ఒకరకంగా చదివేశాను. ఏదో ఒకరకంగా అంటే అర్థమైనకాడికి అని. విశ్వనాథ వారి వేయిపడగలు తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడే మూడు రోజుల్లో చదివేశాను. రాత్రింబవళ్లు చదువుతుంటే మా అమ్మ విసుక్కునేది. సరస్వతి ఉన్న ఇంట్లోకి లక్ష్మి రాదురా అనేది. ఈ పుస్తకాలన్ని నేను చిన్న ఎక్కదీపం వెలుగులో చదివేవాన్ని. అది గుడ్డి వెలుగని అప్పట్లో అనిపించలేదు. మిగతా వెలుగు పుస్తకాల్లోంచి వచ్చి వుంటుంది. కొన్నాళ్ళకు మా అమ్మ చిరాకుకు అసలు కారణం అర్థమైంది. గ్యాస్‌నూనె ఎక్కువ కాలుతుందని ఆమె బాధ. ఆ లైబ్రెరీలోనే నా జీవితం గొప్ప మలుపునకు బీజం పడబోతుందని నాకప్పుడు తెలియదు. సి. నారాయణరెడ్డి గారి 'స్వప్నభంగం' కావ్యం నా చేతిలో పడింది. అది నన్నెంతో ఆకర్షించింది. అందులోని శబ్దసౌష్టవం ఆ అనర్గళ గేయధార నా పసిమనసును హత్తుకుని ఉంటాయి. అప్పటికే మనుచరిత్రలోని వరూధినీ ప్రవరాఖ్యుల ఘట్టాల్లోని పద్యాలన్ని నేనూ సత్యారాం అనే మిత్రుడితో కలిసి బట్టీపట్టి ఉన్నాను. నారాయణరెడ్డిగారి ప్రాబంధిక శబ్ద

ప్రయోగాలు నాకెంతో ఇష్టంగా ఉండేవి.

"నాకు రెక్కలు మొలిచి
నవి పిలిచినవి పయో
ధర భరమల్లాడ
తరుణతారలు నన్ను,
తారలో తారలను
తలదన్ను అప్సర
స్తరుణులో నా గుండె
తల నిమిరినటులాయె"

ఈ రకంగా రెండు రోజుల్లో ఆ కావ్యమంతా నోటికొచ్చేసింది. ముఖ్యంగా ఒకపాదం తరువాతి పాదంలోకి చొచ్చుకొని పోయే పద్ధతి ఆశ్చర్యకరంగా ఉండేది. నారాయణరెడ్డిగారి గేయాన్ని పద్యగంధిలమైన గేయం అంటారని ఆనాటికి తెలియదు. దాని తరువాత కర్పూర వసంతరాయలు కావ్యాన్ని కూడా అదే పద్ధతిలో అధ్యయనం చేశాను. పుస్తకం వెనక చిరునామా చూసి నారాయణరెడ్డి గారికి ఒక ఉత్తరం రాశాను. అప్పటికే ఆయన సినిమా పాటలు మోగిపోతున్నాయి. "పగలే వెన్నెలా...", "ఈ నల్లని రాలలో..." అనే పాటలు హృదయాలను మీటుతున్నాయి. బెరుగ్గానే ఉత్తరం రాసినా మూడు రోజుల్లోనే జవాబు వచ్చింది. ఒక కార్డు మీద జ్వాలల్లా ఎగసే అక్షరాల స్ట్రోకుల్తో. ఇక నా ఆనందానికి హద్దేముంటుంది. మిత్రులందరి ఇండ్లకు వెళ్లి దాన్ని చూపించడం, వారు నమ్మలేక, నమ్మక తప్పనట్టూ అదో మరపురాని అనుభవం. నా ప్రతి ఉత్తరానికి ఆయన జవాబు రాసేవారు. ఇప్పుడనిపిస్తుంది. ఒక ఊళ్లో ఉన్న స్కూలు పిల్లవాడికి ఉత్తరాలు రాయడం ఆయన మట్టి మనస్కతకు గుర్తు. ఆయన ఉత్తరాలు ఇప్పటికీ నా దగ్గర భద్రంగా ఉన్నాయి.

మా ఊళ్లో బల్లా గౌతమయ్య అనే జానపద పద్యరచయిత ఉండేవాడు. ఆయన మాకు దూరపు బంధువు కూడా. ఆయన మా అక్క ఆండాళమ్మ మరణంపైన 'నక్క ఆండాళమ్మ ఉయ్యాలపాట' పేరుతో ఓ పుస్తకం రాశాడు. ఆయన చెర్వీరాల

బాగయ్యలాంటి కవి. ఆ పుస్తకంలోని ఉయ్యాలపాటను మా జిల్లాలోనే కాదు, అనేక తెలంగాణ జిల్లాల్లో కూడా సద్దుల బతుకమ్మ రోజు స్త్రీలు పాడేవారు. చాలా పల్లెటూళ్లలో నన్ను నక్క ఆండాళమ్మ తమ్ముడిగా గుర్తించేవారు. మా అమ్మ మా అక్క చనిపోయిన దు:ఖంతో 20 యేండ్లపాటు ప్రతిరోజూ సాయంత్రం 5 గం॥ల నుండి 6 గం॥ల వరకు శోకం పెట్టి ఏడిచేది. ఆ ఏడుపు పక్క వాడకట్టు దాకా వినపడేది. 6 గంటలు కొట్టంగనే "నక్క లచ్చుమమ్మ ఏడుపు అయిపోయింది, దీపాలు ముట్టియ్యంద్రమ్మా" అనేవారు. బల్లా గౌతమయ్య నేను ఆరవ తరగతిలో ఉండగా నాకు ఛందస్సు నేర్పించిన గురువు. అప్పటినుంచే నేను పుంఖాను పుంఖంగా పద్యాలు రాయడం మొదలుపెట్టాను. నా పద్యపాటవాన్ని చూసి నేను తొమ్మిదో తరగతిలో ఉండగా ఆయన రెండు పద్యసంపుటాలకు నా చేత పీఠికలు రాయించుకున్నాడు. ఇప్పుడనిపిస్తుంది. ప్రతిభను ప్రతిభావంతుడు మాత్రమే గుర్తిస్తాడని. నారాయణరెడ్డి గారు నాకు ఉత్తరాలు రాస్తున్నారని తెలిసి ఆయన చాలా సంతోషించాడు. ఈ కాలంలోనే నేను అనేక బాలల గేయాలు రాశాను. కృష్ణాపత్రిక, ప్రజామతల్లో అచ్చయినాయి. వాటితో ఓ పుస్తకం వెయ్యొచ్చు. సప్తతి పూర్తికి వేస్తానేమో.

ఈ మధ్యలో మా లైబ్రెరీలో 'రాసలీల' అనే పద్యగేయ సంపుటి నా దృష్టికి వచ్చింది. అందులోని కవితలన్నీ మధురమనోహరంగా ఉన్నాయి. ఆ కవి దేవరెడ్డి వెంకటరెడ్డి. ఆయన బొల్లారంలో ఉండేవాడు. రైల్ నిలయంలో ట్రేసర్ అనే చిన్న ఉద్యోగం చేసేవాడు. ఆయనతో పరిచయం అయింది. బొల్లారం వెళ్లి వచ్చేవాన్ని. అంత చిన్న పిల్లవాడినైనా నన్ను ఆయన ఎంతో ఆదరించి భోజనం పెట్టి ట్రెయిన్ ఖర్చులిచ్చి పంపించేవాడు. నేనూ ఆయనా పద్యాల్లోనే ఉత్తరాలు రాసుకునేవాళ్ళం. ఓసారి నేను రాసిన పద్యాలను ఆయనకు పోస్టులో పంపిస్తే దానికి స్పందనగా కార్డుపై ఓ పద్యం రాసి పంపించాడు. అవధరించండి.

ఉ॥ కిన్నెర క్వాణమట్లు, పరికీలిత భ్రామర గీతమట్లు, భా
స్వన్నెరజాణ లాస్యమటు, చక్కని తేనెల సోనలట్లుగన్
వెన్నెల వాగులట్లు సురభీకృత శీత సమీరమమట్లు నీ

చిన్నరి చేతి కైత వికసింపగ జేసెను నాదుడెందమున్

అట్లనే నేనొకసారి ఆయన చెల్లెలి పెండ్లికి పోయినప్పుడు పెండ్లి హడావుడిలో నాతో ఎక్కువసేపు గడపలేకపోయానని బాధపడుతూ ఓ పద్యం రాసి పంపాడు. అది కూడా మరిచిపోగూడనిదే.

సలుపనైతి అతిథి సత్కారములు నీకు
మొన్నవచ్చినప్పుడు నన్ను చూడ
కార్యభారమునను కలత జెందుకతన
గోపి నీవొకింత కోపిగాకు

ఇప్పటికీ దేవరెడ్డి వెంకటరెడ్డితో అనుబంధం కొనసాగుతున్నది. పెద్దవాడైపోయాడు. ఇటువంటివన్ని బాల్యంలో నా కవితారచనకు ఎరువుని సమకూర్చి ఉంటాయి. అంతేకాక మా ఊరిలో కోమట్ల ఇండ్ల ముందు చెప్పించే హరికథలకు వెళ్ళేవాన్ని. హరిదాసు ప్రయోగించే గొట్టు పదాలను నోటుబుక్కులో రాసుకునేవాన్ని. 'పీయూషము' లాంటి పదాలను ఉత్పలమాలాది పద్యాల్లో పొదిగేవాన్ని. యాదగిరిగుట్ట పైన బ్రహ్మోత్సవాల్లో జరిగే సాహిత్య, సంగీత కార్యక్రమాలు కూడా నా పసిమనస్సులో కవితా ముద్రను వేసి ఉంటాయి.

ఆ రోజుల్లో నేను విరివిగా పద్యాలు, గేయాలు రాస్తుండేవాన్ని. వందలాది పద్యాలు రాశాను. నా పద్యాలపైన దాశరథి, దువ్వూరి రామిరెడ్డిల ప్రభావం ఉండేదనుకుంటాను. ఒకరోజు కూర్చొని 'శశీ' అనే మకుటంతో ఒక శతకమే రాసేశాను. పొద్దున మొదలుపెడితే సాయంత్రం వరకు పూర్తయింది. ఇది 1964 సంగతి. 1967లో 'నేత' పత్రికలో అవి అచ్చయ్యాయి కూడా. దాని సంపాదకుడు రామనర్సయ్యగారిని ఈ సందర్భంగా తలుచుకుంటున్నాను. వాటిలోని కొన్ని పద్యాలు మీరు విని తీరాలి.

ఉ॥ చుక్కల పూలు పూచినవి సుందరమైన మొగుళ్ళ వాటిలో
మక్కువ మీర కల్వచెలి మాటికి మింటిని చూచుచుండె, కై

పెక్కిన కన్నులన్ ప్రియులకింపును గూర్చె నవోఢలల్లనన్
గుక్కను బట్టె కుర్రడు చకోరసఖా కనిపించరా శశీ!

ఉ॥ చందురమామ! నీవు విలసన్మృదు చాంద్రియు ఐక్యమైనటుల్
డెందములన్ని యేకమగుటెప్పుడు, ఆ శుభవేళ వచ్చునే
నందము చిందునే జగతి, నాకము అబ్బురమంది చూచునే
నందనవాటి భూమి కభినందనలంపుట నిక్కమే శశీ!

ఉ॥ నిండుగ నొక్కసారి కమనీయ ఘృణుల్ వెదజల్లి మాకు క
న్పండువ సేసి, వేరొకట బంధుర సాంద్ర తమాల మాలికా
మండల మందు కృంగి కనుమాటయిపోతివి, ఎంతవారికిన్
ఉండవె మోద ఖేదములు ఓర్పు వహించుట ముఖ్యమౌ శశీ!

ఉ॥ కౌగిలిలోన చీకటులు కాపురమున్ పొనరించుచుండ నీ
రాగమదెట్టిదో మృదువిలాస మనోజ్ఞ విభాసిత ప్రభా
భోగము గుర్తువీ పుడమి, పూజ్యుల లోపములెన్ని యుండినన్
దాగును, ప్రేమతో ప్రజకు నందము గూర్చిన యప్పుడే శశీ!

ఉ॥ మానుల చీరలొల్చి పవమాన బలమ్మున సంచరించు దు
ర్మానసుడైన శైశిరునమానుష చర్యల కృంగిపోతి, పూ
వానలవెప్పుడో కురియు వచ్చునటంచని నాదు జీవితో
ద్యానమునందు ఆశలకు ఆయువు పోయుచునుంటిరా శశీ!

అనంతర కాలంలో అంటే రెండేండ్ల తరువాత నేనీ పద్యాలు నారాయణరెడ్డి గారిని కలిసి చూపించినప్పుడు ఆయన ఎంతో ఆశ్చర్యంతో మెచ్చుకున్నారు. నీ ధార బాగుంది అన్నారు. ఒక పద్యానికి ఆయన చేసిన చిన్న సవరణ నాకిప్పటికీ గుర్తుంది. 'కౌగిలిలోన చీకటులు' అనే పద్యంలో 'ద్యుతీ భోగము' అని ఉంటే 'ప్రభాభోగము' అని సవరించారు. 'ద్యుతీ' అనేది తప్పు కాదు కాని ప్రభ వల్ల పద్యం యొక్క శైలీ సౌభాగ్యం పెరిగింది. అనంతరకాలంలో నేను ఎందరో నానీ కవుల నానీలను

సరిదిద్దుతున్నప్పుడు ఈ సవరణ గుర్తుకువస్తుండేది.

ఇక నేను భువనగిరిలో ఉండగానే నారాయణరెడ్డిగారితో ప్రత్యక్ష పరిచయం ఒక హృదయానుభవ విలాసం. ఆ రోజుల్లో నేను మట్టి గల్లాలో డబ్బులు వేసి కూడబెట్టుకునేవాడిని. నారాయణరెడ్డిగారిని చూడడానికి దానిని పగలగొట్టి సికిందరాబాద్ రైలెక్కాను. సికింద్రాబాద్‌లో దిగి నడుచుకుంటూ చిల్‌కలగూడా సీతాఫల్‌మండి, దాటి ఆర్ట్స్‌కాలేజీకి చేరుకున్నాను. ఆ పెద్ద భవనాన్ని చూడగానే సగం మూర్ఛ. సి. నారాయణరెడ్డి ఎక్కడుంటాడో లోపలికి వెళ్ళి అడుగుదామంటే పట్టుకొని కొడతరేమోనని భయం. కోట్లు వేసుకుని బ్రీఫ్‌కేసులు పట్టుకుని లోపలికీ, బయటికీ వెళ్తున్న ప్రొఫెసర్లను చూడగానే బెరుకు. అంతకు ముందు సినారెని చూడలేదు. 'కర్పూర వసంతరాయలు' పుస్తకం మీది ఫోటోలో వారికి మీసాలు ఉన్నాయి. 11 గంటలకు వచ్చినవాన్ని 3 గంటలదాకా వచ్చేపోయేవారిని చూస్తూనే ఉన్నాను. ఆఖరికి దిగిండు మహానుభావుడు. "నమస్కారం సార్" అన్నాను. "ఎవరు" అన్నాడు. "గోపి భువనగిరి" అన్నాను. "అరే నువ్వా ఇంత చిన్నవాడివా? ప్రౌఢంగా రాస్తావే" అన్నారు. పదపద అంటూ బస్టాండ్‌వైపు దారితీశారు. అప్పటికాయనకు ఇంకా కారు రాలేదు. 3–డి నెంబర్ బస్సులో ప్రయాణించి నారాయణగూడ చౌరస్తాలో దిగి చిక్కడపల్లి, వివేక్‌నగర్‌లో ఉన్న వాళ్ల ఇంటికి వెళ్లాము. ఆయన టీ తెప్పించి ఆప్యాయంగా మాట్లాడారు. అదో గొప్ప అనుభూతి! ఆయనకు రెండు గేయాలు చూపించాను. వాటి పేర్లు ఇప్పటికీ నాకు గుర్తున్నాయి. ఒకటి 'అద్వైతం'. రెండు 'కన్నీరు'. వాటిని ఆయన హిందీ ప్రచారసభ వారి 'స్రవంతి' పత్రికకు పంపించారు. అప్పుడాయన దాని సంపాదకవర్గంలో ఉండేవారు. మా ఊరికి వెళ్లి సి. నారాయణరెడ్డి నా భుజం మీద చెయ్యి వేసిండని చెపితే మిత్రులందరూ నా భుజాన్నొక పవిత్ర ప్రదేశంగా చూసేవారు. అప్పుడు స్కూళ్ళలో *Self Governament day* అని ఉండేది. ఒకరోజు విద్యార్థులే సార్లుగా మారి పాఠాలు చెప్పాలి. నేను తొమ్మిదో తరగతిలో ఉండగానే పన్నెండో తరగతికి మనుచరిత్ర పాఠం చెప్పాను. అప్పట్లో రామదాసు రావు అని ఓ గొప్ప తెలుగు ఉపాధ్యాయుడు ఉండేవాడు. ఆయనకు కూడా నా

పద్యాలను చూపించేవాన్ని. 1965 ఆగస్టు భారతి కలగూరగంపలో నేనో వ్యాసం రాశాను. 'వచన కవిత్వంలో పదగుంఫనం' అని దాని పేరు. సోమసుందర్, అరిపిరాల విశ్వం వంటివారు గ్రాంథిక పదజాలంతో వచన కవితలు రాసిన వైనాన్ని దానిలో విమర్శించాను. రామదాసురావు దాని గురించి క్లాసుల్లో చెప్తుండేవాడు.

ఇటువంటి నేపథ్యమంతా నా మనస్సును సాహిత్యంవైపే పురికొల్పింది గాని, ఇంజనీరింగ్ వైపు అభిరుచిని కలిగించలేదు. ఇంజనీరింగ్‌ను వదిలిపెట్టి బి.ఏ.,లో చేరడం మా అన్నయ్యకు సహజంగానే ఇష్టంలేదు. ఎందరో చెప్పి చూశారు. నేను వినలేదు. మళ్ళీ హైదరాబాద్ ఆర్ట్స్ కాలేజికి వెళ్ళి సినారె గారిని కలిశాను. అప్పటికే బి.ఏ. స్పెషల్ తెలుగుకు ఆర్ట్స్‌కాలేజిలో, నిజాం కాలేజిలో అప్లయ్ చేసి ఉన్నాను. రెండుచోట్లా లిస్టులో మొదటిపేరు నాదే. నేను బి.ఏ., చేస్తానని సినారె గారితో చెప్పాను. 'ఎందుకు?' అన్నారు ఆయన. 'కవిని కావాలని' నా జవాబు. 'నేనయితే సలహా ఇవ్వను కాని నీ ఇష్టం' అన్నారు. అప్పటికి ఫీజు కట్టడానికి చివరితేది అయిపోయింది. అప్పుడు తెలుగుశాఖాధ్యక్షులుగా ఉన్న దివాకర్ల వెంకటావధాని గారి దగ్గరకు తీసుకెళ్ళి 'ఇతడు ప్రతిభావంతుడు, బుద్ధిమంతుడు. తెలుగులో చేరుతానంటున్నాడు. కాని చివరితేది అయిపోయింది' అన్నారు. అవధానిగారు 'అలాగేనండి' అంటూ లేచి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసుకు వెళ్ళి స్పెషల్ పర్మిషన్ తీసుకువచ్చారు. అప్పటికి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ బిల్డింగ్ నిర్మాణం జరగలేదు. అప్పటికి అంతా ఆర్ట్స్ కాలేజి కింది భాగంలోనే ఉండేది. మొత్తం మీద ప్రవేశ ఫీజు మా అన్నయ్యే పంపించాడు. అప్పటి ఫీజు 67 రూపాయలు.

బి.ఏ.,లో నా ఐచ్ఛికాంశాలు తెలుగు, సంస్కృతం, భాషాశాస్త్రం. అప్పుడు ఆర్ట్స్ కాలేజిలో బి.ఏ. కూడా ఉండేది. సినారె, దివాకర్ల వెంకటావధాని, పాటిబండ్ల మాధవశర్మ, పల్లా దుర్గయ్య, ఖండవల్లి లక్ష్మీరంజనం, చలమచర్ల రంగాచార్యులు, ఇట్లాంటి దిగ్దంతులందరు మా గురువులు. సంస్కృతంలో లాలే, ఖండేరావు దేశ్‌పాండే, పుల్లెల శ్రీరామచంద్రుడు. అటు భాషాశాస్త్రంలో భద్రిరాజు కృష్ణమూర్తి, అనంత నారాయణ, చేకూరి రామారావు, లక్ష్మీబాయి అధ్యాపకులుగా ఉండేవారు. ఈ మూడేండ్ల ఆర్ట్స్ కాలేజి జీవితం ఓ మధురకావ్యంలా గడిచిపోయింది. దీనినే

ఒక పుస్తకంగా రాయవచ్చు. అందరూ గొప్ప అధ్యాపకులే. నా సంస్కారంలోనికి జ్ఞానసంపదను వెదజల్లినవారే. ముఖ్యంగా సినారె పాఠాలు, ప్రతి క్లాసు ఒక కావ్యఖండికలాగ ఉజ్వలంగా వెలిగేది. తెలుగు ఐచ్ఛికాంశంగా నేను ఒక్కడినే ఉండేవాడిని. ఒక్కడే కదా ఏదో నడిపించొచ్చు అని అనుకోకుండా శ్రద్ధగా బోధించేవారు. ముఖ్యంగా సినారె నలభై మందికి చెప్పినట్టుగా ఉచ్ఛైశ్రవంతో భావావేశపూరితంగా పాఠాలు చెప్పేవారు. ప్రతి క్లాసు ప్రిపేర్ అయి వచ్చేవారు. అప్పుడాయన చెప్పిన నోట్స్ చూస్తే ఇప్పటికీ అదొక వాక్ఝురీ ప్రవాహం నిక్షిప్తమయినట్లుగా అనిపిస్తుంది. నేనిదంతా 'అధ్యాపకుడిగా సినారె' అనే వ్యాసంలో వివరించాను. బి.ఏ. మొదటి సంవత్సరంలో ఉన్నప్పుడు సృజన పత్రిక నిర్వహించిన అఖిలాంధ్ర కవితల పోటీలో అమ్మంగి వేణుగోపాల్‌కు ప్రథమ బహుమతి, నాకు ప్రత్యేక బహుమతి లభించింది. రాచమల్లు రామచంద్రారెడ్డి తన సంపాదకత్వంలోని 'సంవేదన' పత్రికలో ఆ ఇద్దరు యువకవులకు మంచి భవిష్యత్తు ఉందని రాసిన సమీక్ష ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. 'సృజన' సంపాదకుడు వరవరరావు బహుమతి కింద కొన్ని పుస్తకాలు తీసుకవచ్చి ఆర్ట్స్ కాలేజి మెట్లమీద కలిసి అందజేయడం ఒక సజీవ జ్ఞాపకం.

బి.ఏ.,లో మూడేళ్లు నేను ట్యూషన్లు చెప్పే చదువుకున్నాను. చిక్కడపల్లిలో ఒక రూం తీసుకుని సత్యారాం అనే మిత్రునితో పాటు వండుకుంటూ ఉండేవాన్ని. ముషీరాబాద్‌లో రెండు కుటుంబాల పిల్లలకు చదువు చెపుతూ నూట ముప్పై రూపాయలు సంపాదించేవాడిని. అందులో ముప్పైరూపాయలు మా అమ్మకు పంపేవాడిని. మొదటి సంవత్సరంలో ఇంగ్లీషు మీడియం కొంత ఇబ్బందిపెట్టింది గాని తరువాత సర్దుకుంది. బి.ఏ.లో నేను ప్రథమశ్రేణిలోనే కాకుండా 77 వేల మంది పరీక్ష రాస్తే నాటి పన్నెండు ర్యాంకుల్లో నాకు 6వ ర్యాంకు వచ్చింది. (అప్పుడు కాకతీయ పి.జి. సెంటర్ కూడా ఉస్మానియాలో ఉండేది.)తెలుగులో అత్యున్నత మార్కులు పొందినందుకు 'నిజాం బంగారు పతకం' కూడా వచ్చింది. దానివల్ల నాకు "నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్"ను ప్రకటించారు. ఆరోజుల్లో అది 1800/- రూపాయలు. చిక్కడపల్లిలో ఉన్నప్పుడు నాకు కె. శివారెడ్డితో పరిచయం

కలిగింది. అప్పుడేదో కాలేజీలో కొత్తగా లెక్చరర్‌గా చేరాడు. అప్పుడప్పుడు ఆయన నా రూంకొచ్చేవాడు. ఇప్పటికీ మా మైత్రి పచ్చగా కొనసాగుతున్నది.

బి.ఏ., ప్రథమ సంవత్సరం చివరలో మా నాయన చనిపోయాడు. అప్పుడాయనకు యాభై ఏండ్లు. జీవితమంతా నడిచి అలిసిపోయి శాశ్వత విశ్రాంతిలోకి వెళ్ళిపోయాడు. మొదటిసారి అనాథగా అనిపించింది. ఆయనకు పెద్దగా చదువురాకున్నా జమాఖర్చులు రాసేంత అక్షరాస్యత ఉండేది. ఆయనకు వేమన పద్యాలుగాని, బ్రహ్మంగారి తత్వాలుగాని బాగావచ్చు. కల్లు తాగినప్పుడు వాటిని పాడుతూ అర్థాలు విడమర్చి చెపుతున్నప్పుడు ఆయన ఒక అచలయోగిలా అనిపించేవాడు. ముఖ్యంగా పిల్లల్ని ప్రేమించడంలో ఆయనకు ఆయనే సాటి. మేమందరం తిన్న తర్వాతే ఆయన భోజనం చేసేవాడు. రాత్రిపూట మా అందరికీ పక్కలు వేసి, మేము నిద్రపోయిన తర్వాతనే ఆయన పండుకునేవాడు.

1969 లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఉధృతంగా వచ్చింది. నేను దానిలో క్రియాశీలంగా పాల్గొన్నాను. భువనగిరిలో లక్ష్మీనారాయణ, రవిందర్ వంటి మిత్రులం కలిసి తెలంగాణపై రెండు కవితాసంపుటాలు వేశాము. భువనగిరిలో మమ్మల్ని అరెస్ట్ చేసి నల్లగొండ జైలుకు తరలించారు. ఒక నెలరోజులు జైలు జీవితం గడిపాము. హైద్రాబాద్‌లో 'ఛలో రాజ్‌భవన్' ర్యాలీలో పాల్గొన్నప్పుడు దానిలో పన్నెండు మంది విద్యార్థులు పోలీసుల తుపాకి గుండ్లకు బలయ్యారు. ఒక బుల్లెట్ నా చెవులను రాసుకొని పోకుండా ఉంటే నేను పదమూడోవాడిని అయ్యుండేవాడిని. ఆ ర్యాలీలో నాకు తెలిసిన అయిదుగురు మిత్రులు నేలకొరిగారు. అదొక విషాద జ్ఞాపకం. అప్పటి తెలంగాణ ఉద్యమంలో ఆరువందలకు పైగా మెరికల్లాంటి యువకులు మరణించారు. ఇప్పుడు తెలంగాణ సాధించిన ఘట్టంలో ఆనాటి ప్రారంభ అమరవీరులను కూడా కలుపుకుని స్మరించుకోవలసిన అవసరం ఉంది.

మెరిట్ స్కాలర్‌షిప్ ఉంది కాబట్టి ఉస్మానియా హాస్టల్లో చేరాను. హాస్టల్ 'ఎ-హాస్టల్' రూం నెంబర్-67. ఆ రూముకొక ప్రత్యేకత ఉంది. హాస్టల్ మొత్తంలో

అది విశాలమైన గది. దీనిలో ముగ్గురం ఉండేవాళ్ళం. ముగ్గురం స్వర్ణపతక గ్రహీతలమే. మిగతా ఇద్దరిలో ఒకరు బాపూజీ చౌదరి. లింగ్విస్టిక్స్‌లో ఉండేవాడు. అతన్ని గాంధీ అనేవారు. బి.ఏ.నుంచే నాకు మంచిమిత్రుడు. సాహితీపరుడు. చలం సాహిత్యంపట్ల తీవ్రమైన అభినివేశం కలవాడు. ప్రస్తుతం హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్నాడు. అతని ద్వారానే నాకు ప్రముఖ దర్శకుడు, రచయిత అక్కినేని కుటుంబరావుతో పరిచయమై ఇప్పటికీ పచ్చని మైత్రి కొనసాగుతున్నది. నా మూడో రూమ్మేట్ నయీముద్దీన్. అతడు గణితశాస్త్రంలో ఎం.ఏ., చేస్తుండేవాడు. నా ఎం.ఏ. తెలుగు రెండు సంవత్సరాలు కూడా చాలా చైతన్యవంతంగా గడిచాయి. ఈ కాలంలోనే నేను చలం, బుచ్చిబాబు, గోపీచంద్, రావిశాస్త్రి, దాశరథి, దువ్వూరి రామిరెడ్డి, కొడవటిగంటి, రాయప్రోలుల రచనలు విపరీతంగా చదివాను. దీనికితోడు ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ సౌందర్యాన్ని మనసునిండా ఆస్వాదించాను. అప్పుడు ఉస్మానియా క్యాంపస్ గురించి నేను రాసిన ఓ కవితలో కొన్ని లైన్లు...

"పొద్దుటి పూట
బస్సుల్లోంచి రెక్కలు విప్పుకని గువ్వలు దిగుతాయి
సాయంత్రం
క్యాంపస్ నిండా రాలిన నవ్వులు దొరుకుతాయి
విద్యార్థుల సందడి
అదే క్యాంపస్ జీవనాడి
పుస్తకాల రెపరెపలు ఎత్తులకెదిగే రెక్కలవుతాయి
కారిడార్లలోని నదులు
క్లాస్‌రూమ్ ఆనకట్ట దగ్గర ఆగిపోతాయి"

ల్యాండ్‌స్కేప్ గార్డెన్ అభిజ్ఞాన శాకుంతలమంత అందంగా అనిపించేది. ఈ హాస్టల్ జీవితంలోనే నా సహవిద్యార్థులు హరిదాసు, కిషన్‌రావు, సంగారెడ్డి, కాసాల సత్యనారాయణలతో ఆత్మీయత ఏర్పడి ఇప్పటికీ కొనసాగుతున్నది.

ఎం.ఏ., మొదటి సంవత్సరంలో ఉండగా ర్యాడికల్ విద్యార్థి నాయకుడు జార్జిరెడ్డి హత్య క్యాంపస్‌లో సంక్షోభాన్ని సృష్టించింది. అప్పట్లో ఆయన చాలామందికి హీరో. చేగువేరాతో పోల్చేవారు. రాబిన్‌హుడ్‌ను గురించినట్లుగానే ఆయన గురించి కూడా ఎన్నో కథలు ప్రచారంలో ఉండేవి. ఆయన హత్యతో చాలాకాలం వరకు క్యాంపస్ అతలాకుతలమైపోయింది. నెలరోజులపాటు యూనివర్సిటీని మూసేశారు. బాపూజీ ఆయన గురించి ఒక స్మృతిసంచికను వెలువరించాడు. ఆ ఘటన చాలాకాలం వరకు మనస్సులో ఉండిపోయింది.

ఎం.ఏ.లో వారానికి ఒక క్లాసు తీసుకోవడానికి జి.వి. సుబ్రహ్మణ్యం, పి. యశోదారెడ్డి వచ్చేవారు. క్యాంపస్‌లో ఉన్నప్పుడే హబ్సిగూడాలోని ఆర్.ఆర్. లాబ్స్‌లో (ఇప్పుడు సిసిఎంబి) ఎన్నో ఆర్ట్స్ చిత్రాలను చూశాము. సత్యజిత్‌రాయ్, రిత్విక్ ఘటక్‌ల సినిమాలు చూసి చర్చించుకునేవాళ్లం. నా ఎం.ఏ. జీవితాన్ని గురించి రాస్తే ఓ గ్రంథమే అవుతుంది. దానికిప్పుడు సమయం సరిపోదు. ఎం.ఏ.లో కూడా నేను యూనివర్సిటీ ఫస్ట్ వచ్చాను. గురజాడ అప్పారావు గోల్డ్‌మెడల్ లభించింది.

నేను ఆ రోజుల్లో వివిధ ప్రాంతాల భాషల, యాసల గురించి మిమిక్రీ చేస్తుండేవాణ్ణి. ముఖ్యంగా తెలంగాణ మాండలికం, పాతనగరంలో హైదరాబాద్ ఉర్దూ కలిసిన తెలుగు ఇంకా ప్రత్యేకం. దానికి చార్‌మినార్ తెలుగు అని పేరు పెట్టాను. ఆంధ్రమహిళాసభలో కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ అని ఉండేది. దానికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఛైర్మెన్. దానిలో వయోజన విద్యావాచక నిర్మాణాన్ని గురించిన శిక్షణా శిబిరం జరిగింది. దానిలో నేను భాషాశాస్త్ర నిపుణుడిగా పాల్గొన్నాను. దాని తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలో నాన్‌ఫార్మల్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టు అనే బృహత్ కార్యక్రమాన్ని యునిసెఫ్ వారి సహాయంతో ప్రారంభించారు. వయోజనులకు అక్షరాస్యత, మాతాశిశు సంక్షేమ విద్య అనేవి దీని లక్ష్యాలు. ఎం.ఏ.,లో నా చివరి పరీక్షరోజే సిఎస్‌డి వారు నాకు ప్రాజెక్టు ఆఫీసర్ ఉద్యోగాన్ని ఇచ్చారు. ఆరోజుల్లో 740 రూ॥లు జీతం. ఈ రకంగా నాకు ఒక్కరోజు కూడా నిరుద్యోగ జీవితం లేకుండా పోయింది. నాకు మహబూబ్‌నగర్ పల్లెటూళ్లలో

లభించిన అనుభవం అనేక జన్మలకు సరిపోయేంతటి విలువైనది. అవి కరువు రోజులు. తిండిలేక పల్లెల్లో ప్రజలు విలవిలలాడిపోయేవారు. ఆ రోజుల్లోనే నలభై గ్రామాల్లో పాలమూరు భాషను టేప్‌రికార్డర్‌లోకి ఎక్కించి వయోజన విద్యావాచక నిర్మాణంలో పాలుపంచుకున్నాను. భారతదేశంలోనే మొట్టమొదటి మాండలిక వాచకమది. అప్పుడు పూర్తి మాండలికంలో కవితలు రాశాను. మాండలికంలో రచనలు చేసేటప్పుడు వ్యావహారికంలో ఆలోచించి రాయడం కంటే మాండలికంలోని అసలైన సొగసుల్ని పట్టుకుని తమ రచనల్లోకి తెచ్చుకోవలసి ఉంటుందని నాకు అర్థమైంది. మహబూబ్‌నగర్‌లో పనిచేస్తున్నప్పుడే నాకు హైదరాబాద్‌లోని నానక్‌రాం భగవాన్‌దాస్ సైన్స్ కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. అప్పటి జీతం 450 రూపాయలు. నాకు తెలుగు అధ్యాపకుడిని కావాలనే కాంక్ష బలంగా ఉండేది. వెంటనే చేరమన్నారు. ఒక నెల ముందస్తు నోటీసు ఇవ్వలేదు కాబట్టి సి.ఎస్.డి.లో ఒక నెల జీతం 740/- రూపాయలు కట్టి బయటపడ్డాను.

ఎన్.బి. సైన్స్ కాలేజీలో ఉండగానే వేమన మీద పిహెచ్.డి. పరిశోధన ప్రారంభమైంది. ఆచార్య అమరేశం రాజేశ్వరశర్మ నా పర్యవేక్షకులు. ఇక్కడొక ముఖ్యమైన విషయం చెప్పాలి. ఈ సమయంలోనే నాకు వివాహమైంది. మాది కులాంతర వివాహం. నా భార్య పేరు అరుణ. ఆమె ఎం.ఏ.లో నా సహవిద్యార్థిని. కవయిత్రి. ఇప్పటివరకు ఏడు కవితాసంపుటాలు వెలువరించింది. ఇప్పుడు మా అబ్బాయి చైతన్య, కోడలు రాధిక, ఇద్దరు మనుమలు ఒకడు అధర్వ్, రెండోవాడు అభవ్. వీళ్ళందరూ జీవితాన్ని వెలిగిస్తున్నారు. ఈ కాలేజీలో ఉండగానే వేమన మీద పిహెచ్.డి. డిగ్రీ అందుకున్నాను. ఈ పరిశోధన గురించి కొంత చెప్పాలి. ఈ పరిశోధన సామగ్రి సేకరణ గురించి నేను దేశంలో చాలా ప్రాంతాలను సందర్శించాను. దాదాపు 50 వేల రూపాయలు అప్పుజేసి ఖర్చుపెట్టాను. మద్రాసులో రెండు ఎండాకాలాలున్నాను. అప్పుడు మద్రాసులోని ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోని అరవై తాళపత్ర గ్రంథాలను రోజూ ఎత్తి రాసుకున్నాను. జిరాక్స్, ఫోటోకాపీల్లాంటివి అప్పుడు అందుబాటులో లేవు. 15 వేల పాఠాంతరాలతో మూడువేల వేమన పద్యాలను కార్డులకు ఎక్కించాను. అప్పటివరకు ఎం.ఏ. సిలబస్ పాండిత్యమే

ఉన్న నాకు ఈ పరిశోధన వల్ల శ్రమలోంచే జ్ఞానం పుడుతుందని అర్థమయింది. వేమన కూడా ఓ చోట 'శ్రమములోన పుట్టు సర్వంబు తానౌను' అన్నాడు. అది నాపట్ల నిజమయిందనుకుంటాను.

"ప్రజాకవి వేమన" ఇప్పటివరకు అయిదు పునర్ముద్రణలు పొందింది. రెండుసార్లు నేను సొంతంగా వేసుకుంటే మిగతావి విశాలాంధ్ర ప్రచురణాలయం వారు వేశారు. వేమన గ్రంథం రాగానే హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్ వారు నాచేత 'వేమన్నవాదం' అనే వ్యాఖ్యాన గ్రంథం రాయించారు. నేను దీనిలో వేమన్నను 17వ శతాబ్దం నాటి సామాజిక, ఆర్థిక, చారిత్రక నేపథ్యంలో ఆవిష్కరించాను. ఇది ఆరేడు ముద్రణలు పొందినట్టు గుర్తు. బుక్‌ట్రస్ట్ వారు దీన్ని పల్లెపల్లెకు తీసుకెళ్ళడం ఒక మంచి ప్రయత్నం. 1990లో పారిస్‌లోని కింగ్స్ లైబ్రెరీలో వున్న ఒక వేమన పద్య సంపుటిని తెప్పించాను. 1730లో జెసూట్ మిషనరీలు అనంతపురం జిల్లా నుండి దీన్ని ఫ్రాన్స్‌కు పంపించారు. దీనిలోని 361 పద్యాలను ఇక్కడ నేను సేకరించిన 3,000 పద్యాలతో పదేళ్ల పాటు సరిపోల్చిచూసి (కొలేషన్) పాఠాంతరాల్ని పాదపీఠికలో ఇస్తూ 'వేమన పద్యాలు పారిస్ ప్రతి' అనే పేరుతో ప్రచురించాను. పరిష్కరణకు కావలసిన మెథడాలజీ, టెక్స్‌చువల్ క్రిటిసిజమ్‌కు సంబంధించిన మార్గదర్శక సూత్రాలు కొన్ని ఈ ప్రక్రియలో బయటపడ్డాయి. దీన్ని ఆరుద్ర ఎంతో మెచ్చుకుని 'ఉల్లాకు' అనే పేరుతో లోతైన ముందుమాట రాశారు. వేమన పరిశోధన సామగ్రి సేకరణ కోసం ఊళ్లు తిరుగుతూ రాజమండ్రి గౌతమీ గ్రంథాలయాన్ని సందర్శించాను. ఆ వూళ్లో ఎవరూ పరిచయం లేరు. పగలంతా లైబ్రెరీలో గడుపుతూ రెండు రాత్రులు ఆర్.టి.సి. బస్‌స్టాండ్‌లో పడుకున్నాను. 25 సంవత్సరాల తర్వాత ఆ ఊరికే వైస్-ఛాన్సలర్‌గా వెళ్తే ఎందరో స్వాగతం పలకడం అదో అనుభూతి. అది మనసులో పెట్టుకొని ఈ మధ్య మా ఇంటి రెండో అంతస్తులో ఓ రిసెర్చి ఇనిస్టిట్యూట్‌ను నిర్మించాను. దానిలో 12 వేల గ్రంథాలు ఉన్నాయి. 40 శాతం అరుదైన గ్రంథాలు. ఎవరైనా రిసెర్చ్ కోసం రావచ్చు. వారు ఉచితంగా ఉండటానికి ఒక గదిని కూడా కట్టాను. దానికొక పూర్తి వ్యవస్థను ఏర్పరచి త్వరలో వినియోగంలోకి

తెస్తాను. 'తొలి పరిశోధకులు' అనే చిన్నపుస్తకం వివిధ పరిశోధకులపైన నేను రాసిన వ్యాస సంపుటి. దానిని బి.యన్. శాస్త్రి గారికి అంకితమిచ్చాను. ఈ సందర్భంగా నేను రెండేళ్ళపాటు "తెలుగు పరిశోధన" అనే త్రైమాసిక పత్రికను నడపడం అవిస్మరణీయ జ్ఞాపకం. వాసిలి వసంతకుమార్, ననుమాసస్వామిల సహకారంతో ఆరు ప్రామాణికమైన సంచికలు తెచ్చాను. అవన్నీ రిఫరెన్స్ విలువల్ని సంతరించుకున్నాయి. పరిశోధనలో అదికూడా ఒక విలువైన అనుభవమే.

వేమన్న తర్వాత కొంతకాలం పోతులూరి వీరబ్రహ్మం పైన కొంత పరిశోధన చేశాను. 'కార్మిక యోగి వీరబ్రహ్మం' పేరిట ఒక పెద్ద వ్యాసం "ఆంధ్రప్రభ" దినపత్రికలో ఆరువారాలు సీరియల్‌గా వచ్చింది. అప్పట్లో అది ఒక సంచలనం. చేతివృత్తులు ఘోరంగా దెబ్బతిన్న పదిహేడవ శతాబ్దం నాటి బ్రహ్మంగారిని ఒక మానవతామూర్తిగా నిరూపించాను. ఈ వ్యాసంతో పాటు మరికొన్ని పరిశోధన వ్యాసాలు 'వ్యాసనవమి' పేరుతో వెలువడ్డాయి. 'గవాక్షం', 'వ్యాసకలశం' అనేవి నన్ను విమర్శకుడిగా ప్రతిష్టించిన వ్యాససంపుటాలు. ముఖ్యంగా "నిలువెత్తు తెలుగు సంతకం – సినారె వ్యక్తిత్వం" అనే వ్యాస సంపుటిని షష్టిపూర్తి కానుకగా వెలువరించాను. ఆయన సాహత్యాన్ని, వ్యక్తిత్వాన్ని వినూత్నంగా ఆవిష్కరించాను. అఖిలాంధ్ర సన్నివేశంలో ఒక తెలంగాణ కవి ఎదగడం వెనకనున్న పరిస్థితులను బేరీజు వేస్తూ విశ్లేషించాను. 'సాలోచన' అనేది నేను రాసిన పీఠికల సంపుటి. ఇంకో పుస్తకం వేయాలంటే వందలాది పీఠికలు ఉన్నాయి. ఈమధ్య 'వేమన్న వెలుగులు' పేరుతో "సాక్షి ఫన్‌డే" సంచికలో మూడేళ్ళపాటు 500 పద్యాలకు వ్యాఖ్యానం రాశాను. వేమనపై పరిశోధన చేసిన నలభై ఏళ్ళ తరువాత రాసిన వ్యాఖ్యాన గ్రంథమిది. సహజంగానే దీనిలో కొంత పరిణతి కనిపిస్తుంది. నలభై ఏళ్ళపాటు వేమన నన్ను అంటిపెట్టుకునే ఉన్నాడని అర్థమవుతుంది. "అక్షరయానం" పేరుతో 'ఇండియా టుడే' లో మూడేళ్ళపాటు సాహిత్య, సాంస్కృతిక, విద్యా సంబంధిత వ్యాసాలతో కాలమ్ నిర్వహించాను. అదికూడా గ్రంథం రూపంలో వచ్చింది. ఇంతేగాక నేను అనువాదాలు కూడా చేశాను. "జ్ఞానదేవ", "తన్మయధూళి" అనే గ్రంథాలను సాహిత్య అకాడమీ ప్రచురించింది. మరికొన్ని అనువాదాలు సిద్ధంగా ఉన్నాయి.

ఆరేండ్లు ఎన్.బి. కాలేజిలో పనిచేసిన తరువాత 1981లో ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖలో లెక్చరర్‌గా సెలక్ట్ అయ్యాను. ఇక్కడ కూడా ఒక విషయం చెప్పాలి. ఇలా అప్లయ్ చేశానని చెప్పడానికి నారాయణరెడ్డి గారిని కలిశాను. "ఏమిటి నీ ప్రత్యేకత" అన్నారు. "గోల్డ్‌మెడల్" అన్నాను. ఆయన దానికి "అదేం ప్రత్యేకత. ప్రతి సంవత్సరం ఒకరికి వస్తుంది కదా" అన్నారు. "బి.ఏ.లో కూడా ఒకటుంది సార్" అన్నాను. "అట్ల చెప్పు" అన్నారు. అప్పుడే బయోడేటా అంటే ఏమిటో అది ఎట్లా రాయాలో సూచించారు. అది నా జీవితంలో ముఖ్యమైన మెట్టు. ఆ ఉద్యోగం సినారె ఆశీస్సులవల్లనే లభించిందని ఇక్కడ నేను వాచ్యంగా చెప్పనక్కర్లేదు. నా అనంతర అకడమిక్ అభివృద్ధికి అదే పునాది. తరువాత అంతా మామూలే. రెండేళ్లలోనే రీడర్ అయ్యాను. నాకు పరిశోధన పట్ల ఉన్న ప్రత్యేకమైన అనుభవం వల్ల నేను కొంత సీరియస్‌గానే నా పరిశోధక విద్యార్థులకు తోడ్పడేవాడిని. వారి పరిశోధనాంశాలను నేను కూడా కొంత అధ్యయనం చేసేవాన్ని. ఎస్వీ, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అఫ్సర్, మచ్చ హరిదాస్, సంగారెడ్డి, నీరజ, కె.బి.లక్ష్మి, ననుమాసస్వామి, ఎండ్లూరి సుధాకర్, రాపోలు సుదర్శన్, ఇవాళ ఇక్కడున్న పరిషత్ ప్రధాన కార్యదర్శి చెన్నయ్య నా దగ్గర పరిశోధన చేసినవారే. ఇంకెందరో... వారిప్పుడు తమతమ రంగాలలో ఉన్నతస్థాయిలో ఉన్నారు.

తరువాత ప్రొఫెసర్‌గా, తెలుగుశాఖ అధ్యక్షుడిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా పనిచేశాను. ఇవేకాక విశ్వవిద్యాలయ వ్యవస్థలో ఉన్న వార్డెన్, అసిస్టెంట్ చీఫ్ వార్డెన్, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ లాంటి పదవులు కూడా చేశాను. అనేక కమిటీల్లో ఉన్నాను. అవి యూనివర్సిటీని పునాదుల నుండి అర్థం చేసుకోవడానికి తోడ్పడ్డాయి. "డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్" పదవి చాలా ముఖ్యమైంది. ఉస్మానియాలో దాదాపు నూరుమంది ప్రొఫెసర్లలో ఒక సీనియర్ మోస్ట్‌కే ఆ అవకాశం వస్తుంది. అయితే ఇది నేను తెలుగు విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్‌గా పదవి పూర్తి చేసి మాతృసంస్థకు తిరిగి వచ్చిన తరువాత వచ్చింది. ఇక నేను వైస్-ఛాన్సలర్ కావడం కూడా నా కెరీర్‌లో ప్రధానమైన మలుపు. నా బాల్యమిత్రుడు, స్కూల్లో నా క్లాస్‌మేట్ నాటి హోంశాఖా మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రమేయం వల్ల నన్ను వి.సి. పదవి

వరించింది. ఆ యూనివర్సిటీకి నేను ఐదవ వైస్–ఛాన్సలర్‌ను. ఆ మూడేళ్ళలో నేనేం చేశానో అప్పటి "తెలుగువాణి" సంచికల్లో ఉంటుంది గాని ఒకటి రెండు సంగతులు చెబుతాను. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జీరో బడ్జెట్ పెట్టడంవల్ల ఆర్థికంగా కటకటగా ఉండేది. నేను 'సౌజన్య ప్రచురణలు' పేరిట ఒక స్కీం పెట్టి రికార్డు స్థాయిలో వంద గ్రంథాలు ప్రచురించాను. కూచిపూడిలో భవన నిర్మాణం కోసం 40 లక్షలు సేకరించి పునాదులు వేయించాను. జి.వి. సుబ్రహ్మణ్యం గారి హయాంలో అది పూర్తయింది. పేర్వారం జగన్నాథం గారు వరంగల్‌లో అద్దెగదుల్లో ప్రారంభించిన జానపద కళాకేంద్రానికి 60 లక్షల వ్యయంతో భద్రకాళి చెరువు ఒడ్డున పక్కా భవనాన్ని నిర్మించాను. దానికి సినారె తమ ఎం.పి. ల్యాడ్స్ నుంచి 30 లక్షలు మంజూరు చేశారు. అఖిల భారత రచయిత్రుల మహోత్సవం, నల్లగొండలో జానపద కళోత్సవాలు నిర్వహించాను. ఒక్కమాటలో చెప్పాలంటే ఉస్మానియాలో నాకు అలవాటైన అకడమిక్ వాతావరణాన్ని అక్కడ తేవడానికి ప్రయత్నించాను. దానికి అప్పటి నా టీం కూడా ఒక కారణం. అప్పటి రిజిస్ట్రార్ శివరామమూర్తి, భక్తవత్సలరెడ్డి, గౌరీశంకర్, జయధీర్ తిరుమలరావు, దేవేందర్, గంధం సుబ్బారావు, చెన్నయ్య, సుధాకర్‌నాయుడు, మృణాళిని, సోమయ్య వంటి వారెందరో నాకు సహకారాన్నందించారు. తెలుగు విశ్వవిద్యాలయానికి వి.సి.గా ఉన్న సమయంలోనే కాకతీయ విశ్వవిద్యాలయానికి ఫుల్ అడిషనల్ ఇన్‌ఛార్జి వి.సి.గా, ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఇన్‌ఛార్జి వి.సి.గా ఉన్నాను. కాకతీయ విశ్వవిద్యాలయానికి ఒక సంవత్సరంపాటు చేసిన సేవ ఎన్నో విశేషాలతో నిండి ఉంది. ఈ సందర్భంగా అప్పటి రిజిస్ట్రార్ తాళ్ల వెంకటరెడ్డిని కూడా స్మరించుకోక తప్పదు.

వైస్–ఛాన్సలర్ పదవి ముగిసిన తరువాత నేను మళ్లీ ఉస్మానియాకు తిరిగి వచ్చాను. ఇంకా ఆరేళ్లు సర్వీసు ఉంది. నేను వి.సి. అయినప్పుడు మొత్తం భారతదేశంలోనే అతి పిన్నవయస్కుడైన వి.సి.గా ఉన్నాను. మాతృసంస్థ ఉస్మానియాకు తిరిగివచ్చిన తర్వాత కోఠి ఉమెన్స్ కాలేజ్, ఆర్ట్స్ కాలేజిల్లో పాఠాలు చెప్పాను. రెండేళ్ళపాటు డీన్‌గా పనిచేసి 2008లో పదవీ విరమణ చేశాను. పదవీ విరమణ తర్వాత యుజిసి వారి మేజర్ రిసెర్చ్ ప్రాజెక్టు పూర్తిచేసి 'వేమన్న వెలుగులు' అన్న

గ్రంథాన్ని వెలువరించాను. తర్వాత అదే యుజిసి వారు ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా ఎంపిక చేశారు. ఆ కాలంలోనే 'సమకాలీన తెలుగు కవిత్వం' పైన ఓ విమర్శ గ్రంథాన్ని రాశాను. అది త్వరలో ముద్రణ కాబోతుంది. దాని తర్వాత ఇప్పుడు రెండోసారి మళ్ళీ ఎమిరెటస్ ప్రొఫెసర్‌గా నియమించబడ్డాను. మరో రెండేళ్ళు 'తెలుగులో వచన కవిత్వం, వ్యాఖ్యాన విమర్శ సూత్రాలు' అనే అంశంపై పరిశోధన చేస్తాను. నా రచనలపై కూడా మూడు పిహెచ్.డి.లు, అయిదారు ఎం.ఫిల్. లు వచ్చాయి. ఇంకెన్నో చోట్ల ఇవి జరుగుతున్నట్లు వినికిడి. ఇలా నిరంతర స్రోతస్వినిలా నా సాహిత్య వ్యాసంగం సాగుతూనే ఉంది. ప్రస్తుతం కేంద్రసాహిత్య అకాడమీకి పాలకమండలి సభ్యుడిగా, సలహామండలికి సంచాలకునిగా ఉన్నాను. దీనివలన దేశంలోని అనేక రాష్ట్రాల్లో సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం, యువతను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో అకాడమీ ఉనికి బలంగా తెలుస్తున్నదని పలువురు అంటున్నారు. ఇది ఇంకొక మూడున్నర సంవత్సరాలు ఉంటుంది. అంతేకాకుండా 'నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా'కు తొమ్మిదేళ్ళుగా సలహామండలి సభ్యుడిగా ఉన్నాను. లోగడ 'నంది అవార్డ్స్' కమిటీకి చైర్మన్‌గా పనిచేశాను. తెలుగు యూనివర్సిటీ ఏర్పడకముందు రాష్ట్ర సాహిత్య అకాడమీకి (1984) ఎలక్టెడ్ మెంబర్‌గా ఉన్నాను.

అలాగే నాకు దాదాపు 30 పురస్కారాలు లభించాయి. ఈ ప్రసంగంలోనే మరోచోట పేర్కొన్నవి కాకుండా మిగతావి ఇక్కడ రికార్డ్ కోసం మీ ముందుంచుతాను. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక అవార్డు (1995), తెలుగు యూనిర్సిటీవారి శ్రీమతి లక్ష్మీరమణ ధర్మనిధి పురస్కారం (1989), విజయనగరం వారి విజయభావన పురస్కారం (1995), ఢిల్లీ తెలుగు అకాడమీ అవార్డు (1999), దాశరథి అవార్డు (1999), కురుగంటి సీతారామయ్య అవార్డు (1999), జ్యోత్స్నా కళాపీఠం అవార్డు (1999), సాహితీరత్న నీలా జంగయ్య అవార్డు (2000), తణుకు బాలగంగాధర తిలక్ అవార్డు (2001), ఉత్తర అమెరికా వారి సప్న అవార్డు (2001), పాలకొల్లువారి సినారె సాహితీ పురస్కారం (2002), రాజమండ్రి వారి ప్రతిభావైజయంతిక పురస్కారం (2002), సాంస్కృతిక శాఖవారి ఉగాది విశిష్ట పురస్కారం (2006), శివానంద

ఎమినెంట్ సిటిజన్ అవార్డు (2006), పిఠాపురం వారి మాతృశ్రీ రాజహంస కృష్ణశాస్త్రి అవార్డు (2007), తేజ ఆర్ట్ క్రియేషన్ జీవన సాఫల్య పురస్కారం (2009), దాశరథి పురస్కారం (2009), రాష్ట్ర ప్రభుత్వం వారి కళారత్న అవార్డు (2009), రాష్ట్రప్రభుత్వ బోయి భీమన్న పురస్కారం (2011), శ్రీపాదరావు స్మృతి పురస్కారం (2012), నిజామాబాద్ వారి హరిదా–రచ్చ తెలంగాణా విశిష్ట పురస్కారం (2013) మొదలైనవి. ఇక నా రచనా వ్యాసంగం గురించి వివరిస్తాను. అప్పట్లో నా 'తంగెడుపూలు' కవిత చాలామంది నోళ్ల కెక్కింది. వినండి.

తంగెడుపూలు

తంగెడుపూలు అంటే ఒప్పుకోను
బంగరు పూలు
పొంగిన విచారాన్ని
దిగమింగిన పూలు
వెల గలిగిన గులాబీల కన్న
వెలవెలబోయే మల్లెల కన్న
వెలలేని ఈ పూలు మేలు
తెలుగు వారి బతకమ్మల కమ్మని మొగాల
వెలుగు నింపు పూలు
కాపు కన్నెల ముద్దుగొలుపు ముద్దకొప్పుల్లో
కాపురముండే పూలు
మనసున్న పూలు
మమతలున్న పూలు
వాసన లేకున్నా
వలపు బాసలు నేర్చిన పూలు
పేద పూలు
పేదల పూలు

తంగెడుపూలు అంటే ఒప్పుకోను
బంగరుపూలు

1976లో నా మొదటి కవితా సంపుటి 'తంగెడుపూలు' వెలువడింది. దీనిలో 'తంగెడుపూలు' అనే కవిత 1967లో రాశాను. తంగెడుపూలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక. ఇది నాటి కవి సమ్మేళనాలలో బాగా పేలిన కవిత. అప్పుడే నేను ఉస్మానియాలో బి.ఏ.లో ప్రవేశించాను. ఈ సంపుటిని సినారె గారికి అంకితం చేశాను. తంగెడుపూలు కవితా సంపుటికి కుందుర్తి ఓ పెద్ద పీఠిక రాశాడు. ఆయన 'తంగెడుపూలు' కవితను పెంచి దీర్ఘకవితను రాయమని సలహా ఇచ్చాడు. దీర్ఘకవిత అంటే అప్పటికి తెలియదు. అప్పటికి 'విప్లవ రచయితల సంఘం' మంచి ఊపులో ఉంది. 'అరసం' పునరుద్ధరణ ప్రయత్నంలో ఉంది. నాలాంటివాడికి అది ఒక చౌరస్తా దశ. 'తంగెడుపూలు', 'కత్తి కార్చిన కన్నీరు' అనే దీనిలోని కవితలు వచన కవితా నిర్మాణంలో కొంత సంధి దశను సూచిస్తాయి.. ముఖ్యంగా ప్రాసల ప్రయోగంలో. దీనిలోని 'ఎండుటాకులు' కవితను గురించి రాస్తూ కుందుర్తి ఈ కవికి మంచి భవిష్యత్తు ఉందని రాశాడు. 'మంచి తిండి' అనే కవిత పూర్తి మాండలికంలో రాసింది. ఈ పుస్తకంలోని కవితలపైన వామపక్ష భావజాల ప్రభావం పరోక్షంగా ఉంది. మా భువనగిరి ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉండేవి. నేను అనేక పార్టీ మహాసభల్లో నేల శ్రోతగా ఉన్నాను. అయితే మా ఊరి నుంచి కొండా లక్ష్మణ్ బాపూజీ ఎన్నికల్లో గెలిచి మంత్రి అయ్యాడు. నా పదో యేట మిత్రులను వెంటేసుకొని మా వూరి దగ్గరి బొల్లేపల్లికి వెళ్లి రావినారాయణరెడ్డిని చూసి రావడం ఓ మంచి జ్ఞాపకం. మూడు వేల ఎకరాలను పేదలకు పంచడం, నెహ్రూకన్నా ఎక్కువ ఓట్లు రావడం అప్పటి ప్రజావాక్యం. ప్రగతిశీలం, అభ్యుదయ దృక్పథం అనేవి నా రక్తంలోనే ఉన్నట్లు ఈ సంపుటిలో గుర్తించవచ్చు. 'తంగెడుపూలు'కు ఆ రోజుల్లో చాలా పేరు వచ్చింది. వేముగంటి నరసింహాచార్యులు, తిరుమల రామచంద్ర లాంటివారు మంచి సమీక్షలు రాశారు. అది ఆంధ్రమహిళాసభవారు దేవులపల్లి కృష్ణశాస్త్రి పేరిట నెలకొల్పిన అవార్డును పొందింది.

చాలా రోజుల దాకా 'తంగెడుపూల గోపి' అని వ్యవహరించేవారు. 1976 నుండి 1981 వరకు ఐదేళ్ళ వరకు నేను పెద్దగా కవిత్వమేమీ రాయలేదు. ఆ ఐదేళ్ళలో నేను వేమనను గురించి పరిశోధనా తపస్సు చేస్తున్నాను. చాలామంది 'గోపి జోడు గుర్రాల స్వారీ చేస్తున్నాడు. కవిత్వాన్ని వదిలివేస్తాడా'? అని అనుకున్నారు. కాని అది నిజం కాలేదు. నా మనస్తత్వంలో పరిశోధనా, కవిత్వం వైరుధ్యాన్ని సంతరించుకోలేదు.

రెండో కవితా సంపుటి 'మైలురాయి' మద్రాస్ 'క్రాంతి ప్రెస్'లో అచ్చయింది. రాతప్రతి పంపిస్తే ఆ ప్రెస్ యజమాని ధనికొండ హనుమంతరావు దాన్ని ముద్రించి పంపించాడు. దీనిలో కూడా ఎప్పటికీ నిలిచిపోయే కవితలున్నాయి. ఇందులోని 'సామగ్రి' అనే మినీ కవితను ఎందరో ఉటంకించేవారు. దీంట్లో కాళోజి గురించి రాసిన ఒక మాండలిక కవిత చాలా ప్రసిద్ధికెక్కింది. నేను రాంనగర్‌లో నివసిస్తున్నపుడు ఆయన నా పొరుగున కొంతకాలం నివసించాడు. అప్పుడు ఆయనను లోతుగా అర్థం చేసుకునే అవకాశం కలిగింది. ఆర్ద్రహృదయుడు కాళోజి. కన్నీళ్లు ఆయన సంపద. 'తంగెడు పూలు'లోనే నా సొంతగొంతు వచ్చేసింది. ఒకటి రెండు కవితల్లో సినారె ముద్ర కనిపించినా అవి నా జీవన నేపథ్య స్వభావంలో అంతగా కనిపించవు. ఇప్పుడు చూస్తే అనిపిస్తుంది. నేను ఏ కవిత రాసినా నా అనుభవంలోంచే రాశాను. నాకనిపించిందే రాశాను. అట్లాగని ఉద్యమాలను అధ్యయనం చేయలేదని కాదు. మార్క్స్, ఫ్రాయిడ్‌లను కుత్తుకబంటిగా అధ్యయనం చేశాను. అన్ని వెలుగులను పీల్చుకుని సారాంశంగా పీడిత పక్షపాతిగా ఎదిగింది నా కవిత్వం. విరసం ఉధృతంగా ఉన్న కాలంలో కూడా కవితాత్మకత, శిల్పం వంటి మూల్యాలను నేనెప్పుడు విస్మరించలేదు. విరసం కాలంలో చాలామంది కవులు భయపడి రాయడం మానేసినట్టు గుర్తు. కాని నేను ఆ కెరటాన్ని అధిగమించి నిలబడ్డాను. విరసం అంటే వ్యతిరేకత ఉండేది కాదు. పరోక్షంగా దాని ప్రభావం కొంత నా మీద ఉండి వుంటుంది. ఒక సమన్వయ ప్రవృత్తితో నా కవిత్వం ఎదిగిందని నాకనిపిస్తుంది. నేను యూనివర్సిటీలో పనిచేసినా, పరిశోధన చేసినా కవిత్వంలో నేను కెరీరిస్టును కాదు. వెక్కసం అయితే తప్ప నేను కవిత్వం రాయలేదు. నిజాయితి నా కవిత్వానికి

మూలధాతువు.

ఉద్యమాలతో నేను మమేకం కాకున్నా ఆ గాడ్పులను తప్పించు కోవడానికి నేనెప్పుడూ ప్రయత్నించలేదు. అయితే ఏడవ దశకంలో వచ్చిన రచనల్లో ఉద్యమ వర్ణన జరిగినంతగా దానికి మూలమైన ప్రజాజీవన చిత్రణ జరగలేదనేది మొదటినుంచి నా ఆరోపణ. 'మైలురాయి'కి ప్రతిష్ఠాత్మకమైన ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు రావడం ఆరోజుల్లో ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది.

నా మూడో కవితా సంపుటి 'చిత్రదీపాలు'. దీనిలో 'మా ఊరిచెరువు, కిరణజన్య సంగీతం, సమూహస్వప్నం, రాక్తారోహణ, ఫ్రీడమ్ ఫైటర్' వంటి బలమైన కవితలున్నాయి. దీనికి తెలుగు యూనివర్సిటీ ఉత్తమ కవితా పురస్కారం లభించింది. ఇది రాష్ట్రస్థాయి సాహిత్య అకాడమీ అవార్డుతో సమానం. నారాయణరెడ్డిగారికి జ్ఞానపీఠ అవార్డ్ వచ్చినప్పుడు వారి అభిమానులు వారి పేరిట కరీంనగర్‌లో ఒక పురస్కారాన్ని నెలకొల్పారు. తొలి పురస్కారాన్ని నా 'చిత్రదీపాలు'కే ప్రకటించడం అదో మంచి అనుభూతి. నా నాలుగో కవితా సంపుటి 'వంతెన'. దీన్లో కూడా చాలా మంచి కవితలు ఉన్నాయి. ప్రతి సంపుటికి ఒక ఎదుగుదల, పరిణామం, పరిణతి కనిపించేవి. ఎప్పటికప్పుడు స్థానీయ, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయంగా వస్తున్న మార్పులన్నీ నా కవిత్వంలో చోటుచేసుకోవడం గమనించవచ్చు. ఇరాక్ యుద్ధం గురించిగాని, జర్నలిస్ట్ గులాం రసూల్ హత్య గురించి గాని, పాతనగరంలో మతకలహాల గురించిగానీ, మా అమ్మ మీద నేను రాసిన కవితలు గాని చాలా ప్రసిద్ధికెక్కాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణా జిల్లాలనుంచి ఇక్కడ బతకలేని నేతన్నలు బొంబాయి, షోలాపూర్, బీవాండి తదితర ప్రాంతాలకు పొట్టచేతపట్టుకుని వలసపోయిన వైనాన్ని 'ఓ రాజయ్య కథ' కవితలో రాశాను. ఇది "ఓ రైతన్నా! నేతన్నా" లాంటి రొటీన్ కవితలకంటే భిన్నమైన కవిత. ఇట్లాంటి కవితలన్నీ "వంతెన" లో దర్శనమిస్తాయి. దీనికి అమలాపురంలోని సమతారచయితల సంఘం అవార్డుని ప్రకటించింది.

నా అయిదో కవితాసంపుటి 'కాలాన్ని నిద్రపోనివ్వను'. శీలావీర్రాజు గారికి

అంకితం చేశాను. దీనికే కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఇందులోని కవితలు చాలావరకు అత్యున్నతమైన స్థాయిలో ఉన్నటువంటివి. 'రొట్టె, చచ్చిపోతున్న ఉత్తరం, వాకిలి, బొంత, మళ్ళీ మా అమ్మాయి, మృత్యుదుఃఖం, కాలాన్ని నిద్రపోనివ్వను, రక్తసముద్రం' వంటివి వాటిలో కొన్ని. దీన్లో దేవులపల్లి రామానుజరావు గురించి రాసిన 'ఎపిటాఫ్' అనే కవిత ఎందరికో గుర్తుండిపోయింది, అట్లాగే కాలాన్ని నిద్రపోనివ్వను. ఈ సంపుటి గురించి అఫ్సర్, ***"గోపి సమకాలీనతలోంచి సార్వకాలీనతలోకి ప్రవేశించరనడానికి ఈ కవిత్వ సంపుటి ఒక ప్రతీక. 'తంగెడుపూలు' నుంచి ఇప్పటివరకూ కాలాన్ని ఒక ముఖ్యవస్తువుగా స్వీకరించి, కాలానికి తన మొత్తం 'Integrity of Time and Place' ని బలంగా represent చేశారు. ఆ కొత్త వైవిధ్యం వల్లనే 'కాలాన్ని నిద్రపోనివ్వను'లో వ్యక్తీకరణ ఆకాశమంత విస్తృతిని తన వృత్తంగా స్వీకరించగలిగింది"*** అని రాశాడు.

అలాగే 'మా అమ్మాయి' అనే కవిత ఎందరినో కదిలించింది. డిసెంబర్ 21, 1996లో మా కూతురు రచన మరణించింది. కుటుంబంలో పిడుగుపడింది. అంతులేని దుఃఖంతో పాతాళంలోకి కుంగిపోయి మూడేళ్ళపాటు అక్కడి అగాధాల్లో కొట్టుమిట్టాడాం. 18 సంవత్సరాలు గడిచినా ప్రతిరోజూ అదొక పీడకలే.

నా 50వ జన్మదిన సంచిక "గోపి సాహిత్య దర్శనం"లో ప్రముఖ విమర్శకుడు కడియాల రామోహనరాయ్ ఇలా రాశారు (1998)–

"గోపి కావ్యాలలో 'మా అమ్మాయి' పేరుతో ఉన్న రెండు గీతాలను చదవగానే ప్రముఖ కవి బసవరాజు అప్పారావు గారు తలపునకు వస్తారు. ఆయనకు లేకలేక ఒక ఆడపిల్ల 'మంగళ ప్రద' జన్మించినప్పుడు ఆ అమ్మాయి చిన్న వయసులోనే మరణించినప్పుడు శ్రీ బసవరాజు రెండు గీతాలను గుండెలలో నుండి రక్తపు జీర అంటుకొని వచ్చిన వాటిని రచించారు. శ్రీ గోపి 'మా అమ్మాయి' అనే మొదటి గీతంలో (1992)...

"మా అమ్మాయి
నా భుజాలదాకా ఎదిగి

నన్ను ఎత్తుకో నాన్నా అన్నప్పుడు
బాల్యాన్ని వీడటం ఇష్టం లేని నా బిడ్డను చూసి
ఎంత బాధపడ్డానో ”   అంటారు. ఇంకా....
నేను బయటికి వెళ్ళేటప్పుడు
తన చిరునవ్వుతో వీడ్కోలు చెప్పకపోతే
నా విశాల ప్రపంచమంతా ఇరుకైపోతుంది
....
మా అమ్మాయి సంతోషమే
నా హృదయావరణంలో ఇంద్ర ధనుస్సును నాటుతుంది
ఆ ఇంద్రధనుస్సును
కళ్ళ తోరణాలు కట్టి కాపాడుకొంటాను”–

అన్నారు. కాని అమ్మాయి మృత్యువును వరించి అకాలంలో వెళ్ళిపోయింది. గోపి అమ్మాయి మరణానికి గుండెలు వ్రయ్యలు కాగా రాసిన శోకగీతం (1996)లో

“అమ్మాయి కలలా వచ్చినా
పీడకలలా వెళ్ళిపోయింది
....
ఎందుకో తనకీ లోకం నచ్చలేదు
.....
విజయాలే కావు
వైఫల్యాలు కూడా
జీవితంలో భాగమని నేర్పనందుకు
అనుభవించు నాన్నా అని
నిర్దాక్షిణ్యంగా శిక్షించి పోయింది”– అని దు:ఖించారు.

‘కాలాన్ని నిద్రపోనివ్వను’ రెండు ముద్రణలు పొందింది. అది 22 భాషల్లోకి అనువదించబడింది. అన్నింటినీ కేంద్రసాహిత్య అకాడమీయే ప్రచురించింది. ఆ

వివరాలివి :

క్ర.సం.	భాష	పుస్తకం పేరు	అనువాదం
1	హిందీ	సమయ్‌కో సోనే నహీదూంగా	శ్రీమతి ఆర్. శాంతసుందరి (హైదరాబాద్)
2	ఇంగ్లీషు	ఐ విల్ నాట్ లెట్ టైం స్లీప్	డా. జె.భాగ్యలక్ష్మి (ఢిల్లీ)
3	గుజరాతీ	సమయ్‌నె సువా నాహీ దౌన్	రమణిక్ సోమేశ్వర్ (బరోడా)
4	తమిళం	కాలత్తయ్ ఉరంగ విడమట్టెన	డా.శిరిపి బాలసుబ్రహ్మణియం (కోయంబత్తూర్)
5	మలయాళం	సమయతె ఉరంగన్ అనువధిక్కుకయిల్ల	ఎల్.ఆర్.స్వామి (విశాఖపట్నం)
6	మరాఠీ	కాలాల జోపు దేనార్ నాహి	డా.కాంచన్ జట్‌కర్ (హైదరాబాద్)
7	కొంకణి	కల్లక్ నిహిదుంక్ దిన్స్‌చోనమ్	రమేష వెలుస్కర్ (గోవా)
8	డోగ్రి	సమెన్‌గీ దేయెంగ్‌నీ సౌనా	ప్రకాష్ ప్రేమీ (ఉద్ధంపూర్)
9	మైథిలి	సమయ్‌కెన్ సుతనాయ్ దేబయ్	కవితాకుమారి (ముంబయి)
10	కన్నడం	కాలవన్ను నిద్రిసలు బిడెను	డా. దివాకర్ల రాజేశ్వరి (బెంగళూరు)
11	పంజాబి	మై సామేను సహీ దేవాంగా	డా.వనిత (ఢిల్లీ)
12	సంస్కృతం	కాలమ్ నో నిద్రాపయాణి	ప్రొ.జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి (తిరుపతి)
13	సింధీ	వఖ్త్ ఖే సుమ్హాన్ దిన్‌దుస్	శ్రీచంద్ దూబె (జునాఘడ్)
14	ఉర్దూ	వఖ్త్ కో సోనే నహీ దూంగా	ప్రొ.రహమత్ యూసుఫ్ జాయ్ (హైదరాబాద్)
15	నేపాలీ	సమయాలమ్ నీదావ్‌న	సిద్ధార్థ రాయ్ (డార్జిలింగ్)
16	ఒడియా	సమయకు సొయిబాకు దెబిని	బెంగాలీనందా (రాయగడ)
17	అస్సామీ	సమాయ్ టొమాక్ శుబోలోయ్ నిద్యు	శ్రీమతి పూరబీ బోరా (గౌహతి)
18	మణిపురి	మతంబూ ఐనా ఫుమల్లోయ్	సలాం తోంబా (ఇంఫాల్)
19	బెంగాలి	సామయ్ కె. ఘుముతె దెబోనా అమి	ప్రొ.మందర ముఖోపాధ్యాయ్ (కోల్‌కతా)
20	బోడో	బూబ్లీ ఖౌ ఫతువా	డా. ఉత్తమ్ కుమార్ బ్రహ్మ (గోనేష్ పోతార్, అస్సాం)
21	కశ్మీరీ	బా దిమ్‌న వఖ్తస్ దామి గధ్‌నా	రాజూర్ తిలగామీ (తిలగామ్ పట్టన్ కష్మీర్)
22	సంతాలీ	ఒక్తో బన్‌జాటీబ్ ఓ చో ఆయా	జాదుమణి బిస్ర (మిద్నాపూర్)

అనువాదకులందరూ ఆయాభాషల్లో సమున్నతులు. నా కవిత్వంపైన అభిమానంతో, అభినివేశంతో అనువాదాన్ని చేపట్టినవారు. దీనివల్ల అనువాదం ఉబలాటంగా మిగిలిపోకుండా ఆయారాష్ట్ర సాహిత్యాల్లో నా పేరు చాలామందికి

పరిచయం అయ్యింది.

ఇక నానీలు. ఇవి 1997లో రచించబడ్డాయి. నాటి 'వార్త' సంపాదకులు ఎ.బి.కె. ప్రసాద్ 365 నానీలను ఎడిట్ పేజీలో 20 వారాలపాటు ప్రచురించారు. సీరియల్‌గా వస్తున్నప్పుడే ఒక సంచలన వాతావరణం నెలకొంది. దానికి వాటిలో ఉండే వస్తునవ్యత, కవితాశక్తి, తాజాదనం, ముఖ్యంగా నిర్మాణబలం, కారణమనుకుంటాను. నాలుగు పాదాల్లో తొలి మలి యూనిట్లు (రెండేసి పాదాలు ఒక యూనిట్) ఇరవై అక్షరాలకు తగ్గకుండా, ఇరవై ఐదు అక్షరాలకు మించకుండా అతికుదింపు; అతివ్యాప్తీ లేకుండా ఏర్పరచిన పరిమితి లక్షణాలు, నానీలు అందరినీ ఆకర్షించడానికి దోహదపడ్డాయి. మినీ కవితలు గతంలోకి వెళ్ళిపోయిన కాలంలో, హైకూ లక్షణాలు తెలుగులో ఒదగవని తేలిపోయిన తరుణంలో నానీలు వెలువడ్డాయి. నానీలు రాస్తున్నప్పుడు అవి ఒక ట్రెండ్ సెట్టర్‌గా మారుతాయని నాక్కూడా తెలియదు. ఒక సంవేదనాత్మక మానసిక స్థితిలో ఒక అనివార్యతా భావశబలిత సన్నివేశంలో నేనీ నానీలను సృష్టించాను. ఇక రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల కవులు నానీలను రాయడం ప్రారంభించారు. నా దృష్టికి వచ్చినవాటికి లక్షణాలను సవరించేవాడిని. కొంత కవిత్వపు స్పర్శను కూడా అందించేవాడిని. నానీల్లో ఎక్కువగా పల్లె జీవితం ప్రతిబింబించింది. ఇప్పటివరకు 230 సంపుటాలు వచ్చాయి. ఎస్. రఘు, సి. భవానీదేవి, నూటెంకి రవీంద్ర, అన్నవరం దేవేందర్, పత్తిపాక మోహన్, నలిమెల భాస్కర్, ఎన్ అరుణ, సూర్య ధనుంజయ, వై. రామకృష్ణారావు వంటి ఎందరో నా నానీల స్థాయిలో నానీల సంపుటాలను వెలువరించారు. సమయ భీతివల్ల కొన్నిపేర్లే చెబుతున్నాను. చాలా నానీలు ప్రజల నోళ్లకెక్కాయి. సభల్లో ఉటంకించబడుతున్నాయి. నా నానీలు 10 భాషల్లోకి అనువదించబడ్డాయి. వాటి వివరాలు ఇవి.

క్ర.సం.	భాష	పుస్తకం పేరు	అనువాదం
1	హిందీ	నన్హేముక్తక్	ప్రొ. పి. విజయరాఘవరెడ్డి (హైదరాబాద్)
2	హిందీ	గోపీకే నన్హేముక్తక్	ప్రొ. బి. సత్యనారాయణ (హైదరాబాద్)
3	మరాఠీ	నానీలు–ముక్తక్‌మణికా	సురేష్ గంగాఖేడ్కర్ (హైదరాబాద్)
4	ఇంగ్లీషు	నానీలు–ది లిటిల్ వన్స్	శ్రీమతి పి. జయలక్ష్మి (హైదరాబాద్)

5	సంస్కృతం	నానీలు-నవమౌక్తికా:	ప్రొ. ఎం. విజయశ్రీ (హైదరాబాద్)
6	తమిళం	నానీగళ్	డా॥ నలిమెల భాస్కర్ (కరీంనగర్)
7	కన్నడం	నానీగళ్	ప్రొ. కె.జి. నారాయణ ప్రసాద్ (హైదరాబాద్)
8	రష్యన్	చికత్ వోర్ణియే మినియాచూరి	ప్రొ. వినయ్ తోతావర్ (హైదరాబాద్)
9	గుజరాతీ	నానీలు	డా॥ ఉర్వీశ్ ఒసావడా (జునాఘడ్)
10	ఉర్దూ	నన్హీ నజ్మే	ప్రొ. ఫాతిమాబేగం (పర్వీన్) (హైదరాబాద్)
11	మలయాళం	నానీ కవితాకళ్	ఎల్.ఆర్. స్వామి (విశాఖపట్నం)

నానీల గురించి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చింతకింది శ్రీనివాసరావు ప్రామాణికమైన పిహెచ్.డి., సిద్ధాంత గ్రంథం రాశాడు. కేంద్రప్రభుత్వం మానవ వనరుల శాఖ చలపాక ప్రకాష్‌కు ఫెలోషిప్‌ను నానీలపై పరిశోధనకు గాను మంజూరు చేసింది. అతను ఒక చక్కని గ్రంథం రాశాడు. ఎందరో ప్రామాణికమైన పరిశోధనలు చేశారు. నానీలతోపాటు ఇతర ముక్తక రూపప్రక్రియలు వచ్చాయిగాని అవి నానీల విలువను మరింత పెంచాయి. నానీలను వ్యతిరేకిస్తూ కొన్ని విమర్శలు కనిపించాయిగాని వాటిలో ఎక్కువగా సాహిత్యేతర కారణాలతో వచ్చినవే. నానీలు వెలువడి పద్దెనిమిది ఏండ్లు అయింది. ద్విదశాబ్ది ఉత్సవాలవైపు పరుగులు తీస్తున్నాయి. నానీలు ఇంకా పుంఖానుపుంఖంగా వెలువడుతూనే ఉన్నాయి. ఒక లిటరరీ ట్రెండ్ ఇంత సుదీర్ఘకాలం చురుగ్గా కొనసాగడం ఆశ్చర్యమే. నానీల వల్ల నాకు సాహిత్య లోకంలో 'నానీల నాన్న', 'నానీల సృష్టికర్త', 'నానీల రూపశిల్పి' లాంటి ఆత్మీయ సంబోధనలు స్థిరపడ్డాయి.

తరువాత సంపుటి 'చుట్టకుదురు' దీనికి ఏలె లక్ష్మణ్ చక్కని ముఖచిత్రం వేశాడు. అదే ఒక దృశ్య కవితలాగా అమరింది. 'చుట్టకుదురు'లో 'హోమ్ ఫర్ ది ఏజ్డ్, భువనగిరి నుంచి కవనగిరి దాకా, కొండ' కవితలు చాలామందిని ఆకర్షించాయి. 'హోమ్ ఫర్ ది ఏజ్డ్' అమెరికాలాంటి విదేశాకు వెళ్ళిన పిల్లల వృద్ధ తల్లిదండ్రుల పరిస్థితిని చిత్రించిన కవిత. అమెరికాలో నేను దీనిని చదివినప్పుడు అక్కడి చాలామందికి కన్నీళ్లు తెప్పించింది. 'భువనగిరి నుండి కవనగిరి దాకా' మా బడి

వజ్రోత్సవాలు జరిగినప్పుడు వాటిలో పాల్గొన్న వందలాదిమంది బాల్యమిత్రుల మధ్య చదివిన కవిత. నా ఆబాల్యమిత్రుడు కీర్తిశేషులు ఎలిమినేటి మాధవరెడ్డి ఈ కవితను విని పులకించిపోవడమే కాక కలిసినప్పుడల్లా దాన్ని మళ్ళీ వినిపించమనేవాడు. ఇప్పుడతను లేడనుకుంటున్నప్పుడల్లా దు:ఖంగా ఉంటుంది. 'హిమాలయ్‌కి గోద్‌మే' అనే కవిత అస్సాంకు వెళ్తున్నపుడు విమానంలో రాసింది. భారతీయకవిత్వారణలో ఇది నా భావవిస్తృతిని మరింత పెంచిన కవిత. పంజాబ్ రాష్ట్రంలోని నాబాడ్ సంస్థానంలో నేను ఈ కవితతోపాటు రొట్టె, బొంత కవితలు వాటి అనువాదాలు చదివినప్పుడు అప్పటి సాహిత్య అకాడమి ఉపాధ్యక్షుడు నూర్‌సింగ్ నన్ను 'మహాకవీ' అని సంబోధించడం ఒక పులకరింపు.

నానీలు ఒక ఉద్యమస్థాయిలో వెలువడుతున్న రోజులవి. 2001లో మళ్ళీ 'గోపీ నానీలు' అనే పేరుతో మరో పుస్తకం వేశాను. అవి నేను వి.సి.గా ఉన్నప్పుడు హైద్రాబాద్‌కు వరంగల్‌కు మధ్య కారులో వెళ్తున్నప్పుడు రాసినవి. ఇవి నా మొదటి నానీల పుస్తకం కంటే ఓ బెత్తెడు ఎక్కువ స్థాయిలోనే ఉన్నవి. కాని చరిత్రలోకి వెళ్ళిన మొదటి పుస్తకం ముందు వీటికి తగినంత ప్రచారం రాలేదు. దీనిని ఆవిష్కరించేటప్పుడు సినారె 'గోపి నానీ కవులతో పోటీ పడుతున్నాడ'ని చమత్కరించారు.

ఇక జలగీతం. ఇది నా సాహిత్య జీవితంలో పెద్ద మలుపు. ఎప్పట్నుంచో సినారె 'నీవు ఇంకా దీర్ఘకావ్యం రాయలేదా' అని అంటుండేవారు. నా వి.సి. పదవి ముగియగానే లౌకిక ధూళిని కవిత్వ గంగతో కడిగేసుకున్న సన్నివేశం అది. నీటిని గురించి కావ్యాన్ని రాయాలని అయిదారేళ్ళుగా అనేక గ్రంథాలు చదివాను. నీటికున్న అనేక పార్శ్వాలను అధ్యయనం చేశాను. ముఖ్యంగా నా సొంత జిల్లా నల్లగొండలో ఫ్లోరైడ్ భూతాన్నీ, దాని దుష్ఫలితాలను చూసి నిలువెల్లా చలించిపోయాను. ప్రజాస్వామ్యానికి జలస్వామ్యం పునాది అని గ్రహించాను. ఒక సమాధిలాంటి స్థితిలో నూరురోజుల పాటు కూర్చుని ఏకధాటిగా ఈ కావ్యాన్ని రాశాను.

భూమ్మీద లభ్యమౌతున్న మొత్తం నీటిలో 97 శాతానికి పైగా సముద్రజలం.

అది ప్రాణులకు ప్రత్యక్షంగా ఉపయోగపడేది కాదు. మరో రెండు శాతానికి పైగా మంచురూపంలో ఉంది. మిగిలిన ఒక్క శాతం కన్న తక్కువే ప్రాణులకు పనికొచ్చే మంచినీరన్నమాట. ఇప్పుడా మంచినీటికి పెద్ద ముప్పు ఏర్పడింది. అధిక జనాభా తదితర వాస్తవాల వల్ల వినియోగం పెరిగి చాలీచాలని పరిస్థితి ఒక కారణమైతే, కాలుష్యం రెండోది.

వాతావరణ కాలుష్యం పెరిగి మంచుమీద వొత్తిడి మొదలైంది. భూగోళం మీది సంతులితకి మంచు ఒక ఆధారం. అది కాస్తా కరిగిపోతే జలప్రళయం సంభవించి నేల తుడిచిపెట్టుకపోతుంది.

నేనీ సుదీర్ఘకవిత రాయడానికి పైన చెప్పిన అంశాలు ఒక ప్రేరణ. అయితే ఇది వైజ్ఞానిక రచన కాదు. వైజ్ఞానిక భూమికపై మొలిచిన తాత్విక, మానవీయ కవిత.

కాస్మిక్ జలం నుంచి కాలుష్య జలం దాకా నీటి అనంత యాత్రా ప్రక్రియ దీనిలో చిత్రితమైంది. విశ్వం నుంచి నీటిరాక, జలచక్రం, పంచభూతాల్లో నీటి ప్రాధాన్యం, ప్రమేయం, నీటి వివిధ రూపాలు, ధర్మాలు, నీటివిలువ, ప్రశస్తి, మనిషికి నీటితో ఉన్న నిర్దిష్ట సంబంధం, నీరూ సంస్కృతి, నీటి కరవు, నీటి పంపకాలు, జలకలహాలు, నదులు, జలపాతాలు, చెరువుల జలవ్యవస్థ, రవాణా జలం, జలకాలుష్యం, నీటిని వాణిజ్య వస్తువుగా మారుస్తున్న వైనం, నీటికోసం ఉద్యమాలు, నీటి నిల్వల కోసం భగీరథ ప్రయత్నాలు మొదలైన సమస్త అంశాలకు కవితాత్మక రూపమే ఈ రచన.

జలాత్మను ఆవిష్కరించడానికి చేసిన ప్రయత్నమిది. పఠితల్లో జలస్పృహను కలిగించాలనేది ఆశయం. ముఖ్యంగా జలాన్ని ఆవాహన చేసి జలానుభూతిలో క్షాళితం కావడానికి ఈ రచన నాకెంతో తోడ్పడింది.

దీంట్లో 27 అధ్యాయాలున్నాయి. 112 పుటల కావ్యం. ఈ కావ్యంలో మొదటి పంక్తితో ప్రారంభమైన భావావేశస్థాయి చివరి పంక్తిదాకా తగ్గలేదని

విమర్శకులు అభిప్రాయపడ్డారు. ఇంతవరకు ఎవరూ వాడని కొత్త మాటలు, కొత్త పదబంధాలు, వినూత్న అభివ్యక్తులు, కవిత్వం ముద్దల్లాంటి సన్నివేశాలు, మానవీయ సంవేదన దీనిలో ఉన్నాయని పలువురు గుర్తించారు. ఇప్పుడు చదువుతుంటే నేనే రాశానా అని అనిపిస్తుంది. ఈ పుస్తకాన్ని గురించి భూగర్భశాస్త్ర అధ్యాపకులు ధనంజయ్ నాయక్ ఓ విమర్శ గ్రంథమే రాశాడు. అలాగే జలగీతాన్ని గురించి రాయబడిన వ్యాసాలన్ని 'జలదీపిక' పేరిట ఓ గ్రంథంగా వచ్చాయి. ఈ పుస్తకాన్ని జలపురుషుడు (వాటర్ మ్యాన్) రాజేంద్రసింగ్‌కు అంకితం చేయడం నా జీవితంలో మరో అనుభూతి. ఆయనకు ఎందుకు అంకితం చేశానో ఈ అంకిత వాక్యాలు చూస్తే అర్థమవుతుంది:

"రాజస్థాన్‌లోని క్షామపీడిత గ్రామసీమలకు నీటిని రప్పించి సస్యశ్యామలం చేసి ఆదుకున్న జలదాత, ఆరావళీ పర్వతాల్లో శుష్కించిపోయిన ఐదు నదులను బతికించిన జలబ్రహ్మ. మాటలు లేకుండా పలుగూ పారతో శ్రేయ:కావ్యం రచించిన జలకవి, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత, తరుణ్ భారత్ సంఘ్ అధినేత– రాజేంద్రసింగ్ ఆర్తికీ, స్ఫూర్తికీ, కీర్తికీ ఈ జలకృతి అంకితం" అన్నాను.

జలగీతం ప్రపంచ సాహిత్యంలో జలం గురించి వెలువడిన పూర్తిస్థాయి *(Full Length)* కావ్యమని ఎందరో సాహితీవవేత్తలు అభిప్రాయపడ్డారు. ఇది ఇప్పటివరకు తొమ్మిది భాషల్లోకి అనువదించబడింది. వాటి వివరాలు ఇట్లా ఉన్నాయి.

క్ర.సం.	భాష	పుస్తకం పేరు	అనువాదం
1	హిందీ	జల్‌గీత్	ప్రొ. పి. మాణిక్యాంబ (హైదరాబాద్)
2	ఇంగ్లీషు	వాటర్ సాంగ్	ప్రొ. అల్లాడి ఉమ, ప్రొ. ఎం. శ్రీధర్ (హైదరాబాద్)
3	మరాఠీ	పాణ్యాచ గాణ	నిరంజన్ ఉజ్‌గరే (ముంబయి)
4	గుజరాతీ	జళగీత్	రమణిక్ సోమేశ్వర్ (బరోడా)
5	ఉర్దూ	నగ్‌మ–ఎ–ఆబ్,	ప్రొ. రహమత్ యూసుఫ్ జాయ్ (హైదరాబాద్)
6	కన్నడం	జలగీత	డా॥ మార్కండాపురం శ్రీనివాస (బెంగళూరు)
7	మలయాళం	జలగీతం	ఎల్. ఆర్. స్వామి (విశాఖపట్నం)

8	పంజాబి	జళగీత్	స్వరణ్‌జీత్ సవి (లుధియానా)
9	పర్షియన్	నగమ-ఎ-ఆబ్	అజీజుద్దీన్ అహమద్ ఉస్మానీ (ఢిల్లీ)

హిందీలోకి 'జలగీత్' పేరిట ప్రొ॥ మాణిక్యాంబ అనువాదం చేశారు. అది ఢిల్లీలో ప్రచురితమైంది. ఉత్తమ హిందీ అనువాద గ్రంథంగా కేంద్ర ప్రభుత్వం వారి హిందీ అనువాద పరిషత్ నుండి ఆమెకు లక్షరూపాయల పురస్కారం లభించింది.

అట్లాగే ప్రఖ్యాత గుజరాతీ కవి రమణిక్ సోమేశ్వర్ 'జళగీత్' పేరుతో గుజరాతీ భాషలోకి అనువదించాడు. హిందీ, ఇంగ్లీషు సంధానభాషలుగా ఉపయోగపడ్డాయి. గుజరాతీ మాతృభాషీయుడైనా, తెలుగు ప్రాంతంలో పుట్టిన ఆచార్య కిషోరీలాల్ వ్యాస్ దీనికి అందించిన సహకారం అపారం. గుజరాతీ అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. 'జలగీతం' అనువాదకులందరూ వారివారి భాషల్లో సమున్నతులే. ఇప్పటిదాకా జరిగిన అనువాదకులందరితో కలిసి 15 ఏళ్ళపాటు నేనొక వెయ్యిగంటలపాటు కూర్చొని ఉంటాను. ఈ చర్చావశాన నేను నేర్చుకున్నదాన్ని గూర్చి రాస్తే అనువాద సమస్యలపైన అది ఒక పెద్ద గ్రంథమే అవుతుంది. భగవంతుడు అనుగ్రహిస్తే ఆ పని జరగాలని కోరుకుంటున్నాను. స్థూలంగా నేను ఈ అనువాదాల గురించి నేర్చుకున్నదేమిటంటే భాషలన్ని ఒకటే. కాకపోతే నుడికారాలు వేరు. అనువాదం అంటే ఒక సాలెగూడును మరో సాలెగూడుగా మార్చడం. ఒక భాషలోంచి మరొక భాషలోకి వెళ్ళినప్పుడు కొంత తరుగు (*Loss*) తప్పకుండా ఉంటుంది గాని మూలకర్త భావ తీక్ష్ణతను అనువాదకుడు పట్టుకోగలిగితే అది విలువైన రచనగా రూపొందుతుంది. జలగీతం ఒరియా, బెంగాలీ లాంటి మరికొన్ని భాషల్లోకి అనువాద ప్రక్రియలో ఉన్నాయి.

జలగీతం కాకతీయ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాల్లో ఎం.ఏ.లో పాఠ్యగ్రంథంగా ఉంది. అలాగే దార్వాడ్ యూనివర్సిటీలో, గుజరాత్‌లో క్రాంతివీర్ శ్యామ్‌జీ కృష్ణవర్మ కచ్ యూనిర్సిటీలో కూడా పాఠ్యగ్రంథంగా ఉంది. ఇటీవలే ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంథంగా చేర్చబడింది. అలాగే రాజేంద్రసింగ్ స్థాపించిన జల విశ్వవిద్యాలయంలో కూడా శిక్షకులకిది

పాఠ్యగ్రంథమైంది. దీనిపైన వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎం.ఫిల్., పిహెచ్.డి.లు జరుగుతున్నాయి.

'మరో ఆకాశం' అనేది నా ఇంగ్లాండు కవితల సంపుటి. దీంట్లో ఇరవై నాలుగు కవితలున్నాయి. గత చారిత్రక అనుభూతుల్లోంచి *(Colonial Past)* ఒక భారతీయ కవి వర్డ్స్‌వర్త్, డిలాన్ థామస్, షేక్స్‌పియర్ వంటి వారి నివాస మ్యూజియంలను చూస్తూ వారి కవిత్వ పంక్తుల్ని పునశ్చరణ చేసుకుంటూ... నిజంగా అదొక గొప్ప అనుభవం. లండన్‌లో తప్పిపోయిన విశ్వమానవ బాలుడిలా పరిభ్రమించాను. నెలరోజులు క్షణక్షణం ఆ దేశంలో జీవించాను. ఈ సందర్భంగా నేను అనేక ఆంగ్ల కవుల కావ్యాలను అధ్యయనం చేశాను. నాకు అర్థమైంది ఏమిటంటే ప్రపంచ కవిత *(International Poem)* అంటూ ఏదీ ఉండదు. అక్కడ పల్లెల్లో పుట్టిన కవితే మనకు ఇంటర్నేషనల్. దానిని మన పల్లీయ కవితలతో పోల్చుకున్నప్పుడే అది మానవీయ కవితగా అర్థమవుతుంది. విదేశీ కవులు అంటే వారిపట్ల మనకున్న గ్లామర్‌ను తొలగించి చూస్తే వారూ మనలాంటివారేనని అర్థమవుతుంది. మానవుని మౌలిక స్పందనలు అన్ని ఏక్‌తార మీటుతున్నట్టుగా శ్రవణ గోచరమవుతుంది. కాకపోతే వాతావరణాల తేడా ఉంటుంది. వర్డ్స్‌వర్త్ ఇంటిముందున్న డెఫడిల్స్ దుంపలను తెచ్చి మా ఇంటి ఆవరణలో నాటితే అవి మొలకెత్తి నాలుగు రోజులు మాత్రమే బతికాయి. రవి అస్తమించని సామ్రాజ్యం కాబట్టి ఇంగ్లీషు కవులు ప్రపంచమంతటా పరిచయం అయ్యారు. మన కవులను పక్కవాడే పట్టించుకోడు. ఒక దశ దాకా నేను ఇంగ్లీషు కవులను చదవకపోవడం మంచిదే అయింది. నా కవిత్వంలో దేశీయత సజీవంగా నిలిచిపోయింది. నేడు వెలువడుతున్న ఇంగ్లీషు కవిత్వంలో ఎక్కువగా నగర జీవన కవిత్వమే. పల్లెల్ని మర్చిపోతున్నారు.

నేను ఐదు విదేశీ ప్రయాణాలు చేశాను. మారిషస్, సైప్రస్, అమెరికా, ఇంగ్లాండు, జర్మనీ దేశాలకు వెళ్ళాను. మారిషస్‌కి ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనడానికి వెళ్ళాను (1995) రాగానే 'నేను చూసిన మారిషస్' పేరిట ఓ యాత్రా చరిత్ర రాశాను. 2002లో అసోసియేషన్ ఆఫ్ కామన్‌వెల్త్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో జరిగిన వైస్-ఛాన్సలర్స్ కాన్ఫరెన్స్‌కు వెళ్ళాను. దానిని 'నా సైపస్

యాత్ర'గా మరో యాత్రాగ్రంథాన్ని రచించాను. అలాగే అదే సంవత్సరం హూస్టన్‌లో జరిగే "నార్త్ అమెరికన్ ఇండియన్ డాన్స్ ఫెస్టివల్' కోసం వెళ్ళాను. అక్కడ యూనివర్సిటీ సిస్టమ్‌లో కూచిపూడి నృత్యాన్ని పెట్టడానికి కొంత కృషి చేశాను. 'అమెరికాలో తెలుగుయాత్ర' అంటూ మరో పెద్ద యాత్రా కథను ప్రచురించాను. మరుసటి సంవత్సరం (2003) 'ఈటా' ఆహ్వానం మేరకు ఇంగ్లాండ్ వెళ్ళాను. అక్కడున్నన్ని రోజులు ప్రతిక్షణం నాకు ఉద్వేగభరితమే. 'ఇంగ్లాండ్‌లో ఇరవై ఐదు రోజులు' అంటూ మరో కవితాత్మక పర్యటన గ్రంథాన్ని రచించాను. ప్రస్తుతం 'జర్మనీలో కవితాయాత్ర' పేరిట మరో యాత్రా చరిత్రను వెలువరించాను. వీటిని రాయడంలో నా ఉద్దేశం వాటిని చూడటానికి అవకాశం లభించనివారికి ఆ అనుభూతిని కలిగించాలని. ఆ దేశాలన్నింటిని ఒక దిగువ మధ్యతరగతివాడి కుతూహల సంవేదనతో దర్శించాను. ఈ ప్రయాణాల్లో నా దృష్టికోణాలు మరింత వికసించి విస్తృతమయ్యాయి. తెలుగులో ఒకే వ్యక్తి ఇన్ని యాత్రాచరిత్రలు రాయడం గతంలో లేదు అని విమర్శకులు శ్లాఘించారు.

తరువాత సంపుటి 'అక్షరాల్లో దగ్ధమై'. దీన్లో 'అరాఫత్ కే యాద్‌మే' గ్లోబల్ స్వామ్యం, ద ఈగిల్ లాంటి సామ్రాజ్య వ్యతిరేక, ప్రపంచీకరణ వ్యతిరేక కవితలు ఉన్నాయి. ఇది అరవై కవితల పెద్ద సంపుటి. దృగావరణ వైశాల్యం దృష్ట్యా భావగాంభీర్యం దృష్ట్యా, రచనాశిల్పం దృష్ట్యా ఇది నా కవిత్వ గ్రంథాల్లో మంచి మలుపు. ఇక 'దీపం ఒక ఏకాంతం' అనే కవితా సంపుటిలో 'సద్దాం యూ విల్', 'ముసలితనం' వంటి హృదయస్పర్శి కవితలకు లోటులేదు. దీనిని నా బాల్యమిత్రుడు కె. ముత్యంరెడ్డికి అంకితం చేశాను. నా తొలికృతి 'తంగెడుపూలు'ని సినారెకు ఇవ్వడంతో ప్రారంభించి నా మిత్రుడు హరిదాస్, సత్యంసార్, బసవలింగప్ప, శీలా వీర్రాజు, ఎ.బి.కె. ప్రసాద్, కరి శ్రీనివాసరావు, కపిలవాయి దిలీప్‌కుమార్, మా అక్క లక్ష్మీనరసమ్మ, రాజేంద్రసింగ్, చాపరాల బాబూరావు, సయ్యద్ ఖాలీద్ ఖాద్రి, వోలేటి పార్వతీశం, మోహన్‌దాస్ సుర్‌లేకర్, పట్నం శేషాద్రి, జతిన్‌కుమార్ దంపతులు మొదలైవారికి అంకితం చేశాను. వీరెవ్వరు నా పోషకులు కారు. ఆత్మీయులు.

'గోవాలో సముద్రం' కూడా ఇంగ్లండ్ కవితల్లాంటిదే. ఒక భావావేశ ప్రాకృతిక

సముద్రంలోకి మునిగి ఈ కవితలన్ని రాశాను. దీనికి కేతు విశ్వనాథరెడ్డి మంచి ముందుమాట రాశాడు. 'హైద్రాబాద్‌లో సముద్రం' అనేది మంచి సారాంశ కవిత. ఇట్లాంటి కవితలవల్లనే నాకు ప్రయాణ కవి అని పేరు వచ్చింది. అది కొంత నిజమే. ప్రయాణంలో మనతో మనమే ఉంటాం. మనసు ప్రపంచమంత విశాలంగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా చలనం ఒక భావుకతా జ్వలనంగా పరిణమిస్తుంది.

'వాన కడిగిన చీకటి' నా పదిహేనవ కవితా సంపుటి. ఇందులో కూడా నావరకు అద్భుతమైన కవితలు కొన్ని ఉన్నాయి. 'వర్షంలో ఇద్దరం, సహాయక క్రియ' వంటివి ప్రయోగ స్ఫూర్తితో రాసిన కవితలు. ఇక ఎలిజీలు రాయడంలో కన్నీళ్లను శాశ్వతంగా గడ్డకట్టించిన ఆత్మీయత నా ఎలిజీల్లో ఉంటుందని గ్రహించాను. 'వాన కడిగిన చీకటి' అనే గ్రంథ శీర్షిక ఎంతో భావస్ఫోరకంగా ఉందని విమర్శకులు భావించారు.

'మా ఊరు మహాకావ్యం'లో కూడా వన్నె తరగని, కొండొకచో వన్నె పెరిగిన కవితలు చాలా ఉన్నాయి. శీర్షికా కవిత పరమ ఉద్వేగభరితంగా సాగుతుంది. తరువాతది 'రాతి కెరటాలు'. దీనిలో 'అంగ్‌సాన్ సూకీ, 'రాజగోపురం – ఆ రెండు పక్షులు' వంటి కవితలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో రాసినవి. తరువాతది 'హృదయ రశ్మి'. ఇది 78 కవితల పెద్ద సంపుటి. దీనిలో 'జిందాతిలిస్మాత్', 'పిన్నీసు' వంటి కవితలకు చాలా పేరొచ్చింది. కార్పొరేట్ సంస్కృతిని వ్యతిరేకిస్తూ రాసిన 'మార్కెట్' అనే కవిత కూడా చాలా ముఖ్యమైంది.

నా పందొమ్మిదవ కవితా సంపుటి 'మళ్ళీ విత్తనంలోకి...' శీర్షికా కవితలో

"అవును
మూలాల్లోకి వెళ్ళితీరాలి
మళ్ళీ మనం జన్మించాలంటే
విత్తనంలోకి వెళ్ళిరాక తప్పదు"–

అని నాస్టాల్జియా పద్ధతిలో కాకుండా ఒక తాత్విక స్థాయిలో జీవిత దర్శనం దీనిలో కనిపిస్తుంది. ఈ నాలుగైదు సంవత్సరాలుగా నేను అనేక ప్రదేశాల్లో పర్యటించాను. కర్నాటక, పంజాబ్, కేరళ, యు.పి., తమిళనాడు, గుజరాత్ ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాలు. నేను కవిత్వం లేకుండా తిరిగి వచ్చింది లేదు. ఈ సంపుటిలో 'మణిపురి కొండలు' నాకు ఎంతో నచ్చిన కవిత. ఇప్పటివరకు నావి 43 గ్రంథాలు అచ్చయినాయి. యాభైయ్యేళ్ళ సాహిత్య జీవితంలో నేను సాధించింది తక్కువే. జ్ఞానపరంగా నేనింకా ఎన్నో ఎత్తులకెదగవలసే ఉంది. లోతుల్లోకి తొలుచుకుపోవలసే ఉంది. ప్రపంచం త్వరత్వరగా మారిపోతున్నది. మానవత్వం చిక్కుల్లో పడింది. ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ఎదుర్కొనే స్థైర్యాన్ని యువత అందిపుచ్చుకోవాలని నా ఆశ. సాహిత్యం కంటే జీవితం పెద్దది. జీవితం పరమ సంక్లిష్టంగా మారిపోతున్న దశలో కవిత్వం ఒక వాచ్‌మన్‌గా మారి స్పష్టతను కాపాడవలసి ఉంది. కవిత్వం ఎవరికీ వత్తాసు పలకదు న్యాయానికీ, ధర్మానికీ తప్ప. మానవ సంబంధాలను పటిష్టం చేసే దిశగా సాహిత్యం సాగాలి. వృద్ధాప్యం పైన ఓ కావ్యం రాయాలనుకుంటున్నాను. తరాల మధ్య అవిచ్ఛిన్నతను భద్రపరచాలనే తపనతో ముందుకు సాగాలని నా ఆకాంక్ష. ఇప్పటిదాకా చేసిన కృషి ఒక ప్రవేశపరీక్ష లాంటిదే. మరింత అర్థవంతమైన, విశ్వశ్రేయోదాయకమైన కవిత్వం కోసం నేను అలమటిస్తున్నాను. కొత్త దర్శనం దారుల్లో పరుగులు తీయాలనుకుంటున్నాను. చివరగా యువకులకు నేనిచ్చే సలహా ఏమిటంటే ఏదీ ఆకాశంలోంచి ఊడిపడదు. బాగా అధ్యయనం చెయ్యాలి. కృషిని నమ్ముకోవాలి.

ఒక సరస్వతీ అవతారంలాంటి మహాకవి సినారె సన్నిధిలో, చాలావరకు నా జీవితాన్ని మలిచిన పితృతుల్యుని ముందట తప్పటడుగుల నుంచి తప్పెటగుళ్ల దాకా నా అక్షరయాత్రను గురించి ప్రసంగించడం నాకే ఆశ్చర్యంగా ఉంది. ఈ ఆశ్చర్యం నిజంగా ఆనందకరమైనదే.

❖ ❖ ❖



జి. వెంకటరామారావు

మా కుటుంబం అయిదు తరాల వెనుకకు వెళితే అంటే మా తాతగారి తాతగారు వరంగల్లు జిల్లాకు అవ్వల్ తాలుక్దారు (కలెక్టరు)గా పనిచేశారు. ఆయన పేరు దేవరాజం పంతులు. అది మొదటి సాలార్‌జంగ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న రోజులు. రిటైర్‌మెంటు సమయంలో ఆయనకు ప్రభుత్వం కొంత భూవసతి, నగదు రూపంలో పింఛన్ మాదిరిగా కొంత మన్సబు మంజూరు చేసింది. 200 ఎకరాల భూమి యిచ్చి ఒక గ్రామం ఏర్పాటు చేసుకోమన్నారు. ఆరోజులలో 'బేచిరాగ్' (దీపంలేని గ్రామాలు) గ్రామాలను ప్రజల నివాసయోగ్యంగా చేయడం చాలా శ్రమతో కూడినపని. చాకలి, కమ్మరి, కుమ్మరి, మంగలి మొద్దలైన పనివాళ్ళను తీసుకురావాలి. వారికి కూడా భూవసతి కలిగించాలి. వాళ్ళనికూడా వతన్‌దార్లు అనేవారు. అలా ప్రభుత్వం నుంచి మక్తాగా పొందిన భూమి మా కుటుంబానికి వారసత్వంగా వచ్చింది. మన్సబు మాత్రం అలాకాదు. తరానికి కొంత కోత విధించారు. మానాన్నగారి కాలంనాటికి అది నల్లభైరూపాయలకు తగ్గింది. అది నాయనగారు ఉన్నంతవరకు వచ్చింది. తరువాత మన్సబు రద్దయింది. ఏతావాతా, ఆనాటి రివాజు ప్రకారం మేము మక్తాదారులం, మన్సబుదారులం. అన్నీపోయినా ఆ ఛాయలు మాత్రం పోలేదు. వూళ్ళో ఇప్పటికీ మమ్మల్ని 'దొర' అని పిలుస్తారు. దొరతనం లేకపోయినా బిరుదు మిగిలింది. మా కుటుంబంలో అందరికన్న చిన్న తమ్ముడు గ్రామ కరణీకం చేసుకుంటున్నాడు. కరణీకం అంటే పట్వారీ. అది కూడా పోయింది. ఆనాటి పటేల్–పట్వారీలు ఇప్పుడు రెక్కలు విరిచేసిన పక్షులుగా బతుకుతున్నారు.

ఇతర ఉద్యోగాలు చేసుకు బతకలేని వృద్ధాప్యంలో నానాబాధలు పడుతున్నారు. మాకు ఉద్యోగాలున్నాయి సరే. లేకపోతే....

మా గ్రామం పేరు మాధాపురం. అప్పటి మెదక్‌జిల్లా, బాగాత్ తాలూకాలో ఉండేది. పోలీసుచర్య అనంతరం మాగ్రామాన్ని హైదరాబాద్ జిల్లా, ఇబ్రహీం పట్నం తాలూకాలో చేర్చారు. ఆనాటి హైదరాబాద్ జిల్లా ఇప్పుడు రంగారెడ్డి జిల్లా అయింది.

మాది చాలా చిన్నగ్రామం. ఆరోజుల్లో తాలూకా కేంద్రంలోనే ప్రభుత్వ పాఠశాలలు ఉండేవి. కనుక మా వూళ్ళో పాఠశాల లేదు. ప్రైవేటుగా చెప్పే పంతుళ్ళు కూడా చిన్నగ్రామంలో ఆర్థికంగా నిలదొక్కుకోవడం కష్టం కనుక ఎవరు పాఠశాల పెట్టే ధైర్యం చేయలేదు. అక్షరజ్ఞానం నుంచి మా చదువు హైదరాబాద్ నగరంలోనే జరిగింది. నేను 1935లో జన్మించినట్లు నా సర్టిఫికేటులో నమోదు అయింది. ఏమైనా ఎనిమిది పదుల ప్రాయంలో వున్న నేను నాలుగు ప్రభుత్వాలు చూసాను. ఒకటి నిజాం ప్రభుత్వం, రెండు హైదరాబాద్ ప్రభుత్వం, మూడు –ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాల్గవది ప్రస్తుత కె.సి.ఆర్.ప్రభుత్వం. నా జీవితంలో రెండు కోరికలు ఉండేవి. ఒకటి నిజాం ప్రభుత్వం అంతం కావడం, రెండవది ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం. ఈ రెండూ చూసిన అదృష్టవంతుణ్ణి నేను.

మా గ్రామం నుంచి హైదరాబాద్‌కు ఆనాడు రోడ్డు లేదు. బస్సు సౌకర్యం లేదు. ఎడ్లబండి మీద హైదరాబాద్‌కు పోయేవాళ్ళం. ఒకరోజు పూర్తి ప్రయాణం. హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చేవాళ్ళు ఆరోజులలో ఇప్పుడు పాతబస్తీగా ప్రచారంలో ఉన్న గౌలీపుర, అల్యాబాద్, లాల్‌దర్వాజా, బేలా, హరిభావులీలో ఉండేవారు. అప్పుడు పాతబస్తీలో ఉన్నవి రెండే మాధ్యమిక పాఠశాలలు. వస్తానియా అనేవారు. ఒకటి ప్రభుత్వ వస్తానియా మొగల్‌పుర, రెండోది ప్రభుత్వ గుర్తింపు పొందిన వస్తానియా రిఫాయె–ఆమ్. ఇప్పుడు షాదీఖానాగా ఉన్న మొగల్‌పురలోని భవనంలో చాలాకాలం ప్రభుత్వ పాఠశాల ఉండేది. ఈ రెండు పాఠశాలలు ఉర్దూ మీడియంవే. పోటాపోటీగా నడిచేవి.

మేము రిఫాయె ఆంలో చేరినాము. అవ్వల్ తెలుగు, దువ్వం తెలుగు చదివితేనే అవ్వల్ ఉర్దూలో ప్రవేశం. అంటే సర్కారీ గుర్తింపు చదువు అన్నమాట. గ్రామం నుంచి రాగానే ఎకాఎకీ ఉర్దూలో ప్రవేశంవల్ల పెద్ద యిబ్బంది ఏమీ కలగలేదు. ఉర్దూ పిల్లలతో సమానంగానే ఉర్దూ నేర్చుకున్నాం. కారణం ఏమైనా ఉర్దూ మాధ్యమం ద్వారా చదువు ఉత్సాహంగానే సాగింది. అయిదవ తరగతిని పంజుమ్ అనేవారు. తరగతుల పేర్లు ఇలా ఉండేవి. అవ్వల్, దువ్వం, సువ్వం, చహరుం, పంజుమ్, షెష్మం, సప్తుం, హష్తుం, నహుమ్, దహుమ్. చదువు చాలా పకడ్బందీగా చెప్పేవారు. పాఠం బోధించగానే మర్నాడు పశ్నలు వేసేవారు. సమాధానం చెప్పని విద్యార్థులకు దండన తప్పదు. నేను పంజుమ్ తారీఖు (చరిత్ర) లో చదివిన 'కిషన్ దేవ్‌రాయ్ షాన్‌వషౌకత్‌కా రాజాథా. ఓ సోనేకాథాలీ మే ఖానా ఖాథాథా' (కృష్ణదేవరాయలు విలాస పురుషుడు. అతడు బంగారుపళ్ళెంలో భుజించేవాడు). ఇంకా నాకు కంఠస్థంగా ఉంది.

రోజుల పేర్లు కూడా ఉర్దూలోనే వాడవలసి వచ్చేది. షంబా (శనివారం), ఏక్‌షంబా (ఆదివారం), దోషంబా (సోమవారం) సెషంబా (మంగళవారం), ఇలా...ఇలా. వారాన్ని 'హప్తా అనేవారు. శుక్రవారం సెలవు దినము. మేము చదివేరోజుల్లో రిఫాయె ఆమ్ ప్రాథమిక పాఠశాల. ఐదవ తరగతితో ఆ స్కూల్లో చదువు అయిపోతుంది. ఇక "ఫౌఖాన్య" (హైస్కూల్) చూచుకోవాలి. అందుకు ఒక తరగతికి ముందే ముఫీదుల్ ఆనామ్ హైస్కూల్లో ఆరవ తరగతిలో చేరినాము. నేను, నా సోదరుడు రంగారావుగారు చిన్నప్పటినుంచి ఒకే తరగతిలో చదువుకునేవాళ్ళం. మా ఇద్దరి మధ్య ఒక సం.10 నెలల వయోభేదం. రంగారావుగారు డిప్యూటీ కలెక్టరుగా రిటైరయి ఇటీవలనే స్వర్గస్థులయ్యారు. ఆరోజుల్లో ముఫీదుల్ ఆనాం, ధర్మవంత్ రెండు హైస్కూళ్ళు పోటాపోటీగా నడిచేవి. పాతబస్తీలో సిటీ కాలేజి తప్ప మరో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లేదు.

'స్టాండర్డ్ స్కూల్' అని ముఫీదుల్ ఆనాంకు మంచిపేరు ఉండేది. ఇది కాయస్థులకోసం ప్రత్యేకంగా ఏర్పడిన స్కూల్ అయినా అందరికీ అడ్మిషన్లు లభించేవి. ఏ.ఎస్.రావుగారు ప్రధానోపాధ్యాయులుగా ఉండేవారు. చాలా

గంభీరమైన మనిషి. ఎప్పుడూ ఇంగ్లీషులోనే మాట్లాడేవారు. పదోతరగతికి ఇంగ్లీషు నాండీటేల్ (ఉపవాచకము) చెప్పేవారు. గోల్డ్‌స్మిత్ రాసిన 'వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్' ఇంగ్లీషు ఉపవాచకముగా ఉండేది. మా ఉపాధ్యాయులందరూ అతిరథ, మహారథులుగా ఉండేవారు. సర్వశ్రీ చిదానందం (లెక్కలు), బి.ఎస్.రంగారావు (లెక్కలు), నాగస్వామి (సైన్స్) ఏ.ఎన్.రావు (ఇంగ్లీషు), అహ్మద్ మఖ్ఫీ ఉర్దూ...ఆయా సబ్జెక్టులలో నిపుణులు. వారు బోధిస్తుంటేనే సగం పాఠాలు జ్ఞాపకం అయ్యేవి. అలా ఉండేది ఆనాటి బోధన.

ముఫీదుల్ ఆనాంలో వార పరీక్షలు పెట్టేవారు. నాలుగువారాల మార్కులు కలిపి నెలమార్కులు వేసేవారు. నెల నెలా ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చేవారు. ఆరవ తరగతివార్షిక పరీక్షలో నా ర్యాంకు నాల్గవది. నాకు వచ్చిన ర్యాంకును చూసి ముస్లిం విద్యార్థులు అసూయపడేవారు. 'గావ్‌ంకా రాజా హోష్యార్ హై' గ్రామం నుంచి వచ్చినా తెలివైనవాడేనని వెక్కిరించేవారు. ఎనిమిదవ తరగతిలో ఐచ్ఛికం మొదలయ్యేది. నేను తెలుగును ఐచ్ఛికంగా తీసుకున్నాను. దీంతో నా మార్కుల పంట పండింది. సైన్స్, చరిత్ర, భూగోళం, తెలుగులో నాకు ఎనభై చొప్పున మార్కులు లభించడంతో నా ర్యాంకు పెరిగింది. హెచ్.ఎస్.సి. బోర్డు పరీక్షలో అన్ని సబ్జెక్టులకన్నా సైన్స్‌లో నాకు ఎక్కువ మార్కులు వచ్చాయి. 70 మార్కులు రావడం చిన్నవిషయం కాదు. గణితములో తప్ప ఇన్ని మార్కులు మరో సబ్జెక్టులో వచ్చే అవకాశం లేదు. హెచ్.ఎస్.సి. పరీక్షలో కూర్చోవడానికి అవసరమైన వయస్సుకన్నా ఒక సంవత్సరం తగ్గి ఉండటం వలన నేను 'ఏజ్ సర్టిఫికెట్' ను పొందవలసి వచ్చింది. ఆ పనంతా స్కూలువారే చూసుకునేవారు. ఇప్పటి ప్రైవేటు స్కూళ్ళకన్నా ఆరోజుల్లో గవర్నమెంటు స్కూళ్లు ఎక్కువ స్థాయిగా ఉండేవి. నగరంలోని గవర్నమెంటు పాఠశాలలన్నీ కూడా ప్రఖ్యాతి చెందినవే. కొందరు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విదేశాలలో చదువుకున్నవారు, సిటీకాలేజి, వివేకవర్ధనీ, చాదర్‌ఘాట్, ఆల్‌సెయింట్స్, మొదలైన మరికొన్ని పాఠశాలలో అడ్మిషన్లు దొరకడమే కష్టం. అలాంటి వాటిలో నేను చదువుకున్న ముఫీదుల్ ఆనాం ఒకటి. ఆరోజుల్లో ఆబ్జెక్టివ్ టైపు ప్రశ్నాపత్రాలు లేవు. కాపీకొట్టే గొడవ

లేదు. క్రమశిక్షణకు ప్రాధాన్యం ఉండేది. విద్యార్థి, విద్యార్థిగానే కనిపించేవాడు.

నేను ఇంటరు చాదర్‌ఘాట్ కళాశాలలో చేసాను. ఎకనామిక్స్, కామర్స్, జాగ్రఫీ నా సబ్జెక్టులు. అప్పుడే రీజనల్ లాంగ్వేజి సబ్జెక్టు కొత్తగా వచ్చింది. వారానికి ఒక క్లాసు ఉండేది. పల్లాదుర్గయ్యగారు తెలుగు చెప్పేవారు. ఆయన మెత్తనిమనిషి. పాఠం చెబుతూంటే ఆసక్తిగా వినే పిల్లల సంఖ్య తక్కువ. దాదాపు సగం బెంచీలు ఖాళీ. ఇర్వై ముప్పై మంది విద్యార్థులకు మాత్రమే ఆయన స్వరం వినిపించేది. కళాశాల వార్షిక సంచిక 'తెలుగువీణ'లో నా మొదట కథానిక అచ్చుకావడం అప్పుడు నాకెంతో గర్వకారణం. నాకు కథానికలు రాయడంలో ఆసక్తి ఉండేది. ఊహ ఉంటే కథానికలు సులభంగానే రాయవచ్చు. కమనీయమైన ఊహల అల్లికనే కథానిక అనే భావం నాలో ఉండేది. కానీ అది ఎక్కువ కాలం నిలవలేదు. రాజకీయ వ్యాసంగంలో పడిపోయాను. ఇంటర్మీడియెట్ తరువాత ఆరేళ్ళకు నేను బి.ఏ. ప్యాసయ్యాను. అదీకూడా ఉపాధ్యాయ అభ్యర్థిగా. ఉస్మానియాలో మాట్లాడే అవకాశాలు నాకు లభించినా, చదువుకునే అదృష్టం లభించలేదు. ఒకసారి చరిత్రశాఖవారు యూనివర్సిటీ చరిత్ర చెప్పమని నన్ను ఆహ్వానించారు. ప్రొఫెసర్ హుసేన్ ఆలీఖాన్, డా.అబ్దుల్‌హక్, ఆచార్య రాయప్రోలు సుబ్బారావు, మొదలగు ఆచార్యుల జీవితాల గురించి నేను ప్రసంగిస్తుంటే "ఆరోజుల్లో మీరు లేరు. ఎలా చెబుతున్నార"ని ఒక లెక్చరర్ కొంటెపశ్న వేశారు. "చంద్రగుప్తుని చరిత్ర రాసినవారు ఆ కాలంలో ఉన్నవారనుకుంటున్నారా?" అని నేను సమాధానమివ్వగానే అందరూ నివ్వెరపోయారు. అదే ప్రొఫెసర్‌గారు "తెలంగాణాలో గ్రామోద్యోగుల వ్యవస్థ' గురించి పరిశోధన చేస్తున్న ఇద్దరు విద్యార్థులను విషయగ్రహణ కోసం నా దగ్గరకు పంపించారు. హైదరాబాద్ జిల్లా మాజీ కలెక్టరు పర్సా వెంకటేశ్వరరావుగారు నిజాం రాష్ట్ర గ్రామోద్యోగుల గురించి వివరాలను నాదగ్గర తెలుసుకున్నారు. వాటిని నేను వ్యాసరూపంలో ఆంధ్రపభ, ఆంధ్రభూమిలో రాశాను. అవి పరిశోధనలకు ఉపయోగపడ్డాయి.

నేను ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ పదవి నుంచి జిల్లా విద్యాశాఖాధికారి వరకు పదవులు చేసాను. తెలంగాణలో దాదాపు సగం

జిల్లాలు తిరిగాను. ఈ పదవులన్నిటిలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని పదవి నాకు సంతృప్తి కలిగించింది. అందులో స్వతంత్రంగా పనిచేయటానికి కొంత అవకాశం ఉంది. ఏమైనా. ఏ పాఠశాలైనా ప్రధానోపాధ్యాయుని శ్రద్ధపై దాని అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. పాఠశాలలో పనిచేసిన రోజుల్లో నేనెన్నడూ ఆలస్యంగా స్కూలుకు వెళ్లలేదు. ఏ గ్రామంలో పనిచేస్తే ఆ గ్రామంలోనే నివాసం. వూళ్ళో ఉపాధ్యాయుడుంటే అతనిపై ఆ గ్రామ ప్రజలకు గౌరవం కలుగుతుంది. తమ పిల్లల చదువులగురించి ఆ టీచరునడిగి తెలుసుకుంటారు. హైదరాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మామిడి భోజిరెడ్డిగారు అనేవారు ఉపాధ్యాయులు బస్సు నౌకర్లు, పాఠశాల నౌకర్లు కాదని. ఎవరి యిబ్బందులు వారికి ఉంటాయి. హైదరాబాద్‌లో మాత్రం పాఠశాల ఉన్నచోటనే ఉపాధ్యాయులుంటున్నారా? అందరికీ అలా యిండ్లు లభ్యంగా ఉంటవా? విజ్ఞానం పెరుగుతున్నది. సబ్జెక్టులు పెరుగుతున్నాయి. ఇప్పటి చదువులు ఎక్కువే.

ఇక పరీక్ష గదుల వ్యవహారం. మూడుగంటలు ఇన్విజిలేటర్లు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని పరీక్షలు నిర్వహించవలసి వస్తున్నది. ఆబ్జెక్టివ్ టైప్ పేపరు ఇచ్చినవుడు చూడాలి హంగామా. ఆ సమయంలో బ్రహ్మదేవుడు కూడా విద్యార్థులను పట్టుకోలేడు. పట్టుకుని సుఖంగా ఇంటికి చేరుకోలేడు. ఇది నా అనుభవం. ఇందులో మరింత లోతుగా వెళ్ళడం నాకు ఇష్టం లేదు. నిజాయితీకి శిక్షపడే రోజులివి. విచారణలను తమకు అనుకూలంగా మార్చుకునే రోజుల్లో పరీక్షకు ఎవరు నిలబడతారు. అలా నిలబడి ఎవరు చేయి కాల్చుకుంటారు. ఆబ్జెక్టివ్ టైప్ లేనవుడు హెచ్.ఎస్.సి. ఫలితాలు 50 శాతం వస్తే మహా ఎక్కువ. ఇప్పుడు నూటికినూరు శాతం ఉత్తీర్ణతతో వస్తున్నాయి. ఇదంతా తమ కృషి ఫలితం అని చెప్పుకుంటున్నారు. ఇప్పుడంతా ఆర్గనైజ్‌డ్ కాపీయింగ్. ఎవరికి ఎవరు బాధ్యులు? ఆంధ్ర తెలుగు, తెలంగాణ తెలుగు లేదు. టీ తీసుకురా అంటే ఆంధ్ర తెలుగు, చాయ్ తీసుకురా అంటే తెలంగాణ తెలుగు.

నిజాం రాష్ట్రంలో దాదాపు సగం తెలుగు, సగం మహారాష్ట్ర విభాగాలుండేవి. తెలుగు విభాగాన్ని, తెలంగాణ అనీ, మహారాష్ట్ర విభాగాన్ని మరట్వాడా అని

పిలిచేవారు. మహారాష్ట్ర భాగంలోనే కొంత కర్నాటక విభాగం కూడా ఉండేది. మరట్వాడా జిల్లాలు, ఔరంగాబాద్, ఉస్మానాబాద్, బీడ్, పర్భనీ, నాందేడ్ - ఐదు జిల్లాలు. కర్నాటక విభాగంలో రాయచూరు, గుల్బర్గా, బీదరు జిల్లాలు. మిగిలిన తెలంగాణ ప్రాంతంలో ఎనిమిది జిల్లాలు. ఇవి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబునగర్. వరంగల్ నుండి 1953లో ఖమ్మం ప్రత్యేకజిల్లాగా ఏర్పడింది. తెలంగాణ ఆంధ్రులను ఆరోజుల్లో నిజాం ఆంధ్రులనేవారు.

ఇంతవరకూ విడివిడిగా ఉన్న ఆంధ్రులకు ఇతర భాషా భాగాలతో ఉమ్మడి కాపురం తప్పలేదు. మద్రాసు ఆంధ్రులకు అరవల ప్రభావం. హైదరాబాద్ సంస్థానంలోని ఆంధ్రులకు మహారాష్ట్రుల ప్రభావం. ఆర్థిక, నైతిక, విజ్ఞాన వికాసానికి ఇవి ఆటంకాలుగా పరిణమించాయి. నిజాంపాలనలో మహారాష్ట్రులకుండే గౌరవం, పలుకుబడి ఆంధ్రులకు ఉండలేదు. దీనికి కొన్ని చారిత్రకమైన కారణాలున్నాయి. మహమ్మదీయులనూ బ్రిటీష్‌వారిని ఒకేసారి ధిక్కరించి, హిందూ స్వాతంత్యం నిలబెట్టడానికి చివర ప్రయత్నం చేసినవారు మహారాష్ట్రులు. ఈ ప్రయత్నంలో ఆదిలో శివాజీ, తర్వాత ఝాన్సీ లక్ష్మీబాయి నాయక, నాయకురాంద్రు. నిజాం రాష్ట్రంలో మహారాష్ట్రులు నిజాంను తమ పాలకుడుగా భావించలేదు. తాము స్వతంత్రులుగా ఉన్నట్లే నడుచుకునేవారు. ప్రభువుల్ని తెలుగువారు అనుసరించినంతగా మహారాష్ట్రవారు అనుసరించలేదు. వారి మహారాష్ట్ర వేషభాష, సంప్రదాయం, పూణేలో ఎలాగ ఉండేవో, ఔరంగాబాద్, హైదరాబాద్‌లో కూడా అట్లాగే ఉండేవి.

కానీ తెలుగువారు మాత్రం జాగీర్దార్లేకాదు, సంస్థానాధీశులతో సహా రూమీ టోపీ, షేర్వాణీ ధరించి ఉర్దూలో మాట్లాడేవారు. తెలంగాణాలో అసలు మధ్యగరగతి లేనేలేదు. అధికార ప్రభావంవల్ల ఉర్దూమాటలు, యాస తెలుగు భాషలో ప్రవేశించినవి. విద్యా సౌకర్యాలు లేక, ఆర్థిక వనరులులేక, వెట్టిచాకిరితో, అధికారులు, ఖామందుల దౌర్జన్యంతో ఆత్మగౌరవం, అభిమానం కోల్పోయి, అజ్ఞానాంధకారంలో పడిపోయిన హిందూ జాతి జనం 'నీబాంచన్', 'నీ కాలు మొక్కుతా దొరా' అనే దుస్థితిలో పడిపోయారు. దౌర్భాగ్యం ఆంధ్రులను

వేటాడినట్లుగా మహారాష్ట్రులను వేటాడలేదు.

హైదరాబాద్‌లో ఆరోజుల్లో ముస్లింల ప్రభావం ఎక్కువ. వారి తరువాత వారికి సన్నిహితులైన కాయస్థుల ప్రభావం. హిందువులలో మహారాష్ట్రుల ప్రభావం. స్థాపించినకొద్ది విజ్ఞానసంస్థలు మహారాష్ట్రులవే. నాయకత్వం వారిదే. స్టేట్ కాంగ్రెస్‌కు స్వామీ రామానంద తీర్థ నాయకుడు. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలో ఉన్నతోద్యోగాలలో ఒక్క ఆంధ్రుడు లేడు. నిజానికి అన్ని ఉద్యోగాలు అంతే. వారసత్వంగా వచ్చిన గ్రామ ఉద్యోగాలైనా పటేల్-పట్వారీలు తప్ప. చెప్పుకోదగ్గ ప్రభుత్వోద్యోగాలు లేవు. మరీ పెద్ద ఉద్యోగాలు ముస్లింలవి. రెండవ వరుస కాయస్థులవి. మూడోస్థాయి మహారాష్ట్రులవి. నవాబులు, జంగ్‌లు, రాయ్‌లు మహారాష్ట్ర రావులు, నాయక్‌లు.

బ్రిటీష్‌వారి కింది నిజాము. నిజాం కింద జాగీర్దార్లు. వాళ్ళకింద భూకామందులు, దేశ్‌ముక్, దేశ్‌పాండ్యాలు, మఖ్తేదార్లు, వగైరా....ఎవరి పరిపాలన, ఎవరి హక్కులు వారివే. రాజ్యంలో పదోవంతు భూమి నిజాం సొంతం. దాన్ని సర్ఫెఖాస్ అనేవారు. నిజాం రాష్ట్రంలో 14 సంస్థానాలుండేవి.

కారుచీకటిలో కాంతిరేఖలు :

ఏడుగురు ఆసఫ్‌జాహీ ప్రభువులపాలనలో రాజధాని హైదరాబాద్ నగరం పోలీసు కమీషనర్ (కొత్వాల్) పదవి పొందిన మొట్టమొదటి హిందువు రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి. కొత్వాల్‌గా ఆయన ప్రతిరోజు నిజాం దగ్గరికి వెళ్ళి శాంతిభద్రతల పరిస్థితి వివరించేవారు. తనవద్దకు ఏ సమయంలోనైనా కొత్వాల్‌గారు రావడానికి నిజాం అనుమతి ఉండేది. హైదరాబాద్ నగరంలో అన్నివర్గాలవారికి ఆశ్రయం ఇచ్చి ప్రసిద్ధిపొందిన రెడ్డి హాస్టల్ స్థాపన ఆయన కృషి ఫలితమే. ఆయన నిజాం రాజుకు ఎంత విధేయుడో, విశ్వాసపాత్రుడో మిగిలిన ప్రజాసంస్థలకు, రాజకీయ పార్టీలకు, యువజన సంస్థలకు, విద్యార్థులకు అంత సన్నిహితుడుగా పనిచేసేవారు. ఆయనకు ఎన్నో బాలికల పాఠశాలలతో సంబంధం ఉండేది. కుల, మత, ప్రాంతీయ భేదాలకు తావివ్వకుండా అన్నివర్గాల ప్రజాభివృద్ధిని కాంక్షించిన వ్యక్తి. నిజాం పాలనలో తొలి ముస్లిమేతర వ్యక్తిగా

కొత్వాల్ సేవలందించిన ఘనత ఆయనదే. పరిపాలనదక్షతకు ఆంగ్లవిద్యకానీ, విదేశీయశిక్షణకానీ అవసరం లేదని వెంకట్రామారెడ్డి చరిత్ర నిదర్శనం. నగర కొత్వాల్ ఉద్యోగమంటే ఆరోజుల్లో సామాన్యమైనది కాదు. ముఖ్యమంత్రి తర్వాత కొత్వాల్ ఉద్యోగానికే ఆనాడు ప్రాముఖ్యం.

సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ పత్రికను స్థాపించి, రెండు దశాబ్దాలపాటు నిర్వహించి అప్పటి నిజాం పాలనలో తెలంగాణ ప్రజలను జాగృతపరచి చైతన్యవంతుల్ని చేసారు. సురవరం రచించిన ఆంధ్రుల సాంఘిక చరిత్రకు తెలుగులో మొదటి సారిగా కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి లభించింది. ప్రతాపరెడ్డిగారు ముప్ఫయికిపైగా రచనలు చేసారు. హిందువుల పండుగలు, రామాయణ విశేషములు, ఆంధ్రుల సాంఘిక చరిత్ర చారిత్రకుడుగా పరిశోధకుడుగా ఆయన స్థానాన్ని సుస్థిరం చేశాయి. ఆయన గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖపాత్ర నిర్వహించారు విజ్ఞానవర్ధనీ వంటి సంస్థలను స్థాపించి వైజ్ఞానిక, సాహిత్య రంగాలలో గ్రంథాలను ప్రకటించారు.

ఆజమ్‌జంగ్‌కు ప్రజలపట్ల, ప్రజల భాషలపట్ల సానుభూతి ఉండేది. అయితే చాలాకాలం అప్పటి పరిపాలకులు ఆయనను పైకి రానీయలేదు. అనేక సంవత్సరాలు సిటీ కాలేజి ప్రిన్సిపాల్‌గానే ఉన్నారు. ఆయన ప్రిన్సిపాల్‌గా ఉన్నపుడు డా.రావాడ సత్యనారాయణ, ఎన్.కె.రావు అక్కడ విద్యార్థులుగా ఉండేవారు. ఈ ఉభయులేగాక అనేకమంది విద్యార్థుల ప్రతిభను గుర్తించి కుల మత విచక్షణ పాటించక ఆయన సహాయం చేసారు. వీరందరూ తర్వాత అభివృద్ధిలోకి వచ్చారు. నవాబు ఆజమ్‌జంగ్ విద్యాశాఖకు డైరెక్టర్ అయిన తర్వాతనే ప్రాథమిక విద్యను ప్రజల మాతృభాషలో చదవడానికి అవకాశం కల్పించారు. తరువాత ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు, విద్యామంత్రి, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులుగా పనిచేసారు. ఆయన హృదయం విశాలమైనది. చిత్తవృత్తి ఉదారమైనది. కుల మత విచక్షణ లేక యోగ్యులైనవారికి సహాయం చేయడానికి ఎన్నడూ వెనుకాడలేదు.

ఆనాటి బహు భాషా పండితులలో గుండేరావు హర్కారే గారిని ప్రత్యేకంగా

పేర్కొనాలి. మహారాష్ట్రము, కన్నడము, తెలుగు, అరబ్బీ, ఫార్సీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో ఆయన పండితుడు. న్యాయ, తర్క, వేదాంత, మీమాంస సాహిత్యాలతో ఆయన ప్రవీణులు. అఖిలభారత ఓరియంటల్ కాన్ఫరెన్స్ సమావేశంలో అనేక విషయాలమీద పరిశోధనాత్మకమైన ప్రసంగాలు చేసి ఆయన యావద్భారత కీర్తి గడించారు. విద్వాంసుడిగా ఆయనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆయనకు విశిష్టసభ్యత్వమిచ్చింది. ఆయన వైదుష్యం అంతా స్వయంకృషిచేత సంపాదించిందే. ఆయన చేసిన అనువాదాలు, స్వతంత్ర రచనలు అసంఖ్యాకాలు. సంస్కృతభాషలో వ్యాకరణం నేర్చుకోవటానికి ఆయన ఒక యంత్రాన్ని సిద్ధం చేసినారు. ఆ యంత్రం అనేకమంది విద్వాంసుల ప్రశంసలు అందుకుంది. ఆయనతో సమాన అగ్రశ్రేణికి చెందిన పండితులు మనదేశంలో మిక్కిలి కొద్దిమంది. ఆయన తొంభై సంవత్సరాలు జీవించారు.

'రయ్యత్' అనే ఉర్దూ దినపత్రికను మందుముల నరసింగరావుగారు నడిపేవారు. కృష్ణాపత్రిక ధోరణిలో సంపాదకీయాలు రాసి ఈ పత్రిక హైదరాబాద్ ప్రజలలో గొప్ప జాగృతి కలిగించింది. ఆరోజుల్లో దేశస్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కోరేవారందరు వయస్సు, భాష, మతాలతో నిమిత్తం లేకుండా నరసింగరావు దగ్గరకు వెళ్ళుతుండేవారు. హైదరాబాద్‌లో ఆయన ఒక గణనీయమైన వ్యక్తిగా ఉండేవారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత రాష్ట్రమంతి అయ్యారు. హైదరాబాద్‌లో తెలుగువారున్నారన్న సంగతి గుర్తుకు రానికాలంలో 1922లో నవంబరు 12న ఆంధ్రోద్యమానికి అంకురార్పణ జరిగింది. ఆంధ్ర పితామహులు మాడపాటి హనుమంతరావు కృషితో ఆంధ్రజన సంఘం ఏర్పడింది. తెలంగాణలోని అనేక ఉద్యమాలకు జనకుడు మాడపాటివారే. ఆ తరువాత విస్తృతస్థాయి కార్యక్రమాలు రూపొందించేందుకు 1930లో నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ స్థాపన జరిగింది. ఆంధ్రమహాసభకు మొదట అధ్యక్షుడు సురవరం ప్రతాపరెడ్డి. రెండవ అధ్యక్షుడు బూర్గుల రామకృష్ణారావు. ఆవిధంగా రాజకీయ లక్ష్యంతో పనిచేయాలనుకున్న సంస్థకు కూడా సాహిత్యకులే సారథులు కావడంవల్ల తెలంగాణలో జాతీయోద్యమం, సాహిత్యోద్యమం చెట్టాపట్టాలు పట్టుకుని నడిచాయి. ఆంధ్రోద్యమంతోపాటు

గ్రంథాలయోద్యమం కూడా తెలంగాణాలో మాతృభాష ప్రచారానికి తోడ్పడింది.

తెలంగాణ స్వాతంత్ర్యోద్యమంలో కవితోద్యమం కూడా విజృంభించింది. గ్రంథాలయాల వార్షికోత్సవ సందర్భాలలో కవితా పఠనం ఉండి తీరవలసిందే. పాఠశాలల వార్షికోత్సవాలలో కావ్యగానం జరుగవలసిందే. పండుగనాడు కవితా గోష్ఠి ఏర్పడవలసిందే. కవిత్వం వినరాని చోటు తెలంగాణాలో ఉండేదికాదు. గుడులు, బడులు, బందీఖానాలు, గుడిసెకొంపలు, గోపురాగ్రామున అంతటానూ కవితా ప్రతిధ్వానాలే.

ఖమ్మం జిల్లా మధిర తాలూకాకు చెందిన సర్దార్ జమలాపురం కేశవరావు హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకుడు. 1938లో స్టేట్ కాంగ్రెస్ పిలుపునందుకుని సత్యాగ్రహాలు చేసి కారాగారవాసం చేశాడు. దరిమిలా ఆంధ్రమహాసభ ఆయన కార్యక్షేత్రం అయింది. ఆంధ్రమహాసభ కార్యక్రమాల సందర్భంగా తెలంగాణ ప్రాంతంలో ఆయన కాలుమోపని వూరు లేదు. ఆంధ్ర మహాసభకు ఆయన కొంతకాలం అధ్యక్షుడుగా ఉన్నారు. 1947 సత్యాగ్రహంలో అందరికన్నా ముందు ఆయనకు జైలుశిక్ష పడింది. తెలంగాణా ప్రజలు ఆయనని సర్దార్ అని పిలుచుకున్నారు. ఆయన తర్వాత ఖమ్మంజిల్లా కాంగ్రెస్‌కు అంతటా పటిష్టమైన నాయకుడు లభించలేదు.

ఆంధ్ర మహాసభ నానా తంటాలుపడి స్థాపించిన విద్యాలయాలను ఎన్.కె. నిర్వహించిన తీరు అద్భుతం. మాడపాటి, సురవరం, ఎన్.కె.రావు - ఈ ముగ్గురు తెలంగాణ త్రికూటాలయంలో అధిష్టాన దేవతలు. అప్పట్లో వేదాంతవర్ధనీ సంస్కృత పాఠశాల సీతారాంబాగ్‌లో ఉండేది. దీన్ని నడిపించిన వ్యక్తి ఎన్.కె.రావు. ఆయన కాంగ్రెస్ కేసులన్నింటిలో ఉచితంగా వకాలత్ యిచ్చేవాడు. విద్యార్థి సంఘానికి వారానికి రెండువందలిచ్చేవాడు. స్వల్పకాలంలో అనల్ప త్యాగాలు చేశాడు.

పబ్లిక్‌గార్డెన్స్ చుట్టు కోటగోడలు ఉండేవి. శుక్రవారం జనానాకు (స్త్రీలు) మాత్రమే ప్రవేశం. వారిని ఇతరులు చూడకూడదు. అందుచేతనే ఆ కోటగోడలను

తరువాత 1946-47లో ముఖ్యమంత్రిగా సర్ మీర్జా ఇస్మాయిల్ వచ్చినపుడు పబ్లిక్‌గార్డెన్స్ అందాన్ని అవి మరుగుపరుస్తున్నాయని వాటిని పగులగొట్టించి, ఇప్పుడున్న ఇనుప కటకటాలు పెట్టించాడు. ఇలాంటి పనుల వల్ల సర్ మీర్జాను బర్తరఫ్ చేశారు. అప్పుడు ముఖ్యమైన రోడ్లన్నీ సిమెంట్ రోడ్లే. రాణిగంజ్ నుంచి చార్మినార్‌దాకా, టాంక్‌బండ్, నాంపల్లి మీదుగా ఆబిడ్స్‌రోడ్డు, సుల్తాన్‌బజార్, కింగ్‌కోఠి రోడ్, కాచీగూడ రోడ్డు అన్నీ సిమెంట్‌వే.

నిజాం ప్రతి శుక్రవారం ప్రార్థనలకు చార్మినార్, మక్కామసీదులకు వెళ్ళేవాడు. ఆయన కారు వెళ్ళేటప్పుడు ఒక అరగంట ముందునుంచి దారి అంతా ఖాళీగా ఉండాలి. రోడ్డుమీద ఏ కదలిక ఉండకూడదు. అట్లా ఖాళీచేసిన రోడ్లమీద తప్పు సైడ్ (రాంగ్‌సైడ్)లో వెళ్లేది నిజాం కారు. రాజా బహాదూర్ కిషన్‌ప్రసాద్ ముఖ్యమంత్రిగా, వెంకట్రామారెడ్డి కొత్వాల్‌గా ఉన్న రోజుల్లో ప్రభుత్వం ప్రశాంతంగా నడిచింది. జనం దొంగతనమెరుగరు. కొట్లాటలెరుగరు. 1939లో సర్ కిషన్‌ప్రసాద్ స్థానంలో ఆర్థికశాఖ కార్యదర్శిగా ఉన్న సర్ అక్బర్ హైదరీని ముఖ్యమంత్రి చేశారు. అది రెసిడెంట్ సలహామీద జరిగింది. కాంగ్రెస్‌లో హిందువులు ముస్లింలు కలిసి బ్రిటీష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నందుకు, వీరిద్దరి మధ్య వైషమ్యాలు కలగజేయాలన్న బ్రిటీషు నీతికి అనుకూలంగా ఈ నియామకం జరిగింది. హైదరాబాద్‌లో హిందూ ముస్లింల మధ్య పోరాటాలు సర్ అక్బర్ హైదరీ ముఖ్యమంత్రిత్వం నాటి నుంచి మొదలైనవి.

ఆరవ నిజాం మీర్ మహబూబ్ ఆలీఖాన్ బహాదూర్ 1911 సం. ఆగస్టు 11వ తేదీన ఫలక్‌నుమా ప్యాలెస్‌లో చనిపోయాడు. అదేరోజు నిజాం నవాబు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ గద్దెనెక్కారు. 1911లోనే బ్రిటీష్‌వారి రాజధాని కలకత్తానుండి ఢిల్లీకి మారింది. నిజాం దుర్మార్గుడు. రాజకీయ చతురుడు. సమర్థుడు. తన రక్షణకోసం ఒక మతాన్ని ఆశ్రయించాడు. 'అనిల్‌మాలిక్' అనే ప్రమాదకరమైన నినాదం చేశాడు. అనిల్‌మాలిక్ అర్థం రాజ్యంలోని ముస్లింలందరూ ప్రభువులే అని, అప్పుడు మఖ్దూం మొహియుద్దీన్ అడిగాడు - ఫకీరు కూతుర్ని రాజుకొడుకు పెళ్ళాడ్తాడా? అని. ఇందులో ముస్లింలను ఉద్ధరించేదేమీలేదు.

ఇదంతా స్వప్రయోజనమే.

ఉస్మాన్ ఆలీఖాన్ మరొక ప్రమాదకరమైన దుశ్చర్యకు పాల్పడ్డాడు. అతడు రాజశాసనం తో 'తబ్లీగ్' (మతాంతీకరణ) ప్రారంభించాడు. బహాదూర్‌ఖాన్ అనే సామాన్య వ్యక్తిని బహాదూర్‌యార్‌జంగ్‌గా చేసి అతనిచేత ఈ ఆటలు ఆడించాడు. రాష్ట్ర బడ్జెట్‌లో అందుకోసం నిధులను ఏర్పాటు చేశాడు. వారంతా గ్రామాలమీద పడ్డారు. 1911లో హిందువుల జనాభా 88.9 శాతంకాగా, 1931లో అది 84 శాతానికి పడిపోయింది. ఇలాంటి విపత్కర పరిస్థితిలోనూ ప్రభుత్వాన్ని అడిగిన ప్రజాసంస్థ లేకపోయింది. నిజాం నవాబు సామాజిక, సాంస్కృతిక సంస్థలను సైతం అనుమతించలేదు. ప్రజ నిశ్శబ్దంగా నిద్రాణంగా ఉండిపోయింది. అప్పుడు రంగం మీదికి వచ్చింది ఆర్యసమాజం. శుద్ధి సంఘటనల ద్వారా ముస్లింలలో చేరిన వారిని మరల హిందూమతంలోనికి మార్చింది.

తెలంగాణ ప్రజలను నిజాం ఒక్కడే పీడించలేదు. గ్రామాల్లో దేశ్‌ముఖ్‌లు, దేశపాండ్యాలు, పటేల్-పట్వారీలు చిల్లరదేవుళ్ళై జలగల్లా పీల్చి పిప్పిచేశారు. నిజాం తన రాజ్యపు హిందువులను నమ్మలేదు. ముస్లింలను నమ్మలేదు. కిషన్‌పర్షాద్ తర్వాత వచ్చిన ప్రధానులంతా బయటి ముస్లింలే. నిజాం ఉర్దూను అధికార భాషగా చేసి మిన్న కుండలేదు. ఆనాటి తెలుగు పాఠశాలలను నిషేధించాడు. వీధిబళ్ళను కూడా ఉండనీయలేదు. తెలంగాణాలో తెలుగువారిని ఒక్క నిజాం ప్రభుత్వమే బాధించలేదు. మహారాష్ట్రులుకూడా బాధించారు. బ్రిటీష్‌వారు సాహిత్య సభలకు, మతపరమైన ఉత్సవాలకు అడ్డు తగలలేదు. కానీ, నిజాం ప్రభుత్వం సాహిత్యసభ జరుపుకోవడానికి సైతం ముందుగా అనుమతి తీసుకోవాలని కట్టుబాటుచేసింది. పోనీ అనుమతి పొందినా సంఘవిద్రోహశక్తులు సభను జరుపనిచ్చేవి కావు.

మాడపాటి హనుమంతరావు పంతులు, వడ్లకొండ నరసింహారావు సహాయంతో 1931లో ఆంధ్ర బాలికల పాఠశాల స్థాపించారు. దాన్ని ఆంధ్ర బాలిక ఉన్నత పాఠశాలగా మార్చివేశారు. దీనికి ఉస్మానియా, ఆంధ్ర విశ్వవిద్యాలయాలు గుర్తింపును నిరాకరించాయి. కానీ మాడపాటివారి నిరంతర

కృషితో పూణేలోని థాకరే మహిళా విశ్వవిద్యాలయం నుండి దీనికి గుర్తింపు లభించింది.

రాజాబహదూర్ వెంకట్రామారెడ్డిది వెన్నవంటి హృదయం. తెలంగాణాలో ఏ సత్కార్యం జరిగినా వారి సహకారం ఉండవలసిందే. వారు తెలంగాణావాసులకు పెన్నిధిలాంటివారు. అటువంటి రాజాబహదూర్‌ను మాడపాటివారు అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఆ పాఠశాలకు రాజబహదూర్ తండ్రి అయితే, పంతులుగారు తల్లివంటివారు. 1945 నుంచి ఆ పాఠశాలకు ఆంధ్ర విశ్వవిద్యాలయపు మెట్రిక్ పరీక్షకు కూర్చునే అనుమతి లభించింది. 1949లో హైదరాబాద్ ప్రభుత్వానుమతి లభించింది. రాజాబహదూర్‌తో పనిలేని జమీందార్లు, సంస్థానాధీశులు లేరు. ఎవరు కనబడ్డా మొదటి ప్రశ్న పాఠశాలకు మీ విరాళం ఎంత అనీ.

హమీద్‌హుసేన్ అనే వ్యక్తి మింట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసేవాడు. మింట్‌లో తయారయ్యే బంగారునాణేలు బూజుపట్టకుండా బయట ఎండవేసేవారట. ఈ సూపర్‌వైజర్ బూట్లకింద మైనం అతికించుకుని వాటిమీద నడిచేవాడట. ఆ మైనానికి బంగారునాణేలు అతుక్కుపోయేవట. అట్లా చాలా నాణేలు ఇంటికి చేరవేసుకుపోయేవాడట. అయితే ఇది చాలాకాలం సాగలేదు. 'ఖుఫియా' (సి.ఐ.డి.)కి పట్టుబడిపోయాడట.

'ములుక్' అనేది ఉర్దూపదం. దేశమని దీని అర్థం. ముల్కీలంటే దేశీయులు. వీరిని స్వదేశీయులని కూడా అనవచ్చు. అంటే హైదరాబాద్ రాష్ట్రంలో పుట్టి పెరిగినవారు. దేశంలో బ్రిటీష్‌వారి పాలన వలన వృద్ధి అవుతోన్న నిరుద్యోగాన్ని తట్టుకోలేక వివిధ ప్రాంతాల ముస్లింలు సంస్థానంలోకి వచ్చి ఉద్యోగాలు సంపాదించుకునేవారు. ప్రభుత్వం యిలాంటి రాకను ప్రోత్సహించేది. కానీ వచ్చినవారంతా ముస్లింలే. దీని ఫలితంగా స్థానిక ముస్లింలు తమకు రావలసిన ఉద్యోగాలన్నీ ఉత్తర హిందూస్థానం నుంచి వచ్చినవారు కొట్టేస్తున్నారని వారి రాకను వ్యతిరేకించసాగారు. ఆవిధంగా ఈ సమస్య హిందూ ముస్లింల మధ్య వచ్చినది కాదు. స్థానిక ముస్లింలు, ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన ముస్లింల మధ్య వచ్చిన ఉద్యమమే ఇది.

ఇటువంటి పరిస్థితులలో ఉత్తర హిందూస్థానం నుంచి దిగుమతి జరుగుతూనే ఉంది. అది ఎప్పుడూ ఆగలేదు. ఇక్కడి ముస్లింలు స్థానిక హిందువులతో కలసి ఉత్తరాదివారికి అన్ని ఉద్యోగాలు పోతే మా గతి ఏమిటని గోలపెట్టటం మొదలుపెట్టారు. స్థానికులేకాక ముందుగా వచ్చిన గైర్‌ముల్కీలు కూడా తమ సంతానానికి ఆస్కారం ఉండదని ముల్కీ ఉద్యమాన్ని ప్రోత్సహించారు. దీనిపై నిజాం ప్రభుత్వం ఉద్యోగాలకు ముల్కీ నిబంధన చేసింది. ముల్కీ కావడానికి నిజాం రాష్ట్రంలో పుట్టి వుండాలి. లేదా ఇక్కడి మనిషిని వివాహం చేసుకుని ఉండాలి. లేదా పదిహేను సంవత్సరాలు నిజాం రాష్ట్రంలో నివాసం అయినా ఉండాలి. అయితే నిబంధన దారి దానిదే. వచ్చి పడే గైర్ ముల్కీలు వచ్చి పడుతూనే ఉన్నారు. ముల్కీ సర్టిఫికేట్లు ఖరీదుకు అవలీలగా దొరికేవి. ఏభాషవారైతేనేం? ఉద్యోగాలలో ఉన్నవారు చాలామంది సర్టిఫికేటు ముల్కీలే. ముల్కీ ఉద్యమానికి రాష్ట్రంలో అంతంలేదు. అజాద్ హైదారాబాద్ రాష్ట్రానికి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి ముల్కీ ఉద్యమమే పునాదులు చేకూర్చింది. ఈ ముల్కీ ఒక్క తెలంగాణాలోనే ఉంది. హైదరాబాద్ రాష్ట్ర పూర్వ విభాగాలైన మరట్వాడాలో, కర్ణాటకలో దీని అలజడి లేదు. అదే విచిత్రం. వారు పోతూ పోతూ దీన్ని మూసీలో పారవేసి పోతే దానికి తెలంగాణావారు వారసులైనారు.

పోలీసుచర్య తరువాత చాలామంది యూనియన్ ఉద్యోగులు హైదరాబాద్ కొచ్చారు. ఉర్దూస్థానంలో పరిపాలన వ్యవహారం ఇంగ్లీషులోకి మారడం, ప్రాంతీయ భాషలకి ప్రాముఖ్యం పెరగడం వలన యిలా చేయవలసి వచ్చింది. పాఠశాలలో ప్రాంతీయ భాషలను మాధ్యమంగా ప్రవేశపెట్టడం వలన ప్రాంతీయ భాషలలో బోధన జరిపే ఉపాధ్యాయులు అవసరమైనారు. రాష్ట్రంలో ఉద్యోగం చేయడానికి ముల్కీ సర్టిఫికేట్ అవసరమన్న నిబంధన ఉన్నా ఏదోవిధంగా ముల్కీ సర్టిఫికేట్లు సంపాదించారు. మొత్తంమీద చాలామంది ఉద్యోగులుగాను, ఉపాధ్యాయులు గాను వచ్చారు. మొదట యీ విషయానికి యింత ప్రాముఖ్యం లేకపోయింది. కానీ అలా వచ్చినవారు సానుభూతితో ప్రవర్తించక, తాము స్వర్గంనుండి దిగివచ్చినట్లు, అనాగరికమైన యీ ప్రాంతాన్ని నాగరికం చేయడానికి

ప్రయత్నిస్తున్నట్లు అసంబద్ధంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. అలా వచ్చినవారు పనికిమాలిన వారుగా తయారై లంచాలు విపరీతంగా తీసుకుని ఇక్కడి ప్రజలకు ఏవిధంగా సహాయం చేయలేదు. ఆ ఉద్యోగుల ప్రవర్తన హేయాతి హేయంగా వుండటంతో వారికంటే ఇదివరలో ఉన్నవారే మేలని భావించడం జరిగింది. తమ స్థానాలలో యూనియన్ ఉద్యోగులు వచ్చి చేరారు. కనుక ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు వారికి వ్యతిరేకంగా కావలసినంత ప్రచారం చేశారు. ఈ ప్రచారం కూడా యూనియన్ వారంటే వున్న వ్యతిరేక భావాన్ని పెంపొందించడానికి తోడ్పడింది.

ఉర్దూ భారతదేశపు భాషల్లో ఒకటి. బ్రిటీష్‌వారి తోడ్పాటుతో నిజాం ప్రభుత్వం ఉర్దూను విశ్వవిద్యాలయ స్థాయివరకు బోధనాభాషగా చేసి అమలుపరిచింది. దేశీయభాషల్లో ఒకటైనప్పటికి కొద్దిమంది తప్ప సంస్థాన ప్రజల మాతృభాషల్లో ఒకటి కాదు. తెలుగు, మరాఠీ, కన్నడ వారివారి మాతృభాషలు. దీని ఫలితంగా ఆంధ్రుల్లో విద్యావ్యాప్తి తగ్గిపోయింది. ఈ వాస్తవాన్ని గుర్తించలేనివారు గురుదేవ్ టాగూరు నుంచి రాజాజీ వరకు ఉర్దూభాషను ఆకాశానికి ఎత్తారు. ఉద్యోగాల్లో చేరిన ఆంధ్రుల్లో తమకో భాష, సంస్కృతి ఉందని భావించేవారు ఉండడమే అరుదు. విద్యార్థులలో అలాంటి ఉద్యమాలు అభివృద్ధి కాలేదు. స్కూళ్ళు, కాలేజీల్లో చేరేనాటి నుండి ఉద్యోగంలో ప్రవేశించే రోజు కోసం నిరీక్షించేవారిలో ఇలాంటి భావాలు ఉండటం అసాధ్యం. తమ తమ భాషా సంస్కృతులను అభిమానిస్తే దానిని ప్రభుత్వ వ్యతిరేకంగా పరిగణించే రోజులవి. ఈ పరిస్థితి 1940 వరకు సాగింది. హైదరాబాద్ ప్రజావిద్య మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులుగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు 1944 నవంబరు 11వ తేదీన మహాసభ వేదికమీదనుంచి చిరస్మరణీయమైన ఉపన్యాసం చేశారు. మాతృభాషలను బోధనాభాషలుగా చేయాలనే సూత్రాన్ని అంగీకరించి అమలు జరుపుతున్నప్పుడు ఉర్దూ మాతృభాషగాని విద్యార్థులకు ఉర్దూలో బోధన జరగడం ఎంతవరకు సమంజసం! అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని వేళ్ళమీద లెక్కపెట్టగలిగినన్ని ఇంగ్గీషు మాధ్యమం పాఠశాలలలో తెలుగు పిల్లలకు ప్రవేశం దుర్లభం.

కొండా వెంకటరంగారెడ్డి కొండంత మనిషి. కొత్వాల్ వెంకట రామారెడ్డి తర్వాత రెడ్డి వర్గాన్ని శాసించే స్థితికి ఎదిగిన నాయకుడు. 1918లో వకీళ్ళ ప్రతినిధిగా మజ్లిస్‌వజేఖవానీన్ (శాసనసభ)కు ఎన్నికై రైతాంగానికి నిరుపమానమైన సేవ చేశాడు. రైతులకు సంబంధించిన సమస్యలపై ఆసభలో మొత్తం ముప్ఫయ్ బిల్లులు ప్రవేశపెట్టి స్టేట్ కాంగ్రెస్‌లోను, ఆంధ్రమహాసభలోను ప్రముఖ నాయకుడయ్యాడు. ఆంధ్రప్రదేశ్‌కు మొదటి ఉపముఖ్యమంత్రి. డా.చెన్నారెడ్డి, వి.బి.రాజు ఆరోజుల్లో యువనాయకులు.

1946 నుంచి పోలీసుచర్య జరిగేవరకు రజాకార్ల దౌర్జన్యచర్యలకు హద్దులు లేకుండాపోయాయి. ప్రజలు అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని జీవించారు. విద్యార్థిదశలో నేనుకూడా రజాకార్లతో దెబ్బలు తిన్నాను. తొమ్మిదిమాసాలు 'క్విట్ స్కూలు' ఉద్యమంలో పాల్గొన్నాను. అప్పుడు నేను 9వ తరగతి చదువుతున్నాను. 14 ఏళ్ళ బాలుడను. నా తరంవారు చాలామంది స్వాతంత్ర్య సమరయోధుల ఫించన్ తీసుకున్నారు. పింఛన్ కోసం పోరాడలేదనే భావంతో నేను స్వాతంత్ర్యసమరయోధుల పింఛన్‌కోసం ప్రయత్నించలేదు. ప్రముఖ సాహితీవేత్త ఇరువెంటి కృష్ణమూర్తిగారు కూడా పింఛన్ తీసుకోలేదు. జీవనోపాధికి ఒక ఉద్యోగం ఉంది చాలనుకున్నాము.

'ఇమ్రోజ్' పత్రిక సంపాదకుడు షొయెబ్‌ఉల్లాఖాన్‌ను రజాకార్లు హత్యచేసినప్పుడు మేము మైనారిటీ తీరని విద్యార్థులం. రహస్యంగా సంతాపసభలు జరుపుకున్నాం. విజయగర్వంతో హైదరాబాద్‌లో కదం తొక్కిన యూనియన్ సైన్యాన్ని ఆహ్వానించడానికి విద్యార్థులు చాలామంది బొలారం చేరుకున్నారు. ఉప్పుగూడ స్టేషన్‌లో లోకల్‌రైళ్లు జనంతో నిండిపోయాయి. యువకులు ట్రైన్ టాపు పైకెక్కి కూర్చున్నారు. బంతిపూల దండలను మిలిటరీ ట్రక్కులమీద విసిరివేసి ప్రజలు వాటిముందు నృత్యం చేసారు. రైతుల ఆనందోత్సవాలకు అంతే లేదు. గ్రామాల్లో రజాకార్ల పీడ విరగడైపోయినందుకు సంతోషించారు. జనరల్ చౌధరీ మిలిటరీ గవర్నర్ కావడంతో రాజధానిలోగాని, జిల్లాలలోగాని మతకలహాలు చెలరేగకుండా గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నాడు. ఒక్క

సైనికుడుకూడా అనవసరంగా నగరంలోకి వచ్చేవాడు కాడు. తమ తమ బార్‌కాసులలోనే ఉండేవారు.

పోలీసుచర్య తరువాతనే హైదరాబాద్‌లో తెలుగు సినిమాల ప్రదర్శన ప్రారంభమైంది. అంతవరకు తెలుగు సినిమాలపై ఇష్టం వున్నవారు సికిందరాబాద్ వెళ్ళవలసి వచ్చేది. ఆబిడ్స్‌లోని సాగర్ టాకీస్‌లో తెలుగు సినిమాలు వేసేవారు. నేను చూసిన మొదటి తెలుగు సినిమా 'కీలుగుఱ్ఱం'. రాజ్‌కపూర్ సినిమాలపై ప్రజలకు మోజు ఉండేది. హిందూపిల్లలు రాజ్‌కపూర్ గొప్ప హీరో అంటే, ముస్లిం పిల్లలు దిలీప్‌కుమార్‌పై మోజు చూపేవారు. ఈవిధంగా పోటాపోటీగా రాజ్‌కపూర్, దిలీప్‌కుమార్ సినిమాలు నడిచేవి. రాజ్‌కపూర్ నటించిన 'ఆవారా' సినిమా అంటే నాకు చాలా ఇష్టం. నాలుగుసార్లు చూసాను. పోలీసుచర్యతో ఒక యుగం సమాప్తమైంది. హైదరాబాద్ రాష్ట్రంలో యూనియన్ రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. కానీ గ్రామీణప్రాంతంలో మరికొంతకాలం పాత పద్ధతులే కొనసాగాయి. ఏమైనా నిజాం రాష్ట్రపజలు మార్పులను వెంటనే స్వీకరించరు. పాత పద్ధతులను విడనాడటానికి కొంత సమయం పట్టింది. కమ్యూనిష్టుల పుణ్యమా అని గ్రామాల్లో దొరల పెత్తనం తగ్గింది. కమ్యూనిష్టుల నాయకత్వంలోని సాయుధ పోరాటం ఎంతోమంది యువకులను ఆకర్షించింది. ఎవరికి యిష్టం వుండనీ, వుండకపోనీ కమ్యూనిష్టులు ఫ్యూడల్‌శక్తులకు సింహస్వప్నాలుగా మారిపోయారు. గ్రామాల్లో పెద్దమార్పు తెచ్చారు. దీంతో ఆంధ్రాభిమానం పెల్లుబికింది.

నవశకం :

పోలీసుచర్య తరువాత మొదటి ఎన్నికలు జరిగేవరకు కొంతకాలం మిలిటరీ పరిపాలన, మరికొంతకాలం సివిల్ పరిపాలన జరిగింది. వీటిని ఆపద్ధర్మ ప్రభుత్వాలని అనవచ్చు. రజాకార్లు తోక ముడిచారు. చెల్లాచెదరై ఏదో ఒక ఉపాధి చూసుకున్నారు. మాతృభాషలకు విముక్తి లభించింది.

మేము దాదాపు 10 ఏండ్లు మహారాష్ట్రుల యింట్లో వుండేవాళ్ళం. అదే యింట్లో ఒకచోట కన్నడిగులు కూడా వుండేవారు. ఇంతకాలం ఒక చోట ఉన్నా

వివిధభాషల వారిమధ్య సఖ్యత సంయమనం కుదరలేదు. ఎవరి సంస్కృతి వారిది అనుకునేవారు. మాట్లాడుకోవలసి వస్తే ఉర్దూలో మాట్లాడుకునేవారం. తెలుగువారికి మరాఠి, కన్నడ భాషలు అంత సులభంగా రాలేదు. మరోవిధంగా చెప్పాలంటే వివిధభాషలవారు విడిపోవడానికి సిద్ధంగా వున్నారన్నమాట. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగువారి ఆధిక్యాన్ని ముస్లింలు అంగీకరించనట్లే మహారాష్ట్రులు, కన్నడిగులు కూడా అంగీకరించలేదు. హైదరాబాద్ మిశ్రమ సంస్కృతి అని ప్రచారం జరిగింది. కానీ అది ఎక్కడా మాకు కనిపించలేదు. ఎవరి సంస్కృతి వారిదిగా ఉండేవారు. ఉర్దూ భాష లింక్‌భాషగా పనిచేసేది. ఇప్పటికీ హైదరాబాద్‌లో ఉర్దూ వాతావరణం పూర్తిగా పోలేదు. నిజాం సర్కారు ఉర్దూ భాషాపోషణకు తీసుకున్న చర్యలు అటువంటివి.

పోలీసుచర్య తరువాత హైదరాబాద్ రాష్ట్రంలో ఎన్నికలు జరుగలేదు. మేజర్ జనరల్ జె.ఎన్.చౌధరీ నాయకత్వంలో మిలిటరీ ప్రభుత్వం ఏర్పడింది. ఆకాలంలో విచక్షణారహితమైన హింసాకాండ కమ్యూనిష్టుల సాయుధ పోరాటం ఉన్నచోట్లలో జరిగింది. సాయుధపోరాటాన్ని అణచివేసిన ఘనత మిలిటరీ గవర్నరుకు దక్కింది.

ఆరోజుల్లో మిలిటరీ పభుత్వం ఏది తలుచుకుంటే అది శాసనం కావడం, ఖచ్చితంగా అమలవడం జరుగుతూ వుండేది. పోలీసుచర్య వల్ల తన నిరంకుశాధికారం కోల్పోయి రాజప్రముఖుడైన నిజాం ఏ శాసనంపైనా సంతకం చేయడానికి నిరాకరించే స్థితిని కోల్పోయాడు. కాబట్టి ఎంత ప్రబలమైన సంస్కరణలైనా ఎట్టి నిరోధం లేకుండా అమలై నల్లేరుపై బండి సాగినట్లు పరిపాలన సాగిందీకాలంలో. ఎవరికీ కాదనడానికి దమ్ములు లేకపోయినవి. నిజాం స్వంత ఆస్తి సర్ఫెఖాస్ రద్దయింది. జాగీర్దారీ వ్యవస్థ పోయింది. ఒక సంవత్సరం మిలిటరీ పాలన అనంతరం ఎం.కె.వెల్లోడీ ముఖ్యమంత్రి అయ్యాడు. ఎవ్వరైతేనేం? మొదట ఎన్నికలు జరిగేవరకూ హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలించిన వారంతా రాష్ట్రేతరులే.

1952లో మొదటి సాధారణ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసులో అంతః కలహాలు ఉండనే ఉన్నాయి. ముఖ్యమంత్రి పదవికి బూర్గుల రామకృష్ణారావు, బిందూ మధ్య పోటీ వచ్చింది. బిందూ స్వామీజీ అభ్యర్థి, కానీ ప్రధానమంత్రి నెహ్రూ కోరికపై బూర్గుల రామకృష్ణరావు కు ముఖ్యమంత్రి పదవి లభించింది. తన పరిపాలనలో రామకృష్ణరావు ఎన్నో సంస్కరణలు తెచ్చారు. భారతదేశంలోనే అభ్యుదయకరమైన కౌల్దారీ శాసనం తెచ్చారు. రాష్ట్రంలో విద్యకు చాలా ప్రాముఖ్యం లభించింది. జిల్లాకొక కళాశాల ఏర్పాటైంది. స్థానిక సంస్థలకు సంపూర్ణ ప్రజాస్వామిక రూపం లభించింది. అనేక నూతన శాసనాలు, ఉద్యమాలు తలెత్తాయి.

ఒకానొక చరిత్రకారుడన్నట్లు తెలంగాణాలోని ప్రతిచెట్టు, గుట్ట, పుట్ట, రాయి, రప్ప, మట్టి - ఎక్కడ చూసినా ఆంధ్రుల చరిత్రకు సంబంధించిన ఉదంతాలు లభిస్తాయి. హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వం కూడా యీ కృషికి కొంత సహాయం చేసింది. శ్రీ వి.బి.రాజు సమాచారశాఖ మంత్రిగా ఉండగా హైదరాబాద్ ప్రభుత్వం తరఫున 1952లో కథానికల పోటీ జరిగింది. ఈ పోటీలో శ్రీ ఎ.ఆర్.కృష్ణకు ప్రథమ బహుమతి,శ్రీ పాలగుమ్మి రామారావుకు ద్వితీయ బహుమతి లభించాయి. 1953లో ప్రభుత్వం తెలుగు కవితా రచన పోటీ నిర్వహించింది. ఈ పోటీలో దాశరథికి ప్రథమ బహుమతి లభించింది.

సాహిత్యరీత్యా తెలంగాణా ప్రతిభ హైదరాబాద్ ప్రజాపోరాటంలో విదితమైంది. ఆకాలంలో ఇద్దరి కవులు ప్రజాబాహుళ్యానికి బాగా పరిచయమైనారు. వీరిలో మొదటివారు కాళోజీ, రెండవవారు దాశరథి. 'నా తెలంగాణా కోటి రత్నాలవీణ' అని సగర్వంగా చెప్పుకున్నారు. ఈ ఇద్దరితో మరిద్దరు గొంతు కలిపారు. ఒకరు శ్రీ వానమామలై వరదాచార్యులు, రెండవవారు శ్రీ సి.నారాయణరెడ్డి. హైదరాబాద్ ప్రభుత్వం సాహిత్య సభలకు అన్నివిధాలా సహాయం చేస్తుండేది. స్వచ్ఛంద సంస్థలు సమ్మేళనలు జరుపుకుంటే ప్రభుత్వం ప్రచార సాధనాల సహాయం సమకూర్చేది. ఆర్థిక సహాయం చేసేది. బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా షామంజిల్‌లో సి.నారాయణరెడ్డిగారి కావ్యగానం

ఏర్పాటుచేశారు షామంజిల్‌లో తెలుగు కావ్యగానం జరగడం హైదరాబాద్ చరిత్రలో ప్రత్యేకంగా పేర్కొనదగిన ఘటన. ఆంధ్రపదేశ్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ వాతావరణం మారిపోయింది. డా.దాశరథి అంత్యక్రియలకు అధికార లాంఛనాలివ్వని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన్ను తాను అగౌరపరచుకున్నది. ఆయన ఉద్యమ వైలక్షణాన్ని అవమానపరచినది. ప్రభుత్వాధినేతల వ్యక్తిగత రాగద్వేషాలననుసరించి కవులపట్ల, కళాకారులపట్ల వ్యవహరించడం సభ్య ప్రభుత్వ లక్షణం కాదు.

రచనా వ్యాసంగం :

1965 నుంచి నా రచనా వ్యాసంగం క్రమం దాటకుండా ప్రారంభమైంది. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంవారు 'మేధావి' అనే మాసపత్రికను శ్రీ వి.పి.రాఘవాచార్యుల సంపాదకత్వంలో తీసేవారు. ఈ పత్రికకు నేను దాదావు 10 సంవత్సరాలు రాస్తూ వచ్చాను. ఆరోజుల్లో కృష్ణాపత్రిక విజయవాడ నుంచి వెలువడేది. అది సంపూర్ణ రాజకీయ వారపత్రిక. నా వ్యాసాలు కృష్ణా పత్రికలో చాలానే వచ్చాయి. కృష్ణాపత్రికలో వచ్చిన నా వ్యాసాల సంకలనమే 'మన చరిత్ర – సంస్కృతి – రాజకీయాలు' దీనికి ఆంధ్రభూమి పత్రిక అప్పటి సంపాదకులు గోరాశాస్త్రిగారు ముందుమాట రాసారు. గోరాశాస్త్రిగారి సుదీర్ఘ పరిచయ వాక్యాలవల్ల నా వుస్తకం బాగాపోయింది. ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాల చరిత్ర ఒక వుస్తకరూపంలో రావడం అదే ప్రథమం. ఈ గ్రంథావిష్కరణ సభ 1973 ఆగస్టు 20వ రోజు ఆంధ్ర సారస్వత పరిషత్తు సమావేశ మందిరంలో జరిగింది. సభకు ఎం.ఎల్.సి. వి.పి.రాఘవాచార్యులుగారు అధ్యక్షత వహించగా, ఆచార్య దివాకర్ల వెంకటావధానిగారు గ్రంథావిష్కరణకావించారు. వావిలాల గోపాలకృష్ణయ్య, రావినారాయణరెడ్డి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, తిరుమల రామచంద్ర, ఆచార్య ఎం.కులశేఖరరావుగారలు సభలో పాల్గొన్నారు. సత్తెనపల్లి నుంచి వావిలాలవారు నా వుస్తకాన్ని ప్రశంసిస్తూ లేఖ కూడా వ్రాశారు. చాలా పత్రికలు వుస్తక సమీక్షలలో నా కృషిని అభినందించాయి.

ఆంధ్రప్రభలో 1968లో ప్రారంభమైన నా రచనా వ్యాసంగం ఇప్పటికీ కొనసాగుతూనే వుంది. సీరియల్‌గా తమ పత్రికలో ఆంధ్రపదేశ్ చరిత్ర ప్రచురించాలనే అభిప్రాయం గోరాశాస్త్రిగారికి కలిగింది. దీనికి నాపేరు సూచించినవారు ఆ పత్రిక సీనియర్ ఉపసంపాదకులు జి.ఎన్.వరదాచారి గారు. దాదావు అన్ని ఆదివారాలలోనూ ఒక సంవత్సరకాలం యీ సీరియల్ కొనసాగింది. నాటికీ తెలుగులో దక్కను చరిత్ర రాలేదు. విద్యార్థులు ఎంతో ఆసక్తితో ఈ చరిత్రను చదివేవారు. ఆంధ్రభూమి సంపాదకులు గోరాశాస్త్రిగారు, ఆంధ్రజ్యోతి సంపాదకులు నండూరి రామ్మోహన్‌రావుగారు, 'ఉదయం' సంపాదకులు కె. రామచంద్రమూర్తిగారు, ఎ.బి.కె.ప్రసాద్‌గారు, ఆంధ్రపభ సంపాదకులు పొత్తూరి వెంకటేశ్వరరావుగారు నా రచనలను తమ పత్రికల్లో ప్రచురించేవారు. 1980లో ఆంధ్రప్రదేశ్ పభుత్వం 'ఆంధ్రపదేశ్ రజతోత్సవ సంచిక'ను మద్రాసులో ప్రచురించింది. ఈ సంచిక ఆవిష్కరణ సభకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్య అధ్యక్షత వహించగా, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.జి.ఆర్.ఆవిష్కరించారు. ఈ ప్రత్యేక సంచిక సంపాదక మండలిలో డా.దాశరథి చెప్పేవరకు నాకు నాపేరున్న సంగతి తెలియదు. ఆ సంచికలో నేను రాసిన 'తెలుగువారి దివ్య దీపావళి' మొదటి వ్యాసంగా వేశారు.

ఆంధ్రజ్యోతి హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభమైనప్పుడు దీనికి ఎ.బి.కె.ప్రసాద్‌గారు రెసిడెంట్ ఎడిటర్‌గా ఉన్నారు. ఈ సంచికలో రాష్ట్ర నిర్మాణంలో రాయలసీమ కృషి అనే నా వ్యాసాన్ని రంగురంగుల ఫోటోలతో ఆకర్షణీయంగా ప్రచురించారు. కాంగ్రెస్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా నండూరి రామ్మోహనరావుగారు, ప్రత్యేకవ్యాసం రాయమని నన్ను కోరినప్పుడు నాకు కొంత ఆశ్చర్యం వేసింది. విజయవాడలో హేమాహేమీలైన రచయితలు ఉండగా నన్ను కోరడమేమిటని వినమ్రంగా నండూరివారిని అడిగాను. సంయమనంగా రాస్తున్న వారు మీరొక్కరేనని ఆ బాధ్యత మీపైన పెట్టామని చెప్పారు. నాకు ఇక తప్పలేదు. అది చాలా పెద్ద వ్యాసమే అయింది. దీన్ని మధ్యపేజీలలో పూర్తివ్యాసంగా నేను పంపిన ఫోటోలతో సహా వేశారు. నా రచనలపై పొత్తూరి వెంకటేశ్వరరావుగారికి సదభిప్రాయం ఉంది. ఏ ప్రత్యేక సన్నివేశం వచ్చినా నాకు ఫోన్ చేసి రచనలు

తెప్పించుకునేవారు. ఎ.బి.కె.గారి దృష్టిలో పడటం నా అదృష్టం. వారిది డేగకన్ను. ప్రతివిషయం జాగ్రత్తగా పరిశీలించి వేస్తారు. ఒక వ్యాసంలో దుగ్గరాల గోపాలకృష్ణయ్య ఉండవలసిన స్థానంలో దుగ్గిరాల బలరామకృష్ణయ్య అని రాశాను. నేను తప్పు రాయననే విశ్వాసంతో సబ్ ఎడిటర్లు దీన్ని ఓ.కే.చేసారు. ఫైనల్‌ప్రూఫ్‌లో ఎ.బి.కె.గారు పట్టుకున్నారు. 'ఇక నీమీద నా విశ్వాసం పోయింది' అని నవ్వుతూ ఎత్తి చూపించారు. సాధారణంగా ఇలాంటి తప్పులు రచయితల నుంచి జరుగుతూంటాయి. పత్రికలకు పంపేముందు రెండుమూడుసార్లు చూసుకుని పంపితే ఇలాంటి తప్పిదాలు జరుగవు.

రామచంద్రమూర్తిగారు 'ఉదయం'లో ఉన్నపుడు నాచేత ఆంధ్రపదేశ్ చరిత్రను 20 సీరియల్స్‌లో దినదినం వచ్చేటట్లుగా రాయించారు. దీన్ని కొంత పెంచుతూ 'ఆంధ్రపదేశ్ రాజకీయ చరిత్ర'గా పుస్తక రూపంలో తెచ్చాను. విమర్శకుల దృష్టిలో బాగా పోయిన నా పుస్తకాలలో ఇది ఒకటి. ప్రకాశం పంతులు మద్రాసులో ముఖ్యమంత్రిగా ఉన్న చరిత్రను వెలికితీసి నేను రాసినప్పుడు పంతులుగారి గురించి తెలుగులో వచ్చిన మొదటి వ్యాసం నాదే అయింది. ఆ తర్వాతనే ఎమెస్కో వారి ప్రకాశం జీవిత చరిత్ర వచ్చింది. అప్పటి స్వతంత్ర, కృష్ణపత్రికలనుంచి విషయం గ్రహించి సమగ్ర రూపమిచ్చాను. చరిత్ర రాసేవారు ఎప్పటికప్పుడు పత్రికలు చదివి సమాచారం సేకరిస్తే యిబ్బందులుండవు. గోలకొండ పత్రిక చదవనివారు తెలంగాణా చరిత్ర రాయడం సాహసమే అవుతుంది. జి.కృష్ణగారు అడిగి అడిగి నాతో సమాధానాలు చెప్పించుకునేవారు.

వివిధ పత్రికల్లో ఈ నలభై సంవత్సరాలకాలంలో నేను రెండువేలకన్నా ఎక్కువ రచనలే చేశాను. అవన్నీ జాగ్రత్త పరుచుకున్నాను. కుతూహలం వున్నవారు ఆనాటి సమాచారాన్ని బైండింగ్ పుస్తకాలలో చదవవచ్చు.

డా.రావూరి భరద్వాజగారు రేడియోలో ఉన్నపుడు 'ప్రథమ స్వతంత్ర్య పోరాటం' అంటే 1857 ఉదంతాలపై ప్రసార కార్యక్రమం చేయవలసి వచ్చింది. నేను ఆనాటికి రెండురోజుల ముందు ఆంధ్రభూమిలో దీనిపై పెద్ద వ్యాసమే రాసాను. దీన్ని చదివి 'ఆంధ్రభూమి' ద్వారా రావూరివారు నాకు కబురు చేసారు. పూర్తిగా

15 నిముషాల ప్రసంగం. అదే నాది మొదటి రేడియో ప్రసంగమైంది. యిలా మొత్తం 80 ప్రసంగాలు రేడియోలో చేశాను. సందర్భానుసారంగా ఆరుసార్లు టి.వీ. ప్రసంగాలు యిచ్చాను.

నన్ను అభిమానించిన వారిలో మండలి బుద్ధప్రసాద్‌గారిని నేను మరువలేను. పూర్తిగా నా పరిచయం లేనిరోజుల్లోనే వారు మాయింటికి వచ్చి నాచేత 'ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చరిత్ర' అనే 480 పేజీల బృహద్గ్రంథం రాయించారు. ఇది నా శక్తికి మించిన పని అయింది. ఆంధ్రలో కాంగ్రెస్ పుట్టుక నాటినుంచి సమాచారం సేకరించాలి. కాంగ్రెసు దస్తరాలు గాంధీభవన్‌లో లభ్యంలో లేవు. విజయవాడ ఆంధ్రరత్న భవన్ నుంచి తెచ్చిన కాంగ్రెస్ దస్తరాలన్నీ అగ్నికి ఆహుతి అయిపోయాయి. కొత్తగా సమాచారం సేకరించవలసి వచ్చింది. డా.పట్టాభి సీతారామయ్యగారు అఖిల భారత కాంగ్రెస్ చరిత్ర రాశారు. వారు కాంగ్రెసులో కడగంటా నిలిచిన సూత్రధారి. వారిముందు నేనెంత? సాహసం పురికొల్పింది. కాంగ్రెస్ చరిత్ర గ్రంథ రూపంలో వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ చరిత్రపై నాకు సంపూర్ణమైన అవగాహన వుందని 'ఆంధ్రభూమి' సంపాదకులు ఎం.వి.ఆర్.శాస్త్రి గారు, ఆంధ్రప్రదేశ్ సంపాదకులు జి. వల్లీశ్వర్ గారల అభిప్రాయం. సందర్భం వచ్చినపుడు వారు నాచేత వ్యాసాలు రాయిస్తుంటారు. నాకన్నా గొప్పగా రాసేవారు లేరని కాదు. ఎవరి విశ్వాసం వారిది.

నామిత్రులు, శ్రేయోభిలాషులు అంటూంటారు 'యీ పత్రికా వ్యాసంగంలో పడిపోయి నీ సమయం వృథా అయిందనీ, ఈ విజ్ఞానంతో రెండు, మూడు పిహెచ్.డి.లు చేయగలవాడివనీ., ఈ సందర్భంలో ఆచార్య బి. రామరాజుగారు అన్నారు. 'నీకు పిహెచ్.డి. ఎందుకు? పిహెచ్.డి. ఏక విషయం పరిశోధన. నీవు చేస్తున్నది బహువిషయ పరిశోధన! చాలదా?' ఆచార్య రామరాజుగారి యోగ్యతాపత్రము నాకు పిహెచ్.డి.కంటె ఘనమైనది. ఏమైనా పత్రికా రచన అసిధారావ్రతచర్య ఎంతటి జటిల విషయమైనా సామాన్యుడికి అర్థమయ్యే విధంగా రాయాలి.

2006 సెప్టెంబరు 13వ తేదీన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి నేను శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి ధర్మనిధి పురస్కారం అందుకున్నాను. దీన్ని అప్పటి ఆర్థికమంత్రి శ్రీ కె.రోశయ్య ప్రదానం చేసారు. పురస్కారం కింద ఒక జ్ఞాపికపత్రం, శాలువా, రూ.1116/- అందించారు. ఈ సభలోనే నాకు అప్పటి అవనిగడ్డ శాసనసభ్యులు, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్‌గారితో పరిచయమేర్పడి, అది యీనాటికి కొనసాగుతున్నది. కృష్ణాజిల్లా రచయితల సంఘంవారు 1012 పేజీల 'తెలుగుపసిడి' అనే ఉద్గ్రంథంలో 'యాభైఏళ్ళ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు' అనే నా వ్యాసం ప్రచురించారు. నేను ఈ మహాసభకు హాజరైనాను. కృష్ణాజిల్లా రచయితల సభలో సత్కారం జరిగింది. దీనికి మాజీమంత్రి బుద్ధప్రసాద్ కారకులని వేరుగా చెప్పనవసరంలేదు. 2011 సం. డిసెంబరు 10వ తేదీన పాలమూరు జిల్లా పరిషత్తుహాల్‌లో కలెక్టర్ పురుషోత్తంరెడ్డి, ఐ.ఏ.ఎస్.గారిచేత 'మూసీ' పత్రికా సంపాదకులు డా.సాగి కమలాకరశర్మగారు బి.ఎన్.శాస్త్రి పురస్కారం అందజేశారు. రూ.2500/- నగదుగాను ఒక శాలువ, ఒక ప్రశంసాపత్రంతో సన్మానం. ఆచార్య ఎన్.వి.రామారావు సభకు ప్రధానవక్తగా వచ్చారు. 'నా జీవితానుభవాలు' కార్యక్రమం హైదరాబాద్ ఆకాశవాణివారు రికార్డు చేసి 2006 సం. నవంబర్ 15వ తేదీన 22 నిముషాలు ప్రసారం చేసారు. 2007 సం. జూలై 30వ తేదీన కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థవారు ఆహ్వానంపై కళాప్రపూర్ణ పాతూరి నాగభూషణంగారి శతజయంతి ఉత్సవంలో పాల్గొని ప్రధాన ప్రసంగం చేసాను. 2007 సం.లో మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుగారి 87వ జన్మదినం రోజున నేను కరీంనగర్‌లో చేసిన ప్రసంగం మేధావుల నాకర్షించింది. బాలభద్రరావు రచించిన 'చరిత్రలో మరవురాని ఘటనలు' పుస్తకావిష్కరణ సభ ఆర్ట్స్ కళాశాలలో సుప్రసిద్ధ పాత్రికేయులు ఐ.వి.చలపతిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో నేను ప్రధాన ప్రసంగం చేసాను. శిష్టా గణపతిశాస్త్రిగారి 'హైదరాబాద్ నాడు-నేడు' గ్రంథావిష్కరణ సభ త్యాగరాజగానసభ హాల్లో జరిగింది. ఈ గ్రంథాన్ని నేను విశ్లేషించి ముందుమాట రాశాను. 2013 సం.29 సెప్టెంబర్‌లో తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా నాకు 10వేల రూపాయల నగదు ఒక మెమెంటో, శాలువతో

అప్పటి ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రదానం చేశారు. ఈ సభకు అధికారభాషా సంఘం అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ ప్రధాన అతిథిగా విచ్చేశారు. రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం, రాష్ట్ర సాంస్కృతికశాఖ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశాయి. ప్రధానిగా పి.వీ. అనే గ్రంథాన్ని 2005 సం. ఏప్రిల్ 28వ తేదీన బేగంపేటలోని స్వామీ రామానందతీర్థ స్మారక భవనంలో అప్పటి గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రూపొందిన పి.వీ. స్మారక సంచికకు నేను సంపాదకత్వం వహించాను. ఏతావాతా ఐదు దశాబ్దాలలో నా సాహిత్య జీవితంలో జరిగిన సత్కారాలు, సన్మానాలు, రూపొందించిన ప్రత్యేక సంచికల వివరాలు గ్రంథ విస్తరణ భీతిచే పూర్తిగా ఇక్కడ ఇవ్వలేకపోతున్నాను.

వరంగల్‌లో మొగులయ్య స్మారక ట్రస్టు వారు ప్రచురించిన 'జాతీయ పతాకారోహణ' సంచికను నాచేత మాజీమంత్రి ఎం.ఎస్.రాజలింగంగారు ఎడిట్ చేయించారు. వరంగల్ నగరంలో జరిగిన గ్రంథావిష్కరణ సభకు నేను హాజరై ఆనాడు జరిగిన కవి సమ్మేళనానికి అధ్యక్షత వహించాను.

నేను రచించిన గ్రంథాలు :

మన చరిత్ర – సంస్కృతి, రాజకీయాలు, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రధాన ఘట్టాలు, ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్ర, తెలంగాణా విద్యా, సాంస్కృతిక రంగాల చరిత్ర, భారతదేశ చరిత్రలో ప్రధాన సంఘటనలు, స్వాతంత్రసమర నిర్మాతలు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చరిత్ర, తెలుగు ప్రముఖులు, నారాయణీయం, ప్రధానిగా పీ.వీ., భారతదేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు. ఉన్నవ వెంకటరామయ్య జీవితచరిత్ర, ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య జీవిత చరిత్ర, మరికొన్ని జీవిత చరిత్రలు, పులిజాల రంగారావు, నూకల రామచంద్రారెడ్డి, జె.వి.నరసింగరావు, విజయ భాస్కరరెడ్డి ముఖ్యమైనవి. 'తరతరాల మన చరిత్ర–సంస్కృతి' ని లఘు గ్రంథంగా తెలుగు అకాడమీ ప్రచురించింది. నా 'తెలంగాణా చరిత' గ్రంథం బహుళ ప్రచారంలో ఉంది.

నా రచనలు పచురించిన పత్యేక సంచికలు : గ్రంథాలలో కొన్ని -

బూర్గుల రామకృష్ణ రావు శతజయంతి సంచిక (మూసీ ప్రచురణ)
ప్రతిభా వైజయంతి, పి.వి.నరసింహారావు సన్మానోత్సవ సంచిక (ఉద్గ్రంథం)
13వ తానా కాన్ఫెరెన్స్ : తెలుగు పలుకులు : 2001 అమెరికా
ప్రవాసాంధ్రుల ప్రత్యేక సంచిక : (అమెరికా) తెలుగు అకాడమీ వారి పునః ప్రచురణ
కృష్ణదేవరాయ పట్టాభిషేక పంచ శతాబ్ది సంచిక
తెలుగు భారతి (తెలుగు విశ్వవిద్యాలయం)
ఆంధ్ర సారస్వత పరిషత్తు (వజ్రోత్సవ సంచిక)
వజ్రభారతి (విజయవాడ)
తెలుగు పసిడి (కృష్ణాజిల్లా రచయితల సంఘం)
టంగుటూరి అంజయ్య సంస్మరణ సంచిక
తెలుగు పున్నమి (కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రచురణ 2011)
నా రచనలు వెలువరించిన ప్రధాన పత్రికలు :
ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఉదయం, వార్త, (దినపత్రికలు)
కృష్ణాపత్రిక, ప్రజాతంత్ర (వారపత్రికలు)
ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, సహకార సారథి (మాసపత్రికలు)

2013 సం.డిసెంబర్ 30వ తేదీన ఆంధ్ర సారస్వత పరిషత్తు అర్వై ఆరవ 'పరిణతవాణి' ప్రసంగం చేసే అవకాశం నాకు లభించింది. అందుకు పరిషత్ అధ్యక్షులు జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలు, పద్మభూషణ్ ఆచార్య సి.నారాయణరెడ్డి గారికి నా కృతజ్ఞతలు. పరిషత్ కార్యదర్శి డా.జె.చెన్నయ్య, జి. రామకృష్ణారావుగారలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు నా ధన్యవాదాలు. ఆంధ్ర సారస్వత పరిషత్తుతో నాకున్న అభిమానం, అనుబంధం 60 ఏళ్ళ నాటిది. చాలా విషయ పరిజ్ఞానం అక్కడ వున్న పుస్తక భాండాగారం నుంచే గ్రహించాను. ఆనాటి నా పరిణతవాణి ప్రసంగాన్ని లిఖితపూర్వకంగా ఈ రచనలో అందించే ప్రయత్నం చేసాను.

❖ ❖ ❖



శ్రీ పెరుంబూదూర్ లక్ష్మణమూర్తి

మాన్యులు జ్ఞానపీఠపురస్కృతులు, పద్మభూషణ్ డాక్టర్ సి. నారాయణ రెడ్డి గారు 'పరిణతవాణి' ప్రసంగం చేయవలసిందిగా ఆదేశించిన కారణాన, ఆత్మకథారూపమైన సాహిత్య ప్రసంగం చేస్తున్నాను:

మాది చందుపట్ల గ్రామం. ఇది నల్లగొండ జిల్లా నకిరేకర్ మండలానికి మూడు మైళ్ళ దూరంలో ఉంది. నేను ఆ ఊళ్ళో విక్రమ నామ సంవత్సరం ఆషాడ మాసం పూర్ణిమ (గురుపూర్ణిమ) నాడు జన్మించాను. ఇంగ్లీష్ తేదీ ప్రకారం అది జూలై 20, 1940 ఔతుంది. కాని స్కూల్ రిజిస్టర్ లో జూన్ 21, 1939 గా నమోదైంది. మా ఇంటి పేరు శ్రీపెరుంబూదూర్. మాది శ్రీవైష్ణవ బ్రాహ్మణ కుటుంబం కావడం మూలాన, తమిళనాడులోని శ్రీవైష్ణవ తీర్థ క్షేత్రాల పేర్లలో ఏదో ఒక పేరు ఇంటి పేరుగా ఉండడం సహజమే. మేము తమిళనాడు నుండి వచ్చి స్థిరపడ్డామనడానికి ఆధారాలు ఏవీ లభించలేదు. ఇప్పుడు నకిరేకిల్ గ్రామం విశాలమై, మండలపట్టణమై, హైదరాబాదు - విజయవాడ హైవే పై ప్రధానమైన మజిలీగా ప్రసిద్ధమైంది. మా చిన్ననాడు మా ఊరే పెద్దది. చుట్టుపక్కల గ్రామాలనుండి ప్రజలు చదువుకోవడానికి, సరుకులు కొనడానికి మా ఊరే వచ్చేవారు. అక్కడే వ్యాపారం బాగా ఉండేది. మా ఊరికి మరో ప్రత్యేకత కూడా ఉంది.

కాకతీయ సామ్రాజ్య అధినేత్రి రుద్రమదేవి అంత్యకాలాన్ని గూర్చి చరిత్రకారులకు నిశ్చితమైన ఆధారం మా ఊళ్ళోనే లభించింది. మా ఊరిపొలిమెరలో

ఒక జీర్ణ శివాలయం ముందు ఒక శిలా శాసనం ఉంది. చాలాకాలం దాన్ని గుర్తించిన వాళ్ళే లేరు. మా తమ్ముడు డాక్టర్ శ్రీరంగాచార్య దాన్ని పురాతత్వ శాఖవారి దృష్టికి తెచ్చాడు. సుప్రసిద్ధ శాసనపరిశోధకులు శ్రీపరబ్రహ్మ శాస్త్రిగారు ఆ శాసనం ఆధారంగా రుద్రమదేవి మా గ్రామం పొలిమెరలో వీరమరణం పొందిన విషయాన్ని ధృవీకరిస్తూ భారతి పత్రికలో చందుపట్ల శాసనం అనే వ్యాసాన్ని వ్రాశారు. ఆ శాసనం అతి ప్రధానమైందిగా గుర్తింపబడింది. దాన్ని ఇప్పుడు ఒక వేదికపై ప్రతిష్ఠించి రక్షణను ఏర్పాటు చేశారు. రుద్రమదేవి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠంచడానికి సర్వమూ సిద్ధమైంది. ఆ శివాలయానికి ప్రక్కనే ఒక పెద్ద చెరువు ఉంది. దాన్ని రాయసముద్రంగా శాసనం పేర్కొంది. అది కాకతీయులనాటి చెరువు. రాయ పదం రుద్రమదేవి బిరుద నామాల్లో ఒకటి. ఇప్పటికీ ఆ చెరువే వ్యవసాయానికి ఆధారం. మరమ్మత్తులేవీ లేకుండా మట్టి కట్టతో ఈనాటికీ చెక్కుచెదరకుండా ఉంది. మా ఊరు వెయ్యేళ్ళ నాటిది.

మా ఊరు ప్రశాంతమైంది. రజాకార్ల కాలంలో కొన్ని నెలలు మినహాయిస్తే, ఆ ఊళ్ళో ప్రశాంత వాతావరణం ఎప్పుడూ భగ్నం కాలేదు. మా ఊళ్ళో విద్యాధికులెక్కువ. అక్కడ కోదండరామస్వామివారి ఆలయం ఉంది. దాన్ని మా ఊరి వెలమదొరలు పానుగంటివారు నిర్మించారు. పానుగంటి వారు సంపన్నులు సంస్కారవంతులు విద్యాధికులు కూడా. ఆ దేవాలయంలో నిత్యపూజాదికాల కోసం మా తాతగారి తాతగారిని అర్చకులుగా నియమించి భూవసతీ గృహవసతీ కల్పించారు. మా పెద్దన్నగారు శ్రీమాన్ శ్రీ వెంకటరమణాచార్యులు పరమపదించేవరకూ ఆ దేవాలయానికి మేమే అర్చకులుగా ఉన్నాం.

మా తాతగారు శ్రీమాన్ శ్రీ వెంకటచార్యులుగారు. ఆయన కుమారుడు మా నాయనగారు శ్రీమాన్ శ్రీరాఘవాచార్యులు గారు.

మా నాయనగారికి అన్నదమ్ములు లేరు. వారికి ఒక అక్కగారు ఉండేది. ఆమె గతించి చాలాకాలమైంది.

ఒక్కడే కొడుకు కావడమూ, దేవాలయంలో అర్చకత్వం ఉండడం వల్లనూ

మా నాయనగారిని స్కూల్లో చేర్చలేదు. సంప్రదాయపూజాదికాలను తాతగారు నేర్పించారు. మా నాయనగారికి చదువుపై ఎంతో ఆసక్తి ఉండేది. ఎందరినో ఆశ్రయించి కష్టపడి తెలుగునూ సంస్కృతాన్ని బాగా నేర్చుకున్నారు. గ్రాసవాసోదైన్యంలేని కుటుంబం. మా నాయనగారికి పుస్తకాలంటే అమితమైన ప్రేమ. వారు 20 ఏళ్ల యువకుడుగా ఉండగా మద్రాస్ వావిళ్ల ప్రెస్ వారి చిరునామాని సంపాదించి వారికి "మీరు ప్రచురించిన గ్రంథాలన్నింటినీ ఒక్కొక్క ప్రతి చొప్పున పంపించండి." అని కోరుతూ ఒక కార్డు వ్రాసారట. అక్కడి నుండి పది రోజులలో పుస్తకాలు వస్తే బండిని బాడుగకు తీసికొని ఆ పుస్తకాలన్నింటినీ మా నాయనగారు ఇంటికి చేర్చుకున్నారు. వాటిని ప్రాణ సమానంగా చూచుకునేవారు. "ఇంటిపై బంగళా వేస్తే 200 రూపాయలు ఖర్చైతే పుస్తకాలకు 300 రూపాయలైంది" అని చెప్పేవారు. ఆ పుస్తకాలన్నీ చెక్క బీరువాల్లో చక్కగా అమర్చబడి ఉండేవి. చదువుకోవడానికి ఒక చిన్న గది ఉండడం వల్ల మేము ఏదో ఒక పుస్తకం చదువుకునేవాళ్ళం.

మాది పెద్ద కుటుంబం. మేము ఐదుగురు సోదరులం. మాకు ఆరుగురు అక్క చెల్లెళ్ళు. మా పాలన పోషణ ఉపనయన వివాహాదులకు ఆస్తి కరిగిపోయింది. మా నాయనగారు వైదిక విద్యను నేర్చుకున్నారు. గ్రామాల్లో పౌరోహిత్యం చేసేవారు. ధనవంతులు వారినే ఆహ్వానించి వివాహాదులకు ఉత్సవాలకు తీసుకువెళ్ళేవారు. ఆ ఆదాయంతో ఇల్లు గడిచేది. ఆర్థికంగా కష్టమైనా మా నాయనగారు ఇంటికి తిరిగివస్తూ ఒక మంచి పుస్తకాన్ని కొని తెచ్చేవారు. మా ఇంట్లో మా చిన్ననాటనే ఒక చిన్న గ్రంథాలయం ఉండేది. అదే మా భాషా సంస్కారానికి మూలం. మా అన్నదమ్ములందరికి చిన్నతనాన్నే అమరకోశం, ఆంధ్రనామ సంగ్రహం మొదలైన నిఘంటువులతో పరిచయమైంది. మా నాయనగారికి తెలుగు, సంస్కృతం – ఈ రెండు భాషలే తెలుసు. తెలుగులో కావ్యాలన్నింటిని సవ్యాఖ్యానంగా చదివారు. మాతో కొన్నింటిని చదివించినారు. అందుకే, స్కూల్లో తెలుగు పాఠాలు సులభంగా ఉండేవి. క్రమశిక్షణ విషయంలో ఆయన చండశాసనుడు. వారికి జీవితాంతం పుస్తకాలతోనే కాలక్షేపం. వారి పుస్తకాలన్నీ మా తమ్ముడి వద్ద భద్రంగా ఉన్నాయి.

ఆంధ్ర సారస్వత పరిషత్తు పరీక్షలకు చదివే వారికి వారు ఉచితంగా కావ్య పాఠాలు చేప్పేవారు. మా ఇంట్లో నిరంతరం సాహిత్య చర్చ ఉండేది. శ్లోకాలను, పద్యాలను చర్చించే వారు. తిరుపతి వెంకటకవుల అవధాన పద్యాలు మా అందరికీ బాల్యం లోనే కంఠస్థమైనాయి. జాషువా కవి పద్య రచనపై వారికి ప్రేమ. ఆ కవి కావ్యాలెన్నో మా నాయనగారి వద్ద ఉండేవి. జ్యోతిషం లో ముహూర్త భాగాన్ని, ఆయుర్వేదాన్నీ నేర్చుకున్నారు. వారు స్కూల్లో చదువుకోలేదు. ఆ కారణంగా వారికి మేము స్కూల్ లో చదువాలి, ఇంగ్లీష్ నేర్చుకోవాలి, ఉద్యోగం చెయ్యాలి అని దృఢమైన కోరిక ఉండేది.

నేను మొట్టమొదటి సారిగా స్కూల్లో అడుగిడింది మిర్యాలగూడెంలో. రజాకార్ల నుండి రక్షణ కై మేమంతా అక్కడ 1946 నుంది 1948 దాకా ఉన్నాం. స్వగ్రామానికి తిరిగి వచ్చి నాల్గవ తరగతి పూర్తి చేసినాను. మంచి మార్కులు వచ్చాయి. ఐదవ తరగతి చదువడానికి సూర్యాపేటకి వెళ్ళాలి. అక్కడ స్కూల్‌లో చేర్పించి మా బంధువుల ఇంట్లో నన్నప్పగించి మా నాయనగారు వెళ్లారు. కానీ అక్కడ వసతి కుదరలేదు. సూర్యాపేటలో ఒక గదిని అద్దెకి తీసికొని వంట చేసికొని తిని చదువుకోవాలి, లేదా ఇంటికివెళ్ళి పౌరోహిత్యం నేర్చుకోవాలి. సూర్యాపేటలో ఉంటానికి నిశ్చయించుకున్నాను. "పరీక్ష తప్పితే పౌరోహిత్యమే" అని మా ఇంట్లో నిర్ణయించారు. వెళ్ళాను. నాకప్పటికి పదేళ్లు కూడా లేవు. 5, 6 తరగతులు ప్యాసైనాను. 7 వ తరగతిలో ఉండగా ఒక రోజు శ్రీ కలగా రామబ్రహ్మం గారింటి ముందు నుండివెళ్ళు తున్నాను. ఆయన గారంటే అందరికీ హడల్. వారు నన్ను లోపటికి రమ్మన్నారు. నాకు వణుకు పుట్టింది. భయం భయంగా వెళ్ళాను. "ఒరేయ్, నీకు కాస్తా డొక్క శుద్ధి ఉంది. రేపటి నుండి నా వద్ద, స్కూల్ అయిపోగానే వచ్చి చదువుకో" అన్నారు. వారు కొవ్వూరు నుండి హైస్కూల్ ఉద్యోగం రీత్యా సూర్యపేట వచ్చారు. హైస్కూల్ లో వారు అన్ని సబ్జెక్టులనీ బోధించేవారు. సంస్కృతాన్ని కూడా చేప్పేవారు. వారికి వైదిక సంస్కారం పుష్కలంగా ఉండేది. శ్రీ రామబ్రహ్మం గారు, వారి సతీమణి నన్ను చాల ప్రేమతో చూచారు. మాస్టారికి రెన్ అండ్ మార్టిన్ హైస్కూల్ ఇంగ్లీష్ గ్రామర్ పుస్తకమంతా కంఠస్థంగా ఉండేది. మాథమాటిక్స్ కూడా గొప్పగా

చెప్పేవారు. నాకు ప్రేమతో ఈ రెండిటినీ మూడేళ్లు ఉచితంగా బోధించారు. వారికి నేను చేసిందేమీ లేదు. వారు నాకీ మేలు నిస్వార్థంగా చేశారు. నేను తరువాతికాలాన ఇంగ్లీష్ ఎం.ఏ. స్వయంగా చదివి పరీక్ష మంచి మార్కులతో ప్యాస్ కావడం వారి దయాభిక్షయే. హెచ్ ఎస్ సీ ఫస్ట్ క్లాస్ లో ప్యాసైన తరువాత మా హెడ్మాస్టర్ శ్రీ రామదాసు గారు కాలేజీలో చేరమని ప్రోత్సహించారు. వారికి నా పై చాలా ప్రేమ. నేను మా నాయనగారితో హైదరాబాదు వెళ్ళాను. సీతాపల్ మండి దగ్గరలో చిల్కలగూడా లో మా బంధువు శ్రీమాన్ శ్రీ కందాళ వేదాంతాచార్యుల గారింట్లో బస చేశాం. ఆయన ఎంతమందికో అన్నదానం చేసి చదువుకోవడానికి సాహయ్యం చేసిన దాత. వారింట్లో ఉంటూ నిజాం కాలేజీ మంచిది అంటే దానిలో చేరాను. వెళ్ళిన రోజే శ్రీ సి. రాఘవాచారి గారితో పరిచమైంది. క్యూలైన్ లో మొదలైన పరిచయం ఇప్పటిదాకా నిలిచింది. శ్రీ రాఘవాచారి తరువాతికాలాన ఉత్తమ జర్నలిస్టుగా 'విశాలాంధ్ర' సంపాదకుడుగా మేధావిగా కీర్తినందినారు. సైన్స్ కోర్స్‌లో చేరితే లాబరేటరీ వర్క్ ఉంటుంది. స్వయంగా చదువుకోవడానికి వీలు ఉండదని ఆర్ట్స్ కోర్స్ లో చేరాను. అటెండెన్స్‌కి అవసరమైనంత వరకు హైదరాబాదులో ఉండి, మా ఊరికి వెళ్ళాను. అక్కడే స్వయంగా చదివి పరీక్ష వ్రాసి యూనివర్సిటీ ఫస్ట్‌గా ప్యాసైనాను. బియ్యే చదవడానికి ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో చేరాను. 1960లో బియ్యేనీ 1962 లో ఏం ఏ నీ ఫస్ట్ క్లాస్‌లో ప్యాసైనాను. నేను పీ యూ సీ చదువుతూ ఉన్న రోజుల్లో శ్రీమాన్ శ్రీ అళహ సింగరాచార్యులు గారు (ప్రస్తుతం ఆంధ్రజ్యోతి' దినపత్రిక సంపాదకులైన శ్రీ కె. శ్రీనివాస్ గారి తండ్రిగారు) సికందరాబాదు రాణీగంజ్ మున్నలాల్ సంస్కృత కాలేజ్ భవనములో నివాసం ఉండేవారు. వారు మాకు బంధువులు కావడం వల్లా వారి అన్నగారి కుమారుడు శ్రీ శేషాచార్యులు నాకు హైస్కూల్ లో క్లాస్ మెట్, స్నేహితుడు అయినందునా అక్కడికి తరచుగా వెళ్ళేవాణ్ణి. నేను ప్రతిదినం సీతాఫల్ మండి నుండి నిజామ్ కాలేజీ కి రాకపోకలు కాలి నడకనే. (మధ్య దూరం 10 లేదా 15 కిలో మీటర్లు ఉంటుంది.) సంస్కృత కాలేజీ దారిలో ఉండేది. శ్రీ ఆచార్యుల వారి మూలంగా శ్రీ శాస్త్రుల విశ్వనాథ శర్మ గారితో, శ్రీ భాగవతం రామారావు గారితో పరిచయం

కలుగడం నా జీవితంలో ఒక పెద్ద అదృష్టం. వారి ప్రోత్సాహంతో బియ్యే మొదటి సంవత్సరం ఆర్ట్స్ కాలేజీలో చదువుతూ మున్నాలాల్ సంస్కృత కాలేజీ లో డిప్లొమా ఇన్ ఓరియెంటల్ లాంగ్వేజెస్ (సంస్కృతం) చదివి సంస్కృత భాషలోనే పరీక్ష వ్రాసి ప్యాసైనాను. ఆ పరీక్షకి చదివినందుకు అక్కడ ఉచిత భోజన సౌకర్యం లభించింది. అతి కష్టంగా బియ్యే మొదటి సంవత్సరం పూర్తి చేసి మా ఊరు వెళ్ళి సెలవులైనాక రెండవ సంవత్సరం లో చేరడానికి హైదరాబాదుకి తిరిగి వచ్చాను. ఆ సంవత్సరం శ్రీ వేణుముద్దల నరసింహారెడ్డి బియ్యే సెకండ్ ఇయర్ చదవడానికి వరంగల్ నుండి వచ్చాడు. మేము ప్రాణ స్నేహితులమైనాం. ఆయన ఔదార్యంతో, సాహాయ్యంతో సౌజన్యంతో బియ్యే యమ్ యే పట్టాలను పొందాను. ఆయన మహానుభావుడు. ఆయన పరిచయం కాకుంటే, నా చదువు అర్థాంతరంగా ఆగిపోయేది. నా చదువు సాగడానికి, నేను ఉద్యోగంలో స్థిరపడటానికి శ్రీ నరసింహారెడ్డి చేసిన మేలే కారణం.

ఎం ఎ (సంస్కృతం) ని ఫస్ట్ క్లాస్ లో ప్యాసై శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారిని కలిసికోవడానికి వెళ్ళాను. శ్రీ విశ్వనాథ శాస్త్రి గారి వలన వారితో పరిచయం ఏర్పడింది. వారు న్యూసైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీ సి. సుదర్శన్ గారిని కలువమన్నారు. వారు నన్ను ఆ కాలేజీలో సంస్కృత లెక్చరర్ గా ఉద్యోగంలో చేర్చుకున్నారు. రోజుకు ఒకటి లేదా రెండు లెక్చర్లు ఉండేవి. అంతా విశ్రాంతి. 1962 లో చేరాను. 1964 లో ఒక సంఘటన ఒక పెద్ద మార్పుకి కారణమైంది. నేను స్టాఫ్ రూంలో కూర్చున్నాను. అక్కడికి విద్యార్థి యూనియన్ ప్రెసిడెంట్ ఇంగ్లీష్ లెక్చరర్ కోసం వచ్చాడు. ఆయనకు ఇంగ్లీషు లో ఒక స్పీచ్ ని వ్రాసి పెట్టాలి. "నేను వ్రాస్తాను, నీకు నచ్చితే వాడుకో" అని వ్రాసి ఇచ్చాను. దాన్ని ఆ పిల్లవాడు ప్రిన్సిపల్ గారికి చూపించాడు. 'సంస్కృతం లెక్చరర్ వ్రాశాడు, దిద్ది పెట్టండి. అన్నాడు. రెండు రోజుల తరువాత శ్రీ సుదర్శన్ గారు నన్ను ఆఫీసు కి పిలిపించుకొని "మూర్తీ, నీవు వ్రాసిన ఇంగ్లీష్ స్పీచ్‌ని చూశాను. బాగుంది. నీవు ఇంగ్లీష్ ఎం ఎ వ్రాయి. ఉద్యోగ భద్రత ఉంటుంది. కాలం వృథా చేయకు. నేను కాలేజీ నుండి వెళ్ళిపోతే నీ ఉద్యోగం ఉంటుందన్న నమ్మకం లేదు" అన్నారు. వారు చెప్పగానే ఇంగ్లీష్ బీయ్యే వ్రాసి

ప్యాసైనాను. ఎంఎ. ని నేరుగా వ్రాయవచ్చు. కానీ బీయ్యే చదివితే పూర్తి సాహిత్య నేపథ్యం తెలుస్తుంది అని చదివాను. ఆ రోజుల్లోనే డాక్టర్ ప్రమోద్ గణేశ్ లాల్యే గారితో, వారి మూలంగా శ్రీ కె ఆర్ సుబ్రహ్మణ్యంగారితో పరిచయం ఏర్పడింది. శ్రీ సుబ్రహ్మణ్యం గారు హింది ఆర్ట్స్ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్గా ఉండేవారు. హింది ఇంగ్లీష్ తమిళ భాషల్లో విద్వాంసులు. వారు నేను ఇంగ్లీష్ ఏం ఏ చదవడానికి చాలా సాహాయ్య సహకారాల్ని అందించారు. ఏం ఏ ఇంగ్లీష్ పరీక్ష ని మంచి మార్కులతో ప్యాసైన వెంటనే ఉస్మానియా యూనివర్సిటి ఇంగ్లీష్ డిపార్ట్ మెంట్ లో లెక్చరర్ గా ఉద్యోగం లభించింది. వరంగల్ లోని కళాశాలకి పంపించారు. అప్పటికే అక్కడ నా ప్రియ మిత్రుడు శ్రీ వేణుముద్దల నరసింహారెడ్డి తెలుగు లెక్చరర్ గా నియుక్తుడై ఉన్నాడు. ఆయన వద్దే బస ఏర్పాటైంది. ప్రొఫెసర్ బిరుదురాజు రామరాజు గారు తెలుగు ప్రొఫెసర్ గా, ప్రొఫెసర్ కైలాస వెంకటరామయ్య గారు స్పెషల్ ఆఫీసర్గా, ప్రొఫెసర్ సత్యనారాయణ్ సింగ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ గా పోస్టుగ్రాడ్యుయేట్ సెంటర్ లో ఉన్నారు. వీరందరూ నాపై అనురాగంతో ఉండేవారు. కొంతకాలం తరువాత నన్ను పి. జి. సెంటర్ ఇంగ్లీష్ డిపార్ట్మెంట్కి బదిలీ చేశారు. ప్రొఫెసర్ సత్యనారాయణ్ సింగ్ గారి పర్యవేక్షణలో ఇంగ్లీష్ సాహిత్యంలో ఎం.లిట్,పి.హెచ్డీ డిగ్రీలను పొందాను. 1976 లో పి.జి సెంటర్ని కాకతీయ యూనివర్శిటీ గా మార్చారు. ప్రొఫెసర్ వెంకట రామయ్య గారు మొదటి వైస్ చాన్సలర్ గా నియుక్తులైనారు. ఆ యూనివర్శిటీ లో నేను రీడర్ గా పదోన్నతిని పొందాను. జాఫర్ నిజామ్ గారు వి.సి.గా ఉండగా ప్రొఫెసర్ గా నియమింప బడినాను. ఆ సమయంలోనే సంస్కృత శాఖ కి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ గా ఉన్నాను. డీన్ గా పదవీ బాధ్యతల్ని నిర్వహించాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి మెరిటోరియస్ టీచర్ అవార్డ్ ని పొందాను.

మున్నాలాల్ సంస్కృత కళాశాలలో చదువుతూ ఉన్న కాలంలో ప్రముఖ విద్యాంసులతో పరిచయం కలిగింది. శ్రీ శాస్త్రుల విశ్వనాథ శర్మ గారి ప్రేమానురాగాలు దాతృత్వం వర్ణింప నలవి కానివి. అట్లాంటి మహానుభావులు లోకంలో అరుదుగా జన్మిస్తారు. అక్కడే శ్రీ రవ్వా శ్రీహరి, శ్రీ భాగవతం రామరావు

లతో దృఢమైన మైత్రీ బంధం ఏర్పడింది.

శ్రీ వేణుముద్దల నరసింహా రెడ్డి వరంగల్లులో 32వ యేట హఠాత్తుగా స్వర్గస్థుడు కావడం నాకు పెద్ద అఘాతమైంది. ఆయన జీవించి ఉంటే తెలుగు సాహిత్యంలో గొప్ప కవిగా కీర్తినందేవాడు. అప్పటికే ఆయన చేతనావర్తకవుల్లో లబ్ధ ప్రతిష్ఠుడు. శ్రీ రామారావు వలన మల్కాజిగిరీలో నివాసమున్న శ్రీ మల్లాది వీరరాఘవ సోమయాజులు గారి కుటుంబంతో పరిచయమైంది. శ్రీ సోమయాజులు గారు గొప్ప పండితులు, మహాతపస్వి. వారి నివాసం ఉపనిషత్తుల కాలం నాటి ఋష్యాశ్రమం లాగా ఉండేది. ఆ వాతావరణం మూలంగా నాకు వైదిక సాహిత్యంతో, వైదిక క్రతువులతో, సంప్రదాయంతో పరిచయం ఏర్పడింది.

మా నాయన గారి సాహిత్యపిపాస తనివిలేనిది. వారికి చందశ్శాస్త్రం పై మక్కువ ఎక్కువ. పద్య రచన వారికి ఆరో ప్రాణం. వారి వల్లే నాకు హైస్కూల్లో ఉండగానే సులక్షణ సారం, అప్పకవీయం వంటి ఛందో గ్రంథాలని చక్కగా చదివే అవకాశం ఏర్పడింది. ప్రతి దినం ఇంట్లో పద్య చర్చ ఉండేది. తాతగారు మాతో శ్రీ వాసుదాసస్వామి రామాయణాన్ని, ఆంధ్ర మహాభారతాన్ని, పోతన గారి భాగవతాన్ని చదివించేవారు. దానితో నాకు పద్యరచన పై ఆసక్తి కలిగింది. 7వ తరగతిలో ఉండగానే పద్యరచన చేశాను. కొన్ని పద్యాలను మా హైస్కూల్ మాగజీన్ లో ప్రచురించారు. నేను హైస్కూల్ లో ఉండగా నాకు గింజల నరసింహారెడ్డి, శ్రీ ఆసూరి మరింగంటి పురుషోత్తమాచార్యులు ఆప్తమిత్రులు. రెడ్డి గారికి పూర్వ ప్రబంధ పద్యాలు వందలకొలది కంఠస్థంగా ఉండేవి. స్వయంగా చక్కని పద్య రచన చేసేవారు. పద్యనిర్మాణాన్ని కూలంకషంగా పరిశీలించే నేర్పు, నిష్కర్షగా తన అభిప్రాయాన్ని చెప్పే చొరవా ఉండేవి. మా హైస్కూల్ లో గొప్ప ప్రతిభా వంతుడైన విద్యార్థి గా పేరు పొందినారు. స్వగ్రామం నకిరేకల్. అక్కడే హెడ్ మాస్టర్ గా రిటైరై విశ్రాంత జీవనం చేస్తున్నారు.

శ్రీ పురుషోత్తమాచార్యులు సుప్రసిద్ధ మరింగంటి కవి వంశానికి చెందినవారు. హైస్కూల్ లో శ్రీ రెడ్డి గారి వలెనే నాకు సీనియర్. వారి నాన్నగారు శ్రీమాన్

మరింగంటి వెంకట నరసింహాచార్యులు గారు గొప్ప ప్రబంధకవి. ఎన్నో కావ్యాలని వ్రాసారు. శ్రీ పురుషోత్త మాచార్యులు కూడా ఎంతో అందంగా పద్యాలని వ్రాసేవారు. ఇంగ్లీష్ లో ధారాళంగా మాటాడేవారు. నేను వారి ఇంటికి తరచుగా వెళ్ళే వాణ్ణి. ఇద్దరం ఆధునిక కవుల పద్యాలను చదివి చర్చించే వాళ్ళం. వారికి మంచి విశ్లేషణ శక్తి ఉండేది. ఆయన కొన్ని పద్య కావ్యాలను రచించి ప్రచురించారు.

వీరి ఇద్దరితో మైత్రి నాకు హైస్కూల్ లో పద్యరచనకు దోహదం చేసింది. సూర్యాపేట సంస్కృతికి నిలయం. ఆ రోజుల్లో త్యాగరాజోత్సవాలను (1950 నుండి 1956 వరకు) ఘనంగా నిర్వహించేవారు. కవులు, గాయకులు, నాట్య కోవిదులు, గొప్ప కళాకారులు రాష్ట్రం నలుమూలల నుండి ఎందరో విచ్చేసేవారు. కవి సమ్మేళనాలను నిర్వహించేవారు.

శ్రీ చిత్తూరు వి నాగయ్య గారు, శ్రీ స్థానం నరసింహారావు వంటి మహానుభావులు ఆ ఉత్సవాలలో ఆధ్యక్షం చేసేవారు. ఆ వాతావరణం నన్ను చాలా ప్రభావితం చేసింది. నేను పద్యరచన చేయడానికి వరంగల్ సాహిత్య వాతావరణం కూడా కారణం. మిత్ర మండలి సమావేశాల్లో పద్య రచనపై చర్చ ఎప్పుడూ ఉండేది. కాళోజీ సోదరులు, సంపత్కుమారాచార్యులు గారు సుప్రసన్నచార్యులు గారు, శ్రీ అనుముల కృష్ణమూర్తి గారి సాహచర్యం పద్య రచనకు ప్రోత్సాహకరంగా ఉండేది. శ్రీ వేణుముద్దల నరసింహారెడ్డి శ్రీ పెండ్యాల వరవరరావు స్ఫూర్తినీ చైతన్యాన్ని కలిగించేవారు. నేను వ్రాసిన ప్రతిపద్యాన్ని మిత్రుడు వే. నరసింహారెడ్డికి వినిపించేవాణ్ణి.

మాది శ్రీ వైష్ణవ సంప్రదాయం అయినందున సహజంగానే ఇంట్లో భక్తి పూర్ణమైన వాతావరణం ఉండేది. నేను నా పద్యాలన్నింటినీ భక్తిపరం గానే వ్రాసాను. శివపరంగా పద్యాలని మొదట వ్రాసినా విష్ణుపరమైన పద్యాలను "గోపికా వల్లభా" అనే పేరున పద్య శతాన్ని ప్రచురించినాను. శివ పరంగా వ్రాసిన పద్యాలన్నింటినీ కూర్చి "సమర్పణం" అనే పేరున ప్రచురించి శ్రీ నరసింహా రెడ్డి స్మృతికి అంకితమిచ్చాను. అంకిత పద్యాలిలా ఉన్నాయి.

ఇది కవిత్వము కాదుకానీ పవిత్ర
మైన యెదద నీకిచ్చుచున్నాను, నీవు
నా పరశ్శత దోష సంతతిని మరిచి
తోడునీడయినట్టి మిత్రుడవు రెడ్డి!

పాడి విన్పించితిని ప్రతిపద్యపంక్తి
నీవు బ్రతికిన నాళ్లలో, నీవు లేవు
పద్యములు లేవు పో వినువాడులేదు
నీకు విన్పించునా స్వర్గలోకమందు

అచ్చట వినబడుననియే
పిచ్చిది విశ్వాసమొకటి, విన్పింతునిదే
నెచ్చెలి నేనెది చేసిన
మెచ్చేడివాడవుకదా క్షమించి వినదగున్

'సమర్పణం' కావ్యంలో ఇంచుమించు నూటయేబై పద్యాలున్నాయి. కొన్ని శ్లోకాలున్నాయి. అన్నీ భక్తిరసప్రధానాలే. గోపీకావల్లభా పద్యశతం నుండి కొన్ని పద్యాలు

శ్రీ కల్పాకృతి సర్వధర్మ పదవీశృంగాగ్రమాముక్తమా
లాకైంకర్యవిముగ్ధచిత్తము, దయాప్రత్యక్ష కావేరి, బా
ధాకల్మాషతమోహర ప్రచురచైతన్యంబు, భూమావధి
ప్రాకారాంతరరంగరాజమెదకాపా, గోపికావల్లభా

చిరుతన్నన్నొడిజేర్చి సంస్కృత వచశ్రీ ప్రక్రియన్ నేర్పిసుం
దర కావ్య ప్రణవస్వభావమను సంధానించి తత్ సర్వమున్
హరికైంకర్యము సేయుమన్న పితృవాక్య స్ఫూర్తి నీ సన్నిధిన్
గరువున్బోసెద పద్యపంక్తి శ్రిత రక్షా గోపికా వల్లభా

కనుగొవే వ్రజసుందరీ మధుర శృంగార ప్రభూ నిత్యనూ
తన గీర్వాణపదప్రయోగ పటుతాతాదాత్మ్యమున్ మున్నునా
జనకుండిచ్చిన సంస్కృతాంధ్రకవితా స్వాధ్యాయమున్ దివ్యచిం
తన నీ పాద యుగీనమై వెలుగునందన్ గోపీకవల్లభా

శిఖిపింఛానిబిరీసనీలచికురశ్రీ కల్పితాషాఢ గో
ప కిశోరా నవనీత చోర యమునాప్రాంతమ్మునందాల మం
దకుతోడై వన వీధులన్నడుచుచున్ నన్ జూడవే నీ కృపా
వికసన్నేత్రములన్ సమాశ్రిత తపస్వీ గోపికావల్లభా

శ్రుతివల్లీ వికసద్వినీల కుసుమ స్తోమప్రభాభాసమా
న తనూమ్లానప్రసూన సాయకధనూ నందాంగనా ప్రేమపూ
రితదృగ్జాలనిబద్ధచాపల కృపా దృష్టిన్ విలోకింపవే,
మతి నీపాదయుగీనమై వెలుగు నింపన్ గోపికావల్లభా

పతితోద్ధారణ బద్ధకంకణ హరీ పల్లాండు, నందాంగనా
వ్రతదీక్షాఫల సంతతీ యదుపతీ పల్లాండు, గోపాలికా
వ్రతతీవేల్లితసుందరార్జునవనీ పల్లాండు, పల్లాండునీ
కితరాసాధ్యకృతిప్రమోదికి, యదుశ్రీ గోపికావల్లభా

నేను పద్యకవిత్వాన్నే వ్రాశాను. అట్లని నాకు ఆధునిక కవిత్వంపై తక్కువచూపేమి లేదు. అది ప్రతిభా సంపూర్ణంగా ఉంది. సంప్రదాయానుసారంగా విద్యాభ్యాసం చేసినందున చిన్నతనాన్నే పద్యరచన అలవాటై పోయింది. పద్య రచన తెలుగు భాషలో విస్తారంగా ఉంది. సహజమై పోయింది. తెలుగు దేశం నలుమూలలా పల్లెల్లో పట్టణాల్లో అత్యంత రమణీయంగా పద్యరచన చేయగలిగిన మహానుభావులెందరో ఉన్నారు. పద్యంలో అపారమైన వైవిధ్యం కూడా ఉంది. సంగీత పరిధిలో శాస్త్రీయ సంగీతం లలిత సంగీతం సమానంగా ఆదరింపబడు తున్నాయి కదా, అట్లాగే పద్య కవిత్వం, వచన కవిత్వం కలిసిమనవచ్చుననుకుంటాను. ఆధునిక మనస్తత్వం సామాజిక అవసరాలు వచనకవిత్వంలో విలక్షణంగా ప్రతిబింబస్తాయనడంలో సందేహం లేదు. పద్య కవిత్వ సౌందర్యాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం లేదు.

పటిష్ఠమైన పద్య రచనకి సంప్రదాయ భాషా సాహిత్యాల పరిచయం పర్యాప్తంగా ఉండాలి. భాషా సాహిత్య పరిజ్ఞానం వచనకవిత్వానికి అవసరం. అది లోపిస్తే, వచనకవిత నీరసమైపోతుంది. తెలుగు సాహిత్య అధ్యయనం సరిగా సాగకపోతే సమాజం సంప్రదాయనిధిని కోల్పోతుంది.

పద్య రచన ఒక శిల్పం వంటిది. వ్యర్థపదం ఒక్కటి కూడా పద్యరచనలో ఉండరాదు. శ్రుతిసుభగంగా ఉండాలి. ఆశు కవిత్వం పద్య శిల్పానికి ఉపకరించదు.

నా పద్య రచనపై విశ్వనాథ సత్యనారాయణగారి ముద్ర స్పష్టంగా కన్పిస్తుంది. వారి కవిత్వాన్ని చదువడం, అదృష్టవశాత్తు ఆ మహాకవితో పరిచయం కలుగడం మూలాన శ్రీ విశ్వనాథ ప్రభావం అనివార్యమైపోయింది. శ్రీ విశ్వనాథవారితోలాగే శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులవారితోనూ పరిచయం ఉండేది. వారి ప్రభావమూ నా పద్య రచనపై ఉంది. మేము ఉస్మానియా యునివర్సిటిలో చదివే రోజుల్లో, ఋషి తుల్యులు శ్రీ ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు తెలుగు శాఖకు హెడ్ గా ఉండేవారు. డాక్టర్ దివాకర్ల వేంకటావధాని గారు, డాక్టర్ రామరాజు గారు, శ్రీమాన్ శ్రీ చెలమచెర్ల రంగాచార్యులుగారు, డాక్టర్ పల్లా దుర్గాయ్యగారు, శ్రీ గరికపాటి లక్ష్మీకాంతయ్య గారు ఆ శాఖ లోనే ఉండేవారు. సంస్కృత శాఖకు డాక్టర్ ఆర్యేంద్ర శర్మ గారు హెడ్ గా ఉండేవారు. ఆయన యూరోపియన్ లాగా ఉండేవారు. జర్మని లో చదువుకొని డాక్టరేట్ ని పొందారు. నాకు ఖండేరావు దేశ్పాండే గారితో, శ్రీ భట్ గారితో సాన్నిహిత్యం ఉండేది. తెలుగు, మరాఠి, కన్నడం, సంస్కృతం శాఖలు ఒకే చోట ఉండేవి. మహామహులు వచ్చి ఉపన్యసించేవారు. అందరూ స్నేహంగా ఉండేవారు.

శ్రీ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి గారి కుంటుంబంతో సాన్నిహిత్యం ఉండేది. వారి కూతురు ప్రొఫెసర్ శ్రీమతి కొరిడే కమల గొప్ప విదుషి. ఆమె భర్త శ్రీ రఘుపతిరావు గారు సహృదయులు. వారితో కూడా సన్నిహితంగా ఉండేవాణ్ణి.

అల్ ఇండియా రేడియో హైదరాబాద్, వరంగల్ స్టేషన్ల నుండి దాదాపు వంద ప్రసంగ వ్యాసాలని ప్రసారం చేశాను. వరంగల్ స్టేషన్ నుండి ప్రసారమైన వ్యాసాలని "ఉపనిషత్తులు: ప్రాథమిక పరిచయం" "గీతాంజలి : ఒక కవితా తపస్సు" అని రెండు పుస్తకాలుగా ప్రచురించినాను. మొదటి పుస్తకాన్ని సుప్రసిద్ధ డాక్టర్, సనామధేయుడు ఆప్త మిత్రుడు ఐన డాక్టర్ రామక లక్ష్మణ మూర్తికి,

రెండవ పుస్తకాన్ని కమలా రఘుపతి రావు దంపతులకు అంకితం చేశాను. వివిధ పత్రికలలో వ్రాసిన వ్యాసాలని 'దేహళి' అనే పేరిట సంకలనాన్ని ప్రచురించినాను. సాహిత్య అకాడెమీ న్యూ డిల్లీ వారికి సురవరం ప్రతాపరెడ్డి గారిపై ఇంగ్లీష్‌లో మోనో గ్రాఫ్ని వ్రాసాను. వారు ప్రచురించారు. వారి కోరికమేరకే 'అవినాశి' అనే సంస్కృత నవలకు '*The Bride of Mahakala*' అనే పేరున ఇంగ్లీష్ అనువాదాన్ని చేశాను. దాన్ని వారు ప్రచురించవలసి ఉంది. సి.పి. బ్రౌన్ అకాడమీ వారికి సంప్రదాయ కీర్తనలని ఇంగ్లీష్ లోనికి అనువదించినాను. వారు ప్రచురించినారు. '*The Novels Of William Styron*' అనే పుస్తకాన్ని ఢిల్లీ ప్రేస్టేజ్ సంస్థ వారు ప్రచురించారు. సెంట్రల్ సాహిత్య అకాడమీ వారు, తెలుగులో నేను వ్రాసిన కావ్యకంఠ గణపతి శాస్త్రి అనే పేరిటి పుస్తకాన్ని ప్రచురించారు.

1983 లో '*Fulbright*' స్కాలర్‌గా అమెరికాలో '*Duke university, Misssouri University*' లను సందర్శించాను. నాగపూర్ యునివర్సిటి ఆహ్వానం పై బెర్నార్డ్ షా నాటకకళ పై ప్రొఫెసర్ రాయ్ ఎండోమెంట్ ఉపన్యాసాలని చేశాను. నాగపూర్, నాగార్జున యునివర్సిటిలలో '*U.G.C*'. ప్రొఫెసర్‌గా సేవలందించాను. లక్నో, అమరావతి, శ్రీ వేంకటేశ్వర, హైదరాబాద్ సెంట్రల్ యునివర్సిటి, ఆంధ్ర విశ్వవిద్యాలయం లలో ఎకడమిక్ స్టాఫ్ కాలేజీలలో రిసోర్స్ పర్సన్‌గా ఉపన్యాసాలు చేసినాను. సెంట్రల్ సాహిత్య అకాడెమీ నిర్వహించిన సెమినార్లలో, మైసూర్ ధ్వన్యాలోక సెమినార్లలో పాల్గొని పత్రసమర్పణ చేశాను. ఏబదికి పైగా ఇంగ్లీష్‌లో రీసెర్చ్ పేపర్లను ప్రచురించినాను. తెలుగు కవుల పద్యాలను, ఆధునిక కవుల వచన కవిత్వాన్ని ఇంగ్లీషు లోకి అనువదించినాను. అవి వివిధ పత్రికలలో ముద్రితమైనాయి.

'సమర్పణం' పద్య కృతికి కూడా మంచి స్పందన వచ్చింది. అద్దంకి సృజన సాహితీ సంస్థ వారు అద్దంకిలో సాహితీ సన్మానం చేశారు. సర్వ వైదిక సంస్థానం, కరీంనగరం వారు 'మధుర కవి' బిరుద ప్రదానం చేసారు. 'సత్సంప్రదాయ సభ' వరంగల్ వారు స్వర్ణ కంకణ బహూకరణం చేశారు. పి.యస్. తెలుగు యూనివర్సిటి వారు, గోపికావల్లభా పద్యశతానికి ధర్మనిధి పురస్కారాన్ని ఇచ్చి సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు, మెరిటోరియస్ యూనివర్సిటి టీచర్ అవార్డ్ ఇచ్చారు. శ్రీ తిరుమల ట్రస్ట్ వారు సన్మానించారు.

1969 ఫిబ్రవరీ నెలలో నా వివాహమైంది. ప్రొఫెసర్ రామరాజు గారు తమ బాల్యమిత్రుడైన తిరునగరి కృష్ణమాచార్యులు గారి కూతురు జయశ్రీతో వివాహ నిశ్చయం చేసినారు. మాకు ముగ్గురు సంతానం. పెద్దమ్మాయి శ్రీమతి ప్రతిమ ఫార్మసూటిక్స్ లో '*Ph.D*' పట్టం పొంది ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్‌గా ఉద్యోగం చేస్తున్నది. రెండవ అమ్మాయి శ్రీమతి ప్రతిభ అమెరికాలో '*U.N.C*' చాపెల్ హిల్‌లో ఉద్యోగినిగా ఉన్నది. అబ్బాయి శేషాద్రి అమెరికాలో సియాటిల్ నగరంలో మైక్రోసాఫ్ట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు.

భగవదనుగ్రహం వలన నాకు ఎందరో మహానుభావులు సాహాయ్యం చేసినారు. అవ్యాజమైన ప్రేమతో వివిధ విషయాలు బోధించినారు. నా చిన్నతనాన మా అమ్మతో పాటు మా దాది రామలక్ష్మమ్మ నన్ను ఎంతో ప్రేమతో పెంచింది. ఆమె నేను '*P.U.C*'. చదువుతూ ఉన్నరోజులో కాలం చేసింది. మా కుటుంబ శ్రేయస్సుకై మా తాతగారు, మా పెద్దన్నయ్య ఎంతో శ్రమపడ్డారు. వారు త్యాగధనులు. వారిని నా గోపికావల్లభా పద్య శతంలో స్మరించాను. మా చిన్నన్నయ్య శ్రీ రామచంద్రమూర్తి స్కూల్ హెడ్మాస్టర్‌గా రిటైర్ అయినారు. నా తమ్ముడు నరసింహాచార్యులు హైస్కూల్ తెలుగు పండితుడుగా రిటైర్ అయినాడు. మా అన్నదమ్ములలో చివరివాడు, '*Dr*'. శ్రీ రంగాచార్య పాలెం ఓరియెంటల్ కాలేజి ప్రిన్సిపల్‌గా రిటైర్ అయినాడు.

మా నాయనగారు వైకుంఠ ఏకాదశి పుణ్యవాసరాన అనాయసంగా పరమపదించినారు. మా అమ్మగారు మా నాయనగారికంటే కొన్ని సంవత్సరాలు ముందుగా కాలం చేసినారు. మా పెద్దన్నగారూ పరమపదించి నారు. నాకు గుర్తుకి వచ్చిన విషయాలను గూర్చి మనవి చేసినాను. నేనేదీ రికార్డ్ చేయలేదు. అందుకే ఇదంతా ఒక క్రమంలో లేదు. నా జీవితాన్ని గూర్చి వ్రాయడం ఇదే ప్రథమం.

'పరిణతవాణి' ప్రసంగం చేయడానికి నాకున్న అర్హత. నాకు 65 యేళ్లకు పైబడి వయస్సు ఉండడమే. ఈ అవకాశాన్ని కల్పించిన జ్ఞాన పీఠ పురస్కృతులు డాక్టర్ సి. నారాయణరెడ్డి గారికి నమస్కారపూర్వక ధన్యవాదాలనర్పిస్తున్నాను.

❖ ❖ ❖



ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

1. సాహసాల జీవితం

హెచ్చెస్సీ పూర్తయింతర్వాత రెండున్నర సం.లు వ్యవసాయం చేశాను. 1963 మే నుండి 1965 జూన్ వరకు వ్యవసాయంలోనే ఉన్నాను.

ఓ రోజు రాత్రి ఓ యింటి మీదికి దొంగలు వచ్చారు. మేం మా కక్కమ్మ ఇంటి దగ్గర కొందరం ఉన్నాం. దొంగలెందరో అనుకొన్నాం. సీటీల మీద సీటీలు విన్నాం. నేను పరుగెత్తాను. తీరా చూస్తే ఒక్కడే. అతణ్ణి పట్టిచ్చాను.

ఊళ్ళోకి పెద్దపులి వస్తుందని తెలిసింది. ఊరు చుట్టూ కావలి కాశాం. వ్యవసాయ క్షేత్రంలో ఓ గోడ పై నుండి దుమికాను. సరిగా పాము మీద కాలు పడింది; దానికి దొరక్కుండా రెండు మైళ్ళు పరుగెత్తాను.

మోట కొడుతుండగా మధ్యరాత్రి తొండెం తాడుతెగి బొక్కెన బావిలో పడింది. అప్పటికప్పుడే నీళ్లల్లో మునిగి బొక్కెనకు తాడు కట్టి వచ్చాను. అందరం కలిసి బొక్కెనను బయటకి లాగాం.

బండి గట్టుకొని తిరుమలాయ గట్టుకు కట్టెలకు వెడుతున్నాం. బండి ఒక గిల్ల (చక్రం) పెద్ద గడ్డ మీదికెక్కింది. బండిలో నుండి దూకేసి తప్పించుకొన్నాను.

చింతబావిలో స్నానం చేస్తుంటే, ఓ పిల్లాడు మునిగి పోవడం చూశాను. లోనికి మునిగి రెట్టవట్టి లాక్కొచ్చాను.

వ్యవసాయ క్షేత్రంలో పనికి దిగక ముందు చిన్ననాడే అంటే 5 నుండి 11వ తరగతి చదివే కాలంలో, ఊయల మీద నుండి పడడం, పరుగెత్తి గోడకు గుద్దుకొని నొసట బర్ర (దెబ్బ గుర్తు) ఏర్పరచుకోవడం, కాల్చిన బీర తీగతో కుడి చెంపకు కుచ్చుకోవడం, గుర్రబ్బాలెక్కి కింద పడడం, బట్టెల కాడికి వెళ్ళి పిల్లలందరితో కలిసి చిట్టిగెన, కబడ్డి లాడడం, దెబ్బలు తాకించుకోవడం సహజంగా జరిగి పోయేవి. భజనల్లో పాల్గొనడం, అడుగుల భజన, కోలాటం, చిరుతల భజన నేర్చుకోవడం అన్నిట్లోనూ “సాహసం సేయరా డింభకా!” అన్న నీతిని పాటించడం, అన్నీ అలవోకగా జరిగిపోవడం, అన్నిట్లో తలదూర్చి ఎంతో కొంత తెలుసుకోవడం జిజ్ఞాసే అనుకొంటాను.

కేవలం వ్యవసాయంలో ఉన్నప్పుడే గాక పాలమూరు జిల్లాలోని మాడ్గుల జిల్లాపరిషదున్నత పాఠశాలలో ఆరు సంవత్సరాలు తెలుగు పండిట్‌గా పని చేసేప్పుడు కూడా కొన్ని సాహసాలు చేయవలసి వచ్చింది. విద్యార్థులకు స్కౌటు శిక్షణ ఇవ్వడం, సేవా కార్యక్రమాలలో పాల్గొనేట్టు చేయడం, ఆటల పోటీలకు సంసిద్ధం చేయడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, సభలూ – సమ్మేళనాలు ఏర్పాటు చేయడం ఇలా ఎన్నో పనుల్లో తలమున్కలయ్యేవాణ్ణి. ఒక వార్షికోత్సవ సందర్భంగా అచ్చం కాంగ్రేసు వాళ్ళనే పిలిచారని, పెద్ద మాడ్గుల నుండి మణిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాత్రి 7 గం. ప్రాంతంలో దాడిచేశారు. మా అధ్యాపకుల్లో విశ్వనాథం గారి మూతి పళ్లు విరిగి పోయాయి. 80 సం ॥ ల మా తాత చిన సీతారెడ్డి చేయి విరిగింది. ఒక అమ్మాయి ఎద మీద రాయి పడింది. నేను కొందరిని ఎదుర్కొన్నాను. దాదాపు 30 మంది స్త్రీలను ఊళ్లోకి పంపించాను. ఓ చైర్మెను, ఓ పంచాయతీ సమితి ప్రెసిడెంటు, ఓ ఎమ్మెల్యే, ఓ యువ కాంగ్రేసు నాయకుడు గుట్ట వైపు నడిచి దాక్కొన్నారు. విధ్వంసం చేసిన వారందరు పారిపోయారు. స్కౌటు మాస్టారుగా రక్షణ విభాగం నాది. నాపాత్ర నేను పోషించాను. ఈ ఉద్యోగ కాలంలో కొన్ని నెలలు రోజూ రానూ పోను 12 కి.మీ నడిచాను.

ఆ తర్వాత 1973 సెప్టెంబర్ 1వ తేదీ నుండి 1985 మార్చి 18 వ తేదీ వరకు దాదాపు 12 సం.లు కామారెడ్డి డిగ్రీ కళాశాలలో పని చేశాను. ఇక్కడ ఒక

వర్ణాంతర వివాహంలో సాక్షిగా ఉన్నాను. ఒకరు పరీక్షను పెట్టగా శ్మశానంలో దయ్యాలు లేవని నిరూపించాను. 1975లో దివిసీమ తుఫానుకు బట్టలు, ఇతర సామగ్రి సేకరించి ఆర్ ఎస్ ఎస్ వారి సేవా సమితికి పంపించాను. సెలవుల్లో వెళ్లి, నిర్మిస్తున్న దీనదయాళ్‌పురం చూచి వచ్చాను. ఆరెస్సెస్ వారి రక్షాబంధన్ ఉత్సవాల్లో ఒకేరోజు 12 గ్రామాల్లో ప్రసంగించాను.

ఇందూరు (నిజామాబాద్) జిల్లాలోని ఓ వంద గ్రామాల్లో చైత్ర, గణపతి, శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రసంగించాను. రాష్ట్రీయ స్వయం సేవక సంఘంలో విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఆదిలాబాదు, మెదక్, ఇందూరు జిల్లాల్లో అనేక పర్యటనలు చేశాను. సంఘ శాఖలకు వెళ్లాను. ఒకరిద్దరు ప్రచారకులూ నావల్ల జీవితాలు సమర్పించి సంఘ సేవకు వెళ్లారు. మూడు నాల్గు ప్రాథమిక శిక్షణ వర్గలు కామారెడ్డిలో స్నేహితుల సహకారంతో నిర్వహించాను. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా సత్యాగ్రహం నిర్వహించడానికి కొన్ని దళాలనూ సంసిద్ధం చేశాను.

కాశ్మీరు షేక్ అబ్దుల్లాకు వ్యతిరేకంగా విద్యార్థులు సత్యాగ్రహం చేశారు. ఆ రోజు నేను కామారెడ్డిలో లేను. ఆర్మూరులో ఉన్నాను. రాత్రికి వచ్చాను. అయినా ఆ సత్యాగ్రహం వెనుక నేనున్నానని అరెస్టు చేశారు. మూడు రోజులు రిమాండులో ఉన్నాను. నా అరెస్టుకు నిరసనగా జిల్లాలోని అనేక విద్యా సంస్థలలో బంద్ చేశారు.

వీటన్నిటికన్నా ముందు పాలెం ప్రాచ్య కళాశాలలో 1965 – 67 మధ్యలో చదివేప్పుడు, తోటి విద్యార్థులతో కలిసి పాలెం నుండి పాలమూరు వరుకు నడిచాను. అధ్యాపకులతో కలిసి వడ్డెమాను వరకు నడిచి శాసనాలు అధ్యయనం చేశాను. తోటి విద్యార్థులతో కలిసి పాలెం చెరువునీదాను. గిరి, రుక్కు, బి.వెంకట్, అనంతరాములుతో కలిసి కాలినడకన శ్రీశైలం వెళ్లి, సాహసాలెన్నో చేశాం. ఒకబావిలో కోడి పడితే జర్రున జారి, చేతులు రక్తసిక్తం కాగా బ్రతికించాను. దేవాలయం వెనుక తోటలో ఓ అల్లుడు, మామను కొడుతుంటే అడ్డుకొని బుద్ధి చెప్పాను. మురలీధర్ అనే మార్క్సిస్టు మిత్రుడు నేనున్న హాస్టల్ గది మీద దాడి చేసినప్పుడు గట్టిగా ఎదిరించి బుద్ధి చెప్పాను. నాగర్ కర్నూలు నుంచి రాత్రి వేళ

పాలెం నడిచి వస్తున్నప్పుడు, దొంగలు దాడిచేసి దోచుకోగా ఎదిరించి దెబ్బలు తిన్నాను.

ఇక 1985 మార్చి నుండి 2006 ఆగస్టు వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పని చేసి, లెక్చరర్‌గా, రీడర్‌గా, ప్రొఫెసర్‌గా, శాఖాధిపతిగా, పాఠ్య ప్రణాళిక సంఘ అధ్యక్షునిగా పని చేసినప్పుడు, పాఠ్యబోధనేతర సేవా కార్యక్రమాలెన్నిటిలోనో పాల్గొన్నాను. ఈ ఇరవై రెండు సం.ల కాలంలోనూ సాహసాలున్నాయి.

చిన్నతనంలో గ్రామజీవనం, వ్యవసాయాధారిత కుటుంబ జీవనం, మా నాన్నగారి ధైర్యసాహసాలు జీవితంలో సాహసిగా నిలిచేట్టు చేశాయి. ఉస్మానియా యూనివర్సిటీలోని తెలుగు శాఖలో ఉద్యోగం రావడానికి కూడా సాహసమే కారణం. యూనివర్సిటీ మీద కేసు వేసి గెలిచి సాధించుకొన్న ఉద్యోగమిది.

విశ్వవిద్యాలయ ఉద్యోగంలో ఉంటూనే విశ్వహిందు, గీతా జ్ఞానయోగ సమాచార్, శివానంద భారతి, పుష్పగిరి భారతి అనే నాలుగు పత్రికలకు సంపాదక బాధ్యతలు నిర్వహించడం కూడా నా దృష్టిలో సాహసమే. ఈ నాలుగే కాకుండా ఆగిపోయిన సాధనకూ రెండేళ్లూ సంపాదకునిగా ఉన్నాను. కొన్నాళ్ళు నడచిన ధర్మసారథి పత్రికకు సంపాదకునిగా ఉండి నిర్వహించడం కూడా సాహసంగానే భావిస్తున్నాను.

సాహస ధైర్యాలు స్థిరపడి ఎన్నో మలుపులు ఈ జీవితం తిరగడానికి కారణం మా నాన్నగారు, మా ఇంటి వాతావరణం, మా ఊరి వాతావరణం, మా మేనమామల ఊరి పరిస్థితులు కారణమనుకొంటాను నేను. మరి మా ఊరేది! ఆ కథా కమామిషేమిటి? క్లుప్తంగా ఓ పది మాటల్లో.......

2. మాఊరు - మాభాగ్యం

పాలమూరు జిల్లా ఆమనగల్లు మండలం లోని పోలెపల్లె మాఊరు. మాపూర్వికులే ముగ్గు పోసి కట్టించారంటారు. చుట్టూ గుట్టలూ, రాళ్లూ -- రప్పలు,

జమ్మి 'రేగు' చంద్ర చెట్లు ఉన్న కారణంగా అది పోలేని పల్లె అయింది. 'ని' తొలగిపోయి పోలెపల్లె అయింది. థగ్గులు, పిండారీల్లాంటి వారు ఆ దారిన పోతుంటే మాపూర్వికులు వాళ్ల నెదిరించారని, వారి దగ్గర దోచుకొని తెచ్చింది, తమ కోటలో పెట్టారని, వీరిని కూడా దొంగలుగా భావించి, ఈ ఊరును దొంగల పోలెపల్లి అన్నారని పెద్దలు చెబుతారు.

కోల్లగట్టు – దుబ్బగట్ల మధ్య మా ఊరుంటుంది. చెట్టూ చేమలు ఎక్కువగా ఉండి ఒకప్పుడు కీకారణ్యంలా ఉండేది. అందువల్లనే దొంగలు మాఊరికి రాలేక పోయేవారు. దొంగలు పోలేని పల్లి చివరకు దొంగల పోలెపల్లి అయింది.

మా పూర్వికులు కట్టిన ఊరు పాటిగడ్డ అయింది. ఊరున్న చోట కోట ఉండేది. కోట నాలుగు బురుజులుండేవి. ఇప్పుడవన్ని కూలిపోయాయి. కోటలో ఓ బావి ఉండేదట! అదీ ఇప్పుడు కనిపించదు. పెద్దలు ఫలానా చోట ఉందంటారు. అక్కడ త్రవ్వితే నిధులుండొచ్చంటారు. చివరకు ఊరు తూర్పున కట్టుకొన్నారు.

మాకు 108 ఎకరాల భూమి ఉండేది. ఇందులో బీడు పొలమెక్కువ. నాన్న ఒకరిద్దరికి జీతమిచ్చి వ్యవసాయం చేసేవారు. తాను గుంటుక కొట్టేవారు, పొలం దున్నేవారు. చెల్లెంద్ర పెళ్ళిళ్ళ సందర్భంలో 30 ఎకరాలు అమ్మాం. మిగిలింది 88 ఎకరాలు. మేం ఆరుగురం అన్నదమ్ములం, ఇద్దరు చెల్లెంద్రు ఎవరికి వారు బతుకుతున్నాం!

నాన్నగారు కసిరెడ్డి మేఘారెడ్డి. అమ్మలు నర్సమ్మ, శాంతమ్మ, ద్రౌపదమ్మ. నాన్నగారు పుత్రకామేష్టి చేశారు. మేమందరం ద్రౌపదమ్మ పిల్లలం. నేను పెద్ద, తమ్ముడు మోహన్‌రెడ్డి మిలిటరీలో పనిచేసి రిటైరయ్యాడు. తర్వాతి తమ్ముడు పర్వతరెడ్డి, వ్యవసాయంలో ఉన్నాడు. దీపావళి పర్వదినాన కరెంట్ షాకుతో చనిపోయాడు. ఆ తర్వాత తమ్ముడు భాస్కర్‌రెడ్డి సమాజసేవలో రాజకీయాల్లో ఉన్నాడు. ఆ తర్వాత తమ్ముడు పద్మారెడ్డి హైదరాబాదు పరిసరాల్లో స్కూటర్ ప్రమాదంలో చనిపోయాడు. చివరి తమ్ముడు సురేంద్ర రెడ్డి వ్యాపార – వ్యవసాయల్లో ఉన్నాడు. చెల్లంద్రు నర్సమ్మ, విజయ లక్ష్మి వారి వారి కుటుంబాలతో దివ్యంగా ఉన్నారు.

నా భార్య కస్తూరి, 1969 లో నా జీవితంలో ప్రవేశించింది. 2001 మార్చిలో ఈ లోకం నుండి నిష్క్రమించింది. ఇద్దరు కూతుళ్లు మధుమతి, ఇందుమతి. వారి వివాహాలయ్యాయి. అబ్బాయి శ్రీనాథ్. వాడి వివాహమయింది. అందరూ స్థిమితంగా ఉన్నారు.

3. నాన్నగారి ప్రభావం – వ్యావసాయిక జీవనం – జానపదంలో....

నాన్నగారికి మేము కానక కన్న సంతానం. మా తమ్ముని పుట్టుకలో మా పెద్దమ్మ (నర్సమ్మ) చనిపోయింది. ఇద్దరమ్మలూ మాకు దేవతలే. నాన్నగారైతే మమ్మల్ని ఎత్తుకొని తిప్పేవాడు. అన్నీ చెప్పలేం గానీ ఆయన పద్యాలూ – పాటలే నాకు సాహిత్యంపై అభిరుచి పెంచాయి.

చిన్నప్పుడు వారి ఒళ్లో కూచొని ఎన్నో పద్యాలు, పాటలు నేను విన్నాను. అవి అలాగే నోట పట్టాయి.

1. చిన్న చెంబు తోటి శీకాయ ఉదకంబు....
2. రామ రామయన్న రారాదు పాపంబు....
3. తేరా పలకా బలపము....
4. ఇందున్న జానకి ఏదోయి తమ్ముడా....
5. శ్రీ రాముని దయచేతను....
6. మాసరి వాడవా మా పాప గొనిపోవ....
7. ఎంత దయో దాసులపై....
8. తల్లీ ! నిన్ను దలంచి పుస్తకము....
9. శ్రీ రఘు రామ ! చారు తులసీదళ రామ...
10. వినవయ్య నరనాధ ! మునినాధుడింద్రునకు....
11. ఖగనాధుండమరేంద్రు గెల్చి....

ఇవిగాక వారు రాకమచర్ల వేంకటదాసు కీర్తనలు గొంతెత్తి పాడేవారు. అవి నోటవట్టలేదు గాని, నేను అయిదారేళ్ల లోపే ఇవన్నీ విన్నాను. నాన్నగారికి భాగవతంలోని రుక్మిణీ కల్యాణం, నారాయణ కవచం నోటికి వచ్చేవి. వారి చివరి

దశలో మొల్ల రామాయణం చాలాసార్లు పారాయణం చేశారు. నేను తెలుగు పండిట్‌గా అప్పటికే చేరాను, 1రూపాయి ప్రబంధాల్లో ఇదీ అచ్చు వేశారు. ఈ ఒక్క పుస్తకమే వారికి నేనిచ్చింది.

ఒకటి రెండు పర్యాయాలు మా వ్యవసాయ క్షేత్రం దగ్గర, పాడి పశువుల కొట్టాల దగ్గర ఒకరిద్దరు ఊరివాళ్లతో నాన్నగారు గొడవ పడ్డారు. ఆసందర్భంలో మేం పిల్లలం,... ఏడిచాం.

ప్రాణం పోయినా సరే కళ్లలో నీళ్లు తేవద్దు. కొన్న ఇల్లు, ఉన్న ఊరు విడిచి పోవద్దు. బతుకైనా చావైనా ఇక్కడే. భూమిని అమ్ముకొన్నోడు తల్లిని అమ్ముకొన్నట్లే! చచ్చినా సరే శత్రువుకు వెన్ను చూపొద్దు! కోపం వస్తే వీపున గొట్టు గానీ కడుపు మీద కొట్టకు.

ఈ మాటలు మరిచిపోలేం! అవి వెంటాడుతూనే ఉన్నాయి. మా దొడ్డిలో మానాన్నగారు వేయించిన కొట్టంలో కొన్నాళ్లు మేం అ ఆ లు దిద్దుకొన్నాం. ఆ తర్వాత చావడిలో తుర్క పంతులు పాఠాలు చెప్పారు. నాన్నగారి పద్యాలు, ఇంటి దగ్గర ఆయన దిద్దపెట్టించిన అక్షరాలు తప్ప ఆ పంతులు గారి దగ్గర పెద్దగా నేర్చుకొన్న దేమీ లేదు.

ఆ కారణంగానే 4 సం.లు మేనమామగారి ఊరు మాడ్గులలో నేనూ మా తమ్ముడు 5వ తరగతి వరకు చదువుకొన్నాం. 1957లో 6వ తరగతి నుండి 1963 వరకు అంటే 11వ తరగతి వరకు కల్వకుర్తిలో చదువుకొన్నాను. 1963 నుండి 65 వరకు వ్యవసాయం. 65-66, 66-67 సం.లలో పాలెం ప్రాచ్య కళాశాలలో చదువూ, అదీ డిప్.ఓ.ఎల్ వరకే.

ఈ చదువుల మధ్యలో వ్యవసాయం మీద దృష్టి ఉంది. ఊరిలోని ఆటపాటల మీద దృష్టి ఉంది. ప్రాచ్య కళాశాలలో డిప్.ఓ.ఎల్లో యూనివర్శిటీ ఫస్ట్‌ర్యాంక్ వచ్చింది. మాడ్గులలో జూనియర్ తెలుగు పండిట్‌గా మూడేళ్లు, ఆ తర్వాత సీనియర్ తెలుగు పండిట్‌గా మూడేళ్లు చేసి 1973 ఆగస్టు 31న ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి కామారెడ్డి డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా చేరాను. అక్కడ 12 సం.లు, ఆ

తర్వాత హైదరాబాదు ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు శాఖలో 22 సం.లు పని చేశాను. ఈ మధ్య కాలంలో ఊరితో బంధాలు తెగి పోయాయి. పాత జ్ఞాపకాలే మిగిలాయి. పుట్టుకలు, చావులు, పెళ్లి పేరాంటాలకు తప్ప ఊరితో దినవారి సంబంధ బాంధవ్యాలు తెగిపోయాయి. అయితే వ్యవసాయ జీవితంలోని జానపదాల్ని మరచిపోలేను.

మమ్మల్ని కన్నతల్లి ద్రౌపదమ్మ అయినా, పెంచిన తల్లి మాత్రం శాంతమ్మే. ఆమె మమ్మల్ని ఒళ్లో కూచోపెట్టుకొని తారంగం తారంగం, తాండవ కృష్ణా తారంగమ్, జయ జయరాం జానకిరాం, వంటివి పాడేది. చంకలో ఎత్తుకొని దాయె దాయె చందమామ/ గోలకొండకోదాం / గొఱ్ఱెను దెత్తాం.... వంటి పాటలు పాడేది. పుట్టుక, పురుడు, ఉయ్యాలలో వేసే (తొట్టెలలో వేసే) బాలసారే మొదలైన సందర్భాలలో ఆయమ్మ – ఈయమ్మ వచ్చి పాడేవారు. ఇందులో హారతుల వంటివి ఉండేవి.

ఇక కార్తిక మాసమంతా ఊర్లో పండుగే. ఒక్కొక్క ఇంట్లో ఒక్కొక్క రోజు రాత్రి 7 గం. నుండి 10 గం. వరకు భజనలు జరిగేవి. ఈ భజనల్లో రాకమచర్ల కీర్తనలు ప్రాధాన్యం వహించేవి.

1. గురు మహారాజ – గురు మహారాజ / పరబ్రహ్మ సద్గురు మహారాజ....
2. ఎక్కడి సంసార మెడబాయ జాలదు ! రామచంద్రా...
3. ఏకాంత సమయమురా – మనకిదే మంచిదై యున్నదిరా....
4. నీ కన్న ఘనులెవ్వరయ్యా! అట్ల గాకున్న నను బ్రోవవయ్యా....
5. రారా! నందకుమారా – నా – కోరిన కోరిక దీరా....
6. పూల వసంతములాడుదమా – గోపాలుని లీలలు పాడుదమా....
7. అన్నన్న యిదియేమి చిత్రము – నన్నాదరించ వెంత మాత్రము....

ఈ విధంగా ఎన్నో భజన కీర్తనలు పదవ తరగతి పూర్తి కాక పూర్వమే వినడం పాడడం జరిగింది. అన్ని కీర్తనలు నోటవట్టకున్నా, కొన్ని పల్లవులు అలా గుర్తున్నాయి.

ఇక ఆయా పండుగల సందర్భంలో దేవుని గుడి ముందుగానీ, ఎవరి ఇంటి ముందైనా గానీ భజనలు సాగేవి. చిరుతల రామాయణం ప్రదర్శించేవారు. యక్షగానాలు వేసేవారు. ఇందులో ఏ పాత్ర వేయకున్నా ఆ పాటల బాణీలు కొన్ని గుర్తున్నవి. ఓ సందర్భంలో పదవ తరగతి చదివే వాళ్లం, ఊళ్లోని యువకులం కలిసి చిరుతల రామాయణం వేయాలని రెండు మూడు రోజులు అభ్యాసం చేశాం. కాని ఆ తర్వాత కొనసాగించలేకపోయాం.

కాముని పాటలు, బతుకమ్మ పాటలు, దసరా మహర్నవమి కోలలు, దీపావళి పాటలు, సంక్రాంతి పాటలు, పీర్ల పండుగ ఆటపాటలు, విత్తనం తతి పాటలు, వనాలకు వెళ్లే పాటలు.... ఇలా ఎన్నో వినే – పాడే అవకాశం కలిగింది.

ఇక వ్యవసాయం చేసేప్పుడు బండి పాటలు, కలుపు పాటలు, నాట్ల పాటలు, కోత పాటలు, నాగలి పాటలు, మోట పాటలు వినే అవకాశం కలిగింది. మోటగొట్టేప్పుడు పక్క మోటల వాళ్లతో కలిసి గొంతెత్తి పాడిన సందర్భాలెన్నో ఉన్నాయి. ఒకటి రెండు మాత్రం ఉదాహరిస్తాను.

"మోటా గొట్టే సిన్నవాడా!
మోటా సుక్కా పొడిసే లేరా!
వాటాఁవైనా అల్లీబిల్లీ – సో రా వాడా!
పాటూ దప్పే కాలా మొచ్చే."

"దుబ్బా గట్టూ పడమాటంగా
దుడ్డే లురుకూతున్నయి కోడుకో!
దుడుక దుడుకా కూడూ కొంటే – సో రా వాడా!
దుమ్ము లేసి పోతది కొడుకో...."

ఆనాడు తెలువదు గానీ, ఆనంద వర్ధనుని ధ్వని సిద్ధాంతానికి అనుగుణమైన మోట పాటలెన్నో ఉన్నాయి. ఇక ఆటల్లో చిఙ్గెన ఆడేప్పుడు ఏకీపాం, సాతీ పేడ్, ముఙ్గామూడ్, నల్లంగొండ, హైదర్‌కోట్, ఆరెగన్ను, ఎలంగ చిక్ వంటి కొలతలు

తెలిశాయి. జాడుబందర్, మారుంపిట్, ముక్కు గిచ్చులాట, వెన్నెల కుప్పలు మొదలైన ఆటల్లో లయాత్మక పదాలుంటాయని తెలిసింది. ఇక వరి కట్టలు తొక్కించడానికి ఎద్దుల బంతులు గట్టి కొట్టేప్పుడు, చేను మంచె మీద పిట్టలు గొట్టేప్పుడు పాడేవి, ఆడి పాడేవి ఎన్నో అనుభవంలోకి వచ్చాయి. తదనంతర కాలంలో జానపదాల మీద పరిశోధన చేయడానికి ఈ అనుభవాలన్నీ మూల భిత్తికలుగా నిలిచాయి.

నిజానికి నేను తెలుగు పొడుపు కథల మీద పరిశోధన చేయాలను కోలేదు. కాని ఎందుకు పొడుపు కథలు సేకరించానో తెలియదు. హెచ్చెస్సి తర్వాత పల్లీయుల ఆట పాటలు కొన్ని సేకరించినట్లే, తెలుగు పండితునిగా ఉన్న కాలంలోనే ఆరేడు వందల పొడుపు కథలు సేకరించి పెట్టుకోవడం జరిగింది. పరిశోధనకు అవకాశం వచ్చిం తర్వాత వేల కొలది తట్లు (పొడుపు కథలు) సేకరించాను.

ఇలా ఊరు, ఊరి సౌరు, ఊరి పైరు, ఊరి ఆటపాటలు జీవితంలో పెనవేసుకొని పోయాయి. కాని వ్యవసాయం వల్ల వచ్చిన కష్టాల కారణంగా ఇవన్నీ వదలు కోవలసి వచ్చింది. తెలుగు పండితునిగా విద్యారంగంలో ప్రవేశించ వలసి వచ్చింది.

4. మతి కొన్ని ప్రభావాలు

బాగా మనస్సు వికసించేట్టు చేసినవి నవలలు. కలువకుర్తి ఉన్నత పాఠశాలలో చదివే కాలంలోనే మిత్రుడు యాదగిరి వాళ్ల ఊరు ఎల్లమ్మ రంగాపురం వెళ్లేవాణ్ణి. అతనూ వాళ్ల ఊళ్లోని గ్రంథాలయం పుస్తకాలు తెచ్చేవాడు. ఈ గ్రంధాలయంలోని నవలలెన్నో 9,10,11 తరగతులలో చదివాను. కలువకుర్తి గ్రంధాలయంలోని నవలలూ చదివాను. ఇందులో సైంటిఫిక్ , మిస్టరీ, సెక్స్, థ్రిల్లింగ్ భావజాలంతో ఉన్నవెన్నో ఉన్నాయి. సంపుటాల కొద్దిగా ఉన్న జగజ్జాణ, మాయామయి వంటి ఐంద్ర జాలిక ఉద్విగ్న భావోత్తేజిత నవలల్ని ఇప్పుడే చదివాను. పురాణం పిచ్చయ్య శాస్త్రి సహస్ర శిరశ్ఛేద అపూర్వ చింతామణి, కావ్వలి వేయి శిరస్సులు ఖండించిన అపూర్వ చింతామణి, భట్టి విక్రమార్క కథలూ, కాశీమజిలీ కథలు చదివిన కాలమిదే. కొవ్వలి నవలలు మోతాదు మించి చదివినట్లు గుర్తు.

నేనివన్నీ చదువుతుంటే గ్రంథాలయం వారు నన్ను చూచినప్పుడల్ల కవిగారు అని నవ్వుతుండేవారు. తెలుగు అధ్యాపకులు డా. ముకురాల రామారెడ్డి, శ్రీ పణతుల రామచంద్రయ్య, శ్రీ యజ్ఞరామయ్య, హిందీ అధ్యాపకులు శ్రీ బుచ్చయ్య, శ్రీ చిన్నయ్య తదితరుల ప్రభావం గట్టిగానే పడిందనే చెప్పాలి. అప్పుడే డా.ముకురాల వారి ఈ క్రింది పద్యాలు నోటికి వచ్చినై.

మూతిమీసముండి ముష్టెత్తు కొనలేద
పేడియయ్యు లక్ష్మి గూడలేద
మీసముండినంత రోసాలు సాగునా!
పుట్ట గోచిలింగ పూలరంగ !
రామ రామ యన్న రాదా కడుపు నొప్పి
వామ వామ యనుచు వామదినక
మందు లేక పుండు మాటల మానునా!
పుట్టగోచిలింగ పూలరంగ!

నేను బ్రిటిషు చరిత్ర 9, 10, 11 తరగతుల్లో ఐచ్ఛికంగా చదవడం నాకు బాగా ఉపకరించింది. డా. ముకురాల వారు కొన్నాళ్లీ విషయం బోధించారు. త్రైమాసిక – షాణ్మాసిక పరీక్షల్లో మార్కులు బాగా వచ్చాయి. ఆ విషయంలో. ప్రత్యేకంగా వారింట్లో కూచొని కొన్ని పత్రాలు చదివాను. మానాన్నగారు కూడా ముకురాల రామారెడ్డి గారిలాగా పేరు తెచ్చుకోవాల్రా అనేవారు.

ఆ తర్వాత వ్యవసాయం చేసేప్పుడు వారానికోసారి ఆమనగల్లుకు వెళ్లి గ్రంథాలయంలోని పుస్తకాలు తెచ్చుకొనేవాణ్ణి. ఇటు వ్యవసాయం, అటు గ్రంథ పఠనం, జానపదుల పండుగ పాటలు వినడం.

నాకేదో వ్రాయాలనిపించింది. అప్పటికే పిచ్చిగా నవలలు చదివిన ప్రభావముంది. ఇంట్లో దీపం మసితో మాడ్చిన బియ్యంతో తయారు చేసుకొన్న సిరాతో ఈ రెండున్నరేళ్ల వ్యవసాయ జీవనంలో 22 కథలు వ్రాశాను. కథలంటే ఇవి. ఎక్సర్‌సైజు నోటుబుక్ సైజులో ఒక్కొక్కటి 50 నుండి 60 పుటల మధ్యలో

ఉండేవి. కొన్ని చిన్న కథలూ వ్రాశాను. వీటన్నిటి మీద అపరాధ పరిశోధక నవలల ప్రభావముంది. చిన్న కథలకు ఊళ్లల్లో పట్వారీలు, పోలీసు పటేళ్లు చేసే భ్రష్టాచారాలు ఇతివృత్తాలుగా నిలిచాయి. అయితే వీటికో శైలి లేదు, భాష లేదు. ఊహాపోహలతో కొన్ని, వాస్తవోద్వేగాలతో కొన్ని నిర్మితమయినై. 1985 లో నేను ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో జాయినైన తర్వాత, నేనూ నా శ్రీమతి కస్తూరి, పిల్లలు మధు, ఇందు, శ్రీనాథ్ కామారెడ్డి నుండి పుస్తకాలతో, ఇతర సామగ్రితో బయలుదేరే ముందు ఈ వ్రాత ప్రతులన్నీ కాల్చి వేశాను.

1967 నుండి 1985 వరకు ఓ దస్త్రంలా వాటిని భద్ర పరచి ఉంచిన నేను మాఇంటి ముందు కాల్చివేస్తూ గుణాఢ్యుని కావ్య హోమాన్ని గుర్తుకు తెచ్చుకొన్నాను.

మావ్యవసాయానికి ఆధారం మాకు గొల్లకుంట. దాని క్రింద వేసిన వరి చేను, అకాల వర్షాలతో కుంట తెగడంతో వరిచేను నాశనమైపోతున్నది. తెగుతున్న కుంటను తట్టా పారతో ఆపలేక ఆత్మహత్య చేసుకొందాం వరదలో దూకి అనుకొన్నప్పుడు, నాతో పాటే పనిచేసే పనిపిల్లాడి కేక నన్నాపింది. ఆ బంజారా అబ్బాయి పేరు సకిరియా (సక్ర్యా). భూమి తనఖా బ్యాంకులో నాన్నగారు తెచ్చిన అప్పు కట్టని కారణంగా మాకున్న దున్నపోతులు (6) ఒకటి రెండు ఆవులను, బ్యాంకు వాళ్లు బలవంతాన లాక్కుపోయారు. ఆ సమయంలో వారు మాఇంటి తలుపులు కూడా పెకలించారు. తలుపు మీద చేయి వేయ వద్దన్నాను నేను. తలుపుల మీదనే కాదు ఇంట్లో వాళ్ల మీద కూడా చేయి వేసే అధికారం మాకుంది అన్నాడందులో ఒకడు. నేను మూలకున్న గొడ్డలి చిప్ప అందుకొని వాళ్ల మీదకి వెళ్లాను. మాఇద్దరు అమ్మలూ, నాన్నగారు నన్ను ఆపారు. మా ఊరి దగ్గరున్న చెన్నరాయని పల్లెలో (చంద్రాయణ పల్లె - చెంద్రాన్ పల్లెలో) మా పశువుల్ని వేలం వేసి అమ్మేసి మాకు కాగితాలు పంపించారు.

కుటుంబం, వ్యవసాయం, పాలెం ప్రాచ్యకళాశాల చదువులూ - అనుభవాలు ఇలా నిరంతరం ఆలోచనా పరంపరలతో ఏదో ఒకటి వ్రాస్తూండేవాణ్ణి. అందులో ఎన్నో ముద్రణ కాకుండానే, ఉద్యోగరీత్యా ఊళ్లు మారుతున్నప్పుడల్లా మాయమై పోయాయి. అక్షర రూపం ధరించి నాకు పేరు తెచ్చిన గ్రంథం తెలుగు పొడుపు

కథలు నా పరిశోధన గ్రంథమే.

5. తెలుగు పొడుపు కథలపై పరిశోధన

నేను కామారెడ్డి డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న సమయంలో (1975 లో) నాకు పరిశోధనకు అవకాశం లభించింది. ఆ రోజుల్లో తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య బి.రామ రాజు గారు, ఆచార్యుల్లో సినారే గారొకరు. రామరాజు గారితో విశ్వహిందూ పరిషత్ తదితర సంస్థల్లో పాల్గొన్నప్పటి పరిచయం మాత్రముంది.

తెలుగులో చారిత్రక కావ్యాలు, తెలుగు పొడుపు కథలు అనే రెండింటి పై పరిశోధన ప్రణాళికతో నేను ఇంటర్వ్యూకు వెళ్లాను. తెలుగు పొడుపు కథలపై అవకాశం కల్పించారు. ఆచార్య సి. నారాయణ రెడ్డి గారు నా పరిశోధన పర్యవేషకులు. ఆచార్యుల వారికెన్నో సాహిత్య - సాంస్కృతికాది కార్యక్రమాలు. అయినా నా పరిశోధనకు వారెంతో సమయమిచ్చారు. నేను వ్రాస్తున్న సరళ గ్రాంధికానికి వారి ఆమోదం లభించింది. యడాగమ - నుగాగమాదుల్లో నేను చేసిన పొరపాట్లను సరిచేయడమే గాక, జానపదంలో ఏయే గ్రంథాలు చదవాలో వారు తెలియజేశారు. నా పరిశోధన వారి పర్యవేక్షణలో సకాలంలోనే పూర్తయింది. 1982లో పి హెచ్.డి పట్టా లభించింది.

1975-80 మధ్యకాలంలో నా క్షేత్ర పర్యటన అనుభవాలు ఒకటి రెండే ప్రస్తావిస్తాను.

పాలమూరు జిల్లా రాజాపూర్లో దిగి మల్లెపల్లి వెళ్లాలి. అది మిత్రుడు శ్రీ నారాయణాచారి ఊరు. మల్లెపల్లి వెళ్లడానికి అక్కడ బస్సులో నలుగురు మహిళలు దిగారు. వారికి ఊరి నుండి బండి రాలేదు. నేను నడిచి వెళ్లడం చూచి తమ ఇంటివారికి తమ రాక గురించి చెప్పవలసిందని కోరారు. నేను అరగంటలో ఆ ఊరికి చేరుకొని చెప్పాను. ఆ ఊళ్లో నా మిత్రుడు లేడు. నేను పదిమంది కూచున్న కమ్మరి దాటి (వడ్లదాటి) దగ్గరకి వెళ్లాను. అది రోడ్డు ప్రక్కనే ఉంది. మాట కలిపాను, వాళ్లు కొందరు పిల్లలను పిలిపించారు. నేను పొడుపు కథలు వేయడం, పెద్దలు పిల్లలు విప్పడం, వాళ్లు వేయడం నేను వ్రాసుకోవడం గంట రెండు గంటల

సమయం అలా గడిచి పోయింది. ఈలోగా ఆ ఇంటివారి బండి వెళ్లడం, వాళ్లు రావడం జరిగింది. వాళ్లే నన్ను భోజనానికి పిలిపించారు. వ్యవసాయదారుల కుటుంబం, ఉన్న కుటుంబం. అక్కడ కూడా కొన్ని పొడుపుకథలు సేకరించాను. మొత్తం కొత్తవి 150 తట్లు దొరికాయి.

శ్రీపురంలో, పాపకల్లులో పొడుపు కథలతో పాటు ఎన్నో జానపద గేయాలు లభించాయి. "నీకివన్ని చెబితే నీకు సర్కారోల్లు పైసలిస్తరు! నువ్వు మాకేమిస్తవు" అని అడిగిన వారున్నారు. అయిదో పదో ఇచ్చి చెప్పించుకొన్న సంఘటనలు ఒకటి రెండే ఉన్నాయి.

గుజిలీ ప్రతులవి, ఇది వరకు వారూ వీరూ ప్రచురించినవి, నేను సేకరించినవి, మిత్రులు వ్రాసి పంపినవి. ఇలా దాదాపు పదివేల పొడుపు కథల వరకు సేకరించాను. ఒకరిద్దరు తాము ప్రచురించు కొంటామంటే కూడా రెండు వేల పొడుపుకథలు అకారాది క్రమంలో వ్రాసి పంపించాను. అలా ఆచార్య జి.ఎన్.రెడ్డి గారు, డా. వెలగా వెంకటప్పయ్య గారు నేను పంపిన వాటిని తెలంగాణ పొడుపు కథలుగా తమ తమ గ్రంథాల్లో ప్రచురించుకొన్నారు.

నా సిద్ధాంత గ్రంథం మొత్తం 850 పుటలు, రెండు పర్యాయాలు అచ్చయింది. కామారెడ్డిలో నాకు అత్యంత ఆప్తుడై, ధార్మిక సాంస్కృతిక రాష్ట్రీయ స్వయం సేవక సంఘ కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలచిన మిత్రులు శ్రీ పి. సుదర్శన్ గారికి అంకితమిచ్చాను.

ఉత్పత్తి – వికాసం, జానపదసాహిత్యం, కథాత్మకాలు గుప్తకథలు, సామెతలు, ప్రజా జీవనం, ఆధునిక సాహిత్యం, చిత్ర కవిత్వం, అలంకారాలు – ప్రతీకలు, రసం –ధ్వని, ఛందశ్శిల్పం, భాషా వైభవం, వివిధ భాషలు.... అనే పంద్రెండు ప్రకరణాలుగా విభజించిన ఈ గ్రంథాన్ని ప్రచురణ సందర్భంలో వ్యావహారిక శైలిలోకి మార్చడం జరిగింది.

పోతుంటిరా జాణ పోతుంటిరా !
చార్ కమాను కట్టమీద పోతుంటిరా !

ఒహన్నీ నలుసుకుంట – ఒగన్నీ సుట్టుకుంట
ఒగని కోసరం నేను వోతుంటిరా !
పొవ్వకు నలుసుకుంట సుట్టాకు సుట్టుకుంట
ఇంగలం కోస్రం నేను వోతుంటిరా ! ॥ పోతుంటి ॥

ఒగన్నీ ఎండవెట్టి – ఒగన్నీ పండ వెట్టి
ఒగని కోస్రం నేను వోతుంటిరా !
వడ్లాను ఎండవెట్టి – రోకలినీ పండ వెట్టి
కుదురు కోస్రం నేను వోతుంటి రా ! ॥ పోతుంటి ॥

ఒహన్నీ కట్టి వేసి – ఒగన్నీ ఇడ్సి పెట్టి
ఒగని కోస్రం నేను వోతుంటి రా !
బఱ్ఱేను కట్టి వేసి – బర్దాన్ను ఇడ్సి పెట్టి
దుత కోస్రం నేను వోతుంటిరా ॥ పోతుంటి ॥

ఒగన్నీకూసోవెట్టి – ఒగన్నీ అండ్ల వెట్టి
ఒగని కోస్రం నేను వోతుంటిరా!
దుత్తాను కూసోవెట్టి – కవ్వాన్నీ అండ్లవెట్టి
తాడు కోస్రం నేను వోతుంటిరా! ॥ పోతుంటి ॥

పల్లెల్లో కోలాటం మీద ఈ పాట పాడుతుంటారు. ఇలాంటి మౌలిక మైన గేయాలు ఈ సిద్ధాంత గ్రంథంలో చేర్చడం జరిగింది. వ్యాఖ్యానానికి, వివరణకు ఇవి ఉదాహరణలుగా ఉపకరించాయి. పర్యవేక్షకులు ఆచార్య సి. నారాయణరెడ్డి గారి సలహాల మేరకు ఒక మంచి పరిశోధన చేశానన్న సంతృప్తి మిగిలింది. ఇకనా ఇతర రచనల గురించి క్లుప్తంగా వివరిస్తాను.

6. నేనూ – నా కవిత్వం

నేను మొదటే ప్రస్తావించాను కావ్య హోమం చేశానని; నవలా సాహిత్య ప్రభావంతో వ్రాసినవన్నీ సరియైనవి కావని అలా చేశాను. అందులో గణయతి ప్రాసలు లేని పద్యాలు కొన్ని బూడిదయ్యాయి. మా యింటికి గురువులు వచ్చేవారు.

వారు కొన్ని పద్యాలు – శ్లోకాలు చదివి, చదువుమనేవారు. ఆ బాణీలల్లో వ్రాసినవన్నీ, ఛందశ్శాస్త్రాధ్యయనం తర్వాత అక్కరలేదనిపించే కావ్య హోమంలో కలిపేశాను.

పాలెం ప్రాచ్య కళాశాలలో డిప్.ఓ.ఎల్ చదివేప్పుడు పాఠ్యాంశంగా ఉన్న కవిజనాశ్రయాన్ని, పాఠ్యాంశంగా లేకున్నా వ్యాఖ్యానంతో సులభంగా అర్థమవుతున్న సులక్షణ సారాన్ని చదవడం జరిగింది. మనసులోని భావాలు పద్యంలో చెప్పాలని వ్రాసుకొన్నదే పాలెము వేంకటేశ్వరా! శతకం. ఇది 1967 లో వ్రాసిందే. అయితే ఆ తర్వాత మార్పుచేసి 1976లో ప్రచురించాను. దీనికన్నా ముందే కొన్ని అచ్చయినై. పాలెంలో పరీక్షలకు ముందే ఇది ప్రింటు చేయాలనీ, దేవాలయాన్ని చూచే ఓ పెద్ద మనిషిని కలవాలని నేను మిత్రుడు యాదగిరి వారింటికి వెళ్లాం. ఆయనేమన్నా సహాయం చేస్తే విద్యార్థి దశలోనే ఇది ప్రచురించాలని తాపత్రయం. కాని మేం వెళినప్పుడు ఆ పెద్ద మనిషి అడుక్కోవడానికి వచ్చిన ఓ వృద్ధ భిక్షుకుణ్ణి కట్టెతో కొట్టి బూతులు తిడుతూ తరుముతున్నాడు. అంతే మేం వెనక్కు వచ్చేశాం! ఇక ఆ ప్రచురణ పదేళ్లు వాయిదాపడింది. అందులోని ఒక పద్యం ఉదాహరిస్తా.

"గ్రామము గుండె కాయయని వ్రాసిరి దేశములోన, కానియా
గ్రామము యొక్క గుండియకు గాలము పట్టి కృశించెనెన్నడో!
గ్రామపు వృద్ధికై కృషిని గాంధియొనర్చెను, రాజకీయ సం
గ్రామములందుమున్గినది గ్రామము పాలెము వేంకటేశ్వరా! (66)

ఇలాగే మిగతా పద్యాలు; అంతా సామాజిక హితచింతనే. నార్ల మాట ప్రభావంతో రెడ్డి మాట శతకం వ్రాశాను. ఇందులోనూ వ్యక్తి సంస్కారం, కుటుంబ సంక్షేమం, సామాజిక చైతన్యం తదితర అంశాలున్నాయి.

వైభవంబు కొఱకు, పదవుల కొఱకును
ప్రాయమంత కష్టపడుటదేల
మూడు కూడయవ్వి మూణ్ణాళ్ల ముచ్చట్లె
బిడ్డ! మఱువబోకు రెడ్డి మాట!

శ్రీమద్భగవద్గీత ముత్యాల సరాల్లో అనువాదం చేశాను. అది ఇప్పటికీ అయిదు సార్లు అచ్చయింది. అందులోనివి రెండు .....

యదాయదాహి ధర్మస్య .... కు అనువాదం .....

ఎప్పుడెప్పుడు ధర్మ హానయి
అధర్మంబభి వృద్ధి యగునో
అప్పుడప్పుడు నన్ను నేనే
సృష్టించుకొనుచున్నా (4-7)

పరిత్రాణాయ సాధూనామ్ ... కు అనువాదం ......

శిష్టజనులను రక్షసేయగ
దుష్టజనులను త్రుంచి వేయగ
ధర్మ సంస్థాపనము చేయగ
యుగ యుగంబున సంభవిస్తా! (4-8)

దాదాపు 25 కావ్యాలు, ఖండ కావ్యాలు పద్య, వచన గేయాల్లో వ్రాశాను. అన్నిట్లో చైతన్యశ్రీ గ్రంథానికి, సింహ గర్జన గేయకావ్య గ్రంథానికి పురస్కారాలు లభించాయి. రెండూ జాతీయ చైతన్యానికి ఏతామెత్తాయనే ప్రశంసలందుకొన్నాయి. మరుసటి రోజు బందు కొఱకు కాకతీయరైలుకు నక్సలైట్లు నిప్పు పెట్టారు. అందులో 48 మంది ప్రయాణికులు మరణించారు. ఇది కిరాతక చర్య. అప్పుడు వ్రాసిన 'కాకతీయ కాక' లోని ఓ పద్యం చూడండి!

"రేపటి బందుకై భయము రేపగ రైలును కొల్చనెంచి సం
తాపము వీడి, సత్ఫలము ధాత్రి జయమ్మిది యంచు పెట్రొలున్
తేపకు తేపకున్ చినికి తీట చెలంగగ పుల్లగీకి, ప్రే
లాపన చేసి పేద ప్రజ ప్రాణము లగ్గిని కాల్చి, క్రూరులై
పాపమనేటిమాట పొరపాటున నోటననంగ లేక ప్ర
స్థాపిత స్వార్థ చిత్తమున దారులు బట్టిరి, స్త్రీలు పిల్లలున్
పోపున బడ్డ గింజలయిపోయిరి, తిట్టిరి నక్సలైటులన్

(చైతన్యశ్రీ, పుట: 35)

చైతన్యశ్రీ లో నేను అనే ఖండిక నా హృదయం. అందులోని ఒక పద్యం మాత్రమే ఉదాహరిస్తా!

"నేనొక మట్టి ముద్దనయి నిచ్చలు మాయమ దివ్య పాదముల్
పూనుదు సర్వదేహమున పుణ్యము గోరుదు పూటపూటకున్
నానవ గంధలేపము ననశ్వరమూర్తికి పూత పూతు పా
రాణిగ మానవా! దమన రాగము మానవ మట్టి పట్టిలై.

(చైతన్యశ్రీ, పుట: 11)

రచన, జీవితం, ఉద్యోగం, సంఘసేవ అన్నీ ఇంచు కొరకే. ఈ నేల తల్లి కొఱకే. ఈ తల్లి ఏవిదేశీయుల పాద ఘట్టనలకు భయపడరాదు. ఆమె స్వతంత్రంగా ఉండాలి. ఆమె స్వేచ్ఛగా ఉండాలంటే ఆమె బిడ్డలు శక్తి మంతులు కావాలి. కులవర్ణ వర్గ ప్రాంత సంప్రదాయ భేదాలు లేనివారై భారత జాతిగా నిలవాలి. మత సామ్రాజ్య వాద పెత్తందారీతనం, సోషల్ సామ్రాజ్య వాద దురహంకారం ఈ దేశం పై అధికారం చలాయించరాదు. ఈ భావజాలంతోనే భారతీయ యువతను నిర్మించాలి. అందులో భాగంగానే నా అక్షరార్చన కొనసాగింది.

భారతీయ సాంస్కృతిక మానవుణ్ణి నిర్మించాలి. ధార్మిక ఆధ్యాత్మిక మానవుణ్ణి నిర్మాణం చేయాలి. అర్థ వాదానికి, అధికారవాదానికి, భోగవాదానికి, హింసావాదానికి, అవకాశవాదానికి లొంగని పారమార్థిక మానవుణ్ణి నిర్మాణం చేయాలి. స్వామి వివేకానందులు చెప్పిన బలమే జీవనం బలహీనతయే మరణం అన్న సూత్రాన్ని పాటించాలి.

ఈ ఉద్దేశంతో కలం పట్టాను. ఈ ఉద్దేశంతోనే గళం విప్పాను. రచనలు చేశాను. వేల కొలది ఉపన్యాసాలిచ్చాను.

ఇందులో భాగంగానే 25 కవిత్వ గ్రంథాలు ప్రచురించాను. ఇవి పద్యగేయ వచన ప్రక్రియల్లో వచ్చినై. అయోధ్య ఛాయాచిత్ర కవితలు, కిన్నెర ఛాయచిత్రకవితలు ఈ పరిధి లోకి రావు. అది ప్రత్యేక ప్రక్రియగా నిలవాల్సి ఉంది.

గాంధి తాత, శాంతి దూత, ప్రబోధమాల, శ్రీ భగవద్గీత, రెడ్డి మాట, పాలెము వేంకటేశ్వరా, శ్రీ నరసింహ శ్రితార్తిభంజనా, మున్నూరు ముక్తకాలు,

సిందూరం, భజ గోవిందం, చైతన్యశ్రీ, శ్రీకర్మన్ ఘాటు ఆంజనేయస్వామి శతకం, సింహగర్జన, శ్రీచందనం, సుభాషిత గీతాత్రిశతి, లేత మబ్బులు, జై తెలంగాణ, అమృత సూక్తం, వివేక గీత, వరదబాధిత భాగ్యనగరం, ఆనందామృతం, పిట్సుభర్గ వేంకటేశ శతనం, సిరిసనగండ్ల రామశతకం .....

ఇవీ ప్రచురితం. ప్రచురణ కావల్సినవి ఉన్నాయి. వాటిని భవిష్యత్తుకు వదలివేద్దాం!

7. కథానికలు – నవలలు

అలక, వయసు వలపు, రాగజ్వాల, మా పల్లె, సుడి గిండాల్లో సూరీడు, సంస్కర్త, వీరనారి రుద్రమ, నూ రుచిన్న కథలు, అమాస పున్నాలు, స్వాతంత్ర్య వీర ఉయ్యాల వాడ నరసింహా రెడ్డి, కలియుగ కవర్ణ బుడ్డా వెంగళ రెడ్డి, దయా నీపేరు దయ్యమా! నక్సలైట్ పంథా!

ఇలా కథలూ – నవలలూ, నవలికలు 13 ప్రచురించాను. ఇంకా ప్రచురణ కానివెన్నో ఉన్నాయి.

వ్యక్తిత్వ వికాసానికి, జాతీయ చైతన్యానికి, ధర్మ వీర భావ జాగరణకు, భారతీయ సంస్కృతీ వికాసానికి ఈ నా కథానికలు – నవలలు – నవలికలు దోహదం చేస్తాయని నా అభిప్రాయం.

8. ఆధ్యాత్మిక గ్రంథాలు

జాతి జీవనంపై రామాయణ ప్రభావం, భారతీయ మహిళ, శ్రీవారి భక్తులు వంటి 30 ఆధ్యాత్మిక గ్రంథాలు ప్రచురించాను. భారతీయ ఆధ్యాత్మిక చింతకులై, అందరిలోనూ ఒకే పరమాత్మను దర్శించే వ్యక్తులు నిర్మాణం కావాలనే తపనతో వ్రాసినవే ఇవన్నీ.

9. సాహిత్య వ్యాసాలు – విమర్శ

జాగృత సాహితి, పత్రికల్లో భాష, జాతీయ సాహితి వంటి పది గ్రంథాలు ప్రచురించాను. సాహిత్య విమర్శలో అలంకారాలెన్ని, ధ్వని యెక్కడ, చమత్కారాలేంటి?

అనే విధంగా రచన చేయలేదు. సందేశానికే ప్రాధాన్యమిచ్చాను. ఆ సందేశం కూడా సంస్కారాలు నాటే దైనప్పుడు బాగా వివరించాను. కాపు బిడ్డ, వేమన వేదాంతం శ్రీభగవద్గీతాసారం వంటి పద్య గ్రంథాలకు ప్రతి పదార్థ వ్యాఖ్యానాలు చేశాను.

10. జానపద వాఙ్మయం:

పరిశోధన గ్రంథం కాక జానపద వాఙ్మయం పై పది గ్రంథాలు ప్రచురించాను. ఇందులో బుజ్జి కథలున్నాయి. పాలమూరు జిల్లా జానపద గేయాల వంటి సంకలన గ్రంథాలున్నాయి. జానపద కళా దర్శనం వంటి గ్రంథాలలో జాతీయ సదస్సులలో చదివిన పది పన్నెండు వ్యాసాలున్నాయి.

11. అనువాద గ్రంథాలు:

అండమాన్లో ఆ జన్మాంతం, సావర్కర్ జైలు జీవితం ఇది 600 పుటల గ్రంథం. దీనిని 300 పుటల సంగ్రహ గ్రంథంగా అనువదించాను. ఇది జాగృతి పత్రికలో ధారావాహికగా వచ్చింది. చిట గాంగ్ వీరగాథ, దారి తప్పిన పంజాబ్, ఆర్యులెవరు? దివ్యోపదేశం వంటి గ్రంథాలన్నీ హిందీ నుండి అనువాదం చేసినవే. ఇందులో కొన్ని ఎన్నో ముద్రణలకు నోచుకొన్నాయి.

12. జీవిత చరిత్రలు:

సాధువులు, సమాజ సేవకులైన పెద్దల్లో ఆయా సందర్భాలననుసరించి 8 మంది జీవిత చరిత్రలు వ్రాశాను. వారి ద్వారా సమాజానికి జరిగిన హితాన్ని ప్రధానంగా వివరించడానికే ఈ జీవిత చరిత్రలు వ్రాయడం జరిగింది.

13. సామాజిక వ్యాసాలు – ఇతర గ్రంథాలు:

నియంత నిజాం నిజ రూపం, హైదరాబాదు సంస్థానంలో రజాకర్ల దురంతాలు, హైదరాబాదులో జాతీయోద్యమం, శతశ్లోకేన పండితః, శివమెత్తిన చికాగో వంటి 9 గ్రంథాలు ఈ కోవలోకి వస్తాయి.

14. పత్రికల సంపాదకత్వం: విశేష సంచికలు

మహర్షి సద్గురు మలయాళ స్వామి సంప్రదాయాన్ని అనుసరించే షాదునగర్ ఆశ్రమం నుండి ప్రారంభించిన గీతాజ్ఞాన యోగ సమాచార్ పత్రికకు 23 సం.లు సంపాదకునిగా ఉన్నాను. సంపాదకీయాలు వ్రాశాను. శ్రీ స్వామి వారి ప్రసంగాలు వ్యాసాలుగా మార్చాను. ఎన్నో ఆధ్యాత్మిక వ్యాసాలందులో ప్రచురించాను.

శివానందభారతి పత్రికకు గత 14 సం.గా సంపాదకునిగా ఉన్నాను. స్వామి శివానంద సరస్వతుల రచనలను హిందీ నుండి అనువాదం చేసి ప్రచురించాను. ఇప్పటికీ పత్రిక అక్షర వ్యవస్థ చూస్తున్నాను. నెల నెలా సంపాదకీయాలు వ్రాస్తున్నాను.

పుష్పగిరి భారతి మాస పత్రిక ఆరు సం.లు నడిచింది. ఆదిశంకరుల అద్వైత సిద్ధాంతానికి అనుగుణంగా నడిచే ఈ పత్రిక అక్షర వ్యవస్థనంతా ఆ ఆరేళ్లు చూశాను. శ్రీకృష్ణ దేవరాయల పట్టాభిషేక మహోత్సవాలను పురస్కరించుకొని కొన్ని పరిశోధనాత్మక వ్యాసాలిందులో ప్రచురించాను.

విశ్వహిందు మాసపత్రికకు కొన్నేళ్ల క్రితం కార్య నిర్వాహక సంపాదకునిగా అక్షర వ్యవస్థ చూశాను. ప్రస్తుతం సంపాదకునిగా వ్యవహరిస్తున్నాను. సంపాదకీయాలే గాక అందులోనే ప్రత్యేక వ్యాసాలు వ్రాస్తున్నాను. ఒకటి రెండు శీర్షికలూ నిర్వహిస్తున్నాను.

జాతీయ సాహిత్య పరిషత్తు నడిపించిన సాధన మాస పత్రికకు మూడు సం॥ లు సంపాదకునిగా బాధ్యతలు నిర్వహించాను. ఆర్థిక వ్యవస్థ సరిగా సమకూర్చుకోని కారణంగా పత్రిక ఆగిపోయింది.

ధర్మసారథి అనే ఆధ్యాత్మిక ధార్మిక మాస పత్రిక ఒకటిన్నర సం.లు నడిచింది. అక్షర వ్యవస్థతో పాటు పంపిణీ విషయంలోనూ సహకరిస్తూ, సంపాదకీయాలు, తదితర రచనలు పత్రికకు అందించాను.

కామారెడ్డిలో ఉన్నప్పుడు రెండేళ్లు సాహితీ స్రవంతి అనే లిఖిత మాసపత్రిక నిర్వహించాను. మాడ్గులలో ఉన్నప్పుడు పాఠశాలలో ప్రతి పక్షానికొకటి గోడపత్రిక ఏర్పాటు చేసి నిర్వహించాను. కామారెడ్డి లోని ఒకటి రెండు కళాశాలల్లో అఖిల

భారతీయ విద్యార్థి పరిషత్తు వారి గోడ పత్రిక **"విద్యార్థి శక్తి – జాతీయ శక్తి"** నిర్వహణా సంపాదకునిగా ఉన్నాను.

జాగృతి వార పత్రికలో ఇదీ హైందవం, కథా కమామిషు, చిన్న కథ – పెద్ద సందేశం వంటి శీర్షికలు నిర్వహించాను. షాద్‌నగర్ మలయాళ స్వామి ఆశ్రమం వెల్వరించిన 10 ధార్మిక సంచికలకు సంపాదకత్వ బాధ్యత వహించాను. ఆయా ఆశ్రమాల, విద్యా సంస్థల పత్రికలకు సంపాదకునిగా ఉన్నాను. జాతీయ సాహిత్య పరిషత్, హిత సాహితీ, రంగా రెడ్డి జిల్లా రచయితల సమితి ప్రచురించిన కొన్ని సాహిత్య సంచికలకు సంపాదకునిగా ఉండి అనేక విధాల సహకరించాను. అయోధ్య వంటి తాత్కాలిక పత్రికలకు, విశ్వహిందూ వంటి ఉద్యమ పత్రికకు వార్తలు, వార్తా కథనాలు అందించాను. శ్రీ పేజావర్ స్వామి వంటి వారి ఇంటర్వ్యూలు ప్రచురించాను.

15. విభిన్న సామాజిక రంగాలకు సేవలు

విద్యార్థిగా ఉన్నప్పటి నుండే రాష్ట్రీయ స్వయం సేవక సంఘ శాఖలకు వెళ్లాను. ఉద్యోగంలో చేరిన తర్వాత కామారెడ్డిలో ఉన్న 12 సం.లు జిల్లా బౌద్ధిక్ ప్రమాఖ్ గా విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్‌గా బాధ్యతలు నిర్వహించాను. హిందువులలో సమానతా నిర్మాణానికి, ఏకతకు, ధర్మ జాగరణకు, వ్యక్తిత్వ నిర్మాణానికి చేయాల్సిన పనులన్నీ చేశాను. జాతీయ విపత్తులు (అతివృష్టి, అనావృష్టి, విదేశీ ఉగ్రవాదుల దాడులు) సంభవించినప్పుడు తన్ మన్ ధన్ సేవలందించాను (సంఘంలో ఎంత మాత్రం కూడా చెప్పుకోకూడదు. భగవంతుడు నాకు ఈ సేవాభాగ్యం కల్పించాడని సంతోషించాలి గాని సొంత డబ్బా కొట్టుకోరాదు).

అయితే ఆత్యయిక పరిస్థితుల్లో ఇందూరు జిల్లా సత్యాగ్రహుల నిర్మాణంలో, సైక్లో స్టయిల్ పేపర్ తీయడం – పంచడంలో నా బాధ్యత కూడా ఉంది. అప్పుడు లోక సంఘర్షణ సమితి (*LSS*) పేరిట పని చేశాను. ఆ సమయంలో విశ్వహిందూ పరిషత్ బాధ్యతలు నిర్వహించాను. మారు వేషాలతో మారుపేర్లతో వచ్చిన సంఘ కార్యకర్తలకు వసతి సౌకర్యాలు కల్పించాను.

ఇక భాగ్యనగర్‌లో ఉద్యోగరీత్యా ఉన్నప్పటి నుండి నాకు సంఘ బాధ్యతలేదు. జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత కార్యాలయ కార్యదర్శిగా, కార్యదర్శిగా చాల

సం॥ లు బాధ్యతలు నిర్వహించాను. గత ఆరు సం॥ గా అధ్యక్షునిగా కొనసాగుతున్నాను. రాష్ట్రాలు రెండైన తర్వాత తెలంగాణ ప్రాంత జా.సా.ప అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ప్రస్తుతం తెలంగాణలో 54 శాఖలతో జాసాప పనిచేస్తున్నది.

సంఘ పరివార క్షేత్రాలకు కర పత్రాలు వ్రాయడం, పుస్తకాలు వ్రాసివ్వడం సర్వ సాదారణంగా జరుగుతుంది. ఇక విశ్వహిందూ పరిషత్ పత్రికా నిర్వహణే కాకుండా, యుగయుగాల్లో హిందూత్వం, హిందూ ధర్మ రక్షణ మన కర్తవ్యం వంటి చిన్న చిన్న గ్రంథాలు వ్రాసిచ్చాను. అన్ని రంగాలలోని కార్యకర్తలకు వందల అంశాలమీద మార్గ దర్శనం చేశాను. అలా ఉపన్యసించిన అంశాల్లో కొన్ని ఇక్కడ చెబుతాను.

1. హిందూధర్మ పరిరక్షణలో మహిళల పాత్ర, 2. సేవా సంస్థలు – సేవా ధర్మం, 3. సమాజహిత కార్యమే భగవంతుని కార్యం, 4. భారతీయ సాంస్కృతిక వారసత్వం, 5. విద్యాలయం – సామాజిక చైతన్య కేంద్రం, 6. విద్యార్థులు – వ్యక్తిత్వవికాసం, 7.సమాజహితమే మనహితం, 8. సమాజమూ యువత, 9. విద్య ద్వారా సాంస్కృతిక మానవుని నిర్మాణం, 10. రాజకీయాల్లో యువత – జాతీయ చైతన్యం, 11. స్వచ్ఛంద సంస్థలు – సేవా ధర్మం, 12. అధ్యాపకుల ద్వారా వ్యక్తిత్వ వికాసం, 13. హిందూ ధర్మ వికాసం – కుల సంఘాల పాత్ర, 14. సాంస్కృతిక జాతీయ ఏకతలో సంస్కృత భాష – దేశభాషలు, 15. మతము – దార్శనికులు, 16. నైతిక విలువల నిర్మాణంలో ఆర్ష వాఙ్మయం, 17. హిందుత్వ చైతన్యం – వ్యక్తి కర్తవ్యం, 18. భావ నిష్ఠాత్మక హిందువు నిర్మాణంలో పరివార క్షేత్రాలు, 19. జీవించడమే ఒక కళ, 20. నైతిక విలువలు – నాయకత్వం, 21. సాహిత్యం ద్వారా సంస్కారాలు, 22. యుగ యుగాల్లో హిందూ ధర్మ జాగరణం, 23. స్వామి వివేకానంద సాహిత్యం – సాహిత్యకారుల కందించే సందేశం, 24. శివుడు శివతత్త్వం, 25. హిందూధర్మ పరిచయం, 26. తెలుగు పద్యం అందించే పరమార్థం, 27. ధర్మం ద్వారా సమానత్వం, 28. మన దార్శనికులు, 29. యువతకు స్వామి వివేకానంద సందేశం, 30. గురువు – గురుపూజ, 31. ఆధునిక గురువు నిబద్ధత – విలువల పరిరక్షణ, 32. విద్యారంగ వికాసమే దేశ వికాసం,

33. సంస్కృతి పరిరక్షణలో ఉపాధ్యాయులు, 34. ధార్మిక ఉత్సవాల్లో హిందుత్వం, 35. మన దేవాలయం - మానవతా వికాస కేంద్రం, 36. వివాహ బంధం - కుటుంబ వ్యవస్థ, 37. వర్ణాశ్రమ ధర్మాలు - ఆధునిక దృక్పథం, 38. ఆధునిక యుగంలో ధర్మ సూత్రాల అంతరార్థాలు, 39. మన అవతారాలు - ధర్మ పరిరక్షణ, 40. హిందూ ఆచార వ్యవహారాలు - వైజ్ఞానిక దృక్పథం, 41. హిందూ ధర్మంలో వివిధ మార్గాలు - సమన్వయం, 42. ధర్మోరక్షతి రక్షితః, 43. హిందూ పురాణాల్లో మహిళలు - చైతన్యం, 44. పండుగలు పారమార్థిక విజ్ఞానం 45. శ్రీరామాయణ సందేశాలు, 46. మహాభారతం ధర్మ రక్షణ, 47. శ్రీమద్భగవద్గీత ధర్మ రక్షణ, 48. భాగవతం - మానవీయ మూల్యాలు, 49. నవవిధ భక్తులు - వ్యక్తిత్వ వికాసం, 50. మాతృదేవోభవ, 51. పితృదేవోభవ, 52. ఆచార్యదేవోభవ, 53. యువత - జాతీయ శక్తి, 54. దేశ పునర్నిర్మాణంలో వివేకానందుని సందేశం, 55. ఆధ్యాత్మిక జాతీయ వాదం ద్వారా ఏకతా నిర్మాణం, 56. సంస్కృతం ద్వారా సాంస్కృతిక మానవుని నిర్మాణం, 57. ధర్మాధారిత జీవితం హిందుత్వ చైతన్యం, 58. మనగ్రామ దేవతలు - వైజ్ఞానిక సాంస్కృతిక వికాసం, 59. జానపదమతం - గ్రామదేవతలు, 60. ప్రాచీన సాహితీ సంస్కృతులు వ్యక్తిత్వ వికాసం, 61. జాతీయతలో ప్రాంతీయత, 62. చిన్న కథలు - ఆధ్యాత్మిక సందేశం. 63. మన పవిత్ర గ్రంథాలు, 64.సత్యం-శివం-సుందరం.

ఇవేగాక నేతాజి, శివాజి, డాక్టర్జి, గురూజి, అంబేడ్కర్, సావర్కర్, మలయాళ స్వామి, స్వామి శివానంద, వివేకానంద, రామకృష్ణ పరమహంస, భీష్ముడు, ఆంజనేయుడు, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు, భగత్సింగ్, రమణమహర్షి, దయానంద మహర్షి, స్వామి రామ తీర్థ, బంకించంద్ర చటర్జి, మహాత్మాగాంధి, నెహ్రూ, సీత, ద్రౌపది, ఝాన్సీ లక్ష్మీబాయి, సురవరం ప్రతాపరెడ్డి, భక్త రామదాసు, రాకమచర్ల వెంకటదాసు, తిక్కన, నన్నయ, పోతన, ఎఱ్ఱాప్రగడ, వేమన, గురజాడ, విశ్వనాథ, రాయప్రోలు, కృష్ణశాస్త్రి ..... తదితరులపై అనేక పర్యాయాలు ప్రసంగాలు చేశాను.

జానపద సాహిత్యంలో ప్రధానంగా సామెతలు, పొడుపుకథలు, యక్షగానాలు, చిందు యక్షగానాలు, తెలంగాణా యక్ష గానం, జానపదుల పిల్లల పాటలు, జానపద సాహిత్యంలో మానవీయ మూల్యాలు, జానపద సాహిత్యం ద్వారా

సంస్కారాలు, జానపద కళలు – వ్యక్తిత్వ వికాసం, హిందూ ధర్మ ప్రచారంలో జానపదాలు, జానపదుల వైద్యం – ఆలోచనాంశాలు, జానపదుల వృత్తులు – గ్రామ వికాసం, వీధి భాగవతాలు, జానపద విజ్ఞానంలో వస్తు సంస్కృతి...

ఇవన్నీ కేవల పరివార క్షేత్రాలలోనే గాక, విద్యా రంగంలో, సామాజిక రంగంలోని భిన్న క్షేత్రాలలో, ప్రసంగించిన అంశాలు. ఇవేగాక మరో వందవరకుంటాయి. సంక్రాంతి, దీపావళి, రక్షాబంధన్, ఉగాది, విజయదశమి, హిందూ సామ్రాజ్య దినోత్సవం, స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్రదినోత్సవం, గీతా జయంతి, మహాత్ముల జయంతులు – వర్ధంతులు .... ఇవన్నీ ఉపన్యాసాల శీర్షికలయినై.

ఏ సంస్థ పిలిచినా ఖాళీగా ఉంటే చాలు వెళ్లాను. అయిదుగురున్నా, అయిదువందల మంది ఉన్నా అదే ఉత్సాహంతో ఉపన్యసించాను. యువత నిమిత్తం ఉపన్యాసకళ అనే అంశం పై దాదాపు ఇరవై పర్యాయాలైనా ప్రసంగించి ఉంటాను. నా ఆలోచనల్ని (ఉపన్యాసకళపై) ఒక వంద పుటల పుస్తకం వ్రాయవలసిందని ఎందరో కోరారు. అది వ్రాయవలసి ఉంది.

పరివారక్షేత్రాలలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, సరస్వతీ విద్యా పీఠం ఆధ్వర్యంలో నడిచే శిశు మందిరాలు, ఇంకా మరికొన్ని విద్యా సంస్థలకు నా సేవలందించాను.

ఆర్య సమాజ్ గో రక్షా ఉద్యమంలో పాల్గొన్నాను. పరిషత్ వారి గో రక్షణ ఉద్యమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా తిరిగాను. రామజన్మ భూమి ఉద్యమంలో వందల కొలది ఉపన్యాసాలిచ్చాను. ఇలా ఇలా ఓ పది వేల ప్రసంగాలు చేసి ఉంటాను.

16. ఎన్నో పీఠికలు – పత్ర సమర్పణాలు

దాదాపు 250 పుస్తకాలకు పీఠికలు వ్రాశాను. ఇంకా వ్రాస్తూనే ఉన్నాను. ఆ పీఠికల్లో ఓ ఏభై యింటిని రెండు సంపుటాలుగా తెచ్చాను. చైతన్య సాహితి, ప్రేరణ సాహితి పేరిట పత్రికలకు వ్రాసిన సంపాదకీయాలు ప్రచురించాను.

ప్రాంతీయ - జాతీయ - అంతర్జాతీయ సదస్సులలో దాదాపు 50 పత్రాలైనా సమర్పించి ఉంటాను. వాటిలో కొన్ని మాత్రమే ప్రచురించ గలిగాను.

17. నాకు ప్రేరణ - అందరికీ సందేశం

ఇన్ని పనులు చేయడానికి, ఇంకా చేస్తుండడానికి నాకు ప్రేరణ నిచ్చింది గీతావాక్యం. నిరంతరం పని చేయాలి (నహి కశ్చిత్ క్షణమపి / జాతు తిష్ఠత్య కర్మకృత్). ఇది అందరికీ గీతాచార్యులిచ్చిన సందేశం.

ఆ కారణంగానే రచన, ఇంటి పని, ఉద్యోగం, సమావేశాల్లో పాల్గొనడం, సహజంగా జరిగిపోయేవి. సదస్సుల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లడానికి కూడా వెనుక ముందాడలేదు. గోలకొండ సాహితీ విజయం, కదన (కార్గిల్) విజయం, వందేమాతరం, సద్గురు విజయం వంటి ఎన్నో సాహిత్య రూపకాలకు ప్రయోక్తగా ఉన్నాను. జాతీయ సాహిత్య పరిషత్ మహిళావిభాగం ప్రదర్శించే రమణీరామాయణానికి కొన్ని సార్లు ప్రయోక్తగా ఉన్నాను. రెండు శతావధానాలకు సంచాలకునిగా వ్యవహరించాను. అనేక సాహిత్య సాంస్కృతిక సమావేశాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించాను. భువన విజయంలో అనేక పర్యాయాలు ఎన్నో పాత్రలు పోషించాను.

*USA*లోని *ATA* పిలుపు మేరకు 2004లో చికాగోకు, 2008లో న్యూయార్క్‌కు (నెవార్కుకు), 2014లో ఫిలడెల్ఫియాకు వెళ్లాను. అక్కడే వివేక గీత, శివమెత్తిన చికాగో, ఫిట్స్‌బర్గ వేంకటేశ శతకం, పాలమూరు జిల్లా జానపద గేయాలు ఆవిష్కరించుకొన్నాను. ఒకసారి **ఆధునిక సాహిత్యం ద్వారా సాంస్కృతిక మానవుని నిర్మాణం,** మరోసారి **జానపద సాహిత్యంలో హాస్యరసం,** ఇంకోసారి **జానపద సాహిత్యం ద్వారా సంస్కారాలు** అనే అంశాలపై ఆ ఆటా సభల్లో ఇచ్చిన సమయం మేరకు ప్రసంగించాను. కవి సమ్మేళనాల్లో పాల్గొన్నాను. అష్టావధానాల్లో పృచ్ఛకునిగా ఉన్నాను.

17.ఎ. ధర్మ ప్రచారకునిగా ....

మరొక విషయం! నేను 2011 ఫిబ్రవరి నుండి 2013 ఫిబ్రవరి వరకు రెండు సంవత్సరాలు తిరుమల తిరుపతి దేవస్థానం లోని హిందూ ధర్మ ప్రచార

పరిషత్తు కార్యదర్శిగా పనిచేశాను. సనాతన ధార్మిక విజ్ఞాన పరీక్షల పునరుద్ధరణకు కృషి చేశాను. పాలమూరు, చిత్తూరు, కృష్ణా, అనంతపురం జిల్లాల్లో ధార్మిక చైతన్య యాత్రలకు మార్గదర్శనం చేశాను. సదాచారం బోధలు విద్యాలయాల్లో కొనసాగించడానికి పాఠ్య ప్రణాళిక సంసిద్ధం చేశాను. బాలబాలికలకు వేసవి శిక్షణా శిబిరం శుభప్రదానికి బోధనా ప్రణాళిక సిద్ధం చేసి ఇచ్చాను.

మన గుడి పుస్తకం వ్రాసి శ్రావణ – కార్తీక పౌర్ణములకు కార్యక్రమాలు జరగడంలో ఉడతాభక్తి సహకరించాను. హిందూ ధర్మ పరిచయం, ప్రవేశికలకు సంపాదకత్వం వహించాను. యుగయుగాల్లో హిందూ ధర్మం, శుభప్రదం, సదాచారం, మన గుడి, నారాయణవనం శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వంటి పుస్తకాలు ప్రచురించుకోడానికి తి.తి.దే. కు ఇచ్చాను. రెండు సం॥ లలో అనేక ధార్మిక సభలలో, కల్యాణాలలో పాల్గొన్నాను.

ఇంతకు పూర్వం, ఆ తర్వాత కూడా అనేక భక్తి – ఇతర ఛానళ్లలో ప్రసంగించాను. తమసోమా జ్యోతిర్గమయ, ధర్మపథం, చర్చల్లో పాల్గొన్నాను. జానపదం ఆధ్యాత్మికం పై ఛానళ్లలో అనేక ప్రసంగాలు చేశాను. తెలుగు వెలుగులో అనేక ప్రసంగాలు చేశాను. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్లో శ్రీ కృష్ణ శతకం పూర్తిగా వ్యాఖ్యానించాను. శ్రీమద్భగవద్గీత, భాగవతం, రామాయణాల సప్తాహాలు నిర్వహించాను. నైమిశారణ్యంలో భాగవతంపై 54 ఘంటలు (రోజు ఉ.3 గం. సాయం 3 గం.) ప్రసంగించాను. అనేక ఆశ్రమాలధార్మిక సంస్థల కార్యక్రమాలలోని పారాయణాలలో పాల్గొని గీతపై, విష్ణుసహస్ర నామాలపై ప్రసంగాలు చేశాను. ఈ కారణంగా నేను ధర్మ ప్రచారకుణ్ణయిపోయాను.

18. శ్రేష్ఠులను అనుసరించండి!

యువశక్తికి, ఆగామి రచయితలకు నేనిచ్చే సందేశమేమీ లేదు. పెద్దలు చెప్పిన మాటలే నేను ఉటంకిస్తున్నాను. గీతాచార్యుల ఈ శ్లోకం అందరికీ అనుసరణీయం ....

శ్లో॥ యద్యదాచరతిశ్రేష్ఠః – తత్త దేవేతరోజనః!
సయత్ప్ర మాణం కురుతే – లోకస్తదనువర్తతే?
అను: శ్రేష్ఠుడే కర్మంబు చేయునొ

ఇతర జనులును చేతురదియే,
అతండేది ప్రమాణ మనునో
అందరదియే అనుసరింతురు ?

నేనూ పెద్దలననుసరించాను. ఆ పెద్దలందించిన సందేశాన్నే నా తర్వాతి తరానికి అందిస్తున్నాను. సురవరం ప్రతాపరెడ్డి గారి ఈ పద్యం చూడండి! అందరికీ ఇది అనుసరణీయం. ముఖ్యంగా భారతీయ సామాజిక పరిస్థితులకు ఇది అవశ్యం ఆచరణీయం.

"అనిశము మాతృ దేశహిత మాత్మను గోరెడు వాడెభక్తుడౌ,
తన తనువున్ ధనంబును ముదంబున నర్పణ జేయునట్టి యా
మనుజుడె త్యాగి, బ్రాహ్మణుల మాలల నొక్క విధంబు జూచు నా
జనుడెమనీషి, దుర్మదము శత్రుగ జూచునతండె శూరుడౌ?

అవును! మనం ఏ వృత్తుల్లో ఉన్నా, ఏ పని చేస్తున్నా దేశహితం కొఱకే పని చేయాలి! దేశహితంలోనే వ్యక్తి హితం అంతర్భవించి ఉన్నది. విదేశీ శక్తులు భారత దేశాన్ని ఏ విధంగా నైనా కబళించాలని ప్రయత్నం చేస్తున్న సందర్భంలో, సాహిత్యకారుడు తన కర్తవ్యాన్ని నిర్వర్తించాల్సిందే! దేశహితం ద్వారా విశ్వహితం వైపుగా పయనించాల్సిందే! శ్రీ తుమ్మలవారి పద్యంతో ఈ ప్రసంగాన్ని ముగిస్తా! ఈ దృష్టితోనే యువత పయనిస్తుందని ఆశిస్తా!

దేవుడన మాతృదేశమ!

దేవతలన ప్రజలు, యజ్ఞదీక్షయనంగా

సేవా వ్రతనిష్టయ, ఇవి

జీవన సూత్రములుగా ప్రసిద్ధింగనుమా!

జైహింద్ – జై భారత్

❖ ❖ ❖



పొల్కంపల్లి శాంతాదేవి

72 ఏళ్ళ క్రితం అంటే 1942 జూన్ 1వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో అమ్మ సీతమ్మకి పదహారో సంతానంగా చిట్టచివర పుట్టాను. అప్పటికే మా అమ్మ కాన్పులతో విసిగిపోయి "చాలు చాలు శాంతమ్మ" అని పెట్టుకొందట నాపేరు. అలా పెట్టుకొంటే కాన్పులు ఆగిపోతాయని తెలంగాణా ప్రాంతంలో ఒక నమ్మకం. నమ్మకమో, కాకతాళీయమో నా తరువాత మా అమ్మకు కాన్పులు ఆగిపోయాయి. కాని, అమ్మ దగ్గర మాత్రం పెరగలేదు నేను. మా రెండో అక్కయ్యకి పిల్లలు లేకపోవడంవల్ల నన్ను పురిటిలోనే తీసుకొని పెంచుకొంది. అమ్మదీ అక్కదీ ఒకే ఊళ్లో దగ్గర దగ్గర ఇళ్ళే కాబట్టి అమ్మ ఒకదాయిలా వచ్చి పాలిచ్చిపోయేదట. అలా అమ్మ పాలు అయిదేళ్ళు తాగానని నా చిన్నప్పుడు చెప్పేవాళ్ళు. మా నాన్నగారు సూగూరు హన్మంతరావు. వనపర్తి సంస్థానంలో ఉద్యోగం చేసి, పదవీ విరమణ తరువాత కరణీకం చేశారు. నన్ను పెంచుకొన్న మా అక్కపేరు బాలకృష్ణమ్మ. బావగారి పేరు వలిపె సంజీవరావుగారు. హైస్కూల్‌లో గణితోపాధ్యాయులుగా పనిచేసేవారు.

చదువులగోల, రాంకులగోల అంతగాలేని ఆరోజుల్లో నేను స్కూల్‌కి వెళ్ళి చదువుకొన్నది చాలా తక్కువ; ఏడెనిమిదేళ్ళవరకు ఆటపాటలతో హాయిగా గడిచిపోయింది. ఇంట్లోనే ఏదో కొంచెం ఇంగ్లీషు, లెక్కలు చెప్పి ఒకేసారి నన్ను నాలుగోతరగతిలో చేర్పించారు. నాకు నాలుగో తరగతి స్టాండర్డ్ లేకపోయినా ఆ టీచరు మా బావగారి శిష్యురాలు కనుక చేర్చుకొంది. నా చదువు అత్తెసరుమార్కులతో

సాగి తొమ్మిదవ తరగతి పరీక్షల ముందు డిస్‌కంటిన్యూ అయిపోయింది. తరువాత ప్రైవేట్‌గా చదివి మెట్రిక్యులేషన్ పాసయ్యాను.

మా ఇంట్లో బాగా ఆధ్యాత్మిక వాతావరణం ఉండేది. మా అమ్మ యోగా చేసేది. తరుచుగా ఇంట్లో వేదాంతపరమైన విషయాలు చర్చిస్తూ ఉండేవాళ్ళు. అందువల్లనో ఏమో ఆధ్యాత్మికతపట్ల నాకు చిన్నప్పుడే ఆసక్తి ఏర్పడింది. మా బావగారు 'కుసుమ హరనాథ' అన్న ఆధ్యాత్మిక మాసపత్రిక తెప్పించేవారు. 1958లో అనుకొంటాను నేను నైన్త్‌క్లాస్‌లో ఉన్నప్పుడే 'ముక్తిమార్గం' అన్న ఆధ్యాత్మిక వ్యాసం 'కుసుమ హరనాథ'కి పంపించాను. వాళ్ళు ప్రచురించారు. ఆ ఉత్సాహంతో 'దేవాలయం' అన్న భక్తిరసపధానమైన కథ వ్రాసి పంపితే అదీ ప్రచురించారు. ఆ తరువాత నేను మెట్రిక్యులేషన్ పరీక్ష రాయడానికి చదువులో పడ్డం వల్ల కొంత గ్యాప్ వచ్చింది.

నేను చదువు మానేసి ఇంట్లో ఎక్కువగా ఉండడంవల్ల కాలక్షేపానికి దొరికిన నవలలూ, వారపత్రికలూ బాగా చదివేదాన్ని. వారం వారం 'ఆంధ్రప్రభ' వీక్లీ కొని చదివేదాన్ని. ఇదంతా 55 ఏళ్ళ క్రిందటి మాట. రంగనాయకమ్మగారి 'బలిపీఠం' కౌసల్యాదేవిగారి 'చక్రభ్రమణం', 'శాంతినికేతన్' లాంటి సీరియల్స్ పాఠకులను ఉర్రూతలూగిస్తున్న రోజులవి. అప్పటికే తెలుగులోకి అనువాదమైన బెంగాలీ, హిందీ నవలలు చదివి ఉండడం కూడా నా ఊహలకి రెక్కలు తొడిగాయనుకుంటాను. ముఖ్యంగా బెంగాలీ నవలా రచయిత శరత్‌బాబు రచనలు నామీద చాలా ప్రభావం చూపాయని చెప్పాలి; తొలినాళ్ళలోని నా రచనలమీద ఆయన ప్రభావం బాగా కనిపిస్తుంది. తరువాత నాదైన శైలి ఏర్పడింది.

నాకు మొదటినుండి కథలకంటే నవలలు వ్రాయడంలోనే ఎక్కువ ఆసక్తి. మొదటి నవల 'పాణిగ్రహణం', 'రక్తతిలకం', 'బాటసారి' వరుసగా ఆంధ్రప్రభ వీక్లీకి పంపడం..అదీ ఉగాది నవలల పోటీకి...అది తిరిగి రావడం...ఎప్పుడో వాటికి మంచిరోజులొస్తాయన్న నమ్మకంతో మా ఇంట్లో ఒక ట్రంకుపెట్టె వుంటే అందులో పెట్టుకోవడం...చివరికి నా నమ్మకమే గెలిచింది. అప్పట్లో మా బావగారు

వనపర్తికి దగ్గరలో ఉన్న పెబ్బేరు మాధ్యమిక పాఠశాలకు ట్రాన్స్‌ఫరై వచ్చారు. 'ప్రజామత' అన్న వారపత్రిక స్కూల్‌కి వచ్చేది. అది ఇంటికి పట్టుకు వచ్చేవారు. చాలా పెద్దసైజ్‌లో 'చాటంత ఉండేది అది. సగం పేజీలు రాజకీయవార్తలతో నిండిపోగా...మిగతాపేజీలు ఒకే ఒక్క సీరియల్ నవల, ఒకటి రెండు కథలు...మహిళలకీ, పిల్లలకీ ఒక పేజీ....మధ్యపేజీలో పెద్ద పెద్ద సినిమా బొమ్మలతో...సినిమావార్తలతో చాలా ఆకర్షణీయంగా వచ్చేది. పెట్టెలో దాచుకొన్న వ్రాతప్రతులు ఒక్కొక్కటి వరుసగా ఆపత్రిక్కి పంపడం, గ్యాప్ లేకుండా వరుసగా ఆరేడు సీరియల్స్, నావి ప్రచురించడం అదొక రికార్డు ఆరోజుల్లో.

నేను కథలు వ్రాయడం మొదలుపెట్టినప్పుడు ఏదో ఒక సబ్జెక్ట్‌మీద ఉండాలనీ, ఏదో ఒక ప్రయోజనం ఉండాలనీ నాకు తెలియదు. ఇర్వైలోపు వయసులో పెద్దగా పాండిత్యం, సామాజిక స్పృహ ఏముంటుంది? ప్రేమలూ, విరహాలూ, విషాదాల చుట్టూనే కథలు తిరిగేవి. చివరికి విషాదాంతమో, సుఖాంతమో అయిపోయేవి. మొదటగా వచ్చిన 'పాణిగ్రహణం', 'రక్తతిలకం' అలా వచ్చినవే. అందులో సామాజికస్పృహ ఎంతుందో నాకు తెలియదుగాని అవి పాఠకాదరణని మాత్రం బాగా చూరగొన్నాయి. ఏడెనిమిది ముద్రణలు వరుసగా వచ్చేశాయి. వాటికి కొంచెం భిన్నంగా 'బాటసారి' అన్న నవల వచ్చింది. అది పాణిగ్రహణం, రక్తతిలకం వచ్చిన 'ప్రజామత' వారపత్రికలోనే సీరియల్‌గా వచ్చింది. అది సాధారణ పాఠకులనేకాదు, మేధావుల ప్రశంసలనూ పొందింది. ఆ నవల వచ్చిన పాతికేళ్ళ తరువాత అనపర్తినుండి అనుకొంటాను ఇంగ్లీష్ లెక్చరర్ ఒకామె లెటరు వాసింది. 'మీ బాటసారి నవలలో డాక్టర్ శ్రీకాంత్‌లాంటి వ్యక్తిని చూశాను. అతనికి మీ బాటసారి నవల ప్రజెంట్ చేద్దామని ఎక్కడ చూసినా ఆ నవల దొరకలేదు. ఎక్కడ దొరుకుతుందో చెప్పండి. లేకుంటే మీ దగ్గర ఒక కాపీ వుంటే పంపండి. ఎంత డబ్బైనా ఫర్వాలేదు' అంటూ. శ్రీకాంత్ లాంటి పాత్రను చిరస్మరణీయంగా చిత్రించినందుకు గర్వించిన సందర్భమది.

ఇటీవల ఒక ఫంక్షన్‌లో ఒక రాజకీయనాయకుడు కలిశాడు. "మీ వనపర్తిలో నేను పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతున్నపుడు మీ బాటసారి నవల చదివాను

సీరియల్‌గా. ఇప్పుడుందా ఆ నవల మీ దగ్గర?' అని అడిగారు. కాలంతోపాటు కొట్టుకుపోకుండా నిలబడే రచన చేశానని తృప్తిపడ్డాను.

అయితే శ్రీకాంత్ పాత్ర నా ఊహల్లోంచి పుట్టుకురాలేదు.

50, 60 ఏళ్ళక్రితం మా ఊళ్ళో ఒక చిన్న ప్రభుత్వాసుపత్రి తప్ప మరో ఆసుపత్రి లేదు. మా బావగారి శిష్యుడొకాయన ఎం.బి.బి.ఎస్. పాసై వచ్చి మా ఊళ్ళో ఆసుపత్రి పెట్టాడు. ఆయనపేరు బాలకృష్ణయ్య. మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చినవాడు. బాగా ఎత్తుగా...లావుగా కొంచెం నల్లగా తెల్లటి చొక్కామీద స్టెతస్కోప్‌తో..గంభీరంగా...డాక్టర్ అంటే ఇలా ఉండాలి అనేటట్టుగా ఉండేవాడు. ఆయన ఆసుపత్రి పెట్టిన కొద్దిరోజుల్లోనే హస్తవాసి ఉన్న డాక్టరుగా, ఏ టెస్టులకీ పంపకుండానే రోగాన్ని సరిగ్గా నిర్ధారణ చేసే డాక్టరుగా, దయార్ద్రహృదయుడిగా ఆయన అందరికీ ప్రీతిపాత్రమైపోయాడు. 'మా డాక్టర్ బాలకిష్టయ్య' అని చెప్పుకొనేంత ఆత్మీయుడైపోయాడు. కారణం... ఆయన ఆసుపత్రిలో కన్సల్టింగ్ ఫీజ్ లేదు. మందులు తప్ప అంతా ఫ్రీ. అక్కడ పనిచేసే కాంపౌండర్లు, నర్సులు కూడా డబ్బులు తీసుకునేవారు కాదు. పేదవాళ్ళ దగ్గర పైసా ముట్టని ఆయన డబ్బున్నవాళ్ళని మాత్రం వదిలేవాడు కాదు. కమ్యూనిస్ట్ భావాలున్న మనిషి. శ్రీశ్రీకి వీరాభిమాని. మంచి సాహిత్యాభిమాని కూడా. తరువాత ఆయన రాజకీయాల్లోకి వెళ్ళి మా ఊరి మున్సిపల్ ఛైర్మన్‌గా, ఎం.ఎల్.ఏ.గా కూడా చేశారు. ఆయన చనిపోయాక మా ఊరి మధ్య ఆయన శిలావిగ్రహం పెట్టి వర్ధంతులూ, జయంతులూ జరుపుకుంటున్నారు మా ఊరివాళ్ళు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని 'బాటసారి' నవలలో శ్రీకాంత్ పాత్ర సృష్టించాను. అందుకే ఆ పాత్రకు అంత సజీవత వచ్చిందనుకొంటాను. ఇక కథలోకి వెడితే క్లుప్తంగా...శ్రీకాంత్ ధనవంతుల పెంపుడుబిడ్డ. త్యాగశీలి, పేదలకోసం, రోగులకోసం తన సర్వస్వం త్యాగం చెయ్యడమేకాదు దీనులనూ, దుఃఖితులనూ ఆదుకోవాలనుకొనే మనిషి. తను ప్రేమించినదాన్ని చేరుకోలేక, తనను ప్రేమించినదాన్ని చేసుకోలేక జీవితంలో గాయపడతాడు. ఇంకా భాస్వతి, ప్రభాత్, రాజేంద్ర మొదలైన పాత్రలున్నాయందులో. అందరూ శ్రీకాంత్ అడుగుజాడల్లో నడిచే త్యాగమూర్తులే. సేవామార్గంలో వాళ్ళంతా కలిసి ఒక ఉద్యమంలా సాగుతుంటారు. ఆనాడేకాదు,

ఈనాడుకూడా నేను త్యాగాన్ని ఎక్కువగా ఇష్టపడతాను.

నాలుగైదు నవలలు తిప్పి పంపడంలో అలసిపోయిన 'ఆంధ్రప్రభ' వాళ్ళు చివరికి ఓ నవల అంగీకరించక తప్పలేదు. అది 'జీవన సంగీతం' అది యాక్సెప్ట్ అయ్యాక రెండు సంవత్సరాల వరకు ప్రచురించలేదు. లెటర్స్ వ్రాసి వ్రాసి విసిగిపోయి ఇక ప్రచురించనట్టేనని సినీ డైరెక్టర్ వి. మధుసూదనరావుగారు సినిమా కథలపోటీ పెడితే పంపాను. పోటీలో శ్రీమతి సి.ఆనందరామంగారి 'ఆత్మబలి'కి మొదటి బహుమతి, 'జీవన సంగీతం'కి రెండవ బహుమతి ఇవ్వడం జరిగింది. దీని తరువాతనే ఆంధ్రప్రభలో జీవన సంగీతం నవల సీరియల్‌గా ప్రచురించారు. 'ఆంధ్రప్రభ'లో మరో రెండు కథలు కూడా వచ్చాయి. ఉగాది సంచికలో నా మొదటికథ 'విశ్వేశ్వరి' తరువాత 'సమర్పణ' కథ వేశారు. ఎ క్లాసు కథలుగా భావించి, వాటికి పారితోషికం ఎక్కువ పంపుతున్నట్టుగా రాశారు. ఓటమి తరువాత వచ్చే గెలుపులోని ఆనందాన్ని అనుభవించిన సందర్భమది.

తరువాత నన్ను పోత్సహించిన పత్రికల్లో ముఖ్యంగా చెప్పుకోవలసింది చక్రపాణి, బి. నాగిరెడ్డిగార్ల ఆధ్వర్యంలో వచ్చిన 'యువ' మాసపత్రికని 'ప్రతీక్ష', 'పూజాసుమం', 'రాగదీపం' నవలలు దీపావళి ప్రత్యేక సంచికలలో ప్రచురించి నన్ను అగ్రశ్రేణి రచయితల మధ్య నిలిపింది. ప్రతి దీపావళికి కథలు అడిగి తెప్పించుకుని ప్రచురించేవారు. మూడు నాలుగు నవలలు సీరియల్స్‌గానూ, మరికొన్ని నవలలు అనుబంధంగానూ, చాలా కథలు సాధారణ సంచికల్లోనూ ప్రచురించింది. యువలో సీరియల్‌గా వచ్చిన ప్రేమపూజారి నవల నాకు చాలామంది అభిమానుల్ని సంపాదించి పెట్టింది. అలాగే 'జ్యోతి' మాసపత్రిక కూడా ప్రతి దీపావళి సంచికలోనూ నా కథ ప్రచురించేవారు. 'జ్యోతి' మాసపత్రిక సంపాదకులు లీలావతి రాఘవయ్యగారు చాలా చక్కని ఉత్తరాలు వ్రాసేవారు. ఫలానా సమస్యమీద కథ వాస్తే బాగుంటుందని సూచించేవారు.

వీటి తరువాత చెప్పుకోవలసింది స్వాతినీ, ఆంధ్రభూమినీ, స్వాతి వీక్లీలో సీరియల్సేకాక, స్వాతి మాసపత్రికలో చాలా నవలలు అనుబంధంగా ప్రచురించడం జరిగింది.

ఇక 'ఆంధ్రభూమి' వీక్లీలో వచ్చిన 'చండీప్రియ' నా సాహితీప్రస్థానంలో ఒక మైలురాయి. ఆ నవల ప్రత్యేకత ఏమిటంటే నేను సరిగా చెప్పలేనుగాని ఒక సందర్భంలో ఆంధ్రభూమి ఎడిటర్ సికరాజుగారు 'చండీప్రియ' ఆంధ్రభూమి పత్రికకి లైఫ్‌నిచ్చిందని అన్నారంటే ఆ నవలఎంత పాపులర్ అయ్యిందో అంచనావేయొచ్చు. అది అంజలీ పిక్చర్స్ ద్వారా సినిమాగా వచ్చింది. 'జీవన సంగీతా'నికి బహుమతి నిచ్చిన వి.మధుసూదనరావుగారే ఆ సినిమాని డైరెక్ట్ చేసారు. 'చండీప్రియ' తరువాత వచ్చిన 'పుష్యమి' నవలని విజయనిర్మలగారు సినిమాగా తీద్దామని హక్కులు కొన్నారుగాని ఎందుకో సినిమా తీయలేక చివరికి టీ.వి.సీరియల్‌గా కృష్ణగారు హీరోగా తీశారు. పుష్యమిని సినిమాగా చేయలేకపోవడం తన తీరని కోరికల్లో ఒకటని చెప్పుకొన్నారు ఆమె ఒక ఇంటర్వ్యూలో.

ఈ శతాబ్దపు మెగా సీరియల్‌గా 50వారాలపాటు 'ఆంధ్రభూమి'లో వచ్చిన మరొక నవల 'అష్టదళం' గురించి కూడా కొంత చెప్పాలి. అది పాఠకులను ఉర్రూతలూగించడమేకాదు. నాకొక ప్రత్యేకతనీ తెచ్చిపెట్టింది. పునర్జన్మలకూ, గుప్త నిధులకూ, ఆత్మలకూ సంబంధించి నేను చిన్నప్పట్నుంచి విన్న కథలూ, జనంలో ఉన్న నమ్మకాలు, భయాలూ... వాటిని ఆధారం చేసుకొని సోషియో ఫాంటసీ నవల...'అష్టదళం' వాశాను. ఆ సీరియల్ ప్రకటనే 14, 15 వారాలు ఫుల్‌పేజీలో కలర్‌లో బొమ్మలు వేసి ముందే పాఠకుల్లో ఒక భయాన్నీ, సస్పెన్సునీ నెలకొల్పి సీరియల్ ప్రారంభించారు. పధ్నాలుగు వారాల వరకు నాపేరు అజ్ఞాతంలో ఉంచి కొన్ని పడికట్టు పదాలనూ, శైలినీబట్టి పేరు కనుక్కున్నవాళ్ళకి చక్కని బహుమతి అని సంపాదకులు ప్రకటిస్తే పత్రికాఫీసుకు వచ్చిన వేలాది ఉత్తరాల్లో 'అష్టదళం' లాంటి సీరియల్‌ని రచయిత్రులు రాయలేరని దాదాపు అందరూ రచయితల పేర్లే రాశారు. చిట్టచివరికి 'అష్టదళం' లో దళాలు అక్షరాలైతే రచయిత్రి పేరు వస్తుందని దగ్గరగా క్లూ ఇచ్చాక ఒకరిద్దరు నాపేరు కనుక్కున్నారు.

రచయిత్రులదంతా వంటింటి సాహిత్యమంటుంటారు కదా, రచయితలు మాత్రమే రాయగలరనిపించే హారర్ నవల రాశానని గర్వపడిన సందర్భమది!

నాకు రచయిత్రి ఉత్తమగ్రంథంగా పొట్టి శ్రీరాములు తెలుగు

యూనివర్సిటీనుండి అవార్డు తెచ్చిపెట్టిన నవల 'నైనా'. అది 'వార్త'లో డైలీ సీరియల్‌గా వచ్చింది. మనిషి స్వచ్ఛత కోల్పోయాక ఎన్ని కోట్లు సంపాదించినా వ్యర్థమేనని చెబుతుందీ నవల.

కథనాయకుడు రాహుల్‌శర్మ తండ్రి చంద్రశేఖరశర్మ. నీతికీ నిజాయితీకి కట్టుబడి బీదరికాన్ని ప్రతిఘటించే ప్రయత్నం చేయడు. దరిద్రాన్ని దరిద్రంగా భావించక నిర్లిప్తంగా అనుభవించి ఏమీ లేకపోయినా అన్నీ వున్న ఆత్మతృప్తితో పోతాడు. చిన్నప్పటినుండి అనుభవించిన బీదరికాన్ని అసహ్యించుకున్న రాహుల్ డబ్బు సంపాదించి తనవాళ్ళని సుఖపెట్టాలన్న ఆలోచనతో చీకటిదారిలో అడుగుపెడతాడు. కోట్లు సంపాదిస్తాడు. ఎవరిని సంతోషపెట్టాలని సంపాదిస్తాడో వాళ్ళు...తల్లీ చెల్లి అది పాపిష్టిడబ్బుగా భావించి పైసా కూడా ముట్టుకోకుండా అతడినుండి దూరంగా వెళ్ళిపోతారు. అన్నీ ఉన్నా ఏమీ లేనివాడిలా అల్లాడిపోతాడు రాహుల్.

కోట్ల సిరులున్నా ఆ మనిషి తినేది అన్నమే, బంగారం కాదు. ఆ పిడికెడు అన్నంకోసం మనిషి ఇన్ని పాపాలు చేయనక్కరలేదు. ఆ వాస్తవాన్ని కొంచెం ఆలస్యంగానైనా అతడి జన్మసంస్కారం చెబుతుంది. అతడు ప్రేమించిన నైనా అదే చెబుతుంది. తను సంపాదించిన కోట్లాది డబ్బును తృణప్రాయంగా త్యజించి సత్ప్రవర్తనలో పడతాడు. నైనాను గెలుచుకుంటాడు.

వార్తలో డైలీ సీరియల్‌గా వచ్చిన మరొక నవల 'కొత్త బంగారులోకం'.

మతప్రచారం చేస్తూ మతం మార్పిడులకు పాల్పడుతున్నాడన్న నెపంతో ఒక చర్చి ఫాదర్ని అతడి పిల్లలతో సహా సజీవదహనం చేశారని, దానికి కారణం ఒక హిందూమతాభిమాని అని పత్రికల్లో చదివినప్పుడు 'మతమంటే ఒకరినొకరు చంపుకోవడమా...మనిషిని మనిషిగా గుర్తించని మతమెందుకు?' అనిపించింది. ఆ ఆవేదననుండి వచ్చింది 'కొత్త బంగారులోకం'

'మతమన్నది నాకంటికి మసకైతే, మతమన్నది నాకంటికి మబ్బైతే మతం వద్దు గితంవద్దు మాయామర్మం వద్దు' అంటాడు కృష్ణశాస్త్రి. మానవతను మించిన

మతం లేదంటాడు వివేకానందుడు. ఆ మాటలను ఆచరణలో పెట్టినవాడు ఈనవలలో కథానాయకుడు జితేంద్ర. ఒక సందర్భంలో 'నువ్వు హిందువా, క్రైస్తవుడివా' అన్న ప్రశ్నకు 'మనిషి అన్న స్పృహతప్ప ఏమతం వాడినన్న ఆలోచన నాకెప్పుడూ లేదు' అని చెబుతాడు.

మతమంటే మనిషి ఎలా ఉండాలో చెప్పేది. మతమంటే మనిషి ఎలా ఉండకూడదో చెప్పేది. పాశవికతను వురికొల్పేది, మతోన్మాదభూతాన్ని తట్టిలేపేది మతంకాదు. మనిషిని సచ్ఛీలుడిగా తీర్చిదిద్దడానికే మతాలు వుట్టాయి. పరమత సహనంలేని మతాభిమానం చాలా ప్రమాదకరమైనది.

మరొకనవల 'నౌకాగమనం' గురించి తప్పక చెప్పాలి.

నేను స్త్రీల సమస్యలను ప్రతి నవలలోనూ, ప్రతికథలోనూ ఎంతో కొంత చర్చిస్తూనే ఉన్నా పూర్తిగా స్త్రీల సమస్యలను తీసుకొని వ్రాసిన నవల 'నౌకాగమనం'. 1971లో ఎమెస్కో అధిపతి ఎం.ఎన్.రావుగారు అడిగితే రాసిచ్చాను.

స్త్రీవాదం అన్నమాట అప్పటికింకా బాగా ప్రాచుర్యంలోకి రాలేదు.

మగవాడు పెళ్ళాన్ని చావగొడితేనో, పడకింట్లో శాడిస్ట్‌గా ప్రవర్తిస్తేనో, సిగరెట్లతో వాతలు పెడితేనో మాత్రమే చెడ్డవాడు కాదు. భార్య చిన్న చిన్న ఇష్టాలనుకూడా పట్టించుకోనివాడు, ఆమెను కాలుక్రింద చెప్పులా చూసేవాడు, ఆమెకు ఆశలూ, ఆలోచనలూ వుంటాయని తెలుసుకోనివాడు కూడా చెడ్డభర్తే. ఇల్లాలు గృహహింసకు గురయ్యేది అలాంటి మగవాళ్ళవల్లే.

కుటుంబ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే భార్యభర్తల మధ్య ముఖ్యంగా ఉండాల్సింది సదవగాహన, సహనం! సర్దుకుపోవడం! కేవలం అది ఒక్కవైపునే ఉండడం కాదు. ఇద్దరిలో ఉండాలి. అవి ఏ ఒకరిలో లోపించినా సంసారం చిల్లులు పడిన నావ అవుతుంది. అది ఏదో ఒకరోజు మునిగిపోక తప్పదు. 'నౌకాగమనం' నవలలో అదే చెప్పడం జరిగింది. హక్కులు, అధికారాలు ఎవరో తెచ్చి అరచేతిలో పెట్టరు. అది ఎవరికి వాళ్ళు సంపాదించుకోవాలి. తమ ఆత్మగౌరవం ఎక్కడ మంటగలుస్తోందో, తమ వ్యక్తిత్వం ఎక్కడ కాలరాయబడుతుందో తెలుసుకొంటే

చాలు. చక్కదిద్దుకోవడం కష్టమేమీకాదు అని చెబుతుంది ఈనవలలోని కథానాయకి పాత్ర సత్యభామ.

సత్యభామ పెళ్ళయి సంసారజీవితంలో అడుగుపెడుతూనే అడుగడుగునా గాయపడి ఒక పాప పుట్టాక విడిపోతుంది భర్తనుండి. స్నేహితుల సహాయంతో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూనే లా చదివి లాయర్‌గా ప్రాక్టీస్ పెట్టి పేరూ డబ్బూ సంపాదించుకుంటుంది. అప్పుడు వస్తాడు ఆమె భర్త జగన్మోహన్. పశ్చాత్తాపం ప్రకటించి క్షమించమని వేడుకొంటాడు. సత్యభామ భర్తను క్షమిస్తుంది తన పాపకు తండ్రిప్రేమ దూరం చేయకూడదనుకోవడంవల్ల.

ఇంతా చేసి...మగడు పశ్చాత్తాపం ప్రకటించి క్షమించమని అడగ్గానే తరతరాల భావదాస్యానికి లొంగిపోయిందా అనిపిస్తుంది. కాని, నాకు మన కుటుంబవ్యవస్థమీదున్న గౌరవంతో ఆ నవలకి ఆ ముగింపు ఇవ్వకతప్పలేదు. తల్లిదండ్రుల ప్రేమ కరువైన పిల్లలు ఒక అసహజధోరణికి అలవాటై పెడత్రోవపట్టి...వాళ్ళవల్ల ఒక వికృతసమాజం ఏర్పడే ప్రమాదం ఉంది. కుటుంబంలో వ్యక్తులమధ్య బంధాలు ఎంత ఆరోగ్యంగా, బలంగా ఉంటే సంసారానికి అంత మంచిది. వీళ్ళున్న సమాజానికీ మంచిది.

ఆ నవలమీద కాత్యాయనీ విద్మహేగారి పర్యవేక్షణలో రజనీ అన్న తెలుగు లెక్చరర్ సిద్ధాంతవ్యాసం సమర్పించి కాకతీయ యూనివర్సిటీనుండి ఎం.ఫిల్ తీసుకుంది. తెలుగుభాషా సంరక్షణ సంఘం, జగిత్యాలవాళ్ళు సందేశాత్మక నవలగా పేర్కొంటూ తాపీధర్మారావు సాహితీ పురస్కారాన్ని అందజేశారు. ఇవికాక 'నౌకాగమనా'నికి మరొక గౌరవం కూడా దక్కింది. సహవాసి ఉమామహేశ్వరరావు అన్న ఆయన 'నూరేళ్ళ తెలుగునవల' అన్న పుస్తకంలో ఆయన పరిచయం చేసిన పాతిక సుప్రసిద్ధ నవలలతోపాటు ఈ శతాబ్దిలో వెలువడిన నవలల్లో చదువతగ్గ మరో 55 నవలలంటూ ఆయన ఇచ్చిన పట్టికలో 'నౌకాగమననా'నికి కూడా చోటు దొరికింది.

జరిగిన సంఘటనలు ఆధారంగా చేసుకుని వ్రాసిన నవలలూ, కథలూ ఉన్నాయి.

ఒకసారి మా బంధువులమ్మాయి కబుర్లు చెబుతూ "మా ఊళ్ళో జయరాం (పేరు మార్చాను) ఉన్నప్పుడు ఆడపిల్లలు నిశ్చింతగా స్కూళ్ళకీ, కాలేజీలకీ వెళ్ళేవాళ్ళు. ఎవడైనా ఆకతాయిగా అమ్మాయిలను అల్లరిపెడితే జయరాం చేతిలో వీడిపని అయిపోయినట్టే. మంచి బాడీబిల్డరు. ముఠాకక్షలతో అతడు హత్యకు గురయ్యాక మా ఊళ్ళో ఆడపిల్లలకు రక్షణ కరువైంది" అని చెప్పింది. ఎందుకో ఆ కారెక్టరు నాకు బాగా నచ్చింది. నేను ఆ ఊరికివెళ్ళి వాళ్ళనీ వీళ్ళనీ పట్టుకుని జయరాం కుటుంబసభ్యులను కలుసుకున్నాను. అతడి గురించి, అతడు హత్యకు గురైన పరిస్థితుల గురించీ వివరాలు సేకరించి 'ఇది-మన తపోభూమి' అన్న నవల వ్రాశాను. మా ఊళ్ళో జూనియర్ కాలేజీలో ఒక లెక్చరర్ విద్యార్థుల్లో విజ్ఞానతృష్ణను రగులుస్తూ, వాళ్ళను సత్ప్రవర్తనులుగా తీర్చిదిద్దుతూ అంకితభావంతో అహరహం శ్రమిస్తున్న అతడిని స్ఫూర్తిగా తీసుకుని విద్యారణ్య పేరుతో మరొకపాత్రని కూడా ఆనవలలో చిత్రించడం జరిగింది.

మరొక యథార్థ చిత్రణ 'అరుణ కిరణం' నవల.

విరించి (పేరు మార్చాను) ఒక ఫారిన్ రిటర్న్డ్ డాక్టరు, ప్రొఫెసర్‌కూడా. ఒక కలెక్టరుకు కొడుకు, ఆకాశవాణిలో 'ఏ' క్లాసుకి చెందిన సితార్ విద్వాంసుడు. ఇద్దరు స్త్రీలు భార్యలరూపంతో ఆయన జీవితంతో ఆడుకోగా మరొక స్త్రీ దగ్గర ఆయనకు స్వాంతన దొరుకుతుంది. కాని, ఆమె వివాహిత. ఇద్దరు పిల్లలకి తల్లి. ఆమెను చేరాలన్నా చేరలేని పరిస్థితి; ఆయన్ని మా పెద్దక్కకొడుకు వెంటబెట్టుకుని హైదరాబాద్‌నుండి మా ఊరికి వచ్చాడు. వాళ్ళు వచ్చేటప్పటికి బాగా చీకటిపడింది. వాళ్ళకి వంటచేసిపెట్టి రాత్రంతా కూర్చుని ఆయన చెప్పిందంతా క్యాసెట్లలో రికార్డు చేసుకున్నాను. ఆయన కథ విని నేను కదలిపోయాను. మనిషి ఎదిగినకొద్దీ మానసికంగా సున్నితంగా మారిపోతాడేమోననిపించింది ఆయన్ని చూస్తే. అరుణకిరణం పేరుతో నవలగా రాసాను. అది స్వాతి అనుబంధంలో ప్రచురించబడింది.

ఇంకొక యథార్థచిత్రణ 'చీకటిసూర్యుడు'

మా అబ్బాయిలిద్దరు అడ్వకేట్లుగా పనిచేస్తున్నారు. ఒకరోజు వాళ్ళ దగ్గరికి ఒక విడాకులకేసు వచ్చింది. ఆయన ఒక పుట్టు అంధుడు. భార్య ఉన్నతికి ఎంతో శ్రమించాడు. ఆమెను చదివించాడు. ఉద్యోగస్తురాలిని చేశాడు. ఏరుదాటి తెప్ప తగలేసిన చందంగా ఆమె విడాకులు కోరింది అతడినుండి. ఇష్టంలేని కాపురం బలవంతంగా ఎందుకని చట్టరీత్యా విడాకులు ఇవ్వడానికి మా పిల్లల దగ్గరికి వచ్చాడు. దాన్ని ఆధారంగా చేసుకొని నేను 'చీకటి సూర్యుడు' రాశాను. ఆ నవలకి పాఠకుల నుండి చాలా ప్రశంసలు వచ్చాయి. ఆ నవలని 'స్వాతి' అనుబంధంలో ప్రచురించింది.

నేను వ్రాసిన అర్వై అయిదు నవలల్లో కొన్నిటిని క్లుప్తంగా పరిచయం చేశాను. అన్నిటిగురించి చెప్పడం కుదరదుకదా! నేను కథలుకూడా 70, 80 దాకా వ్రాశాను.

నేను నవలలు మాత్రమే బాగా రాస్తాను, కథలు అంత బాగా రాయలేనని లోపలెక్కడో కొంచెం న్యూనతాభావం ఉండేది. ఇటీవల 'నవ్య' వారపత్రికలో నా ఇంటర్వ్యూ ప్రచురిస్తూ నాకు నచ్చినకథగా 'నివురు తొలగిన నిప్పు' అన్న నాకథను ప్రచురించారు. అది అంతకుముందు 'యువ' దీపావళి ప్రత్యేకసంచిక 1980లో ప్రచురితమైనదే. ఎన్నో కష్టాలుపడి కలెక్టర్‌స్థాయికి ఎదిగిన ఒక బీదవిద్యార్థి కథ అది. ఆ కథ చదివి అసంఖ్యాకంగా నాకు ఫోన్‌కాల్స్ వచ్చాయి. చీఫ్ ఇంజనీర్‌గా రిటైరయిన ఒకాయన పత్రిక మార్కెట్‌లో వచ్చిన ఉదయమే చదివి నాకు వెంటనే ఫోన్ చేశాడు. ఆ కథలో రమణలాగా చిన్నప్పుడు తన జీవితం చాలా బీదరికంలో గడిచిందనీ, ఆ బీదరికంలో తనకు సాయం చేసినవాళ్ళను గుర్తుపెట్టుకుని రమణలాగే పదింతలు సాయం చేశానని...ఆ కథ చదువుతుంటే కన్నీరాగలేదనీ....ఆయన భావోద్వేగంతో గొంతుపట్టుకుపోయినట్టుగా చెబుతుంటే ఏకథకైనా ఇంతకంటే ప్రయోజనమేముంటుందనిపించింది.

ఆ కథ కన్నడంలోకి, ఇంగ్లీషులోకి అనువాదమైంది.

వార్తాపత్రికలో వచ్చిన ఒక వార్తాకథనం కలిగించిన స్పందనతో వ్రాసిన

కథ 'మరణం అంచున మందహాసం'.

ఈ కథ 2007లో 'నవ్య' వారపత్రికలో వచ్చింది. ఇది హిందీలోకి అనువాదమై మహిళా చైతన్య సాంస్కృతిక సంస్థ 'లేఖిని' ప్రచురించిన కథాసంకలనం 'గుల్‌దస్తా'లో ఒక పువ్వుగా పరిమళించింది.

'ట్రెయిన్ చాలావేగంగా వెడుతూంది. లయబద్ధమైన దాని చక్రాల చప్పుడును బయట గాలిహోరు మింగేస్తోంది. గాలి, వాన పున్నమి నాగుల్లా పెనవేసుకుపోయి ప్రకృతి రంగస్థలంమీద ప్రళయనృత్యం చేస్తున్నట్టుగా ఉంది....' అంటూ మొదలయ్యే ఆ కథ ఎయిడ్స్ వచ్చిన ఒక లంబాడి యువతి కథ. కూతురికి వచ్చిన ఎయిడ్స్ జబ్బు తమకీ అంటుతుందేమోనన్న భయంతో కూతురిని పశువుల కొట్టంలో పడేసి బలవంతంగా కూతురి నోట్లో పురుగులమందు పోసి చంపాలనుకుంటుంది తల్లి. ఆమెనుండి తప్పించుకునిపోయి సోషల్ వర్కర్ దీపిక ఆశ్రయం పొంది – ఆమె శిక్షణలో...ఎయిడ్స్‌వల్ల చచ్చిపోతానేమోనన్న భయాన్ని జయించడమేకాదు – ఎయిడ్స్‌మీద యుద్ధంచేసే ఉద్యమంలో తనూ ప్రముఖపాత్ర వహిస్తుంది. 'ఎయిడ్స్‌రోగులకు మీనుండి కావలసింది కొంచెం ఆదరణ...ఆత్మీయమైన చిన్న పలకరింపు. అవే వాళ్లకు ఆరోగ్యానిస్తాయని, ఆయువును పెంచుతాయని మరువకండి. ఎయిడ్స్ రోగులూ మనుషులే. వాళ్ళకీ మనస్సుంటుంది. బతకాలన్న కోరికా ఉంటుంది. వాళ్ళని మీలో ఒకరిగా బ్రతకనీయండి. వాళ్ళని తాకితే వాళ్ళజబ్బు మీకు రాదు. వాళ్ళతో సంపర్కం పెట్టుకుంటే మాత్రం వస్తుంది..." అన్న సందేశాన్ని అందిస్తుందీ కథ.

తల్లి రెక్కల చాటున వెచ్చగా పెరిగిన పక్షిపిల్లలు రెక్కలొచ్చాక ఎగిరిపోయి తల్లెవరో, పిల్లలెవరో అన్నట్టుగా అవుతాయి. జంతువులైనా అంతే. ఒక వయసు వచ్చాక అమ్మను వదిలిపోయి తమ బతుకు తాము బతుకుతాయి. అది ప్రకృతి సహజం. ప్రకృతి విధానమది, కాని మనుషులకు అది ప్రకృతి విధానం కాదు. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక వృద్ధాప్యంలో తల్లిదండ్రులను వదిలిపోవడం ధర్మం కాదు. బిడ్డను తన రక్తమాంసాలు కరిగించికంటుంది అమ్మ. అమృతతుల్యమైన ప్రేమను పంచి అల్లారుముద్దుగా పెంచుతుంది. జీవితాన్నిస్తాడు నాన్న. అలాంటి అమ్మనీ,

నాన్ననీ వృద్ధాప్యంలో ఎలా చూచుకోవాలో...తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లలకు కనువిప్పుగా 'గుర్తుకొస్తున్నాయి' కథ రాశాను. స్వాతి మాసపత్రికలో ప్రచురితం.

రోడ్డుమీద ఎవరికైనా ఏక్సిడెంటు అయి చావుబతుకులమధ్య కొట్టుకొంటుంటే చూసి 'మనకెందుకులే దగ్గరికి వెడితే పోలీసులతో తంటా' అని తమ దారిన తాము వెళ్ళిపోకుండా, వాళ్ళని వెంటనే హాస్పిటల్‌కి తీసికెళ్ళి వైద్యం చేయించి ప్రాణదానం చెయ్యమని చెప్పి...మనిషికి తన కనీసబాధ్యతను గుర్తుచేసే కథ 'కన్నీరు పన్నీరైన వేళ....'.

మనం మంచిగా బతకాలనుకోవడం ఒక అందమైన గులాబీ పువ్వుగా పుట్టాలనుకోవడం లాంటిది. గులాబీ పువ్వుగా పుట్టాలనుకుంటే ముందు ముళ్ళకొమ్మగా మొలవక తప్పదు. అలాగే మనం మంచిగా బతకాలనుకోవడం...ముందు ఎన్నో కష్టాలు, ఎన్నో స్వార్థత్యాగాలూ, ఎంతో ఆత్మక్షోభ...అవన్నీ దాటిన తరువాతనే మనం మంచివాళ్ళం కాగలమనిపించే 'ముళ్ళగులాబి'.

కులాలనుబట్టి వ్యక్తిత్వాలను నిర్ణయించడంకంటే, వ్యక్తిత్వాలనుబట్టి, గుణాలనుబట్టి కులాలలను నిర్ణయించడం మంచిదని చెప్పే కథ 'వెలసిన శిఖరాలు'. ఇది దీపావళి సంచిక యువలో ప్రచురితం.

పెళ్ళయిన మగవాళ్ళు ప్రణయంలో పడితే వాళ్ళ కొంపేమీ మునగదుకాని, పెళ్ళయిన మగవాళ్ళతో ప్రేమలో పడిన ఆడపిల్లకు మాత్రం కొంప మునుగుతుందని చెప్పే 'ఒక తుఫాను ఆగింది' కథ. ఇది యువలో ప్రచురితం.

'నిధి' కథ మా ఇంట్లో యథార్థంగా జరిగిందే. ముందుగా అది దీపావళి యువ సంచికలో ప్రచురింపబడి భార్గవీరావు వందకథల సంకలనం 'నూరేళ్ళపంట'లో చోటు చేసుకుంది. మా నాన్నగారు చితికిపోయిన సమయంలో కోర్టులో కేసు గెలిచి దాయాదుల ఆస్తి కలిసొచ్చినా అదికూడా క్రమంగా పోగొట్టుకొని పరమ దరిద్రం అనుభవిస్తున్న సమయంలో ఒక మంత్రగాడు తారసపడి, హాల్లో పాతబడిన పెద్దరోటి క్రింద ధనం నిక్షిప్తమై ఉందని చెప్పడంతో దాన్ని పొందడానికి

మా ముగ్గురు అన్నగార్లు పడిన అవస్థలూ, చివరికి లోతుగా పాతబడిన రోటిని పెకలించడంలో ఒళ్ళంతా హూనమై నిధి దొరకలేదుగాని అలసట జ్వరాలు పట్టుకుని మంచం దిగలేదు. మంత్రగాళ్ళ మోసాలు ఎలా వుంటాయో చెప్పినకథ 'నిధి'.

మరొక కథ 'దరిచేరిన పడవ!' వాస్తవంగా జరిగిన సంఘటన ఆధారంగా వ్రాసిందే. సదాచార సంపన్నులైన బ్రాహ్మణుల ఇంటికోడలు పార్వతి (పేరు మార్చాను). ఆమెకు నలుగురు ఆడపిల్లల తరువాత కొడుకు పుడతాడు. లేకలేక మగపిల్లాడు పుట్టాడన్న ఆనందం ఆ కుటుంబం పూర్తిగా అనుభవించకముందే ఒక అవాంఛనీయ సంఘటన జరుగుతుంది. తమ ఇంట్లో అద్దెకుండే యువకుడితో ఆ అయిదుగురు బిడ్డలతల్లి రంకు సాగించడం అత్తామామ కంటపడుతుంది. చెడిపోయిన ఆడదానికి ఇంట్లో స్థానం లేదని నిర్ధాక్షిణ్యంగా ఆమెను బయటికి గెంటుతారు. తనను క్షమించి ఇంట్లో వుండనిస్తే మరోసారి ఆ తప్పు తనవల్ల జరగదని ఎంత ప్రాధేయపడినా వాళ్ళు వినరు. ఆమె వెళ్ళి ఒక సోషల్‌వర్కర్‌ను ఆశ్రయిస్తుంది. పిల్లల తల్లిని...అదీ ఆడపిల్లల తల్లిని పతితగా ముద్రవేసి బయటికి పంపడంవల్ల జరిగే అనర్థాలు ఆ సోషల్‌వర్కర్ వాళ్ళ ఇంటికి వెళ్ళి వివరిస్తుంది. తల్లి పతితగా ముద్రపడితే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళుకావడం కష్టమౌతుందని, పెరిగి పెద్దవుతున్నకొద్దీ కొడుకు బతుకు నవ్వులపాలవుతుందనీ...ఆమెను క్షమించి ఆమె తప్పుదిద్దుకునే అవకాశం ఇచ్చి చూడమని నచ్చజెప్పుతుంది. కథ సుఖాంతం. కానీ యథార్థంగా జరిగిందేమిటంటే కథలోలా ఆమెను ఏ సోషల్‌వర్కరూ ఆదుకోలేదు. కులటగా ముద్రపడి రోడ్డుమీద తరిమివేయబడిన ఆమె మగడిమీద, అత్తామామలమీద కసి తీర్చుకొంటున్నట్లుగా బజారు రౌడీగా మారిపోయింది. వయసొచ్చిన ఆ నలుగురుకూతుళ్ళు కులంవాళ్ళు పెళ్ళి చేసుకోవడానికి ముందుకు రాకపోవడంతో ఎవరు దొరికితే వాళ్ళను కట్టుకుని వాళ్ళబాధలు వాళ్ళు పడుతున్నారు. బజారుస్త్రీగా ముద్రపడిన ఆమె రంకు కథలు వింటూ ఆ కుటుంబం క్రుంగిపోని రోజంటూ లేదు. ఇది నిజంగా మా ఊళ్ళో జరిగిన కథ.

అలాంటిదే మరొక కథ 'పతితల్లో పతివ్రతలు'.

ఏదో ఒక బలహీనక్షణంలో తప్పుచేసిన ఆడదాన్ని ఇంట్లోంచి గెంటి

బజారుపాలు చేస్తే అందరి జీవితాలు నరకంగా మారిపోతాయి. అదే...ఆమెను పెద్దమనసుతో క్షమించి ఆమె తప్పును దిద్దుకోవడానికి ఒక అవకాశం ఇచ్చి చూస్తే...అని చెప్పే కథ.

స్త్రీవాదం, దళితవాదం,...ఇలాంటివేవీ నాకు తెలియవు. కాని నాటి 'బాటసారి' నుండి నేటి 'చీకటిసూర్యుడు' వరకు ఒక మానవతావాదం పాఠకుడు చెవిపెట్టి నిశ్శబ్దంగా వింటే చీకటిరాత్రిలో ఒక తాత్వికుడు మీటే ఏక్‌తారలా వినిపిస్తుంది.

చండీప్రియ నాకు బాగా పేరు తెచ్చిపెట్టిన నవల. అందులో హీరో నాస్తికుడు కాబట్టి బాబాలనీ, మహిమలనీ నిరసిస్తుంటాడు. ఆ నవలని సినిమాగా తీసిన అంజలీదేవి దంపతులేమో ఆస్తికులు, బాబాభక్తులూ కదా. ఒక నాస్తికుడి కథ ఎలా నచ్చింది?' అని అడిగాను. 'దైవత్వం' కంటే మానవత్వం గొప్పదికదా! అది ఉంది మీ నవలలో. అది మా వారికీ నాకూ ఎంతో నచ్చింది' అని చెప్పారామె.

మా వనపర్తికి పదిపన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెబ్బేరు గురించి కూడా కొంచెం చెప్పాలి. మా బావగారికి పెబ్బేరులో మాధ్యమిక పాఠశాలకి ట్రాన్స్‌ఫరైనప్పుడు అక్కడ మూడు నాలుగు సంవత్సరాలున్నాం. అక్కడే నా రచనా వ్యాసంగం ఊపందుకొని పత్రికల్లో రావడం మొదలైంది. అక్కడ గడిపిన రోజులు నాకు మధురమైన జ్ఞాపకాలను మిగిల్చాయి. నా వివాహం మా బావగారి మేనల్లుడు సుదర్శనరావుగారితో జరిగింది అక్కడ ఉన్నప్పుడే. హైవే ఊరిపక్కనుండి పోవడంవల్ల ఇప్పుడది బాగా అభివృద్ధి చెంది మండల కేంద్రమైందికాని, అరవయ్యేళ్ళ క్రితం అది బాగా పల్లెటూరు. ఊరినిండా బావులున్నా తాగడానికి పనికి వచ్చేవి కాదు. కందిపప్పు ఉడికేదికాదు. మంచినీళ్ళు ఊరవతల పంటకాలవనుండి తెచ్చుకునేవాళ్ళం. మా ఇంట్లో ఒక రాగిబిందె ఉండేది. చింతపండుతో ఎర్రగా తోమి కాలువనీళ్ళతో కడిగి బిందెనిండా నీళ్ళు నింపుకుని చంకలో పెట్టుకొని వచ్చేదాన్ని. ఆ కాలవ పంటపొలాలమధ్య ఉండేది. చుట్టూపచ్చగా వరిపైరులు. కొంచెం దూరంగా చెరువుకట్ట, ఇంకా కొంచెం దూరంగా పెళ్ళికూతురు మేలిముసుగు కప్పుకొన్నట్టుగా నీలికొండలు, పైరులమీద ఎగిరే తెల్లటి కొంగలు...కొంచెం మబ్బులు ముసిరాయంటే

ఆ ప్రకృతి సౌందర్యం వర్ణనకందనిది. ఒక్కోసారి చెరువుకట్టమీదికి వెళ్ళి చెరువులోకి చూస్తూ కూర్చునేదాన్ని. అప్పుడూ ఇప్పుడూ కూడా ప్రకృతి అంటే నాకిష్టం! భగవంతుడు మనకోసం అన్ని అందాల్ని సృష్టించాడు అనిపిస్తుంది. ఆ అనుభవాలు ఉన్నందుకేమో నాకథల్లో, నవలల్లో చేసిన ప్రకృతి వర్ణనలు చాలా సహజంగా వచ్చాయనుకొంటాను.

ఎప్పుడోగాని నాట్లువేసి కలుపుతీసే జనాలుండేవాళ్ళుకాదు. నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా ఉండే చేలమధ్య సన్నని ఒడ్డుమీద నడవడం, ఆకుపచ్చ తివాసీపరచినట్టుగా ఆ వరిపైరులూ...ఆ రామణీయకత ఇప్పటికీ నాకళ్ళకు కట్టినట్టుగా ఉంటుంది.

ఇప్పుడున్న పరిస్థితులలో ఒక టీనేజ్ అమ్మాయి అలా ఊరవతల పొలాల్లో ఒంటరిగా తిరగడం ఊహించనుకూడా ఊహించలేం. ఆనాడు ఏ అవాంఛనీయ సంఘటనా జరగలేదు. జరుగుతుందన్న ఊహకూడా వచ్చేది కాదు. నాకుగాని, మా ఇంట్లోవాళ్ళకిగాని! మనుషుల్లో ఆనాడున్న స్వచ్ఛతను ఈనాడు దేశం ఎందుకు కోల్పోయిందో అనిపిస్తుంది.

పెబ్బేరులో ఉండగా చదివినన్ని పుస్తకాలు మళ్ళీ ఎక్కడా చదవలేదు. మా బావగారు స్కూల్ లైబ్రరీనుండి పట్టుకొచ్చే పుస్తకాలేకాక డిటెక్టివ్ సాహిత్యం కూడా విరివిగా చదివాను. డిటెక్టివ్ భయంకర్, విషకన్య, నెరజాణలాంటి పుస్తకాలు సీరియల్స్‌గా వచ్చేవి. కొంచెం తెలుగు చదవడం వచ్చిన పల్లెటూరి యువకులకి డిటెక్టివ్ పుస్తకం కరభూషణంగా ఉండేది. నేను వ్రాయడం మొదలుపెట్టాక పాత్ర చిత్రీకరణలోనేకాక సన్నివేశాలు సహజంగా, కళ్ళకు కట్టినట్లుగా రాయడంలో ఆనాటి డిటెక్టివ్ సాహిత్యపఠనం దోహదపడిందని చెప్పక తప్పదు.

1970 నుండి 90 వరకు తీరికలేని దినచర్య నాది. ఇంట్లో పనిపాటలు, వంటావార్పు, బంధువుల రాకపోకలు, అతిథి మర్యాదలు, వృద్ధుల సేవలు...నన్ను పెంచుకొన్న మా అక్కయ్య పదేళ్ళు మంచంలో ఉంది పక్షవాతం రావడంవల్ల. మా బావగారు చివరిదశలో మంచం మీదున్నారు. కోడలితో పడక మా అమ్మకూడా నాదగ్గరుండేది. వాళ్ళకి అన్నీ సమయానికి చేసిపెట్టి, ఎలాగో తీరిక చేసుకొని రాసుకోవడం...బాగా పుస్తకాలు చదివే అలవాటుండటంవల్ల రాత్రి పడుకునేటప్పుడు

ఏపత్రికో, పుస్తకమో పట్టుకోవడం, అంత బిజీగా ఉండి వాసిన నవలలు ప్రేమపూజారి, చండీప్రియ, పుష్యమి, మంచుముత్యం లాంటి నవలలు చాలా పాప్యులర్ అయ్యాయి.

నేను మౌనాన్ని ఎక్కువగా ఇష్టపడతాను. బహుశః నేను పెరిగిన వాతావరణం ఇందుకు దోహదం చేసియుండవచ్చు. మా బావగారు జిల్లాలో పేరుపొందిన గణితోపాధ్యాయులు. హైస్కూల్లో టీచరుగా చేస్తున్నపుడే టెంత్‌క్లాసుకి రేఖాగణితం, పిల్లలందరికీ పనికివచ్చేలా సంజీవనీ గణితం రాశారు. స్కూలు తప్పితే ఇల్లు. ఇంట్లోకి ఏవైనా అవసరమైతే బజారుకి వెళ్ళి తెచ్చుకోవడం. ఎవరిళ్ళకీ వెళ్ళి కబుర్లు చెప్పుకునే అలవాటు లేదు. రాట్నం వడుకుతూ గంటలు గంటలు కూర్చునేవారు. ఆ వడికిన దారాన్ని కండెలుగా మార్చి చేనేతదుకాణంలో ఇచ్చి తాను కట్టుకునే పంచెలు, తువాళ్ళు తెచ్చుకునేవారు. మా బావగారి దగ్గర ఒక హార్మోనియం పెట్టె వుండేది. శ్రీగణనాథ, వరవీణ లాంటి చిన్నగీతాలు వాయించేవారు. నేనూ చిన్నప్పుడు సరదాపడి కొద్దిగా నేర్చుకున్నాను. మా బావగారి తదనంతరం స్టోర్‌రూంలో పెట్టిన ఆయన హార్మోనియం పెట్టె చెదలు తినిపోయింది. ఇక మా అక్కయ్య...కుట్లు అల్లికలంటే ఆమెకు ఇష్టం. ఎప్పుడూ కుట్టుకుంటూ కూర్చొనేది. తనకీ ఓ రాట్నం ఉండేది. తనూ వడికేది. ఇల్లెప్పుడూ నిశ్శబ్దంగా ప్రశాంతంగా వుండేది. అటు మా అమ్మవాళ్ళింట్లో ఎప్పుడైనా వెళ్ళినా ఇంతే. శరీరాన్ని సుఖపెట్టకూడదంటూ ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూ ఉండేది మా అమ్మ. రాత్రిపూట పడుకున్నపుడు ఏవో తత్వాలు పాడుకుంటూ అలాగే నిద్రపోయేది. ఆవిడ దాదాపు వందసంవత్సరాలదాకా బతికింది. మా నాన్నగారిదీ చాలా గంభీరమైన స్వభావం! చాలా మితభాషి.

నాకు తోటపని అంటే ఇష్టం! నా అభిరుచిమేరకు మా ఇంటి ఆవరణలో చిన్నతోట పెంచుకొన్నాను. పక్షులన్నా పావురాలన్నా ఇష్టం. వందలకొద్దీ రంగరంగుల పావురాలు నా సంరక్షణలో ఉండేవి. పిల్లులు వాటిని ఎత్తుకుపోవడం మొదలయ్యాక చూడలేక తీసేశాను. గుడ్లను పొదుగుతున్న ఒక ఆడ పావురాన్ని పిల్లి నోట కరుచుకుపోవడం కళ్ళారా చూసి... చలించిపోయి 'కపోతవిలాపం' అన్న కథ రాశాను. దాన్ని 'స్వాతి' అనుబంధంలో ప్రచురించింది. మాతోటలో ఎన్నోచెట్లతో

పాటు ఎర్ర చందనం చెట్లుకూడా ఉన్నాయి. ఆ చెట్టు కాయలు పళ్ళైనపుడు వాటిని తినడానికి వచ్చే కోయిలలు చేసే సందడికి మాతోట అదిరిపోతూ వుంటుంది.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే రచయితలకైనా, ఏ కళాకారులకైనా తమ చుట్టూ చక్కని వాతావరణం సృష్టించుకోవడం వాళ్ళ సృజనాత్మకతకు దోహదం చేస్తుందని చెప్పడానికే. వాళ్ళ వ్యక్తిత్వం వాళ్ళ రచనల్లో ప్రతిబింబిస్తుందని నా నమ్మకం!

'స్త్రీ చైతన్య స్రవంతి' పేరుతో మహిళాభ్యుదయ సంస్థ స్థాపించి అధ్యక్షురాలిగా మూడు సంవత్సరాలపాటు వయోజన విద్యావ్యాప్తికి కృషిచేయడం, స్త్రీల సమస్యలమీద సభలూ, సమావేశాలూ, సెమినార్లు నిర్వహించి క్రింది తరగతి స్త్రీలకు తోడ్పడే కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. 'స్త్రీ చైతన్య స్రవంతి' ద్వారా మేము నిర్వహిస్తున్న సభలకు శ్రీమతి మల్లాది సుబ్బమ్మగారు వక్తగా రావడం జరిగింది. ఆమె మా కార్యక్రమాలు చూసి ఆమె ప్రతియేటా ఇచ్చే ధర్మనిధి పురస్కారానికి 1995లో తెలుగు యూనివర్సిటీకి నాపేరు సూచించడం జరిగింది.

ఆ సంస్థలో పనిచేయడం వల్ల సోషల్‌వర్క్ నిర్వహించడంలో ఉండే సాధకబాధకాలు నాకు తెలిసొచ్చాయి. మహిళామండళ్ళ తీరుతెన్నులు కూడా తెలిశాయి. 'నైనా' నవలలో 'నైనా' పాత్రని సోషల్‌వర్కర్‌గా తీర్చిదిద్దడంలో ఆ అనుభవం నాకెంతో ఉపకరించింది.

రచయిత్రి కావడంలో మీ లక్ష్యం ఏమిటి? అని అడుగుతుంటారు కొంతమంది. నిజం చెప్పాలంటే రచయిత్రి కావడంలో లక్ష్యం, ఆశయం అంటూ ఏమీలేవు. రాయాలనిపించి రాయడం మొదలుపెట్టాను. అయితే రచయిత్రిగా కొంత పేరు వచ్చాక సమాజంపట్ల కొంత బాధ్యత ఫీలవుతున్నాను. తమాషా సంగతి ఏమిటంటే తెలిసీ తెలియని వయసులో ఎమోషనల్‌గా రాసిన నవలలే ఇప్పటికీ పాఠకులకు గుర్తున్నాయి. ఇప్పుడు బాధ్యత ఫీలవుతూ సమకాలీన సమాజానికీ, సమస్యలకూ దగ్గరగా ఉన్న రచనలు, ముఖ్యంగా సందేశాత్మక రచనలు చేస్తుంటే పాఠకులు, పత్రికలు అంతగా ఇష్టపడడం లేదేమోననిపిస్తోంది. ఎందరో

సమర్థవంతమైన రచయితలు ప్రయోజనాత్మకంగా వ్రాయగలిగి ఉండీ థ్రిల్లర్స్, హారర్స్, సెక్స్ వెల్లువలో కొట్టుకుపోవడం మనం చూస్తున్నాం. మనకున్నది వ్యాపారపత్రికలు కాబట్టి అందులో ప్రచురితమయ్యే నవలలు కమర్షియల్‌గా రాయక తప్పడం లేదు. నేనూ ఆ వెల్లువలో కొంతవరకు కొట్టుకుపోయినదాన్నే. అదొక నిస్సహాయస్థితి. రచయిత తనను తాను మోసం చేసుకోక తప్పని పరిస్థితి. సమస్యాత్మకమైన రచనల్ని ఏ కొద్దిమంది మేధావి పాఠకులో చదివి ఆదరిస్తారేగాని మెజారిటీ పాఠకులకు సమస్యలను చర్చించే రచనలు నచ్చవు. వాళ్ళకు కావలసింది మానసోల్లాసం. జీవితంలోని ఇబ్బందులు, నిరాశా నిస్పృహలు కొద్దిసేపైనా మరిచిపోవాలని చదివే పాఠకులను దృష్టిలో పెట్టుకుని నడుస్తున్నాయి పత్రికలు. అందుకే ఎంత గొప్ప రచయితలైనా పాఠకుల అభిరుచి స్థాయికి దిగజారి రాయవలసి వస్తోంది. ఈ పరిస్థితి మారాలి. రచయిత తన స్థాయికి పాఠకుడిని తీసికెళ్ళగలిగినరోజు పత్రికల స్వరూపమే మారిపోయి ఒక ఆరోగ్యవంతమైన మార్పు చోటు చేసుకుంటుందని నాకనిపిస్తూ ఉంటుంది.

నవలల సంగతి వదిలిపెడితే ఈనాడొస్తున్న కథలు మాత్రం అంత తేలిగ్గా తీసేయాల్సినవి కావు. పాఠకుల్లో ఒక స్ఫూర్తినీ, ఒక ప్రయోజనాన్నీ ఉద్దేశించే వస్తున్నాయనిపిస్తుంది. కుటుంబాలలోని అనుబంధాలు, ఆత్మీయతలు... మధ్యతరగతి జనాలు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు... ముఖ్యంగా ఆర్థిక సమస్యలు, శాస్త్రసాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులు... సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలు. అనేకం మనకళ్ళ ముందుంచుతున్నాయి. ఆణిముత్యాలనతగ్గవి మన రచయితలు వ్రాస్తున్నారుకాని, వాటిని గీటురాయిమీద గీచి వెలకట్టే సద్విమర్శకులు లేరు. ఉన్న కొద్దిమంది పాడిందే పాడినట్టుగా వెనకటితరం రచనలకే పరిమితమయ్యారనిపిస్తుంది. అదపాదడపా ఈనాడొస్తున్న కథలను, నవలలను విశ్లేషించినా అవి మగవాళ్ళ రచనలకే పరిమితమౌతున్నాయి. రంగనాయకమ్మ, బీనాదేవిలాంటి ఒకరిద్దరు రచయిత్రులవి తప్ప మిగతా రచయిత్రులవి పట్టించుకొన్నవాళ్ళే లేరు. రచయితలకు ధీటుగా రచయిత్రులు రాస్తూ వున్నా అన్నిరంగాలలో వివక్షకు గురి అయినట్టే ఇక్కడా అవుతున్నారు. 'ఆ ఆడవాళ్ళేం

రాస్తారులే' అన్న ధోరణి. తమ గురించి తాము చెప్పుకోడానికైనా రచయిత్రులనుండి విమర్శకులు రావలసిన అవసరం ఎంతైనా వుందని నాకనిపిస్తుంది.

పెళ్ళి, పిల్లలు, సంసార ఝంజాటం, రచనా వ్యాసంగం... ఆ ఉధృతం కొంత తగ్గుముఖం పడుతుంటే మనసు అంతర్ముఖమైన తరుణంలో నాకు బుద్ధా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీతో పరిచయం ఏర్పడింది. 'శ్వాసమీద ధ్యాస' ఇది గౌతమబుద్ధుడు ఏర్పరచిన ధ్యానపద్ధతి. దీనినే 'ఆనాపానసతి' అన్నాడు. 'ఆన' అంటే ఉచ్ఛ్వాస, 'పాన' అంటే నిశ్వాస. 'సతి' అంటే కూడి వుండడం అని అర్థం. మరొకమాట కూడా చెప్పాడు గౌతమబుద్ధుడు. 'అప్పో దీపోభవ!' అంటే 'నీ దీపాన్ని నువ్వే వెలగించుకో!' అని. మరుగుపడిన ఆ ధ్యానపద్ధతిని సుభాష్‌పత్రీజీ వెలికి తెచ్చి ప్రచారం చేస్తున్నారు. మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసాలను గమనిస్తూ పోతే నెమ్మది నెమ్మదిగా ఆలోచనలు తగ్గి శూన్యావస్థకు చేరుతుంది మనసు. ఆ ఆలోచనారహిత స్థితిలో శరీరం వెలుపల ఉన్న విశ్వమయ ప్రాణశక్తి అపారంగా మనలోకి ప్రవేశిస్తుంది. దీనివల్ల హీలింగ్ జరిగి శరీరాన్ని అంటిపెట్టుకొని వున్న మొండిరోగాలు వదిలిపోతాయి. స్థూలశరీరంనుండి సూక్ష్మశరీరం విడివడి ఆస్ట్రల్ ట్రావల్ అనుభవాలు ఎదురవుతాయి. ఆలోచనలు తగ్గి శూన్యానికి చేరుతున్న ఆ దశ... జన్మజన్మలుగా తలమీద భారంగా మోస్తున్న చెత్తబుట్టను క్రిందికి దింపి, ఓ చెట్టునీడకు చేరి, చెట్టుమానుకు జారగిలబడి విశ్రాంతి తీసుకుంటున్నట్లుగా హృదయం తేలికపడుతుంది.

ప్రతిఒక్కరు జీవితంలో ఎక్కడో ఒకచోట ఆగి...అంతర్ముఖంగా ప్రయాణం సాగించాల్సిన అవసరముంటుందని నా ఉద్దేశ్యం. బుద్ధా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ పరిచయాన్ని పురస్కరించుకొని 'కాయపుటూపిరిలో...గని' అన్న కథ రాశాను. అది చేతన ప్రచురించింది.

తరువాత నేను ఋషి ప్రభాకర్‌జీ స్థాపించిన సిద్ధసమాధి యోగాలో కూడా శిక్షణ పొందాను.

శిక్షణ సందర్భంగా శంకరపల్లిలో, వినుకొండలో సిద్ధసమాధియోగా శ్రమాలలో గడపడం జీవితంలో మరిచిపోలేని అనుభూతిని మిగిల్చింది.

ఊరికి దూరంగా కొన్ని ఎకరాల స్థలంలో పచ్చనిచెట్ల మధ్య చుట్టూ ఓపెన్‌గా వదిలి పర్ణశాల టైప్‌లో రెల్లుగడ్డి కప్పుతో నిర్మించిన దానిలో మాకు శిక్షణ తరగతులుండేవి. ఆ ఆశ్రమవాతావరణం...ఋషివాక్కులు...రావుడ్ వంటి సాత్వికాహారం తీసుకోవడం...ధ్యాన, పాణాయామ, యోగాసనాల సాధన.... జీవితంలో కొత్త వెలుగులు నింపాయనుకుంటాను. అక్కడ జరిగిన ఒక సంఘటనను పురస్కరించుకుని 'గుర్తుకొస్తున్నాయి' కథ రాశాను. దాన్ని స్వాతి ప్రచురించింది.

ఉదయం ప్రాణాయామంతో మొదలయ్యే దినచర్య రాత్రి మెడిటేషన్‌తో ముగుస్తుంది. జీవితం సరైన మలుపునకు తిరిగిందన్న తృప్తి నాకుంది.

జీవితంలో నేను గర్వపడిన సందర్భాలు, తీపిగుర్తులు ఉన్నాయి.

నవసాహితీ పబ్లిషర్స్ ప్రకాశరావుగారు డైరెక్ట్ నవలలు కావాలని మరీమరీ అడిగితే 'ప్రేమికారాణి', 'తామరపువ్వు' నవలలు వ్రాసిచ్చాను. ఆ రెండునవలలూ చదివి కళాప్రపూర్ణ శ్రీ వేదుల సూర్యనారాయణశర్మగారు నాకు లెటర్స్ వాశారు. స్త్రీల సమస్యలపట్ల చక్కని అవగాహన ఉన్న రచయిత్రిగా ఆయన నన్ను ప్రశంసించారు. అందులో తామరపువ్వులో దొర్లిన ఒక తప్పును ఆయన సహృదయంతో ఎత్తి చూపారు. అంత పెద్దవారు...నాకు పూర్తిగా అపరిచితులైన ఆయన నాకు వ్యక్తిగతంగా లేఖలు వాసి నాకు అభినందనలూ, ఆశీస్సులూ అందజేయడం నాకు ఆనందాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ కలిగించింది. ఆయన ఉత్తరాలు నా దగ్గర భద్రంగా ఉన్నాయి. బాటసారి వచ్చిన పాతికేళ్ళ తరువాత గుర్తుచేసిన ఇంగ్లీష్ లెక్చరర్ లెటరుకూడా గుర్తుపెట్టుకున్నాను. 2011లో 'సుశీలా నారాయణరెడ్డి' అవార్డును శ్రీ నారాయణరెడ్డిగారి చేతులమీదుగా అందుకోవడం కూడా నాకొక మధురమైన జ్ఞాపకం!

ఇటీవల రెండుసార్లు తిరుమల కొండ కాలినడక వెళ్ళి శ్రీవారి దర్శనం చేసుకొన్నాను. కష్టపడి చేసుకున్న శ్రీవారి దర్శనం అపురూపమనిపించింది.

అమృతలతగారి నుండి అమృతలత జీవనసాఫల్య పురస్కారం అందుకొన్న సందర్భంగా ఒక ప్రముఖ స్త్రీవాద రచయిత్రి 'మీరు చల్లిన విత్తనాలతో మేం పంటలు

పండిస్తున్నాం' అన్నపుడు నాకు చాలా సంతోషమనిపించింది. గుర్తుపెట్టుకోవలసిన కామెంటే కదా!

కథ...కవిత...నవల ఏదైనా గొప్ప గొప్ప సందేశాలిస్తేనో, ఆదర్శాలు వల్లిస్తేనో ఉత్తమ రచన అవుతుందనుకోను. మనుషుల్లో మరుగునపడిపోతున్న మానవతావిలువలను తట్టి మంచిదారిలో నడవడానికి స్ఫూర్తినివ్వగలిగితే ఏ రచనకైనా ప్రయోజనం చేకూరినట్టేనని నా ఉద్దేశ్యం. రచనలో సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించడం ఎంత ముఖ్యమో సమాజహితాన్ని కోరడం అంతే ముఖ్యం.

మనిషిలో మంచీ చెడు రెండూ ఉన్నాయి. చెడును ఎక్కువగా తమ రచనల్లో ఫోకస్ చేయడంవల్ల సమాజంలో మంచికి గుర్తింపులేకుండా పోతుంది. మంచిసాహిత్యానికి కొలతలూ, తూనికలూ లేకపోవచ్చునేమోగాని మనిషికి మంచిచేసేది, కొంచెం మంచితనం నేర్పేది ఉత్తమసాహిత్యమని నా ఉద్దేశ్యం. నేను నా రచనల్లో ఇదే పాటించాను. రచనలు చేయాలనుకొన్న ఎవర్కైనా ఇదే అనుసరణీయమని నా ఉద్దేశ్యం.

నాకొచ్చిన అవార్డులు చెప్పడం భావ్యమనుకొంటాను :

1991లో అభినందన సంస్థనుండి శ్రీమతి మాదిరెడ్డి సులోచన స్మారక అవార్డు.

1995లో శ్రీమతి మల్లాది సుబ్బమ్మగారి ధర్మనిధి పురస్కారం – తెలుగు యూనివర్సిటీ నుండి.

2011లో సుశీలా నారాయణరెడ్డిగారి అవార్డు రసమయినుండి

2013లో శ్రీమతి అమృతలతగారి 'అమృతలత జీవనసాఫల్య పురస్కారం'

2010లో రచయిత్రి ఉత్తమగ్రంథంగా 'నైనా'కి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుండి.

2013లో నౌకాగమనం నవలకు తాపీ ధర్మారావు పురస్కారం.

జీవన సంగీతం నవలకు సినీ డైరెక్టర్ వి. మధుసూదరావుగారి నుండి 'ప్రేమబంధం' నవలకు ఆంధ్రజ్యోతి వీక్లీ నుండి

ఆంధ్రభూమి వీక్లీ నుండి 'అడవి మంట' నవలకు బహుమతులు అందుకొన్నాను.

మనసు ఒకరికే, మనిషి ఒకరికే, వరమాల, రాగదీపం, చండీప్రియ, పుష్యమి, ఇంకా కొన్ని నవలలు కన్నడంలోకి అనువదింపబడ్డాయి. వనితాజ్యోతిలో సీరియల్‌గా వచ్చిన 'విశిష్ట' నవల శ్రీమతి కుమారి టి. రుక్మాయిగారి చేత కన్నడంలోకి అనువాదమై 'కన్నడ వారపత్రిక 'సుధ'లో సీరియల్‌లాగా వచ్చింది. 'సంధ్యా కల్యాణం' మరికొన్ని నవలలు కన్నడంలోకి అనువాదం అవుతున్నాయి.

శ్రీమతి చంద్రరేఖగారు నానవలమీద పరిశోధనా వ్యాసం సమర్పించి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌నీ, ఉమ్మెత్తల నర్సింహమూర్తి అనే తెలుగు లెక్చరర్ నా కథలమీద ఎం.ఫిల్‌నీ, శ్రీమతి రజనీ అన్న తెలుగు లెక్చరర్ 'నౌకాగమనం' మీద కాకతీయ యూనివర్సిటీనుండి ఎం.ఫిల్‌నీ తీసుకొన్నారు.

ఇంకా కొన్ని పరిశోధనల్లో ఉన్నాయి.

మరొక విషయం కూడా చెప్పాలి. నా అజాగ్రత్తవల్ల చాలా కథలు పోగొట్టుకున్నాను. వాటిని కాళీపట్నం రామారావుగారి కథానిలయం నుండి పొందగలిగాను. వారికి కృతజ్ఞతలు.

మరోసారి ఆంధ్ర సారస్వత పరిషత్‌కు కృతజ్ఞతలు చెబుతూ సెలవు తీసుకుంటున్నా.

❖ ❖ ❖



డా. తిరుమల శ్రీనివాసాచార్య

"ఎన్ని పూలు పూచిందో చెట్టు కేమి గుర్తు?
ఎన్ని నీళ్ళు పారినవో ఏటి కేమి గుర్తు ?
వేదనతో వ్రాస్తూనే పోతున్నది కాని
ఎన్ని కృతులు కూర్చిందో ఎడద కేమి గుర్తు? "

నేను పుట్టిన తేదీ 1.1.1938 : బహుధాన్య నామ సంవత్సరం. నా జన్మ స్థలం నారాయణపురం అనే గ్రామం. ఇది కరీంనగర్ జిల్లా, సిరిసిల్ల తాలూకా, కిషన్‌దాస్ ఎల్లారెడ్డి పేట మండలంలో ఉన్నది. అప్పట్లో "రాచర్ల" అనే పరగణాలోని ఏడు గ్రామాల 'మఖ్తా'లో ఒకటి మా ఊరు. పక్క ఊరు ఎల్లారెడ్డిపేటలో ఉన్న కిషన్‌దాసు రాజాగారికి నాలుగు ఊర్లూ, మా నారాయణపురం మఖ్తేదార్ దేశపాండ్య శ్రీ సుందరరావు గారికి మూడు ఊర్లూ ఉండేవి. మఖ్తేదార్ ఉండే నివాస గృహాన్ని 'గడి' అనేవారు. ఆ గడి కోటలాగా ఉంటుంది – మూడు వైపులా బురుజులతో– ఆ గడిలో ఉండేవారు దొరవార్లు. ఆ దొరగారి 'గడి' కి ఒక అరబ్బీ జవాన్ తుపాకి పట్టుకొని కాపలా ఉండేవాడు. ఈ ఏడు గ్రామాలకూ ఎల్లారెడ్డిపేటలో తహశీల్ కచేరీ ఉండేది. ఇప్పుడు ఆ ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంగా మారింది.

మా ఊరు అటు ఎల్లారెడ్డిపేట – ఇటు కొండాపురం మధ్య ఉన్నది. ఊరు చుట్టూ పచ్చని పొలాలే. మాకు కొండాపురం వైపుగా రెండు కిలోమీటర్ల దూరంలో 'మానేరు' అనే వాగు పారుతుంది. వెన్నెల వంటి ఇసుక తిన్నెలు, తీరాలపై ఈత,

మామిడి మట్టి చెట్లూ, ఆ వాగు అంచుకు కొండాపురం వైపున శ్రీ ఆంజనేయస్వామి రూపమున్న శిలాఫలకం, ఒక పెద్ద కొండ లాంటి బండ మీద చెక్కబడి ఉన్నది. రెండు మూడు రోజుల కొకసారైనా ఆ మానేరు వాగులో స్నానం చేసి, బట్టలుతికి కొని, ఆంజనేయుని సన్నిధిలో ఉన్న పెద్ద మట్టిచెట్టు కొమ్మలపై ఎక్కి దూకి ఆటలాడుకొనేవాళ్లం – మిత్రులమందరం కలసి వెళ్లి ఆ పసితనంలో. ఇప్పుడు తలచుకొంటే ఆ బాల్యక్రీడలు కమ్మని కలలాగా దిగి వచ్చిన దివి లాగా స్ఫురిస్తాయి.

మా ఊళ్లో మా ఇంటికి ఎడమవైపున శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయమూ, కుడివైపున శ్రీ శివాలయమూ, ఊరి అంచులో, గడి పక్కన, పెద్ద రావి చెట్టు కింద శ్రీ ఆంజనేయస్వామి గుడి ఉంది. ఇలా ముచ్చటగా మూడు దేవాలయాలున్నాయి. మా ఇంటికి పక్కన శ్రీ వైష్ణవుల నివాసాలున్నాయి. మా ఇంటికి ఎదురుగా వేదమూర్తులైన బ్రాహ్మణుల భవనాలున్నాయి. మానేరుకు పోయే దారిలో మైసమ్మ గుడి ఉంది. మా ఇంటికి వెనుక వైపు కొంత దూరంలో దొరవారి తోట, ఆ తోటలో రకరకాల పండ్ల చెట్లూ, పక్కనే జలకాలాటకు అనుకూలమైన ఆందాల కోనేరూ, ఆ పక్కనే చింత చెట్లూ, పొలాలు, పక్కనే కాలువ – ఇలా మా ఊరు నా చిన్ననాడు ఎంత అందంగా ఉండిందో! ఆ బాల్యం ఎంత ఆనందంగా గడిపినామో!

మా ఊరు వేద పండితులకూ, సంస్కృతాంధ్ర సాహితీ కోవిదులకూ నిలయం. కాబట్టి దొరవారి సౌజన్యంలో సారథ్యంలో దేవాలయాలలో నిత్య పూజలూ ఆరాధనలూ వార్షికోత్సవాలూ, యజ్ఞయాగాదులూ తరచుగా జరిగేవి.

మాది శ్రీ వైష్ణవ కుటుంబం. మా ఇలవేల్పు శ్రీ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి. మా అమ్మ వేంకటమ్మ, ఆమెకు చదువు రాదు. ప్రేమకు కొదవలేదు. మా నాన్న కారంచేటి తిరుమల మనోహరాచార్యులు; వారు పౌరాణికులు. సంస్కృతాంధ్ర ద్రావిడ పండితులు. మా నాన్న మొదట మహబూబ్‌నగర్ జిల్లా బూర్గుల గ్రామ వాస్తవ్యులు. ఇల్లరికం వచ్చి నారాయణపురంలో స్థిరపడ్డారు. శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో మా నాన్నగారిని స్థానాచార్యులుగా నియమించి, ఆలయ పోషకులైన దొరవారు నాల్గు ఎకరాల భూమి 'ఇనాము' గా ఇచ్చినారు. మా

నాన్నగారికి శిష్య పరంపర ఎంతో ఉంది.

నాకు ముగ్గురు అన్నలు – శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులు, శ్రీ పార్థసారథి, శ్రీ నరసింహాచార్యులు. ఒక తమ్ముడు – డా. వెంకట రమణాచారి. ఒక అక్క – శ్రీమతి కొండమ్మ. ఒక చెల్లెలు – శ్రీమతి శీనమ్మ.

నేను పుట్టిన బహుధాన్య సంవత్సరంలో పంటలు బాగా పండినవని మా నాన్న చెప్పేవారు. నా జన్మకుండలి కాగితాలు ఎక్కడో పోయినవి. మా నాన్న నన్ను బడిలో చేర్చేటప్పుడు శ్రీ రాఘవులు అనే ప్రధాన అధ్యాపకులు తమకు తోచిన తేది – 1.1.1938 – అని వ్రాసినారు రిజిష్టరులో. నేను పుట్టిన వారం, మాసం తెలియక పోయినా సంవత్సరం మాత్రం అదే. మా ఊళ్లో మా ఇంటి పేరును 'తిరుమల' అని అంటారు. అందువల్ల రిజిష్టరు లో 'టి. (తిరుమల) శ్రీనివాసాచారి' అని వ్రాసినారు శ్రీ రాఘవులు సారు. మా పెద్దన్న మాత్రం – 'కారంచేటి తిరుమల వేంకట రాఘవాచారి' అని వ్రాసికొన్నారు. కాబట్టి వారు 'కె.వి రాఘవాచారిగా ప్రసిద్ధులు. 'కారంచేటి తిరుమల' అనే పూర్తి ఇంటిపేరులో తిరుమల మాత్రం నాకు దక్కింది.

నాకు ఏడేండ్ల వఱకు మాటలు రాలేదట. మా అమ్మ, నాన్న "వీడు ఎక్కడ ఎడ్డివాడు – మూగవాడు అవుతాడో!" అని దుఃఖపడేవారట. అయితే ధైర్యంగా మా నాన్న మాత్రం – "వీడు మూలా నక్షత్ర జాతకుడు ఏం పరవాలేదు, పండితుడు అవుతాడు" – అని అనేవారట. ఇక మాటలు ప్రారంభమైన తరువాత మాత్రం చకచకా ప్రవాహంలాగా పలికే వాణ్ణట! అక్షరాభ్యాసం ఎప్పుడు చేయించినారో తెలియదు. కాని నాకు మాటలు వచ్చినప్పటి నుండి మా నాన్న ముకుందమాల, శ్రీ గుణరత్నకోశం అనే స్తోత్ర కావ్య శ్లోకాలను నోటికి చెప్పేవారు. ధారణ చాలా ఉండింది నాకు. వెంటనే చెప్పేవాణ్ని నోటికి. మా పెద్దన్న శిష్యసంచారం చేస్తున్నప్పుడు "వేములకుర్తి" అనే గ్రామంలో నాకు ఉపనయనం చేసినారు. మా నాన్న నన్ను వేరే ఊరికి వెళ్లేటప్పుడు వెంట తీసికొని పోతూ మార్గమధ్యంలో "నిత్యానుసంధానం" అనే స్తోత్ర గ్రంథం జెప్పేవారు. రాత్రి తమ వద్దనే పరుండబెట్టుకొని బ్రహ్మ ముహూర్తంలో లేపి తమిళపాశురాలు చదివించేవారు. పగటిపూట "తిరువాయిమొషి"

ని చెప్పేవారు – అన్నీ మౌఖికంగానే చదివించేవారు. అలా నాకు ఆరు 'పత్తులు' (600 పాశురాలు) కంఠతః వచ్చేటట్లు చెప్పినారు. నన్ను ద్రావిడ ప్రబంధ అధ్యాపకునిగా చేయాలని మా నాన్న సంకల్పం. మచ్చుకు ఒక పాశురంలోని కొన్ని పంక్తులు –

"ఊయర్వఱ వుయర్నల ముడైయవన్ యవనవన్
మయర్వఱ మదినల మరుళినన్ యవనవన్
అయర్వఱ మనరర్ హాళధిపతి యవనవన్
తుఱ రఱు శుడరపి తొఴి దేషున్మనసే"

– ఇలా ఉంటాయి పాశురాలు గేయంలా. యతి ప్రాసాదులతో. వీటి అర్థం మాత్రం ఏమీ తెలియదు. 'వసుచరిత్ర' (భట్టుమూర్తి ప్రబంధం) చదివితే గొప్ప పండితుడవుతాడు – అనే దృఢ విశ్వాసంతో, మా నాన్న నాకు వసుచరిత్ర ప్రబంధంలోని 50, 60 పద్యాలు నోటికి చేయించినారు. అయితే ఆ పద్యాలను కట్టె పలకపై 'హిందీ' లిపిలో వ్రాసికొని చదువమనేవారు. అప్పటికి నాకు హిందీ అక్షర గుణితం వచ్చింది. అప్పుడప్పుడే హింది ప్రజలలోకి వ్యాపిస్తున్న కాలం. ఆ భాష రావాలని మా నాన్న అభిప్రాయం.

"శ్రీ భూపుత్త్రి వివాహ వేళ నిజమంజీరాగ్ర రత్న స్వలీ
లాభి వ్యక్తి వరాంఘ్రిరేణు భవ కన్యాలీల యంచున్మదిం
దా భారింప శుభ క్రమా కలనచే, దద్రత్న ముంగప్పుసీ
తా భామాపతి ప్రోవుతం దిరుకులేంద్ర శ్రీమహారాయనిన్"

"ఘన ఘనా ఘన లక్ష్మి నెనయు గొప్పరుగడ
నిరుగడ దరుణాబ్జ కృతవతంగ
మురు చిత్రకాగ్ని శిఖోన్మేష మిరువంక
నిరువంక కుండ లిస్ఫురిత కర్ణము"

ఇలా ఎన్నో పద్యాలు నా తొమ్మిదేళ్ల వయస్సులో కంఠతః వచ్చేవి. ఈ పద్యంలో – 'ఘన' అంటేమిటో 'ఘనా ఘన" అంటేమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాస

లేని జింక పరుగులాంటి కాలం ఆ బాల్యం. కేవలం పద్యాలు నోటికి చేయించినారు నాన్న. ఇలా పాశురాలూ పద్యాలూ స్తోత్రాలూ ప్రతి దినం వల్లె వేయవలసిందే నోటికి అప్ప చెప్పవలసిందే, అలా రెండేళ్లు బోధించినారు నాన్న.

మరో వైపు పెద్దన్న శ్రీ రాఘవాచార్యులు గారు ఉరుదూ – అక్షరాలు 'అలీఫ్ బే టే తే' లు నేర్పేవారు. తీగల్లాగా ఉండే ఆ అక్షరాలు వ్రాయరాకపోతే వేళ్ల మీద కొట్టేవారు. ఆ అక్షరాలను కళ్లు చూచినవే తప్ప వేళ్లు మాత్రం నేర్చుకోలేదు. "అరె అంధా! తేరే లియే దిన్ రాత్ బరాబర్ హై ఫ్రిర్ తూ చిరాగ్ క్యోం లియే జారహా హై?" అనే పంక్తులు ఇప్పటికీ జ్ఞాపకమున్నాయి. ఏమైనా – ఉర్దూ వ్రాయ రాలేదు చక్కగా – మాట్లాడడం మాత్రం వచ్చింది. హిందీ మాత్రం తొందరగా అబ్బింది. పద్యాలు నోటికి రాకపోతే మా నాన్న తాడుతో కొట్టేవారు. అన్నం తినేటప్పుడు మాత్రం ప్రేమతో ముద్దలు కలిపి చేతిలో పెట్టేవారు. అలా గుద్దులు – ముద్దలు – రెండూ అనుభవించినాను. ఇప్పుడు, అప్పటి పాశురాలన్ని మఱచిపోయినాను – 'అనభ్యాసేవిషం శాస్త్రమ్" కదా!

నన్ను జ్యోతిషపండితుని చేయాలనే మా నాన్న ఆశయానికి అనుగుణంగా మా పెద్దన్న నాకు జ్యోతిషం చెప్పేవారు. ముహూర్త దర్పణమ్, కాలామృతమ్ వంటి గ్రంథాల నుండి శ్లోకాలు చెప్పి నోటికి చేయించేవారు. నక్షత్రాలు, రాశులు, రాశిఫలాలూ, ఘాతవారాలూ, గ్రహకుండలి వేయడం, ముహూర్త బలం చూడడం దాకా వాటికి సంబంధించిన శ్లోకాలన్నీ నేర్పినారు అన్నయ్య. పురుష సూక్తమ్, శ్రీ సూక్తం వల్లింపచేసినారు. మా ఊరు దొర గారింట్లో దైవారాధనకు పిలిచేవారు ఒక్కొక్కసారి. అప్పుడు అభిషేకం చేసేటప్పుడు పురుష సూక్తం చదువాలి. చదివేటప్పుడు దొరగారు శ్రీ వేంకటరావుగారు అక్కడే కూర్చొని వినేవారు. "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్ " అంటూ మొదలు పెట్టి – చివరకు – "ఇష్టం మనిషాణ, అముం మనిషాణ, సర్వం మనిషాణ ఓం శాంతిః శాంతిః" అని ముగించే దాకా చూచేవారు దొరగారు. భయపడుతూ ఈ సూక్తం చెప్పేవాణ్ని – వణకుతూ స్వరం తప్పకుండ.

పెద్దన్న జ్యోతిషం బోధిస్తే పెద్ద వదిన శ్రీమతి పద్మావతి గారు నాకు ఇంగ్లీషు చెప్పింది. మూడు రకాల ఇంగ్లీషు అక్షరాలు వ్రాయడం నేర్పింది. ఒక రోజు మా వదిన వెంట ఎల్లారెడ్డి పేటకు వెళ్లి, అరగంటకొక పాఠం చొప్పున నోటికి చేసి, ఆ రోజంతా ప్రైమర్ (Primar) లో మూడు భాగాలు పూర్తిచేసినాను. ఆ విధంగా మా వదిన నాకు ఆంగ్ల భాషా గురువు. అందువల్ల నాకు, నాన్న, పెద్దన్న – వదిన – ముగ్గురు గురువులు ఇంట్లోనే. కొన్ని రోజులు ఖాన్గీ మదర్సా నడుపుతున్న శ్రీ బి. అచ్యుతరాజు సారు వద్ద పెద్దబాలశిక్షలో ఉన్న ఎక్కాలూ బంతులూ పల్లాలూ పుట్లూ, బొట్లూ – పరక, వీసం, ఇంకా పాత ఉత్తరాలు పఠించడం – వంటి వాటిని నేర్చుకొన్నాను. ఇలా రకరకాల చదువులు చదివినాను పన్నెండు సంవత్సరాల వరకు ఇంట్లోనే.

1947–48 లలో జరిగిన రజాకార్ల దౌర్జన్యాలను విన్నాను. రాత్రి పూట కమ్యూనిస్టులు, పగటివేళ రజాకార్లు తుపాకులు పట్టుకొని తిరుగుతూ ఊళ్లో ఎవరు కనిపిస్తే వాళ్లను కొట్టేవాళ్లు. ఇళ్లు దోచుకునే వాళ్లు. రాత్రి పూట నేను రామాలయం రథం గది కిటికీ ద్వారా భయపడుతూ రజాకార్లు, కమ్యూనిస్టుల సంచారం చూచినాను.

మా ఎదురింటి వేద పండితులు బ్రహ్మశ్రీ మురళీధర శర్మ అన్నయ్య ఇంట్లో అప్పట్లో 'తెలుగు స్వతంత్ర' పత్రికనూ, ఆ పత్రికలో అచ్చయ్యే దాశరథి, సినారె కవితల పేర్లను మాత్రం చూచేవాణ్ని. అప్పుడు చదువాలనే దృక్పథం లేకుండింది.

1950లో మా నాన్న – అప్పుడే మా ఊళ్లో ఏర్పడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతిలో చేర్పించినారు. శ్రీ రాఘవులు అప్పటి ఉపాధ్యాయులు. అక్కడే శ్రీ ఈశ్వరయ్య, బి. వెంకటయ్య, శ్రీ ఎం. రాజి రెడ్డి అనే మిత్రత్రయంతో స్నేహం గాఢంగా ఏర్పడింది. శ్రీ ఈశ్వరయ్య కుంటివారు. అప్పుడు బడిలో చదువు పలకలపై – ఇంటిలో వ్రాత, నోట్ బుక్కులలో – కలాలతో సిరాబుడ్లతో వ్రాతపని. 1950 లో మూడవ తరగతి పూర్తి అయింది. నాల్గవ తరగతి ఎల్లారెడ్డి పేటలో చేరినాను. మా ఊరు నుండి ఎల్లారెడ్డి పేటకు శ్రీ ఈశ్వరయ్యను మోసుకుని పోయ్యేవాళ్లం ముగ్గురం రెండు కిలోమీటర్ల దూరం. పొద్దున సద్ది కట్టుకొని పోయి, మధ్యాహ్నం ఒకరి ఇంట్లో భోజనం చేసి, స్కూలు

ముగించుకొని సాయంకాలం ఇంటికి చేరేవాళ్లం.

నాల్గవ తరగతిని ఎల్లారెడ్డి పేటలో పూర్తి చేసి, ఐదవ తరగతి (మిడిల్ స్కూల్) కోసం సిరిసిల్ల కు చేరుకున్నాం నల్గురం. అప్పట్లో బస్సులు తక్కువ. ప్రతి శనివారం సిరిసిల్ల నుండి నారాయణపురం వరకు 12 కిలో మీటర్లు నడుచుకుంటూ వచ్చే వాళ్లం. సోమవారం ఉదయం నడుచుకుంటూ, 9.30 వరకు ఉదయం స్కూలుకు చేరుకొనేవాళ్లం. మాది చాల పేద కుటుంబం. మా అమ్మ నాకు వారానికి రూపాయన్నర ఇచ్చేది - పెరుగుకూ కూరగాయలకూ. నేను వంట వండే వాణ్ని. ముగ్గురు మిత్రులు వేరే పనులలో సాయం చేసేవాళ్లు. వాళ్లు వంటను ముట్టుకోగూడదు – నేను వండి, కొంత తీసికొని, వాళ్లకు వంట గిన్నెలు ఇచ్చేసేవాణ్ని. అంతా మడి, ఆచారం ఉండింది. సిరిసిల్లలో మిడిల్, హై క్లాసులు (5 నుంది 10 తరగతులు) ఉండేవి. ప్రార్థనకు సకాలంలో హాజరు కాకపోతే హెడ్ మాస్టరు (తురక సారు) బెత్తంతో కొట్టే వారు. మా క్లాసు టీచరు శ్రీ వెంకట నరసయ్య గారు దయామయులు. నేను ఫస్ట్‌క్లాసులో పాసయితే స్కాలరు షిప్పు 36/- రూపాయలు ఇప్పించినారు. ఆ రూపాయలను అమ్మకిస్తే అందులో పన్నెండు రూపాయలకు పైంట్ బుషర్ట్ బట్ట కొని కుట్టించుకున్నాను. చెప్పులు లేకుండానే నడిచేవాణ్ణి. దాదాపు అందరం మా మిత్రులం అంతే. అలాగే నడచినాము చెప్పులు లేకుండ. నిజానికి చెప్పులపై దృష్టే ఉండేదికాదు. అంటే పేదరికం అంత సామాన్యం ఆనాడు. సిరిసిల్లలో 1952-53 లో ఐదు, ఆరు తరగతులు పూర్తి చేసినాను. 1952 లో ఆంధ్ర సారస్వత పరిషత్తు హైద్రాబాదు వారి ప్రథమ పరీక్షలో పాసయినాను. మా అన్నయ్య ప్రవేశ పరీక్ష ఇచ్చి పాసైనారు. అయితే – సర్టిఫికేట్ మాత్రం తీసికోలేదు. దాని మీద చూపే లేదు. నేను ఆరవ తరగతి చదువుతుండగా అదే స్కూలు విద్యార్థి శ్రీ ఆదిరెడ్డి గారు శ్రీ సి.నా.రె గారు వ్రాసిన –

"ఓ చిన్ని మొగ్గా! ఓ కన్నె మొగ్గా!
చివురుటాకుల లోన – రవల రేకులలోన
మంచు ముత్యాలుంచి – మంచి మధువుల నించి
ఉదయ భానుకరాల సుధలు, జారే వేళ

ప్రకృతి లక్ష్మి దివ్య పాద పూజలు చేసి
ఎన్నొ నోములు నోచి ఎన్నొ జాములు సైచి
నిన్ను గనె నీ తల్లి నిండు మమతల వెల్లి!
ఓ చిన్ని మొగ్గా! ఓ కన్నె మొగ్గా!

అనే గేయం పాడి బహుమతి అందుకున్నాడు - పాటలపోటీలలో. ఆ దశలో నాకు - ఈ గేయం కవి సినారె గారిదనీ, అది "నవ్వని పువ్వు" గేయ నాటికలోనిదనీ తెలియదు. కానీ ఆ పాటా - ఆ పాడేరీతీ నన్ను బాగా ఆకర్షించినాయి. నా హృదయంలో ముద్ర పడిపోయింది. అప్పట్లో శ్రీ ఆదిరెడ్డి గారితో నాకు పరిచయం కూడ లేదు. తరువాత జీవితంలో వారిని కలిసి మాట్లాడినాను. సిరిసిల్ల విద్యార్థులుగా ఉన్న శ్రీ గూడూరి సీతారాం, శ్రీ కనపర్తి లక్ష్మీనరసయ్య గారలు సి.నా.రె గారిని గూర్చి చెప్పుతుండగా విద్యార్థిగా కొంచెం విన్నాను. శ్రీ గూడూరి సీతారాం గారి తమ్ములు శ్రీ గూడూరి రాఘవేంద్ర గారు నా సహపాఠిగా ఉండేవారు.

మా అమ్మనాన్నలకు మా పెద్దన్న శ్రీ రాఘవాచార్యులుగారు "ధర్మాత్ముడు, వంశోద్ధారకుడు, మార్గదర్శకుడు " అని దృఢ విశ్వాసం. అందువల్ల నన్ను సిరిసిల్ల నుండి తీసి, మెదకు ఉన్నతపాఠశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న పెద్దన్నకు నన్ను అప్పగించినారు. మెదకు లో నేను 7, 8, 9, 10, 11, 12 తరగతులు చదువుకున్నాను. తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారి 'విశారద' పరీక్షలో కూర్చొని ఉత్తీర్ణుణ్ణి అయినాను. 1959 లో మెదకు బహుళార్థ సాధకోన్నత పాఠశాల (Multipurpose High school) లో ఎం.పి.సి. విషయాలతో విద్యను పూర్తి చేసినాను - ప్రథమ శ్రేణిలో. అప్పట్లో మల్టీ పర్పస్ చదువు పూర్తి అయితే P.U.C (pre-university course) పూర్తి అయినట్లే. తర్వాతి చదువు పట్టభద్ర స్థాయి విద్య (Graduation Course).

మా పెద్దన్నకు వచ్చే వేతనం దాదాపు వంద రూపాయలే. అయినా నన్నూ, నా కంటె పెద్దన్ననూ, నా తమ్ముణ్ణి చదివించినారు. ఆర్థిక బాధలకు గురి అవుతూ, తాను స్వయంకృషితో మెట్రిక్, ఇంటర్, బి.ఏ., ఎం. ఏ. (తెలుగు సంస్కృతం)

పరీక్షలిచ్చి ఉత్తర్ణులై ఆదర్శంగా నిలిచిన అధ్యాపక వతంసులు ఆయన. ఆనాడు మేము చదువుకున్నప్పుడు విద్యుత్తు సౌకర్యం లేదు. గుడ్డి కిరోసిన్ దీపాలు పెట్టుకొని చదువుకున్నాము. గోనె సంచులే పరుపులుగా, చేతులే మెత్తని దిండ్లుగా పండుకొన్నాను.

మా వదిన అమ్మను మఱిపిస్తూ, అన్నం పెట్టి, చదువు కూడా చెప్పేది - చిన్న పిల్లలకు. చెఱువుకు వెళ్లి బిందెతో మంచినీళ్లు తెచ్చి పెట్టడం నాకు అవ్వ చెప్పిన పని. నేను ఆ నీళ్లు తేవడం ఒక సాకుగా, ప్లే గ్రౌండులో వాలీబాల్ ఆడివచ్చేవాణ్ని. అలా ఆడి ఆడి వాలీ బాల్ క్యాప్టెన్ అయినాను. జిలా స్థాయి ఆటల పోటీలలో గెలిచి స్కూలుకు బహుమతులు సంపాదించి పెట్టినాను. పన్నెండవ తరగతి చదువుతుండగా 'బాన్స్వాడ' లో జరిగిన జోనల్ టోర్నమెంట్‌లో పాల్గొని జట్టును గెలిపించినాను. నన్నందరూ పైకెత్తికొని పొగడిన ఘట్టం ఇప్పటికీ పచ్చగా ఉంది మనస్సులో. రాష్ట్ర స్థాయి వాలీ బాల్ క్రీడాకారులతో కూడా ఆడినాను అనేక టోర్నమెంటులలో పాల్గొని. హైద్రాబాదు విక్టరీ ప్లే గ్రౌండులో అప్పటి ఇండియా వాలీబాల్ క్యాప్టెన్ శ్రీ గోపాల్ గారితో ఆడినాను. ఆటల వల్ల, చదువు దెబ్బతింటుందని మా అన్న మందలించేవారు. మా హెడ్మాస్టరు శ్రీ రామయ్య అటు - ఆటలాడుమనీ, ఇటు తన లెక్కల క్లాసుకు తప్పక రావాలనీ నిర్బంధం పెట్టేవారు. లెక్కల పరీక్షలో ఎప్పుడు ఒక్క లెక్క తప్పిపోయేది నాకు. అయినా మొత్తం మీద మార్కులలో ప్రథమ శ్రేణిలో ముందుండేవాణ్ని.

చిన్నప్పటి నుండి పాటలంటే చాల ఇష్టం. లయ జ్ఞానం బాగుండింది. పీట కనిపిస్తే తకిటతక తకిటతక అంటూ తబలా కొట్టేవాణ్ని. తొమ్మిదవ తరగతిలో ఉన్నప్పుడు కొంచెం హార్మోనియం కూడ నేర్చినాను. అనేక చలన చిత్ర గీతాలు పాడేవాణ్ని. పాటలలో పాల్గొని ఎన్నో బహుమతులందుకున్నాను. అందుకు ఆనందం, కారులో షికారు కెళ్లె, జగమే మాయ, కుడి ఎడమైతే, ఓ దేవదా! ఓ పార్వతీ!, కలవరమాయె మదిలో, ఎంత ఘాటు ప్రేమయో, ప్రేమ కోసమై వలలో పడెనే వంటి పాటలు ఉన్నదున్నట్లుగా మ్యూజిక్‌తో సహా పాడి బహుమతులందుకొనేవాణ్ని. టీచర్లు నన్ను ప్రేమతో పిలిచి, తమ ఇళ్లల్లో పాడించుకునేవాళ్లు. వ్యాస రచన

పోటీలలో, ఉపన్యాస పోటీలలో తెలుగులో ఇంగ్లీషులో పాల్గొని బహుమతులను గెలుచుకున్నాను. వార్షికోత్సవాలలో వ్యాసరచనలో, పాటల పోటీలలో, ఉపన్యాస పోటీలలో, ఆటలలో, వాలీబాల్, కబడ్డీ, పరుగులలో అనేక బహుమతులు చిన్న సంచినిండా వచ్చేవి. పాఠశాల విద్యార్థులందఋా నన్ను గుర్తు పట్టి ప్రేమతో పల్కరించేవాళ్లు. నాతో చదువుకున్న విద్యార్థి మిత్రులకూ, నా కన్న జూనియర్ విద్యార్థులకూ ఫిజిక్స్, కెమిస్ట్రీ పాఠాలు చెప్పేవాణ్ని. ఇప్పుడు వాళ్లు గొప్ప డాక్టర్లు, ఇంజినీర్లు అయినారు. ఉదాహరణకు – డా. ఎం. ఎస్ గౌడు – గవర్నరుకు డెంటల్ డాక్టరు. డా. ఎం. నాగభూషణ్ ఎం. ఎస్. గొప్ప సర్జన్, ఉస్మానియా వైద్యశాలలో. అట్లాగే సహమిత్రుడు సత్యనారాయణ (లొగిట) గొప్ప ఇంజనీరు అయినారు. సర్దెన రామకృష్ణా రావు గొప్ప వెటరినరీ డాక్టరై అమెరికాలో స్థిరపడ్డారు. నా ఆప్త మిత్రుడు శ్రీ అయిత చంద్రమౌళి (సర్దెన) గొప్ప వర్తకుడు. మెదకులో స్థిరపడ్డారు. ఇప్పటికి ప్రతిదినం పలుకరిస్తుంటాడు ఫోన్‌లో. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం సలహాదారులుగా ఉన్న డా. కె. వెంకట రమణాచారి ఐ.ఏ.ఎస్, మా పెద్దన్న కొడుకు – అప్పుడు చాల చిన్నవాడు. వెంట వచ్చి వీధిలో నడుస్తూ చేతి వేలితో గాలిలో అక్షరాలు వ్రాస్తుండేవాడు. చాల చురుకైనవాడు. చిన్ననాడు ఎత్తుకుని ఆడించినవాణ్ని. 'తుక్కాదేవి' అనే తెలుగు వాచకంలోని ఒక పాఠంలోని ప్రశ్నకు నోటికి సంపూర్ణంగా సమాధానం ఇవ్వలేదని, మా అన్న క్లాసులో, ఎవరినీ కొట్టక, నన్ను ఎడెనిమిది దెబ్బలు బెత్తంతో కొట్టిన నొప్పి, ఇప్పటికీ చేయి చూస్తే గుర్తుకు వస్తుంది. పూలు వాడినా, ముల్లు వాడదు కదా! మా ఇంగ్లీషు టీచరు శ్రీ చివుకుల సత్యనారాయణ మూర్తి గారు మధుర భాషి, మంచి గాయకులు. ఆయన పాడిన

"నరనరాల జీర్ణించిన – తరతరాలనుండి కన్న
ఎన్నెన్నో పాడుకలలు – ఎన్నెన్నో పీడ కలలు
మొదట మాయమయ్యెన హో!

రేయి తెల్లవారె న హో!" – అనే పల్లవితోటి పాటను నేర్చుకొని, మళ్లీ పాటలపోటీలో పాడి ప్రథమ బహుమతిని వారి చేతి మీదుగానే అందుకునేవాణ్ని. ఇవన్నీ మధుర సన్నివేశాలూ తీపిగుర్తులూ మెదకు బతుకులో.

1959 లో M.P.C. తో మల్టీ పర్పస్ ఫైనల్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుణ్ణైనాను. అప్పటికి నా వయస్సు 21 సంవత్సరాలు దాటింది. కాబట్టి ఇంజనీరింగులో సీటు దొరకలేదు. దైవం అనుకూలించలేదు. మా అన్న నా కోసం ఎంత శ్రమించినారో సీటు కోసం! కళాశాలలో చదువలేకపోయినాను.

ఆ రోజుల్లో ప్రభుత్వ అధ్యాపకులకు మాత్రమే ప్రైవేటుగా చదువుకొని బి.ఏ. పరీక్ష ఇచ్చే అవకాశం ఉండింది. అందువల్ల ఉన్నత విద్యాప్రాప్తి కోసం, మెదకు జిల్లా విద్యా శాఖాధికారి పెట్టిన ఇంటర్వ్యూలో నెగ్గి, మెదకు జిల్లా, రామాయంపేట తాలూకాలోని కలువకుంట దగ్గరున్న వేంకటాపురంలో సింగిల్ ప్రైమరీ స్కూలులో టీచరుగా నియమితుణ్ణై వెళ్లినాను. ఆ వేంకటాపురంలో అప్పటికే ఒక ప్రైవేటు పాఠశాల ఉండింది. అక్కడి పిల్లలు చాలా చురుకైన వాళ్లు. నేను వెళ్లగానే పాపం ఆ పాఠశాల పంతులు వెళ్లిపోయినారు. ఆయన పాఠాలు చెప్పిన ప్రదేశంలోనే స్కూలు పెట్టి, మూడవ తరగతివరకు బోధించేవాణ్ని. అక్కడి జీవితం కూడా చాల మధురంగా ఆప్యాయతతో గడచింది. పిల్లలు పగలే కాదు – రాత్రిపూట కూడ, నా ఇంట్లోనే ఉండి చదువుకొనేవాళ్లు కందిళ్లు గొంగళ్లు తెచ్చుకొని. పిల్లలకు చదువుతో పాటు ఈత కూడ నేర్పేవాణ్ని. పిల్లల తల్లిదండ్రులు, ఇంటికి గ్లాసుపాలు పంపేవారు. నా ఇంట్లో ఉన్న చిన్న తపాల పాలతో నిండేది. నీళ్లు తాగడం మానేసి పాలే తాగినాను. అందుకే ఇప్పటికీ జ్ఞాపకం!

నేను చదువు చెప్పుతూ, బి.ఏ. పరీక్ష ఇంగ్లీషులో వ్రాయాలి కాబట్టి – ఇంగ్లీషు పద జాలం, వాక్య నిర్మాణ వైవిధ్యం, లేఖలూ వ్యాసాలూ వ్రాసే పద్ధతులు, జాతీయాతా భాగీయాలు (Idioms, Phrases) వందల కొలది నోటికి నేర్చుకున్నాను. ధారాళంగా ఇంగ్లీషులో వ్రాయడం నిర్దోషంగా సుందరంగా వ్రాయడం నేర్చుకున్నాను. వ్యాయామం చేసి, శరీర సౌష్టవాన్ని కాపాడుకున్నాను. ఆ రోజుల్లో పిల్లల తల్లిదండ్రులు గురువారం, ఆదివారం నా ఇంటికి పిల్లల ద్వారా సాహిత్యం (బియ్యం పప్పు మొదలైనవి) పంపించేవాళ్లు. అందువల్ల, అప్పట్లో నాకు వచ్చే 60/– రూపాయల వేతనం లో తిండికి 17 రూపాయలే ఖర్చయ్యేవి. తమ్మునికి డాక్టరు చదువుకు 40 రూపాయలు పంపేవాణ్ని. అయినా, నెలకు 3 రూపాయలు మిగిలేవి. అంత

మంచి కాలం అది! అలా వేంకటాపురంలో ఒక్క ఏడు గడిపినాను. ఆ తరువాత సూరారం, చేగుంట, రామాయం పేట జూనియర్ బేసిక్ స్కూళ్లల్లో పని చేసినాను. చేగుంటలో ఉన్నప్పుడు 1963 లో బి.ఏ. పూర్తి చేసినాను. రాజకీయ శాస్త్రం, చరిత్ర, ఐచ్ఛికం తెలుగులో (modern Language). తర్వాత రామాయంపేటలో ఎం.ఏ ప్రథమ సంవత్సరం, దుబ్బాక ఉన్నత పాఠశాలలో (1964–1965) ఎం.ఏ (తెలుగు) పూర్తి చేసినాను ప్రథమ శ్రేణిలో.

దుబ్బాక జిల్లా పరిషదున్నత పాఠశాల జీవితం కూడ ఆనందంగా సాగింది. పాఠశాలలో అష్టావధాని శ్రీ గుమ్మన్నగారి లక్ష్మీనృసింహ శర్మ, శ్రీ జి. నారాయణ రెడ్డి (గుంపలపల్లి), శ్రీ గోవర్ధన్ (చరిత్ర – అధ్యాపకులు), శ్రీ సామ్యూల్ హెడ్‌మాస్టారు, శ్రీ రాఘవ రెడ్డి, శ్రీ సీతారామాచార్యులు మున్నగువారితో చాల సన్నిహిత స్నేహం ఉండింది. పాఠశాలలో అన్ని విషయాలూ చెప్పేవాణ్ని. ఏ టీచరు రాకున్నా ఆ క్లాసుకు పోయి పాఠం చెప్పేవాణ్ని. హెడ్ మాస్టరు ఆజ్ఞతో ఉన్నత పాఠశాలా విద్యార్థులకు ఇంగ్లీషు వ్యాకరణం (రెన్ అండ్ మార్టిన్ గ్రామర్) బోధించేవాణ్ని. పాఠశాల తర్వాత పిల్లలకూ, తోటి టీచర్లకూ వాలీ బాల్ నేర్పేవాణ్ని. పాటలూ బుఱ్ఱకథలూ నేర్పేవాణ్ని మిత్రులు శ్రీ గోవర్ధన్ గారితో కలిసి. వివిధ సభలల్లో సన్మాన పత్రాలూ పంచరత్న పద్యాలూ వ్రాసి చదివేవాణ్ని. ఇలా ఆరేళ్లు (1959–1965) అధ్యాపక వృత్తిలో పనిచేసినాను. 1965 లో ఎం. ఏ (తెలుగు) పూర్తి చేసి, అధ్యాపక వృత్తికి రాజీనామా చేసి, బి.జి.ఎన్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖమ్మంలో తెలుగు ట్యూటరుగా నియమితుణ్ని అయినాను, డైరెక్టరు హైయర్ ఎడ్యుకేషన్ వారిచే. ఖమ్మంలో తొమ్మిది నెలలు పనిచేయగానే కొన్ని ఔద్యోగిక కారణాల వలన, ప్రభుత్వం నన్ను ఉద్యోగం నుండి తొలగించింది. ఆ తర్వాత 1966 లో ఎస్.ఆర్.ఆర్. కరీంనగర్ ప్రభుత్వ సాయం కళాశాలలో తెలుగు ట్యూటరుగా ఉద్యోగంలో చేరినాను. 1968 వరకు అక్కడే ఉన్నాను. 1969 లో అసిస్టెంట్ తెలుగు లెక్చరరుగా ప్రమోషన్ పై శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలకు ట్రాన్స్‌ఫర్ చేసింది ప్రభుత్వం. ఆ రోజుల్లో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రోద్యమం తీవ్రంగా సాగుతుండింది. ఆయా కారణాల వల్ల నన్ను శ్రీకాకుళం నుండి సిద్ధిపేట ప్రభుత్వ

కళాశాలకు ట్రాన్స్‌ఫర్ చేసింది ప్రభుత్వం. అప్పుడు శ్రీ కె.వి. రమణాచారి బి.ఎస్.సి ఫైనల్లో చదువుతుండేవారు.

1968లో నాకు వివాహం జరిగింది. నా భార్య శ్రీమతి స్వరాజ్య లక్ష్మి హైద్రాబాదు ఎగ్జిబిషన్ పరిసరాలలో ఉన్న, కమలా నెహ్రూ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో, ఉపన్యాసకురాలుగా ఉండింది. అది ప్రైవేటు కాలేజి. అందువల్ల ఒక్క చోట స్థిరంగా ఉండవచ్చుననే అభిప్రాయంతో, సిద్ధిపేట కళాశాలలో ఉండగా (1969 లో) ఉపన్యాసక పదవికి రాజీనామా చేసి, 1970 లో సర్ధార్ పటేల్ కళాశాల (సికింద్రాబాదులోని ప్రైవేట్ కాలేజీ) లో చేరి, 25 సంవత్సరాలు ఉద్యోగం చేసినాను తెలుగు శాఖాధ్యక్షులుగా. 1978 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పి హెచ్. డి పట్టాను పొందినాను పరిశోధన చేసి. 1995 డిసెంబరు 31 నాడు తెలుగు రీడరుగా రిటైర్ అయినాను. ఆ తరువాత – 1996 లో ఒక సంవత్సరం పాటు, మిత్రుల పోత్సాహం వల్ల, దిల్‌సుఖ్‌నగర్ లోని అనిబీసెంట్ మహిళా డిగ్రీ కళాశాల (ప్రైవేట్ కాలేజి) ప్రిన్సిపాల్ గా పనిచేసినాను. ఈ విధంగా నా ఔద్యోగిక జీవితం 37 సంవత్సరాల కాలం గడచింది – రకరకాల అనుభవాలతో విద్యాధ్యయనంలో అధ్యాపనంతో.

ఇక నా కుటుంబం గూర్చి రెండు మాటలు. నాకు నలుగురు కూతుళ్లు. పెద్ద బిడ్డ అరవింద. డాక్టరేటు (బోటనీ) చేసింది. ఉద్యోగం చేస్తున్నది – లెక్చరరుగా. భర్త శ్రీ చంద్రశేఖర్ గారు కంట్రాక్టరు. రెండవ బిడ్డ రాధిక. ఎం.ఇ. సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. ఎన్.ఆర్.ఎన్.ఏ.లో సైంటిస్టు. భర్త – శ్రీ కృష్ణకాంత్ – ఇంజనీరు, ప్రైవేట్ కంపెనీ మేనేజరు. మూడవ కూతురు జ్యోతిర్మయి – ఎం.ఏ గణితం. అధ్యాపకురాలు – ఒక ప్రైవేట్ పాఠశాలలో హైద్రాబాదులో. భర్త శ్రీహరిబాబు – ఎం.బి.ఏ – బ్యాంక్ మేనేజరు. ప్రస్తుతం ఒక కంపెనీ మేనేజరు. ఇక చివరి – నాల్గవ కొమార్తె శిరీష. ఆమె డాక్టరు. భర్త శ్రీ భానుమూర్తి – ఇంజనీరు. వీరిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. నా కూతుళ్లందరికీ సంతానం కలిగింది. తమ తమ పిల్లలతో హాయిగా ఉన్నారు దేవుని దయ వల్ల. మొదటి ముగ్గురు కూతుళ్లు హైద్రాబాదీయులే – ఇప్పుడు.

సాహితీ ప్రస్థానం:

రాగ తాళ భావమయమైన పాట అంటే చిన్న నాటి నుండి ఎంతో అభిరుచి. ఏడవ తరగతిలో మెదకులో చదువుతున్నప్పుడు పద్యాలు వ్రాసినాను – పాఠశాల వార్షిక సంచిక కోసం – "పొగతాగుట ధగ కాదా" – అనే శీర్షికతో. "గంటకు డబ్బి రీతి పదిగంటలకెన్నగు లెక్కపెట్టుడీ గంటకు" – అనే పద్య పాదం మాత్రమే జ్ఞాపకమున్నది. 'అందం' అనే శీర్షికతో ఒక గేయం వ్రాసినాను, అది ఎక్కడపోయిందో!

ప్రైవేటుగా (టీచరుగా) బి.ఏ. తెలుగు సాహిత్యం (Modern Language) పరీక్షతో ప్రారంభమైంది నా సాహిత్య కృషి. వ్యాకరణ సూత్రాలూ, చందోగతులూ యతిప్రాసలూ, శతాధిక పద్యాలూ నోటికి వచ్చేవి.

కరీంనగర్ సాయం కళాశాలలో (1966–1968) తెలుగు ట్యూటరుగా పనిచేస్తున్నప్పుడు, తిరుపతి వేంకట కవుల కావ్యాలు, డా. సి. నారాయణరెడ్డి కావ్యాలూ విశేషంగా చదివినాను. ఆ సందర్భంగా కొన్ని గేయాలూ పద్యాలూ వ్రాసి, కరీంనగర్ సాహితీ మిత్రమండలి సంస్థ ప్రధాన కార్యకర్తలూ సత్కవీ అయిన శ్రీ గట్టెపల్లి సత్యనారాయణ రాజు గారికి చూపించినాను. వారు నా రచనలను సవరించి 'ఉదయ రాగము' పేరుతో సంస్థ పక్షాన 1970 లో ప్రచురించినారు. నా ప్రప్రథమ కావ్యం అది. కావ్యావిష్కరణ సభ కరీంనగర్ జిల్లా పరిషత్తు సభా భవనంలో శ్రీ జువ్వాడి గౌతమరావుగారి అధ్యక్షతలో జరిగింది. నా అభిమాన పరోక్ష గురువులు ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారికి ఆకృతిని భక్తితో అంకితం చేసినాను. ప్రముఖ విమర్శకులు డా. జి.వి. సుబ్రహ్మణ్యంగారు సభలో కావ్య సమీక్ష చేసినారు. ఆచార్య దివాకర్ల వారు, తమ జీవితంలో అంకితంగా స్వీకరించిన ప్రప్రథమ గ్రంథం, ఉదయరాగమే, అని సభలో చెప్పగా ఎంతో ఆనందించినాను.

నేను సిద్ధిపేట ప్రభుత్వ కళాశాలలో (1970) పని చేస్తున్నప్పుడు, ప్రముఖ విద్వత్కవి శ్రీ వేముగంటి నరసింహాచార్యుల వారితో స్నేహమేర్పడింది. ఫలితంగా వారి రచనలూ నా రచనలూ కొన్నింటిని కలిపి "జీవన స్వరాలు" అనే పేరుతో ఒక

కవితా సంపుటిని ప్రచురించి, మహాకవి దాశరథి గారికి అంకితం చేయడం జరిగింది. ఆ సభ ఆంధ్ర సారస్వత పరిషత్తు మందిరంలో శ్రీ దేవులపల్లి రామానుజరావు, డా. సి. నారాయణ రెడ్డి వంటి ప్రముఖ కవి పండిత స్వాతంత్ర్య సమర యోధుల సమక్షంలో జరిగింది.

నేను సర్దార్ పటేల్ కళాశాల (సికింద్రాబాదు 1970) లో ప్రధానాంధ్రో పన్యాసకునిగా చేరిన తరువాత, నాకు 'యువ భారతి' సాహిత్య సాంస్కృతిక సంస్థలో సన్నిహిత సంబంధ మేర్పడింది. సంస్థ అధ్యక్షులు శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి, సమావేశకర్త శ్రీ వంగపల్లి విశ్వనాథం, యువభారతి ప్రధాన సంపాదకులు డా. జి.వి. సుబ్రహ్మణ్యం – ఇంకా – శ్రీ సుధామ, విజయకుమార్, అనంతాచార్యులు, శ్రీ వేంకటేశ్వర రావు వంటి ప్రముఖ సభ్యులతో మైత్రీ బంధం ఏర్పడింది. 'కావ్యలహరి' ఉపన్యాసాలు ఆచార్య దివాకర్ల ముఖతః – అన్ని పరంపరగా విని, ముఖ్యాంశాలు వ్రాసికొనేవాణ్ని. యువభారతి నన్ను సభ్యునిగా చేర్చుకొన్నది. యువభారతి రచయిత మిత్రుల కవితా సంపుటాల సంపాదకునిగా, ఆ తర్వాత ఉపాధ్యక్షునిగా, అధ్యక్షునిగా, చివరకు గౌరవాధ్యక్షునిగా, నన్ను ఎన్నుకొని సన్మానించిన సందర్భాలు మఱచిపోలేనివి. 'యువభారతి' సంస్థ వారు 1977లో, నేను వ్రాసిన "కిరణాలు – కెరటాలు" – అనే సూక్తి సంపుటిని, 'నారాయణ రెడ్డి సాహితీ మూర్తి' (1981) అనే విమర్శ గ్రంథాన్ని, 'తెలుగులో గేయ నాటికలు'(1988) అనే సిద్ధాంత గ్రంధాన్నీ, తెలుగు రుబాయీలు (1988) అనే రుబాయీల సంపుటినీ, 'గంగా తరంగాలు' (1992) అనే 108 గీతికల సంపుటిని, 'దీపాల చూపులు' (1993) – అనే ద్వితీయ రుబాయీల కావ్యాన్ని – క్రమంగా ప్రచురించి ఆవిష్కరింపజేసినారు.

'నారాయణ రెడ్డి సాహితీ మూర్తి' గ్రంధ రచనను గూర్చి ఈ సందర్భంలో కొంత చెప్పవలసి ఉంది. నేను కరీంనగర్ సాయం కళాశాలలో పని చేస్తున్నప్పుడు, పగలంతా సమయం దొరికేది. ఆ సందర్భంలో మహాకవి డా. సి. నారాయణ రెడ్డి గారి కృతులను, క్రమంగా లోతుగా అధ్యయనం చేసి, ప్రతి గ్రంధాన్ని గూర్చి సమీక్షా రూపంలో వ్రాసి పెట్టుకొన్నాను. కాలక్రమంలో వచ్చిన కృతులను – నవ్వని పువ్వు – జలపాతం కావ్యాల నుండి 'విశ్వంభర' వఱకు 45 గ్రంథాలను

గూర్చి వ్రాస్తూ పోయినాను. అలా వ్రాసిన సమీక్షల సంపుటాలను, ఆప్త మిత్రులూ అమృత హృదయులూ శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి గారికి చూపించినాను. వారు నా, సి.నా.రె కృతుల సమీక్షలనన్నింటినీ విని, సవరించినారు. 'నారాయణ రెడ్డి సాహితీ మూర్తి' అని గ్రంథ నామాకరణం కూడ చేసి, యువ భారతి పక్షాన ప్రచురింపచేసినారు. మహాకవి డా. సి. నా. రె గారి సూచన మేరకు, ఈ గ్రంథాన్ని, వారికి ఆరవ ప్రాణమైన శ్రీ ఇరివెంటి కృష్ణమూర్తి గారికే అంకితం చేసి సంతృప్తిని పొందినాను.

ఆచార్య సి. నారాయణ రెడ్డి గారి సాహిత్యంచే ప్రభావితుణ్ని అయిన నాకు, పి. హెచ్.డి పరిశోధనకై – "తెలుగులో గేయ నాటికలు" – అనే విషయాన్ని సూచించిన వారూ, పర్యవేక్షకులుగా నిలిచిన వారూ – నా డాక్టరేటు పట్టా ప్రాప్తికి ఆద్యంతాలూ సహకరించి ఆశీర్వదించినవారూ మహాకవి ఆచార్య సి. నారాయణ రెడ్డి గారే.

ఆచార్య నారాయణ రెడ్డి గారి తర్వాత, నాపై, మహాకవి డా. దాశరథి సాహిత్య ప్రభావ కిరణాలు ప్రసరించినాయి. దాశరథి గారి రచనలు – అగ్నిధార తో ప్రారంభించి, జ్వాలా లేఖిని – యాత్రా చరిత్ర – వఱకు అన్నింటినీ క్రమంగా చదివినాను. డా. సి. నారాయణ రెడ్డి గారి కవిత్వం జగన్మోహిని. దాశరథి గారి కవిత్వం విద్యుద్వాహిని. ముట్టుకున్నా పట్టుకున్నా విడువదు. నా దృష్టిలో ఇద్దఱూ గొప్పవారే. ఇద్దఱూ మార్గదర్శకులే. ఒకరు పూర్ణ సుధాకరుడు. ఒకరు ప్రభాకరుడు. ఒకే ప్రతిభ – రెండు రూపాలను ధరించి వచ్చి లోకాన్ని ఆకర్షించింది. ఆశ్చర్య పరచింది. ఆనందింప చేసింది.

దాశరథి సాహిత్య అధ్యయనం చేసి, అనేక సందర్భాలలో, నేను, వారి సాహిత్య వ్యక్తిత్వాలను గూర్చి ప్రసంగించినాను. ప్రధాన కారకులెవరో కాక, కేంద్ర సాహిత్య అకాడమీ వారు 'దాశరథి జీవిత సాహిత్యాలను గూర్చి ఒక గ్రంథం వ్రాయమని నన్ను ఆదేశించినారు. కృషి చేసి వ్రాసినాను. ఆ గ్రంథమే – 'భారతీయ సాహిత్య నిర్మాతలు – దాశరథి' – అనే పేర 2006 లో ప్రచురితమైనది.

దాశరథి గారు తెలుగు భాషా సాహిత్యాలకు చేసిన విశేష సేవలో

ప్రముఖమైనవి – తెలుగు రుబాయీలు, తెలుగు గజళ్లు. ఈ రెండు ప్రక్రియలకు వారే ప్రయోక్తలు. నేను దాశరథి గారిచే ప్రభావితుణ్ణయి, ప్రేరితుణ్ణయి, తెలుగు రుబాయీలు సృజించినాను. పరంపరగా 12 సంపుటాలు రచించి, ప్రచురించి ఆవిష్కరింపజేసినాను. అంతే కాక – 'దాశరథి రుబాయీలు గజళ్లు' (2009) అనే మరో విమర్శ గ్రంథం రచించినాను. ఇటీవల – 'దాశరథి కవితా వైభవం' (2014) అనే పేరుతో యువభారతి సంస్థా వారికి, ఒక వ్యాఖ్యాన గ్రంథాన్ని వ్రాసి యిచ్చినాను. అది ప్రచురితం; ఆవిష్కృతం. ఆ విధంగా దాశరథి గారిని గూర్చి మూడు గ్రంథాలు రచించినాను.

డా. సి. నా. రె. గారి 'ప్రపంచ పదులు' కావ్యంచే ప్రభావితుణ్ణయి, 2014 లో 'ప్రపంచ విపంచి' ని రచించినాను – సామాజిక నిత్య జీవన దృక్పథంతో – అధిక్షేపాత్మకంగా ధ్వనిమంతంగా.

నా 'షష్టి పూర్తి' ఉత్సవం సందర్భంగా మహాకవి ఆచార్య సి. నారాయణ రెడ్డి గారికి 'రవ్వల పతాకే' (1999) – అనే రుబాయీల సంపుటిని రచించి, అంకితం చేసినాను గురుదక్షిణగా.

నన్ను ప్రభావితం చేసిన మరో మహాకవి – అభినవ పోతన శ్రీమాన్ వానమామలై వరదాచార్యులవారు. వారు ఎం. ఎల్. సి. గా ఉన్నప్పుడు, యాకూత్‌పురలో ఉన్న మా యింటికి విచ్చేసి, ఆశీర్వదించినారు. వారి షష్టి పూర్తి మహోత్సవ సందర్భంగా, కోరుట్ల సభలో – వారి – పోతన చరిత్ర లోని 'నాటకీయత' ను గూర్చి ప్రసంగిస్తే ఎంతో సంతోషించినారు వారు. ఇటీవల వారి 'శత జయంతి' సందర్భంగా – "వానమామలై శత పద్య పారిజాతాలు" (2012) అనే వ్యాఖ్యాన గ్రంథాన్ని వ్రాసినాను. నాలుగవ ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా, 'తెలుగు అకాడమీ' వారి ఆదేశాన్ని అనుసరించి – 'వానమామలై వరదాచార్యులు' (2012) అనే గ్రంథం వ్రాసి ఇచ్చినాను. అలా వానమామలై వారిని గూర్చి రెండు గ్రంథాలు వ్రాసే అవకాశం లభించడం నా అదృష్టంగా భావించినాను.

నాకు మరొక ఆప్త మిత్రులు, సాహితీ మూర్తులు శ్రీమాన్ ఉత్పల సత్యనారాయణాచార్యులు గారు. నన్నెంతో ప్రోత్సహించేవారు. స్నేహ చిహ్నంగా

వారు 'పాత బస్తీ విలాసము' అనే ప్రౌఢ పద్య కావ్యాన్ని నాకు అంకితమిచ్చినారు. నేను వారి ప్రేరణ చేతనే భాస్కర శతకానికి 'సుదర్శన వ్యాఖ్యానం' వ్రాసినాను. 'పావని సేవా సంస్థ' వారి ఆదేశాన్ని అనుసరించి. అది 2004 లో ప్రచురితమైనది.

బాల్యం నుండి నేను అభిమానించిన చలనచిత్ర మహా నటులు నట సమ్రాట్ డా. అక్కినేని నాగేశ్వర రావు గారు. వారు చిత్రాల ద్వారా నాకు అందించిన ఆనందానికి కృతజ్ఞతా చిహ్నంగా నేను రచించిన 'దీపాల చూపులు' (1993) అనే రుబాయిల సంపుటిని వారికి అంకితం చేసినాను. సాహిత్య రంగంలో నేను చేసిన కృషిని అభినందిస్తూ నాగేశ్వరరావు గారు 2009 లో రసమయి సంస్థ నిర్వహణలో "డా. అక్కినేని జీవిత సాఫల్య స్వర్ణ కంకణ పురస్కారం" అందించి నన్ను సన్మానించినారు. అంతే కాదు – ఎన్నో సార్లు నా గ్రంధావిష్కరణ సభలకు విచ్చేసి, అభినందించి ఆశీర్వదించిన మహోదయులు డా. అక్కినేని గారు.

నన్ను సాహిత్య రంగంలో ప్రోత్సహించిన మరో ఆప్త మిత్రులు శ్రీ వంగపల్లి విశ్వనాధం గారు. యువభారతి స్థాపకులు. వారి ప్రేరణచే – 'సాహిత్యం ఎందుకు చదువాలి' – అనే చిన్న పుస్తకం (విమర్శ) వ్రాసి, వారికే అంకితం చేసినాను.

నా సాహితీ ప్రస్థానంలో నాకు చేయూతనిచ్చిన మరో సాహితీ మూర్తి మహావిమర్శకులు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయ పూర్వ ఉపకులపతులు. వారు యువభారతి ప్రధాన సంపాదకులుగా, నా కావ్యాలకు, విశేషించి – నా రుబాయీ సంపుటాలకు గభీర విస్తృత సమీక్షలు సమకూర్చినారు. అందువల్ల నా 'వ్యాసోల్లాసం' (2002) విమర్శ వ్యాస సంపుటిని వారికి అంకితం చేసినాను.

నేను హైద్రాబాదుకు వచ్చినప్పటి నుండి – 1970 నుండి – నాకు పరిచయమైన అమృతాక్షర మిత్రులు, సత్కవి, సినీ గేయ రచయిత, 'రసమయి' సంస్థ స్థాపకాధ్యక్షులు డా. ఎం.కె. రాము గారు. మా స్నేహము ముహూర్త బలమేమిటో కాని, వారు నాకు ఆప్త మిత్రులై నా సాహిత్య సౌరభ వ్యాప్తికి గంధవహులై– వారు చేయని కృషి లేదు. వారు నా చే ఉపన్యాసాలిప్పించి నారు,

కావ్య గానాలు చేయించినారు. సన్మాన పత్రాలు రచింపచేసినారు. నాకు షష్టి పూర్తి, సప్తతి పూర్తి మహోత్సవాలు నిర్వహించినారు. సప్తతి పూర్తి మహోత్సవం సందర్భంగా, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఆచార్య సి. నారాయణరెడ్డి, నటసమ్రాట్ డా. అక్కినేని నాగేశ్వరరావు ప్రభృతి మహోదయుల సమక్షంలో 'సాహిత సుధానిధి' – అనే బిరుదుని ప్రదానం చేసినారు. 2009 జనవరి– 11, 12 తేదీలలో నా 71 వ జన్మదినోత్సవం నిర్వహించి సాహిత్య సభలు జరిపి సత్కరించినారు. ఇటీవల – అంటే – 2013 – జనవరి 4, 5, 6 తేదీలలో 'రవీంద్ర భారతి' లో, 'యువభారతి ' సహకారంతో నా 'అమృతోత్సవం' మహా సభలు నిర్వహించినారు జనవరి 4 వ తేదీ నాడు – నా సాహిత్య వ్యక్తిత్వ విశ్లేషణ సదస్సు నూ, 5 వ తేదీనాడు అభినందన కవి సమ్మేళనాన్నీ జరిపినారు. జనవరి 6 వ తేదీనాటి మహోత్సవంలో 'అమెరికా లో నా అనుభూతి' అనే నా పద్య కావ్యాన్ని ఆవిష్కరింపజేసి, ఘనంగా సత్కరించినారు. ఈ కావ్యం నా భార్య శ్రీమతి స్వరాజ్య లక్ష్మి గారికి అంకితం. తెలుగు అకాడమీ సంచాలకులు ఆచార్య యాదగిరి, ప్రసిద్ధ కవులు డా. జె. బాపురెడ్డి, ఆచార్య ఎన్ గోపీగారలు, నట సమ్రాట్ డా. అక్కినేనిగారు, పద్మ భూషణ్ డా. కె.ఐ.వర ప్రసాదరెడ్డి గారు, తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారు, ఆం. ప్ర. ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారు డా.కె.వి. రమణాచారి గారు, మా పెద్దన్న వాచస్పతి – డా. కె.వి. రాఘవాచార్యులుగారు, కె.పార్థసారథి స్వామి గారు, తిరుమల నరసింహాచార్యులు గారు ఈ అమృతోత్సవ సభలో పాల్గొని నన్ను అభినందించి ఆశీస్సులందించినారు. ప్రముఖ విద్వద్విమర్శకులూ కవులూ పాల్గొని నా సాహిత్యాన్ని విశ్లేషించినారు. నన్ను అభినందిస్తూ కావ్య గానం చేసినారు. మఱపు రాని మధుర సన్ని వేశాలవి. ఇన్ని మహా సభలు జరిపిన సహృదయతామూర్తి డా. ఎం.కె. రాము గారికి, నేను రచించిన – 'పలుకరించే పరిమళాలు' – అనే రుబాయీ కవితా సంపుటిని (2009 లో) అంకితం చేసి కొంతలో కొంత ఋణం తీర్చుకున్నాను. ఇటీవల "ఘంటసాల ప్రణుతి మాల" – అనే మరో పద్య కావ్యాన్ని (2015 లో) డా. ఎం. కె. రాము గారికి అంకితం చేసి మఱి కొంత ఋణం తీర్చుకున్నాను. ఏమైనా వారి ఋణం తీరనిదే.

తండ్రి తర్వాత తండ్రిగా మా పెద్దన్న శ్రీమాన్ కె.వి. రాఘవచార్యుల వారు నన్నెంతో ఉద్ధరించిన మహానుభావులు; పుణ్యమూర్తులు. వారి ఋణం కొంతైనా తీర్చుకోవాలని, వారికి నా పద్యకావ్యం - కావ్య పుష్కరిణి (2002) ని అంకితమిచ్చినాను.

మా పెద్దన్న గారి పెద్దకొడుకు డా. కె.వి. రమణాచారి ఐ.ఏ.ఎస్ గారు, నా జీవిత సాహిత్య రంగ కృషిలో ఎంతో సాయమందించినారు. ఇప్పటికీ నా పట్ల ఎంతో ఆదరాభిమానాలు గలవారు. వారికి నా 'దాశరథి' (2006) గ్రంథాన్నీ, 'వానమామలై శతపద్యపారిజాతాలు' (2012) అనే వ్యాఖ్యాన గ్రంథాన్నీ అంకితం చేసినాను కృతజ్ఞతామతితో.

నేను హైద్రాబాదులో ఉద్యోగం చేస్తున్నప్పటి (1970) – నుండి, నా రచనలను 'ఆంధ్రభూమి' దినపత్రికకు పంపేవాణ్ని. ఆ పత్రికకు సబ్ ఎడిటర్‌గా, ఎడిటర్‌గా పనిచేసిన ప్రముఖ పాత్రికేయ విద్వాంసులూ, పరిణత హృదయులూ శ్రీ జి.ఎస్. వరదాచార్యులు గారు, నా రచనలను పరిశీలించి పత్రికలో సకాలంలో ప్రచురించేవారు. ఆ విధంగా నగ్న కవిగా, విమర్శకునిగా సమీక్షకునిగా సాహిత్యలోకానికి పరిచయం చేసిన శ్రీ వరదాచార్యుల వారికి కృతజ్ఞతాపూర్వకంగా నేను రచించిన – "దాశరథి రుబాయీలు – గజళ్లు" – (2009) అనే విమర్శ గ్రంథాన్ని అంకితం చేసినాను.

హైద్రాబాదులో నాతో హార్దంగా ప్రవర్తిస్తూ పలుకరిస్తూ మిత్రులైన వారు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారు. సభలల్లో సదస్సులలో నా సాహిత్య వ్యక్తిత్వాలను సారస్వతలోకానికి, నా కావ్య పీఠికల ద్వారా, ప్రశంసల ద్వారా చాటి చెప్పిన సహృదయులు వారు. డా. మేడసాని మోహన్ గారి అపూర్వ పంచసహస్రావధానంలో నెలరోజులపాటు సహసమన్వయ కర్తలుగా వ్యవహరించిన సారస్వతమూర్తులు వారు. వారితో నాకు గల మధురమైత్రీ బంధంసూచకంగా నా "జాతీయ కవితా సౌరభాలు" (2010) అనే అను సృజనా కవితా సంపుటిని అంకితం చేసి ధన్యతను పొందినాను.

భారతదేశం గర్వించదగిన విద్వన్మూర్తులలో మహామహోపాధ్యాయ, పద్మశ్రీ

ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారు అగ్రేసరులు. నాకు తెలుగు భాషా సాహిత్యపరంగా తలెత్తిన సందేహాలను సరళ మనస్కులై ఫోన్ ద్వారా నివృత్తి చేసేవారు. వారు నాకు గురు సదృశులు. వారి అనుమతితో వారిని గూర్చి, వారి గ్రంథాలను గూర్చి, వారితో హైద్రాబాదు ఆకాశవాణిలోనూ, సప్తగిరి దూరదర్శన్‌లోను ఇంటర్వ్యూలు నిర్వహించినాను. వారి పట్ల నాకు గల పూజ్య భావాన్ని వ్యక్తం చేయడానికి, నేను అప్పుడప్పుడు, ఆం.ప్ర. రాష్ట్ర సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ వారి బహుమతులందుకున్న గ్రంథాలను గూర్చి వ్రాసిన వ్యాసాలను సమీకరించి – 'కృతులూ బహూకృతులు' (2010) గా ప్రచురించి, దానిని ఆచార్య పుల్లెల శ్రీరామ చంద్రుడు గారికి, వసంతునికి ఒక ప్రసూనంలా, అంకితంగా సమర్పించినాను.

ఉత్తమ చలన చిత్రాలను నిర్మించి, మన సంస్కృతి పునరుద్ధరణకై పాటుపడిన ప్రముఖ దర్శకులు కళాతపస్వి శ్రీ కె. విశ్వనాథ్ గారు. వారిపట్ల నాకెంతో గౌరవం. అందుకు సంకేతంగా, వారికి, నా 'గంగా తరంగాలు' (1992) అనే 108 గీతికల సంపుటిని సాదరంగా సభాముఖంగా రవీంద్రభారతిలో అంకితం చేసినాను. అలాగే ప్రముఖ చలన చిత్ర నేపథ్య గాయకులూ నటులూ అయిన శ్రీ బాలసుబ్రహ్మణ్యం గారికి, నా 'ప్రపంచ విపంచి' (2004) అనే పంచపదుల సంకలనాన్ని అంకితం చేసి, వారి పట్ల నాకున్న ఆదరభావాన్ని తెలుపుకున్నాను.

తెలుగు భాషా సాహిత్య లలిత కళల అభ్యున్నతికై, సంస్కృతి పునరుద్ధరణకై, యథాశక్తి ఆర్థికంగా దోహదం చేసే మహోదారులు – శాంతా బయోటెక్నిక్స్ అధినేత పద్మభూషణ్ డా. ఐ.కె. వరప్రసాద రెడ్డి గారు. వారి పట్ల నాకున్న గౌరవభావాన్ని వ్యక్తం చేయడం కోసం – "తెలుగులో మాటాడుకుందాం" (2010) అనే రుబాయీ కావ్యాన్ని అంకితం చేసినాను. కావ్య ప్రచురణకూ, కావ్యావిష్కరణ సభా నిర్వహణకూ, 50 వేల రూపాయలను చెక్కు ద్వారా, అయాచితంగా అందించినారు. వరప్రసాదరెడ్డి గారి ఔదార్యాన్ని మఱచిపోలేను. పత్రికలలో, టీవీలలో చలన చిత్రాలలో తెలుగు భాషలో వస్తున్న అపశబ్దాలనూ, ఆంగ్ల పదాలనూ సూచిస్తూ, వాటికి మౌలిక సుశబ్దాలనూ, సమాంతర ఆంధ్ర పదాలనూ సూచించే

గ్రంథం "తెలుగులో మాటాడుకుందాం".

శ్రీ కృష్ణదేవరాయల పట్టాభిషేక పంచశతాబ్ది మహోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని, రాయల వ్యక్తిత్వాన్ని ప్రశంసిస్తూ, "శ్రీకృష్ణ దేవరాయ సంస్తుతి" (2011) అనే పద్యకావ్యాన్ని రచించినాను. ఆ కావ్యాన్ని హైద్రాబాదు సుల్తాన్ బజార్‌లోని 'శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం' అనే ప్రాచీన గ్రంథాలయ సర్వతోముఖ వికాసానికై జీవితాన్ని ధారపోసిన సారస్వతమూర్తులూ, స్వాతంత్ర్య సమరయోధులూ, సౌహృద సంపన్నులూ అయిన డా. ఎం.ఎల్. నరసింహారావు గారికి అంకితం చేసినాను.

తమ ధ్వన్యనుకరణ ప్రతిభ చేత తెలుగు జాతికీ, భారత దేశానికీ కీర్తిని సమకూర్చిన ధ్వన్యనుకరణ సమ్రాట్ పద్మశ్రీ, కళాప్రపూర్ణ డా. నేరెళ్ల వేణుమాధవ్ గారికి, 'నాదేశం నా ఆవేశం' (2012) అనే రుబాయీ సంపుటిని అంకితం చేసి, సన్మానించి సంతృప్తిని పొందినాను.

నా సాహిత్య వ్యక్తిత్వాలను సంస్కరించి, నన్ను ప్రగతి పథంలో నడిపించిన, నా ప్రథమ కావ్యాన్ని అంకితంగా స్వీకరించిన, వాఙ్మయ దివాకరులు కళాప్రపూర్ణ ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారి శతజయంతి మహోత్సవాల సందర్భంగా 'దివాకర ప్రభ' (2012) అనే పద్య కావ్యాన్ని రచించినాను. ఆ కావ్యాన్ని ఆచార్య దివాకర్ల వారి జ్యేష్ఠ పుత్రులు శ్రీ దివాకర్ల సీతారామశర్మ గారికి భక్తితో అంకితమిచ్చినాను. పుంభావ సరస్వతులైన అవధాని గారి మహోన్నత వ్యక్తిత్వాన్ని ఈ కావ్యంలో సాక్షరసన్నుతి పూర్వకంగా సంస్మరించుకున్నాను.

నా జీవితంలో ఆయా సందర్భాలలో సాయపడిన ఆర్థిక శాస్త్రవేత్తలూ సర్దార్ పటేల్ కళాశాలలో సహోద్యోగులూ అయిన శ్రీ బసవ లింగప్ప గారికి నా మొట్టమొదటి రూబాయీ సంపుటి 'తెలుగు రుబాయీలు' (1988) ను అంకితమిచ్చినాను కృతజ్ఞుడనై. అట్లాగే నా బాల్యమిత్రులూ సుప్రసిద్ధ దంతవైద్య శాస్త్ర నిపుణులూ అయిన డా. ఎం. ఎస్ గౌడు, శ్రీమతి విజయలక్ష్మి దంపతులకు – నా –"కిరణాలు–కెరటాలు" (1977–2009) అనే ద్వితీయ ముద్రణ సూక్తి సంపుటిని అంకితం చేసినాను – అచ్చమైన చెలిమికి అక్షర సంకేతంగా.

నన్ను కని, పెంచి విద్యాబుద్ధులు చెప్పిన నా తల్లిదండ్రులు – శ్రీమతి వేంకటమ్మ, శ్రీమాన్ మనోహరాచార్యులు గారలకు – నా సిద్ధాంత గ్రంథం – 'తెలుగులో గేయనాటికలు' (1988) ను అంకితం చేసి అక్షరాలా ఋణం తీర్చుకున్నాను కొంతలో కొంత. నాకు నిరంతరం అన్ని రకాలుగా సేవలందించిన, అందిస్తూ ఉన్న, నా భార్య శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారికి, నేను అమెరికాలో అనుభవించిన అనుభూతుల అక్షరాకృతి అయిన – "అమెరికాలో నా అనుభూతి" (2013) అనే పద్యకావ్యాన్ని అంకితం చేసి, చెట్టులో చిగురంత, కొండలో గోరంత ఋణం తీర్చుకున్న సంతృప్తిని అనుభవించినాను.

'న్యాయం నా ధ్యేయం' (2013) అనే నా రుబాయీ కవితా సంపుటిని ప్రముఖ కవి, విమర్శకులు డా. జె. బాపురెడ్డి గారికి అంకితం చేసినాను అనేక సంవత్సరాలుగా వారు చేసిన – చేస్తున్న – సాహిత్య సేవకు ధన్యవాదాలు పలుకుతూ.

నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు తిరుపతిలో జరిగిన సందర్భంగా తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక చారిత్రక గరిమను చాటుతూ 27 గీతాలు వ్రాసినాను. వాటిని ప్రచురించి అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘాధ్యక్షులు శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారికి అంకితం చేసినాను వారు చేసిన తెలుగు భాషా సాహిత్య సేవను అభినందిస్తూ.

నా మిత్రమండలిలో ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు ఒకరు. అమెరికాకు 'ఆటా' సభలకు వెళ్లినప్పుడు, వారు నాకెంతో తోడుపడ్డారు. అందుకు కృతజ్ఞతతో 'కలంలో కలకలం' (2014) అనే రుబాయీల సంపుటిని వారికి అంకితం చేసి సన్మానించినాను.

'యువభారతి' సంస్థ కోరిక మేరకు మహాకవి దాశరథి విశ్వకవితామూర్తిలోని సకల ప్రక్రియా కోణాలను రేఖామాత్రంగా వివరిస్తూ వ్రాసిన వ్యాఖ్యాన గ్రంథం – 'దాశరథి కవితా వైభవం' (2014). దానిని ప్రఖ్యాత విమర్శకులు నాకు సన్నిహిత మిత్రులు ఆచార్య ఎస్.వి.రామారావు గారికి అంకిత మిచ్చినాను చెలిమికి చిహ్నంగా.

తిరుమల తిరుపతి దేవస్థానం – అన్నమాచార్య ప్రాజెక్టు వారి ఆదేశాన్ని

అనుసరించి పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల పెద్ద కుమారుడు అయిన శ్రీ పెదతిరుమలచార్యులు, శ్రీ వేంకటేశ్వరస్వామిని నుతిస్తూ పద్నాలుగు గ్రంథాలు రచించినారు. వీటిలో వైరాగ్య వచనమాలికా గీతములు, శృంగార దండకము, చక్రవాళ మంజరి (కుంజరీద్విపద), శ్రీ వేంకటేశోదాహరణము (ఉదాహరణం), నీతి శతకము (నీతిసీస పద్యముల శతకము) – అనే ఐదు గ్రంథాలకు, 'సుదర్శన' వ్యాఖ్యానాన్ని రచించి దేవస్థానము వారికి అందజేసినాను. 'శృంగార దండకము' – చక్రవాళ మంజరి – అనే గ్రంథములు 2014లో ప్రచురితాలైనవి. ఈ ఐదు వ్యాఖ్యాన గ్రంథాలను "తిరుమల శ్రీనివాసుని చరణములకు" – అంకితం చేసినాను. ఇటీవల 'శ్రీ విష్ణు సహస్రనామస్తోత్రము'నకు అర్థాలు వ్రాసి, ప్రచురించినాను (2015).

ఈ విధంగా తెలుగు భాషా సాహిత్యాలు, లలిత కళల అభ్యున్నతికై బతుకంతా కృషిచేసిన ప్రతిభామూర్తులకూ, కళారాధకులకూ, ఉదార హృదయులకూ నాకు ఆయా సందర్భాలలో సహకారమందించి నా ప్రగతికై పాటుపడిన మిత్రబాంధవులకూ, రసహృదయులకూ నా కృతులను అంకితం చేసి దేశభక్తినీ, లలిత కళానురక్తినీ, సంస్కృతి పరిరక్షణాభినివేశాన్నీ అక్షరాలా ప్రకటించుకున్నాను నా పరిమిత సాహితీ ప్రస్థానాన్ని సాగిస్తూ ఇప్పటి వరకు.

బహూకృత రచనలు : సాహిత్య పురస్కారాలు :

నా రచనలలో ప్రప్రథమంగా బహుమతి పొందిన గ్రంథం – 'నారాయణరెడ్డి సాహితీమూర్తి'. ఉత్తమ సాహిత్య విమర్శగా, ఈ గ్రంథం 1982లో, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి పురస్కృతికి పాత్రమైనది. 'దీపాల చూపులు'– అనే నా గేయాత్మక రుబాయీల సంపుటి, 1996 లో, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారిచే ఉత్తమ కవితా పురస్కారాన్ని అందుకున్నది. అట్లాగే – 'తెలుగులో మాటాడుకుందాం' (2013) అనే రుబాయీ గేయసంపుటి, 2011 సంవత్సరానికి గాను, గేయకవితా ప్రక్రియలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారాన్ని పొందింది.

ఇక–అన్య పురస్కారాలు:

అనేక సంస్థలు, విశిష్ట వ్యక్తులు, కళామూర్తులు, మహాకవుల పేర్ల మీదుగా స్థాపించిన పురస్కారాలనూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా సాంస్కృతిక శాఖ పురస్కారాలనూ స్వీకరించినాను. – అవి ఇవి – క్రమంగా.

వానమామలై వరదాచార్యస్మారక సాహితీ పురస్కారం (కోరుట్ల) – 1989
ఆంధ్రప్రదేశ ప్రభుత్వ కళాశాల ఉత్తమ ఉపన్యాసక పురస్కారం – 1992
కలహంసి బాబయ్య స్మారక పురస్కారం (1993) ('గంగాతరంగాలు' సంపుటికి)
శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వారి మహాకవి దాశరథి పురస్కారం (1997)
అరుంధతి కళా సంస్థ వారి మహాకవి దాశరథి పురస్కృతి (1998)
'రసమయి' పురస్కారం (2000)
వృషనామ సంవత్సర యుగాది కవిపురస్కారం (2001)
రాయప్రోలు 'వంశీరత్న' స్వర్ణ పతక పురస్కృతి (2002)
బి. లక్ష్మీకాంతరావు స్మారక పురస్కారం (2002)
నాదెళ్ల లక్ష్మమ్మ స్మారక పురస్కారం (2004)
ఆంధ్రప్రదేశ ప్రభుత్వ పార్థివ యుగాది పురస్కృతి (2005)
'రసమయి' శ్రీకృష్ణదేవరాయల పురస్కారం (2005)
ఆంధ్రప్రదేశ ప్రభుత్వ 'వ్యయ'యుగాది కవి పురస్కారం (2006)
గజల్ ఛారిటబుల్ ట్రస్టు పురస్కారం (2006)
ఆం.ప్ర. ప్రభుత్వ సర్వజిత్‌యుగాది పురస్కృతి (2007)
డా. ఇరివెంటి కృష్ణమూర్తి స్మారక పురస్కారం (యువభారతి) 2007
డా. అందె వేంకటరాజం స్మారక సాహిత్య పురస్కారం – (కోరుట్ల) (2007)
డా. దివాకర్ల వేంకటావధాని స్మారక పురస్కారం (2008)
'కవిరత్న' శ్రీ నీలాజంగయ్య సాహితీ పురస్కారం (2009)
'రసమయి' డా. అక్కినేని జీవితసాఫల్య స్వర్ణ కంకణ పురస్కారం (2009)

కళాశారద ఆత్మీయ పురస్కారం (2009)

డా. సి. నారాయణ రెడ్డి సాహితీ పురస్కారం (2010) (సి.నా.రె. కళాపీఠం)

డా. కె. అంజిరెడ్డి ధర్మవిధి సాహిత్యపురస్కారం. (ఆంధ్ర సారస్వత పరిషత్) (2010)

మహర్షి వాల్మీకి సేవా సమితి వారి సువర్ణ కంకణ విశిష్ట సత్కారం (2010)

కిన్నెర ఆర్ట్స్ హైదరాబాదు వారి - డా. మద్దాళి సుబ్బారావు స్మారక అవార్డు (2011)

నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పురస్కారం (2011)

ఆం.ప్ర. ప్రభుత్వ 'ఖర' నామయుగాది విశిష్ట పురస్కారం (2011)

'లలిత కళాభిరామ పింఛము' వారి పంచరత్న పురస్కారం (2011)

కమలాకర మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు వారి విశిష్ట పురస్కారం (2011)

'రసమయి' వారి - కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి వాఙ్మయ పురస్కారం (2011)

బి.ఎన్. రెడ్డి సాహితీ పురస్కారం (2012)

ఆచార్య దివాకర్ల వేంకటావధాని జీవితసాఫల్య పురస్కారం (2012) ('శతజయంతి' సందర్భం)

వానమామలై వరదాచార్యుల జీవితసాఫల్య పురస్కారం (2013) శత జయంతి సందర్భంగా.

'రసమయి' ఘంటసాల అవార్డు (ఘంటసాల 92వ జయంతి సందర్భంగా (2.1.2015)

"సాహితీ సుధానిధి" - బిరుద ప్రదానం:

నా సప్తతిపూర్తి మహోత్సవం సందర్భంగా 25.1.2008 నాడు, 'రసమయి' సంస్థ, డా. ఎం.కె. రాము నిర్వహణలో, మహాకవి ఆచార్య సి. నారాయణరెడ్డి, నటసమ్రాట్ డా. అక్కినేని నాగేశ్వరరావు, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యులు, డా. సుందర రామకృష్ణ వంటి మహనీయుల సమక్షంలో

'సాహితీ సుధానిధి' అనే బిరుదును నాకు ప్రదానం చేయడం జరిగింది.

అంకిత గ్రంథాలు:

నా సాహిత్య వ్యక్తిత్వం పట్ల ఆదరాభిమానాలున్న కవిమిత్రులు, సాహితీ మూర్తులు కొన్ని కృతులను నాకు అంకితం చేసి నన్ను సన్మానించినారు. మహాకవి శ్రీమాన్ ఉత్పల సత్యనారాయణాచార్యులు గారు, తాము రచించిన 'పాతబస్తీవిలాసము' అనే ప్రౌఢ పద్యకావ్యాన్ని స్నేహచిహ్నంగా నాకు అంకితమిచ్చి గౌరవించినారు.

ప్రముఖ కవి గాయకనటులు డా. అక్కిరాజు సుందర రామకృష్ణ గారు, 'కవితాశరథి–దాశరథి' అనే పద్యకృతిని మైత్రీ సంకేతంగా నాకు అంకితం చేసినారు.

ప్రముఖ కవి, రచయిత, పుస్తకశిల్పి, శిష్యమిత్రులు శ్రీ తాళ్లపల్లి మురళీధరగౌడు గారు 'జీవనరేఖలు' అనే గ్రంథాన్ని నాకు అంకితం చేసి నన్ను గురువుగా గౌరవించినారు.

కవి శిరోమణి ఆచార్య రావికంటి వసునందన్ గారు – 'ఊర్మిళ' పద్యకావ్యాన్ని, ఆప్తంగా నాకు అంకితమిచ్చి సన్మానించినారు.

'తెలుగులో సాహిత్య విమర్శ' అనే అంశంపై పరిశోధించి, అనేక విమర్శనాత్మక కృతులు రచించిన విమర్శకాగ్రేసరులు ఆచార్య ఎస్.వి. రామారావుగారు, ఇటీవల ప్రచురించిన 'గ్రంథావలోకనం' అనే పీఠికల సమీక్షల గ్రంథాన్ని నాకు అంకితమిచ్చి సత్కరించినారు.

అమెరికా ఆటా – సభ: సత్కారం:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ పక్షాన, జూలై 2008లో అమెరికాలోని – 'న్యూజెర్సీ'లో జరిగిన – 'అమెరికా తెలుగు సంఘం (ఆటా–) దశమ వార్షికోత్సవాలలో, కవిగా, భువనవిజయ' సాహిత్య రూపక కవి పాత్రధారిగా పాల్గొన్నందుకు, జ్ఞాపికతో యోగ్యతాపత్రంతో నన్ను సన్మానించినారు ఆ సంఘం వారు.

తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక సేవ: పురస్కార ప్రధాన కార్యక్రమం:

నన్ను అనేక సందర్భాలలో సన్మానించిన ఈ ప్రతిభామయ భాషా సాహిత్య కవి పండిత సమాజాన్ని కృతజ్ఞతతో గౌరవించుకోవాలనే సంకల్పంతో నాపేరూ, నా భార్యపేరు మీదుగా – ధర్మనిధి సాహిత్య పురస్కారాలను స్థాపించి కవిపండితులను సన్మానిస్తున్నాను ప్రతి ఏటా 2008 నుండి.

(1) ఆంధ్ర సారస్వత పరిషత్తు – హైద్రాబాదు సంస్థ పక్షాన, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, మహాకవి, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షలూ ఆచార్య సి. నారాయణరెడ్డి గారి అధ్యక్షతలో 2008 నుండి ప్రతి సంవత్సరం ఒక కవితామూర్తికి – "డా. తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి సాహిత్య పురస్కారం" పేరుతో పురస్కృతి ప్రదానం చేయబడుతున్నది.

(2) అట్లాగే – మా తిరుమల కుటుంబం పక్షాన నిర్వహింపబడుతున్న – 'తిరుమల ఛారిటబుల్ ట్రస్టు – హైద్రాబాదు" – అనే సంస్థ పక్షాన సంస్థ అధ్యక్షులు – డా. కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్. అధ్యక్షతలో 2008 నుండి, సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి ఏటా – "డా. తిరుమల శ్రీనివాసాచార్య సాహితీ పురస్కారం" – అనే పేరుతో ఒక శ్రీవైష్ణవ పండితునికి పురస్కార ప్రదానం జరుగుతున్నది.

(3) 'యువభారతి' సంస్థ పక్షాన 2010 నుండి – "శ్రీమతి స్వరాజ్యలక్ష్మి డా. తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి సాహిత్య వక్తృత్వ పురస్కారం" – పేరిట ప్రతివత్సరం ఒక ఉత్తమ వక్తకు ప్రదానం జరుగుతున్నది.

(4) శ్రీ వైష్ణవ సేవా సంఘం, హైద్రాబాదు సంస్థ పక్షాన 2011 లో, "స్వరాజ్యలక్ష్మి డా. తిరుమల శ్రీనివాసాచార్య ధర్మనిధి పండిత పురస్కారం" కోసం 50వేల రూపాయలు నిధిగా ఇవ్వడం జరిగింది.

పరిశోధన: పర్యవేక్షణ:

నా పర్యవేక్షణలో శ్రీమతి కృష్ణకుమారి గారు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో – "శ్రీనాథుని శివరాత్రి మహాత్మ్యము – సమాలోచన" అనే విషయం

గూర్చి, పరిశోధించి ఎం.ఫిల్. డిగ్రీ పొందినారు 1994లో.

తెలుగు వాచక సంకలనం: వ్యాఖ్యారచన:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యాశాఖ - 1987లో ప్రచురించిన "తెలుగు వాచకం–తొమ్మిదవ తరగతి" ప్రథమ భాష పుస్తకానికి, సంకలన కర్తగా, వ్యాఖ్యాతగా రచనా బాధ్యతలను నిర్వహించినాను. ఐదు సంవత్సరాలు ఆ వాచకం ఆచరణలో ఉండింది.

యువభారతి సంస్థ: భాషా సాహిత్యసేవ:

'యువభారతి' సాహితీ సాంస్కృతిక సంస్థ సభ్యునిగా, ఉపాధ్యక్షునిగా, అధ్యక్షునిగా, అనేక ఉపన్యాస రచనా కార్యక్రమాలు నిర్వహించి, తెలుగు భాషా సాహిత్య సంస్కృతి పరివ్యాప్తికి కృషి చేసినాను.

సభ్యులుగా:- ఆంధ్ర సారస్వత పరిషత్తు (హైద్రాబాదు) సంస్థ కార్యవర్గ సభ్యునిగా యధావకాశం భాషా సేవాకర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాను.

ఆకాశవాణి కార్యక్రమాలు: కవిగా, విమర్శకునిగా, వ్యాఖ్యాతగా, రూపకకర్తగా – ఆకాశవాణి, హైదరాబాదు వారు నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నాను. వాటిలో కొన్ని ఇవి –

జాతీయ సర్వభాషా కవి సమ్మేళనం, కవిగోష్ఠి, రసమంజరి, కవితాంజలి, తరుణ తరంగిణి, కవి సమ్మేళనం, సాహిత్యవీధి, మీరు చదివారా? (పుస్తక సమీక్ష), సాహిత్య పరిచయం, పుస్తక పరిచయం, అష్టావధానాలు, రేడియో కళాశాల ప్రసంగం, మహనీయుల మహితోక్తులు, కవితావాహిని, మకరందం, జ్యోతిపథం, తిరుపతి కవిసమ్మేళనం, ధ్వని సంచికా కార్యక్రమం, లలిత సంగీతం, (15 పాటలు రికార్డు అయినవి), సంగీత రూపకరచన (స్వేచ్ఛానువాదం), రసమంజరి (ఉగాది సంగీత రూపకం), ప్రసంగాలు (పుట్టపర్తి), సాహితీసుధ (పల్లా దుర్గయ్య – కరుణశ్రీ) ఈ మాసపు పాట (25 పాటలు రికార్డు అయినవి), యువభారతి రజతోత్సవాల సమీక్ష, ఆచార్య డా. సి. నారాయణ రెడ్డి, ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గార్లతో

ముఖాముఖి ఇంటర్వ్యూ(ఆర్కీవ్స్-3 గంటలు) నిర్వహణ, యాదగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణోత్సవం (లైవ్) వ్యాఖ్యానం, కృష్ణా పుష్కరాలు – వ్యాఖ్యానం (బీచుపల్లి వద్ద) 'భావన' కార్యక్రమంలో సంక్షిప్త ప్రసంగ పరంపర – ఇటీవల – శ్రీనరసింహశతక పద్యవ్యాఖ్యానం, జాతీయ సర్వభాషా కవిసమ్మేళనంలో ఉరుదు కవితకు అనుసృజనం – ఇలా అనేక పర్యాయాలు ఆకాశవాణి కార్యక్రమాలలో పాల్గొన్నాను.

దూరదర్శన్ (సప్తగిరి) కార్యక్రమాలు:

ప్రభుత్వ దూరదర్శన్ 'సప్తగిరి' ఛానల్‌లో అనేక భాషా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నాను. ఉదాహరణకు కొన్ని–

గేయ నృత్యనాటికా రచయితగా, పద్యాలతోరణం న్యాయనిర్ణేతగా, తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాతగా, శ్రీ శివరాత్రి మహోత్సవాల వ్యాఖ్యాతగా, శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి (అనంతపురం) ఉత్సవాల వ్యాఖ్యాతగా, శ్రీరామనవమి సందర్భంగా భద్రాచల శ్రీ సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవ వ్యాఖ్యాతగా, తిరుచానూరు శ్రీ పద్మావతీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవ వ్యాఖ్యాతగా, వినాయకచవితి శ్రీ గణేశ నిమజ్జనోత్సవాల (హైద్రాబాదు) వ్యాఖ్యాతగా, శ్రీ యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాతగా కర్తవ్యం నిర్వహించినాను.

ఇటీవల – ప్రసారభారతి అవతరణ దినోత్సవంలో కవిగా, నందనయుగాది కవి సమ్మేళనంలో పద్యకవిగా – పాల్గొన్నాను.

మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు గారు అనువదించిన చాణక్యుని అర్థశాస్త్ర గ్రంథాన్ని గూర్చిన ఇంటర్వ్యూలో పాల్గొన్నాను.

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి నిర్వహణలో పట్టభద్ర స్థాయి విద్యార్థులకు దూరదర్శన్ ద్వారా పాఠ్యబోధన చేసినాను.

సమస్యాపూరణ ధారావాహిక కార్యక్రమంలో కొన్ని భాగాలలో పాల్గొన్నాను.

అభినవ పోతన శ్రీ వానమామలై వరదాచార్యుల వారి 'పోతన చరిత్రము' మహాకావ్యంలోని కవితా సౌందర్యాన్ని గూర్చి ప్రసంగించినాను.

శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్‌లో :

శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తి ఛానల్ (SVBC)లో భాస్కర శతక పద్యాలను గూర్చి వ్యాఖ్యానం చేసినాను. తిరుమల స్వామి బ్రహ్మోత్సవాలలో (తిరుమలలో) వ్యాఖ్యానం చెప్పినాను. శ్రీ 'నందన' యుగాది, 'విజయ' యుగాది కవి సమ్మేళనాలలో పద్యకవిగా పాల్గొన్నాను.

ఇటీవల – ధర్మపురి శేషప్ప రచించిన శ్రీ నరసింహశతకంలోని శతపద్యాలకు వ్యాఖ్యానం చేసినాను. అవి ప్రస్తుతం (2015 మార్చి, ఏప్రిల్‌లో) ధారావాహికగా ప్రసారమవుతున్నాయి.

సంపాదకత్వం:

1) సర్దార్ పటేల్ కళాశాల ప్రధానాంధ్రోపన్యాకులుగా, ఆ కళాశాల వార్షిక సంచిక 'సర్దార్' పత్రికకు 1970 నుండి 1995 వరకు సంపాదకునిగా ఉన్నాను. (తెలుగు విభాగానికి.)

2) యువభారతి 'సాహితీ మిత్రకవుల' కవితా సంకలనం 'ఉషస్సు'కు సంపాదకత్వం వహించినాను.

3) 'యువభారతి' త్రైమాసిక పత్రిక 'నందిని' (1982) పత్రికకూ, ఇరివెంటి వారి కవితా కథల సంపుటి – 'ఇరివెంటి రచనలు' (1991) కు, 'పాతికేళ్ల పత్రికా రచన' (1992)కు యువభారతి రజతోత్సవ సంచికకూ, 'వెండివెలుగు' (1992)కు, 'అమృతరాజీవం' (1992) అనే కవితా సంపుటికీ, 'అనుభూతి' (1992) అనే కవితా సంపుటికీ సంపాదకత్వాన్ని నిర్వహించినాను.

4) ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైద్రాబాదు వారి 'ఇరివెంటి వ్యాసాలు' (1990) అనే ప్రచురణకూ, ఆ సంస్థ 'వజ్రోత్సవ సంచిక' (2003) కు సంపాదక వర్గంలో ఒక సభ్యునిగా బాధ్యతను నెరవేర్చినాను.

5) ఆచార్య జీ.వి. సుబ్రహ్మణ్యం గారి షష్టి పూర్తి ప్రచురణ – 'మధురాద్వైతం' (1996) అనే కవితా సంపుటికి సంపాదకునిగా పనిచేసినాను.

6) డా. మాడుగుల నాగఫణిశర్మ గారి – మహా సహస్రావధాన, ద్విశతావధాన పద్య సంచిక – అయిన "సహస్రశీర్ష" గ్రంథానికి సహాయ సంపాదకునిగా కృషి చేసినాను.

గ్రంథ పీఠికలు: గ్రంథ పరిష్కరణలు :

ఆధునిక కవులూ రచయితలూ రచించిన అనేక గ్రంథాలకు పీఠికలూ సమీక్షలూ వ్రాసినాను.

ఇటీవల అభినవ పోతన శ్రీ వానమామలై వరదాచార్యుల వారి కొన్ని గ్రంథాలకు పరిష్కర్తగా పనిచేసినాను.

అవధాన రంగం:

1) ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా (1975), ఆంధ్రప్రదేశ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారిచే నిజాం కాలేజీలో నిర్వహింపజేసిన అష్టావధాన కార్యక్రమంలో పృచ్ఛకునిగా పాల్గొన్నాను.

2) డా. మాడుగుల నాగఫణిశర్మ గారు చేసిన సహస్రావధానంలోనూ, బృహత్ ద్విసహస్రావధానంలోనూ సమన్వయకర్తగా, వ్యాఖ్యాతగా పనిచేసినాను లలిత కళాతోరణం (హైద్రాబాదు)లో.

3) శ్రీ గండ్లూరి దత్తాత్రేయశర్మగారి అష్టావధానాలలో

4) డా. అందె వేంకటరాజం గారి అష్టావధానాలలో

5) డా. మేడసాని మోహన్ గారి అష్టావధానాలలో – పృచ్ఛకుడిగా పాల్గొన్నాను.

6) 'రసమయి' సంస్థ, ఆం.ప్ర. ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన డా. మేడసాని మోహన్ గారు చేసిన అపూర్వ పంచసహస్రావధానానికి

(2007 లో) నెల రోజుల పాటు, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారితో పాటు, సమన్వయకర్తగా వ్యవహరించినాను – 'లలిత కళాతోరణం'లో

7) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ వారు ఘంటసాల ప్రాంగణంలో నిర్వహించిన డా. గరికపాటి నరసింహరావు గారి 'శతావధానం' (2009)లో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి గారితో పాటు సమన్వయకర్తగా పనిచేసినాను.

8) ఆం.ప్ర. ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వారు 2013లో, డా. రాళ్లబండి కవితాప్రసాద్ (సాంస్కృతిక శాఖ సంచాలకులు నిర్వహణలో జరిపిన, శతరూప కార్యక్రమంలో భాగంగా జరిగిన గరికిపాటి వారి అష్టావధాన కార్యక్రమంలో నిషిద్ధాక్షరిపృచ్ఛకుడిగా పాల్గొన్నాను.

9) 21.9.2013 నాడు, నటసమ్రాట్ డా. అక్కినేని నాగేశ్వరరావు గారి 90వ జన్మదినోత్సవం సందర్భంగా, రవీంద్రభారతిలో, రసమయి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన డా. మేడసాని మోహన్ అష్టావధాన అభినందన సభలో సమస్యాపూరణ పృచ్ఛకుడిగా పాల్గొన్నాను.

సాహిత్య రూపకాలలో పాత్రధారణ:

ఆచార్య దివాకర్ల వేంకటావధాని గారు రూపొందించిన – భువన విజయం, మహాభారతావతరణం, శ్రీనాథుని కనకాభిషేకం, రామాయణ అవతరణం, శ్రీదేవీ విజయం, కైలాస సాహితీ సభ, ఇందిరామందిరము – వంటి సాహిత్య రూపకాలలో – శ్రీకృష్ణదేవరాయలుగా, పింగళిసూరనగా, మాదయగారి మల్లనగా, అయ్యలరాజు రామభద్రునిగా, తెనాలి రామకృష్ణునిగా, వేములవాడ భీమకవిగా పాత్రధారణ చేసినాను.

ఆచార్య ముదిగొండ శివప్రసాద్ గారు రూపొందించిన – 'వేంకటాద్రి నాయుడు' అనే సాహితీ రూపకంలో ఒక కవి పాత్రను పోషించినాను.

ఆం.ప్ర. ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వారు ప్రదర్శింపచేసిన 'వందేమాతరమ్' వంటి సాహిత్యరూపకాలలో పోతనగా, దాశరథిగా నటించినాను.

డా. ద్వానాశాస్త్రి గారు రచించిన 'గురజాడ దర్బారు' రూపకంలో వేదం వేంకటరాయశాస్త్రిగా నటించినాను.

ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం - భాషాసాంస్కృతిక శాఖ వారు నిర్వహించిన మహాకవి డా. దాశరధి కృష్ణమాచార్య 89వ జయంతి ఉత్సవం సందర్భంగా రూపకల్పన చేసిన "సుకవితాశరధీ! దాశరథీ" - అనే సాహిత్య రూపకంలో 'సురవరం ప్రతాపరెడ్డి' పాత్రను పోషించి, రూపక సమన్వయకర్తగా బాధ్యతను నిర్వహించినాను 2014 జూలై 22 నాడు - రవీంద్రభారతి సభలో.

సభలూ సమావేశాలు:

1) కోలకత్తాలో 1986 లో అఖిల భారత ప్రాచ్య మహాసభ జరిగినప్పుడు "ఆధునికాంధ్ర కవిత్వంలో వినూత్న ప్రక్రియ గజల్" - అనే విషయాన్ని గూర్చి పరిశోధన పత్రాన్ని సమర్పించినాను.

2) అఖిల భారత ప్రాచ్య మహాసభలు - అహమదాబాదు, విశాఖ పట్టణాలలో జరిగినప్పుడు పాల్గొన్నాను.

3) 'సి.నా.రె. సాహిత్య సమాలోచన' (17, 18-3-1990)లో పాల్గొని సి.నా.రె. గేయనాటికలను గూర్చి పరిశోధన పత్రం సమర్పించినాను.

4) వేటూరి ప్రభాకరశాస్త్రి శతజయంతి ఉత్సవ సభ (1980) పెద్దకళ్లేపల్లిలో జరిగినప్పుడు పాల్గొని కావ్యగానం చేసినాను.

5) మూడవ అఖిల భారత తెలుగు మహాసభలు (1990) బెంగుళూరులో జరిగినప్పుడు, వాటిలో పాల్గొన్నాను.

6) అఖిల భారత అధ్యాపక మహాసభలలో (ఫిబ్రవరి-1992) కవిగా, వక్తగా పాల్గొన్నాను.

7) ఢిల్లీలో జరిగిన ఆంధ్రప్రదేశ రాజ్య ఉత్సవాల (5.11.1986) లో పద్యగానం చేసినాను - మహాకవి దాశరధి అధ్యక్షతలో.

8) ఢిల్లీలో జరిగిన కవిగోష్ఠిలో పాల్గొన్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో, కావ్యగానం చేసినాను (12.9.1987లో).

9) ఆంధ్రప్రదేశ ప్రభుత్వ యుగాదికవి సమ్మేళనాలలో చాలసార్లు పాల్గొన్నాను.

10) ఎగ్జిబిషన్ వారి వార్షిక సంక్రాంతి కవిసమ్మేళనాలలో పాల్గొంటున్నాను ఇప్పటికీ.

11) ఆం.ప్ర. ప్రభుత్వ గవర్నరు శ్రీ కృష్ణకాంత్ గారు ఏర్పాటు చేసిన బహుభాషా కవి సమ్మేళనం (9.4.1992) లో తెలుగు కవిగా పాల్గొన్నాను. ఆచార్య సి. నారాయణరెడ్డి గారు ఆ సభలో పాల్గొన్నారు – విశిష్ట అతిధులుగా.

12) జూనియర్ కళాశాల ఉపన్యాసకులకు (1986), డిగ్రీ కళాశాల అధ్యాపకులకు (1991) – వారి వారి ప్రత్యేక శిక్షణ తరగతుల పాఠాలలో పాల్గొని, వారికి ఆదర్శ పాఠ్యోపన్యాసాలను ఇచ్చినాను. నాటకం, శతకం, దాశరధి – పోతన వంటి విషయాలను గూర్చి ప్రసంగాలు చేసినాను.

13) ప్రకాశం జిల్లా (ఒంగోలు) అవతరణోత్సవాల సందర్భంగా (2.2.2008) సాహిత్య సభలో పాల్గొన్నాను.

14) ఆంధ్రప్రదేశ్‌లోని జిల్లాలలో వివిధ కళాశాలలో ఉపన్యసించినాను.

15) ఉస్మానియా విశ్వవిద్యాలయం 'బోర్డ్ ఆఫ్ స్టడీస్' సభ్యుడిగా (1991–92) పనిచేసినాను.

16) ఆంధ్రప్రదేశ్ ఒపెన్ స్కూల్ నిపుణ సంఘ సభ్యుడిగా పాఠ్య ప్రణాళికా రూపకల్పనలో తోడు పడ్డాను.

17) తిరుపతిలోని శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయ గీతాన్ని రచించి ఇచ్చినాను (డిసెంబరు 1992 లో). ఫలితంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్‌లరు సముచితంగా సభలో సన్మానించినారు.

18) 'రసమయి' సంస్థ నిర్వహించిన తెలుగు ప్రబంధ ప్రసంగ పరంపరలో 'విజయవిలాసము'ను గూర్చి ప్రసంగించినాను. ఆ వ్యాసం 'తెలుగు ప్రబంధాలు' (డిసెంబరు 1995లో)లో ప్రచురితమైనది.

19) ఇంకా – ఖమ్మం, శ్రీకాకుళం, బరంపురం, మద్రాసు, బొంబాయి,

అనంతపురం, తిరుపతి, కరీంనగర్, వరంగల్, విజయవాడ, గూడూరు, నెల్లూరు, పాలకొల్లు, చిత్తూరు, మెదక్, సిద్ధిపేట, కాగజ్‌నగర్, కోరుట్ల, నిజమాబాదు మున్నగు ప్రదేశాలలో జరిగిన సాహిత్య సభలలో, కవిగా, వక్తగా, అధ్యక్షులుగా, ముఖ్య అతిథిగా, గ్రంధావిష్కర్తగా పాల్గొన్నాను.

20) పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆహ్వానం మేరకు, నాయని సుబ్బారావు గూర్చి స్మారక ప్రసంగం చేసినాను. అంతర్జాతీయ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా (2014) తెలుగు భాష గొప్పదనాన్ని గూర్చి ప్రసంగించినాను.

21) కీ.శే. దేవులపల్ల రామానుజరావు జయంతి సందర్భంగా స్మారకోపన్యాసం చేసినాను.

22) ఇటీవల తిరుపతిలో జరిగిన నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలలో మహాకవి దాశరధి వ్యక్తిత్వాన్ని గూర్చి, కవిత్వాన్ని గూర్చి ప్రసంగం చేసినాను.

ఈ విధంగా అనేక సభలలో పాల్గొని తెలుగు భాషా సాహిత్య సమున్నతినీ సౌందర్యాన్నీ గూర్చి ఉపన్యాసాలిచ్చినాను–ఇస్తున్నాను ఇప్పటికీ.

ఇక ఈ 'పరిణతవాణి' ప్రసంగాన్ని ఈ సూక్తులతో ముగిస్తాను.

"వెలుగు కొఱకు విక్రమించు
తెలివి ప్రజకు విక్రయించు
నిశ్చితహిత మాచరించి
నెమ్మదిగా నిష్క్రమించు"
"ఎవరు నీకు పోటి లేరు
ఎవరు నీకు సాటి కారు
నీ పయనం నీదే మరి!
ఎవరూ నీతోటి రారు" ('కలంలో కలకలం' నుండి)

❖ ❖ ❖



వరవరరావు

'మొదటి ప్రపంచ యుద్ధంతో పాటు నేను భూమి మీద పడ్డాను' అని కాళోజీ అన్నట్లు రెండో ప్రపంచ యుద్ధంతో పాటు నేను భూమి మీద పడ్డాను. ఈ రెండు యుద్ధాలతో పాటు మేమిద్దరమే పుట్టలేదు. ఆయా కాలాల్లో మా సమకాలీనులందరూ పుట్టారు. అందుకోసం కాదు వాటి ప్రస్తావన. మొదటి ప్రపంచ యుద్ధం ముగియడం కన్నా ముందే 1917లో రష్యాలో విప్లవం విజయవంతమైంది. ప్రపంచమంతటా ప్రజాస్వామిక, సామ్యవాద భావాలు వికసించాయి. రెండో ప్రపంచ యుద్ధమైతే ఫాసిజాన్ని ఓడించి ప్రజాస్వామ్య శక్తుల విజయాన్ని సామ్యవాద రష్యా నాయకత్వంలో సాధ్యం చేసింది. వలస పాలన అంతానికి దారులు వేసింది.

నేను 3 నవంబర్ 1940న చిన పెండ్యాలలో పుట్టాను. మా అమ్మది సంతపురి వంశం. అంటే మా మాతామహులది అలియాబాదు, హైదరాబాద్. ఆమె తండ్రి సంతపురి రాఘవరావు హనుమకొండ పేష్కార్ చేసాడు గనుక వాళ్ల యశోదమ్మగా పిలుచుకునే మా అమ్మ చినపెండ్యాల చితికిన మధ్యతరగతి కుటుంబానికి చెందిన పెండ్యాల కోదండరామారావు గారిని రుక్మిణిగా చేపట్టింది. మా బాపు కన్నా మా అమ్మ విద్యావంతురాలు, ధైర్యస్తురాలని నాకు గట్టి నమ్మకం. మా బాపు పట్వార్‌గిరీకి అసల్‌దార్ కాదు గనుక ఎక్కడ దొరికితే అక్కడ గుమస్తాగానే దస్త్రం రాసేవాడు. కరణం వ్యవసాయం గురించయితే చెప్పనక్కర్లేదు.

పైగా నేను పుట్టే నాటికి బతికిన సంతానమే పదిమందిమి. ఐదుగురు అక్క చెల్లెళ్లు. ఐదుగురు అన్నదమ్ములం. పెద్దన్నయ్యలిద్దరూ నేను పుట్టేనాటికి కాంగ్రెస్

పార్టీ రాజకీయాల్లో పూర్తికాలపు కార్యకర్తలుగా తలమునకలుగా ఉన్నారు. మా తాతల నాటి భూములమ్ముకొని తినడమే మా ప్రధాన ఆదాయం. దానికి మా అమ్మ హృదయవిదారకంగా వివరించి చెప్పే ధాత కరువు తోడయింది. బెంగాల్ కరువు అని తర్వాత కాలంలో సాహిత్యంలో చదువుకున్నది. కనుక నా బాల్యం పశువులు మొదలు మా ఇంట్లో, ఇరుగు పొరుగు చాల మరణాలు చూసింది. దీనికంతా నేను మూలా నక్షత్రంలో పుట్టడం కారణమని మా బాపు నా మీద కలిగే పుత్రోత్సాహాన్ని అణచుకునేవాడు. అందుకని మా అమ్మకు నేనంటే ప్రాణం. నా ఎనిమిదో ఏట బాపు మరణించాడు. పదవ ఏట ఒక ఏడాది గడువులో మా పెద్దన్నయ్య ఐదేళ్ల పాప, ఆయన భార్య, చివరకాయన కూడ క్షయవ్యాధితో మరణించారు. రెండవ ప్రపంచ యుద్ధమూ, ధాత కరువూ మా ఇంట్లోకి రాకుండా పోలేదన్నమాట.

మా ఊరు చిన పెండ్యాల జాగీర్ గ్రామం. కనుక మాకు రాయగిరి తాలూకా, డిండిగల్ జిల్లానట. అంటే ఏమిటో అప్పుడు నాకు తెలియదు గానీ భారత సైన్యం హైదరాబాద్ సంస్థానాన్ని ఆక్రమించుకున్నాక గానీ 1950లో మాకు సర్కార్ బడి వచ్చింది. అప్పటిదాకా మాకంతా ఖాన్గీ చదువులే. ఎక్కువగా సాలెపంతుళ్లు. పేరాల వీరయ్య, పేరాల బచ్చయ్య – పెదబాల శిక్ష. సుమతీ వేమన శతకాలు. ఉసిక మీద, పలక మీద కరడాలు – పేంబెత్తంతో దెబ్బలు, కోదండాలు, నా వరకు ఆ స్థితి ఎక్కువ కాలం లేదు. మా పెద్దన్నయ్య తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుడుగా సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య కార్యకలాపాల్లో భాగంగా తాలూకాలో చాల చోట్లతో పాటు పొరుగున ఘనపురం స్టేషన్‌లో జాతీయ పాఠశాల, గ్రంథాలయం నెలకొల్పారు. మా ఊళ్లోనూ 1943లోనే గ్రంథాలయం పెట్టించాడు. జాతీయోద్యమంలో పనిచేస్తున్న సముద్రాల లక్ష్మీనర్సయ్య, బి. యాదగిరి, ఎన్. రవీందర్‌లను మా ఊరికి అధ్యాపకులుగా తెచ్చాడు. మా ప్రత్యేకమైన చదువులట్లా మొదలయ్యాయి. మా ఇంట్లోనే ఉంటూ కోమటి నాగభూషణంగారి పెద్ద వసారా వంటి ఇంట్లో రవీందర్ గారు బడి నడిపే పద్ధతి తర్వాత కాలంలో గాంధీ, జాకీర్ హుస్సేన్‌లు అమలు చేసిన బేసిక్ విద్యా విధానం అనుకుంటాను. తకిలీలు, రాట్నాలపై

ఖద్దర్ వడకడం, వ్యాయామంతో మొదలై గాంధీజీ ఆత్మకథ, నెహ్రూ భారత దర్శనం, ప్రపంచ దర్శిని, మాక్మిలన్ వాచకాలు మాకు చెప్పేవాడు. ఊరు పక్కనే ఉన్న వాగుకు తీసుకుపోయి చెడుగుడు ఆడించేవాడు. పాటలు నేర్పి, నాటకాలు వేయించేవాడు.

మా ఊరు చాల అందమైన ఊరు. ఎడమ వైపు ఆకేరు. కుడివైపు రాజారం వాగు – రెండు నశికల్లు రామాలయం దగ్గర కలిసి మా ఊరి మెడలో హారంగా ఉండే ముప్పేట వాగు. ఎడమ వైపు వాగు అటు ఒడ్డున పొట్లపల్లి రామారావు గారి ఊరు. మా ఊరు హైదరాబాద్ – హనుమకొండ బస్సు మార్గంపై ఉంటుంది. బర్సనగడ్డ బస్ స్టేజి మా ఊరికి దక్కన్ పీఠభూమి లాంటిది. అక్కడ బస్సు కోసం నిలబడితే ఘనపురం కనిపించేది. రోడ్డెంబడి దట్టంగా బొడ్డుమల్లె చెట్లు. దిరిసెన పూల చెట్లు. "శిరీష కుసుమపేశల సుధామయోక్తుల" పెద్దన గురించి మాకు పియుసిలో చెలమచెర్ల రంగాచార్యులు పాఠం చెప్పడం కన్న ముందే మా బాల్యంలో దిరిసెన పూల పరాగాన్ని మా జీవితాల్లోకి తెచ్చుకున్నాం.

నేను సాహిత్యంలోకి, రాజకీయాల్లోకి రావడం విశేషం కాదు. మా ఇంట్లో మా అన్నయ్యలందరూ రచయితలు. పెద్దన్నయ్య పెండ్యాల రామానుజరావు గారికి కందుకూరి, చిలకమర్తి, పానుగంటి రచనలంటే ఇష్టం. మా రెండవ అన్నయ్య శేషగిరిరావు స్వయంగా కవి, కథకుడు. జాషువా, జంధ్యాల పాపయ్య శాస్త్రి, పద్యాలను తన శ్రావ్యమైన కంఠంతో మా ఇంట్లో ప్రవేశపెట్టిన వాడు ఆయన. ఇంక మా మూడవ అన్నయ్య రాగవులన్నయ్య, 'రాజశ్రీ' కవి, కథకుడు, గాయకుడు. నాకు, పెండ్యాల కిషన్‌రావుకు సాహిత్యంలోకి కిటికీలే కాదు ద్వారాలు తెరచినవాడు. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, పుస్తకాల ద్వారా, దాశరథి, సినారెలు ఉత్తరాల ద్వార కూడ మా ఇంట్లోకి నా బాల్యంలోనే వచ్చారు. మా పెదనాయన కొడుకు పెండ్యాల రాఘవరావు ఆర్య సమాజ్, ఆంధ్ర మహాసభలలో పనిచేసి భోనగిరి మహాసభ నాటికి కమ్యూనిస్టు పార్టీలోకి పోయినట్లున్నాడు. నాకు బుద్ధి తెలిసే నాటికి ఆయన అజ్ఞాత జీవితానికి వెళ్లి ఉంటాడు కాని నా బాల్యంలో ఒక దృశ్యం నా కళ్ల ముందు ఇప్పటికీ నిలిచి ఉంది. 1940ల తొలి అర్ధభాగంలోనే అనుకుంటాను ఊళ్లో కల్లా పెద్ద భూస్వామి,

అసల్‌దార్ పట్వారీ అయిన ఆయన తండ్రి రామచంద్రరావు ఇంట్లోకి, అంటే తన ఇంట్లోకే ఒక సాయంకాలం పెండ్యాల రాఘవరావు ఊళ్లోని మాల మాదిగలను తీసుకవచ్చి బలవంతంగా ప్రవేశపెట్టాడు. అంటే అస్పృశ్యతా వ్యతిరేక పోరాటమే కాదు, తండ్రి ఆధిపత్య కుల బ్రాహ్మణీయ భావజాలం పట్ల ధిక్కారం ప్రకటించడానికి కూడ అదొక సంచలన చర్య అనుకుంటాను. ఆ దశాబ్దమంతా అటు పెండ్యాల రాఘవరావు గానీ, మా అన్నయ్య పెండ్యాల రామానుజరావు గానీ మా ఊళ్లో ఇటువంటి సంఘ సంస్కరణ కార్యకలాపాలు చేపట్టడం నా బాల్యం మీద ఒక ప్రగాఢమైన ప్రభావాన్ని వేసాయి. మా ఊళ్లో 1943లోనే సీతారామాంజనేయ గ్రంథాలయం పెట్టి పొట్లపల్లి రామారావు గారి 'జైలు కథలు' పుస్తకాన్ని అచ్చువేసారు. ఆ తర్వాత మా శేషగిరి రావు అన్నయ్య పందొమ్మిదవ ఏటనే రాసిన 'దాంపత్యం' కథలు వేసారు. మాకు ఐదు మైళ్ల దూరంలో ఉన్న ఘనపురంలో మా పెద్దన్నయ్య స్థానిక వైశ్య దాతల సహాయంతో, కాంగ్రెస్ పార్టీలో అప్పుడు క్రియాశీలంగా పనిచేస్తున్న గోలి, పార్శి, కూరెళ్ల కుటుంబాలకు చెందిన విశ్వనాథం, ఈశ్వరయ్య, వీరయ్య మొదలైన నాయకుల సహాయంతో జాతీయ పాఠశాలను, గ్రంథాలయాన్ని చాలా కాలం నిర్వహించారు. తర్వాత ఉస్మానియాలో ఎడ్యుకేషన్ ప్రొఫెసర్‌గా పనిచేసిన వంగర రుక్మారావు, సముద్రాల లక్ష్మీనర్సయ్య మొదలైనవాళ్లు ఇక్కడ ఉపాధ్యాయులుగా పనిచేసిన వాళ్లే. ఈ రోజుల్లోనే ఘనపురం నుంచి 'సేవాంజలి' అనే ఒక సాహిత్య గ్రంథాన్ని వీళ్లంతా కలిసి వెలువరించారు. ఇటీవల కాలంలో ముదిగంటి సుజాతరెడ్డి గారు వెలువరించిన తెలంగాణ కథల్లో 'దాంపత్యం', 'సేవాంజలి' నుంచి కథలు మళ్లీ వెలుగు చూసాయి.

ఆంధ్ర మహాసభ, కాంగ్రెస్ పార్టీల అనుబంధం వల్ల నా చిన్ననాటికే అటు పెండ్యాల రాఘవరావు గారి ఇంటికి, ఇటు మా ఇంటికి కాళోజీ, పొట్లపల్లి రామారావు తరచు వచ్చేవాళ్లు. కాళోజీ 'నా గొడవ' గేయాలు, పొట్లపల్లి రామారావు గారి 'కాలిబాట' గేయాలు మా చిన్నతనంలోనే శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గేయాలతో పాటు నేనూ, కిషన్‌రావు కంది చేలల్లో, జొన్న చేలల్లో పాడుకుంటూ తిరిగే వాళ్లం. పొట్లపల్లి వారి కుటుంబంతో మా కుటుంబానికి మరో అనుబంధం కూడ ఉండేది.

మేము మల్లంకుంట్ల లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి ఇనాందార్లం. బహుశా ఆ దేవస్థానం భూముల యాజమాన్యంలో పొట్లపల్లి వారి కుటుంబం ఉండి ఉంటుంది. నాకు స్పష్టంగా తెలియదు గానీ పొట్లపల్లి రామారావు గారి అన్నయ్య రాంచందర్‌రావు గారికి మా బాపు కాలం నుంచే మా కుటుంబంతో సంబంధాలుండేవి. ఆయన కొడుకులిద్దరూ తర్వాత కాలంలో హనుమకొండలో మాతో ఉండి చదువుకున్నారు.

ఆంధ్ర సారస్వత పరిషత్ మా ఊళ్లో పెండ్యాల రామచంద్రరావు గారి బంకుల్లో (ఇంటి ముందరి వసారా) నిర్వహించిన పరీక్షల్లో మా అన్నయ్య చినరాఘవరావు విశారద పరీక్ష రాసాడు. నేను, దామోదరరావు అన్నయ్య ప్రాథమిక పరీక్షలు రాసాము. సారస్వత పరిషత్తు తరఫున పరీక్షల నిర్వహణ పొట్లపల్లి రామారావు గారు చేసారు. ఇంత సహజమైన రాజకీయ, సాహిత్య వాతావరణంలోంచి పోలీస్ చర్య తర్వాత, అంటే 1950లో నేను, దామోదరరావు అన్నయ్య హనుమకొండలో, ప్రభుత్వ పాఠశాలలో చేరడానికి వెళ్లాం. నేను మర్కజిలో చేరాను. అప్పటి నుంచి 1956 దాకా నాకయినా, పెండ్యాల కిషన్‌రావు కయినా సాహిత్య గురువు మా పెండ్యాల రాఘవరావు, 'రాజశ్రీ' అన్నయ్యే. ఆయనకు సినారె, దాశరథిలతో ఉండే ఉత్తర ప్రత్యుత్తరాల స్నేహం వల్ల అగ్నిధార, రుద్రవీణ, నవ్వని పువ్వు మా పాఠ్య గ్రంథాలయ్యాయి. నేను మా అక్కయ్యల, అన్నయ్యల పిల్లలతో 'నవ్వని పువ్వు', భాగవతం ఆధారంగా సినారె రాసిన గేయ నాటికలు మా చిన్నాయన ఇంట్లో ప్రదర్శిస్తుండేవాళ్లం. సాయంకాలాలు పొలాల దగ్గరికో, చేన్లకు, చెలకలకో తీసుకపోతూ మా రాగవులన్నయ్య మాకు కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ సాహిత్యం గురించి, ఉర్దూ సాహిత్యం గురించి, ప్రేంచంద్, కిషన్‌చందర్ మొదలైనవారి అభ్యుదయ సాహిత్యం గురించి చెప్తుండేవాడు. గొంతెత్తి పద్యాలు, గేయాలు చదివి వినిపిస్తుండేవాడు. వట్టికోట ఆళ్వారుస్వామి కూడ తాటికాయలకు పోతూ మా ఇంటి మీదుగా పోయేవాడు. వానమామలై వరదాచార్యులకు రామారావుగారి తోటలో వేసవి విడిది ఏర్పాటు చేసి 'పోతన చరిత్ర' రాయించడానికి, క్షయవ్యాధి వలన విశ్రాంతి కోసం ఏర్పాట్లు చేయడానికి పోతుంటాడని మా అన్నయ్య చెప్పేవాడు.

అట్లే 'పరిసరాలు' కథా సంకలనాలు రెండు సంపుటాలలో ఒక సంపుటిలో మా రాగవులన్నయ్య 'తీరని కోరిక' కథ అడిగి తీసుకోవడానికి ఒక సాయంత్రం వచ్చినప్పుడు ఆ ఆజానుబాహువు స్ఫురద్రూపాన్ని చూసాను. చంకల సంచి వేసుకొని, ముతక ఖద్దరు దుస్తులతో ఊరూర తిరిగి పుస్తకాల ప్రచారం చేస్తూ, అమ్ముతూ ఆయన నిర్వహించిన దేశోద్ధారక గ్రంథమాల ప్రచురణల కార్యక్రమం, గ్రంథాలయోద్యమం నా బాల్యం మీద వేసిన చెరగని ప్రభావమే పరిణత వయసులో 'ప్రజల మనిషి', 'గంగు' నవల చదివి వాటి మీద పరిశోధన చేయడానికి తర్వాత కాలంలో దోహదం చేసినవి.

నా మీద పెద్దన్నయ్య పెండ్యాల రామానుజరావు నిజాయితీతో కూడిన ఆదర్శ త్యాగ జీవిత ప్రభావమే కాకుండా బాల్యంలో జమలాపురం కేశవరావు ప్రభావం కూడ ఉన్నది. పల్లగుట్టలో ఆంధ్ర మహాసభ సభలు జరిగినపుడు మా పెద్దన్నయ్య జగన్నాథం అనే ఒక కాంగ్రెస్ కార్యకర్తను పంపించి నన్ను సైకిల్ మీద రప్పించుకున్నాడు. అప్పటికే సర్దార్ బిరుదు పొందిన ఆ ఆజానుబాహువు ముతక ఎర్రని ఖద్దరు దుస్తులతో ఊళ్లన్నీ కాలి నడకన తిరుగుతూ దుమ్ము కొట్టుకున్న కాళ్లతో ఊళ్లో ప్రవేశిస్తుంటే ఆ ప్రాంత ప్రజలు ఆయనకు ఎదురేగి పదహారెడ్ల బండి కట్టి ఆయనను సభ వేదిక దగ్గరికి తీసుకు వచ్చారు. ఆ బండి మీద ఆయనతో పాటు మా అన్నయ్య, ఆయన ఒళ్లో నేను కూర్చున్నాం. అదొక పులకరింత. 1952 ఎన్నికల్లో పెండ్యాల రాఘవరావు ఒక లోక్‌సభ స్థానానికి, మూడు శాసనసభల స్థానాలకు పోటీ చేసి ఒక లోక్‌సభ, రెండు శాసనసభ స్థానాలు గెలిచాడు. లోక్‌సభ స్థానానికి వరంగల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ గుర్తుతో కాళోజీ పోటీ చేసాడు. (తన జీవితంలో చేసిన ఒకే ఒక్క తప్పు ఒక పార్టీ టికెట్‌పై పోటీ చేసి 'పార్టీవ్రత్యాన్ని' పాటించడమని కాళోజీ తన ఆత్మకథ 'ఇదీ నా గొడవ'లో స్వీయ విమర్శ చేసుకున్నాడు) పెండ్యాల రాఘవరావు లోక్‌సభ స్థానం ఉంచుకొని రెండు శాసనసభ స్థానాలకు రాజీనామా చేస్తే జరిగిన ఉప ఎన్నికలకు కమ్యూనిస్టు పార్టీ ఘనపురం నియోజకవర్గానికి ఆరుట్ల లక్ష్మీ నరసింహారెడ్డిని, వర్ధన్నపేటకు సర్వదేవరభట్ల రామనాథాన్ని నిలబెట్టింది. రెండు చోట్లా కాంగ్రెస్ పార్టీ జమలాపురం

కేశవరావును నిలబెట్టింది. ఆ ఎన్నికల సందర్భంగా కేశవరావు గారు మా ఊరు వచ్చి తాను ఎన్నికైతే తెలంగాణ ప్రజల కొరకు చేపట్టదలచుకున్న పనుల గురించి వివరించిన తీరు, ప్రజల పట్ల ఆయన సేవాభావం పన్నెండేళ్ల నా మనసుపై ఎంతో ప్రభావం వేసినవి. 'కాడితో రెండెడ్లు కదలి వస్తున్నాయి, కాంగ్రెస్‌కే ఓటు వేయాలయో' అనే ఎన్నికల ప్రచారంతో మా ఊళ్లో నేను తిరిగాను. ఆశ్చర్యమేమిటంటే నాకు ఓటు హక్కు వచ్చిన తర్వాత ఎన్నికల ప్రచారం కాదు కదా నేనెన్నడూ ఓటు వేయలేదు. 1962 ఎన్నికల నాటికి నాకు ఎం.ఎ. కూడ అయిపోయింది. అప్పటికి నాకు ఓటు హక్కు వచ్చింది. ఆ ఎన్నికల్లో బొంబాయి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కృష్ణ మీనన్ స్వతంత్రంగా పోటీ చేసిన కృపలానీపై గెలవాలని అనుకున్నాను. మా మిత్రబృందమంతా కృపలానీ పక్షం వహించిన ఎస్. జయపాల్‌రెడ్డితో హెూరాహెూరీ వాగ్యుద్ధం, చర్చల్లో పాల్గొన్నారు ('అంపశయ్య' నవలలో ఆ చర్చంతా చూడవచ్చు) కానీ, మా నియోజకవర్గంలో, మా ఊళ్లో మాత్రం నేనెవరికీ ఓటు వేయాలనే ఉత్సాహం చూపలేదు. 1967 నాటికి జడ్చర్ల కాలేజీలో లెక్చరర్‌గా అమర్‌చింత గ్రామానికి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వెళ్లాను గానీ పోస్టల్ బ్యాలెట్ హక్కు కూడ ఉపయోగించుకోలేదు. అపుడప్పుడే విప్లవ భావాల పట్ల ఆకర్షితుణ్నవుతున్నాను. 1972 నాటికి ఎన్నికల బహిష్కరణ చైతన్యంలోకి మారిపోయాను గనుక ఇంక ఆ సోది మిగలలేదు.

ఇటువంటి శిథిల ఫ్యూడల్ భూస్వామ్య బ్రాహ్మణీయ నేపథ్యం నుంచి నన్ను అభ్యుదయ భావాలవైపు తీసుకువచ్చింది మాత్రం కవిత్వమే. ముఖ్యంగా శ్రీశ్రీ కవిత్వం. అయితే అప్పటి అభ్యుదయ కవులకు (బహుశా ఇప్పటికీ అభ్యుదయ కవులకు) గాంధీ, నెహ్రూ, ఇందిరా గాంధీ కూడ నేమో – వాళ్ల సాహిత్య సిలబస్‌లో భాగమే. కనుక నాకు జ్ఞాపకం ఉన్నంతవరకు పద్నాలుగవ ఏట ఆకాశవాణి నిర్వహించిన కవిత్వ పోటీకి మా రాగవులన్నయ్య సహాయంతో గాంధీపై పద్నాలుగు పంక్తుల సానెట్‌తో నా కవితా రచన ప్రారంభమైంది. మర్కజి విద్యార్థిగా మా దామోదరరావు అన్నయ్య నిర్వహించిన 'విజ్ఞాని' లిఖిత పత్రికలో, ఆ తర్వాత 'రచన'లో సృజనాత్మక రచన ఎంత చేసానో జ్ఞాపకం లేదు గానీ నేను ఆ పత్రికల

రాయసగాణ్ని. కాలేజియేట్ హైస్కూలులో ఉదయరాజు శేషగిరి రావు గారనే పండిత కవి, టి.వి. సుబ్బారావు సార్లు నన్ను కవిత్వ రచనకు ప్రోత్సహించారు. ఆటవెలది, తేటగీతుల నుంచి శార్దూలాలు, మత్తేభాల దాకా ప్రయోగాలు చేసి తాజమహల్‌ను చూసినప్పుడు దేశీఛందస్సులో రాసాను. వరంగల్ ఆర్ట్స్ కాలేజీలో బిఎలో నవయవ్వన ప్రేమ చిగురించినపుడు ఏకపక్ష ప్రేమతో 'శరద్వతీ' మకుటంతో కావ్యం రాశాను. ఈ కాలమంతా కటిక దరిద్రపు కాలం గనుక, మా అన్నయ్యలు నన్ను డొక్కారగట్టుకొని చదివిస్తుంటే 'కంఠాభరణం' నాటకంలో వలె ఆహారాన్వేషణలో కంద పద్యాలు, శతక కవిత్వం ఆశువుగా మా పురుషోత్తమన్నయ్యతో కలిసి రాసిన రోజులూ ఉన్నాయి.

నా కవిత్వానికయినా, సాహిత్య విమర్శకైనా బ్రేక్‌థ్రూ 1957లో రావడం ఇవ్వాటి నా ప్రాపంచిక దృక్పథంతో పోలిస్తే ఒక విరోధాభాసం. 1957లో రష్యా చంద్రమండలం లోకి 'లైకా' అనే కుక్కపిల్లను పంపినపుడు నేను రాసిన 'సోషలిస్టు చంద్రుడు' అనే వచన కవిత 'తెలుగు స్వతంత్ర'లో అచ్చయి నాకు కవిగా గుర్తింపును తెచ్చినప్పుడు వచ్చింది. అంతకు ఒక్క సంవత్సరం ముందే అనుకుంటాను ఇరవై దేశాల కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ సభలో కృశ్చేవ్ వర్గ సామరస్య సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అప్పటికి ఐదు ఏళ్ల పూర్వమే కమ్యూనిస్టు పార్టీ 1951లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విరమణ చేసింది. 1952లో ఇంకా నిషేధం తొలగక పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్‌గా డా. జయసూర్య నాయకత్వంలో ఎన్నికల్లో పోటీ చేసిన దగ్గర్నించీ 1967 దాకా కాస్త 'ముందుచూపు'తోనే భారత కమ్యూనిస్టు పార్టీ వర్గ సామరస్య ఎన్నికల రాజకీయాలలోనే కూరుకుపోయింది. అభ్యుదయ కవిననుకుంటున్న నాకు సోవియెట్ రష్యా చంద్రమండలానికి, ఒక కుక్కపిల్లను పంపడమే సోషలిస్టు ప్రయోగమనిపించింది. ఇపుడీ ప్రస్తావన ఎందుకంటే ఆ తర్వాత ఒక వచన కవితలో నేను చంద్రమండలానికి, స్వర్గలోకానికి వెళ్లి కామధేనువు పొదుగుకోసి నాలుగు ఖండాలకు అమృత క్షీరాలు పంచుతానని రాసినపుడు - సామ్యవాదం, సమానత్వం అంటే పొదుగు కోసి పంచడం కాదు, ఉత్పత్తిలో పాల్గొనే ప్రజలు ఉత్పత్తిపై, ఉత్పత్తి సాధనాలపై అధికారాన్ని పొంది శ్రమ ఫలాలు సమానంగా

పంచుకోవడమని మా బంధువు, సుందరయ్యగారి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో కొరియర్‌గా పనిచేసిన ఒకాయన నన్ను సవరించాడు.

ఆ రోజుల్లోనే 'తెలుగు స్వతంత్ర'లో సినిమాల చిట్టడవిలో చిక్కుకున్న మహాకవి' అని చేకూరి రామారావు ఒక కవిత రాస్తే 'ఇంకా శ్రీశ్రీయే రాసి మనకు మార్గ దర్శకత్వం వహించాలని ఎందుకనుకోవాలని, ఆ మార్గంలో మనమే పయనించవచ్చు కదా' అని 'తెలుగు స్వతంత్ర'లో రాసిన వ్యాసంతో నేను 'సాహిత్య విమర్శ'లో ప్రవేశించాను.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నిజాం కాలేజీ గ్రౌండ్స్‌లో ఆ రోజుల్లో 'ఆంధ్రాభ్యుదయోత్సవాలు' నిర్వహించేది. విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే కవితా రచన పోటీలో 1958-59, 60 - బిఎ, రెండవ, మూడవ సంవత్సరాలు, ఎంఎ ప్రీవియస్ (1960-61), వరుసగా నేను రెండుసార్లు ప్రథమ బహుమతి, మూడోసారి ద్వితీయ బహుమతి పొందాను. మూడుసార్లు సి. నారాయణరెడ్డి గారే న్యాయనిర్ణేత. 1958లో రాసిన 'భళ్ళున తెల్లవారునింక భయం లేదు' కవిత నాకు చాలా పేరు తేవడమే కాదు ఒక అసంకల్పిత కవితా చైతన్య ప్రకటన. ఈ కాలంలో నాకు మర్కజి నుంచి, ఎంఎ దాకా క్లాస్‌మేట్, ఈనాటికీ కలిసి నడుస్తున్న 'సాహితీ మిత్రుడు' గంట రామన్న నాకు గుడిపాటి వెంకటచలంలోకి కిటికీలు తెరిచాడు. అట్లా 1957లో చలంలోకి ప్రవేశిస్తే కిటికీలు గోడలు పగిలి తోవలుగా మారి నక్సల్బరీ కాలం దాకా, 1968లో నా 'చలినెగళ్లు' కవితా సంకలనం ఆయనకు అంకితం ఇవ్వడం దాకా మా లోకం చలం. ఉస్మానియా క్యాంపస్‌లో ఎంఎ, తర్వాత రెండేళ్ల రీసెర్చ్ కాలంలో అటు అభ్యుదయ వచన కవితలు, శ్రీశ్రీని, అభ్యుదయ కవిత్వాన్ని సమర్థించే వ్యాసాలు రాస్తూనే, చలం, చార్లీ చాప్లిన్, సత్యజిత్‌రే, గురుదత్, మర్లిన్ మన్రోల ప్రపంచంలో 'మల్లెపూలు', హేమంత స్వప్నాలు - వంటి ప్రేమ కవిత్వం కూడ రాసాను. అదే కాలంలో చైనాతో, పాకిస్తాన్‌తో భారత ప్రభుత్వం యుద్ధం తెచ్చుకుంటే నేనూ శ్రీశ్రీ, కాళోజీల వలె 'దేశభక్తి, పొంగిపొర్లి తిట్టు కవిత్వం రాసాను. నా సహాధ్యాయి వే. నరసింహారెడ్డితో కలిసి కవితా సంకలనాలు వెలువరించాను. 'కాళోజీ కవి కలం కుంచె కదలాడెను' అని సీరియల్ సాహిత్య

వ్యాసాలు 'జనధర్మ'లో రాసాను. ఇటువంటి పని కవుల్లో కె.వి. రమణారెడ్డి, సి. విజయలక్ష్మి తప్ప మిగతా కవులంతా మినహాయింపు లేకుండా చేసారు. శుద్ధ కవిత్వవాదులైన అజంతా (జెండాలకు కన్నీళ్లు లేవు) ఇస్మాయిల్ (వడ్లపిట్ట - కమ్యూనిస్టులను తిడుతూ)లు కూడ ఫక్తు రాజకీయ కవిత్వం రాసిన రోజులు 'దేశభక్తి' అంటువ్యాధి వల్లనే. నెహ్రూ చనిపోతే, కెనెడీ చనిపోతే నేను రాసిన కవిత్వాలు నాకెంత పేరు తెచ్చాయో నాకిప్పుడంత ఆశ్చర్యమనిపిస్తుంది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని అణచివేయడానికి ఇంకా రాజ్యాంగ రచన జరగని రోజుల్లో, పార్లమెంటు ఏర్పడని రోజుల్లో హైదరాబాద్ రాజ్యం మీదికి సైన్యాన్ని పంపిన నెహ్రూను నేనెట్లా సామ్యవాది అనుకున్నానా - నాలుగు వేల మంది కమ్యూనిస్టులను, సానుభూతి పరులను చంపి, రజాకార్ల నెపంతో రెండు లక్షల మంది ముస్లింలను చంపిన కేంద్ర ప్రభుత్వాన్ని లౌకిక ప్రజాస్వామ్యమని ఎట్లా అనుకున్నానా అని ఇప్పుడు ఆశ్చర్యమనిపిస్తుంది. బహుశా అది ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ప్రభావం. అప్పటికింకా కమ్యూనిస్టు పార్టీ చీలలేదు. నేను బిఎలో ఉండగా నా సహాధ్యాయి అయిన సి. రాఘవాచారి ద్వారా నేను నిర్మాణరీత్యా కాకున్నా భావజాలం ద్వారా అటువైపు ఆకర్షితుణ్నవుతున్నాను. శ్రీశ్రీ 'త్రీ చీర్స్ ఫర్ మ్యాన్' ఇంగ్లిష్ కవితా సంకలనాన్ని 1963-64లో హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ (సిపిఐ అనుబంధ సంస్థ) తరఫున సుల్తాన్ బజార్ క్లాక్ టవర్ దగ్గర విడుదల చేయించినప్పటికి నాకా పార్టీ చీలిపోయే పరిస్థితిలో ఉందని కూడా తెలియదు.

కవిగా గుర్తింపు వచ్చిన 1957లోనే నా సాహిత్య సంఘ కార్యకలాపాలు కూడ ప్రారంభం కావడం యాదృచ్ఛికం కాకపోవచ్చు. బిఎ మొదటి సంవత్సరంలో కళాశాల తెలుగు సాహిత్య సమితి కార్యదర్శినయ్యాను. మా అన్నయ్యల తమ్మునిగా కాకుండా ఒక యువకవిగా కాళోజీ దగ్గర గుర్తింపు పొంది ఆయనను మా సాహిత్య సమితి ఆవిష్కరణకు తీసుకపోయాను. ఆయన బాటలో 'ఓటేసేటప్పుడే ఉండాలి బుద్ధి. ఓటుబోయిన కుండనెంచుకోవద్దు' అని మా గంటరామన్న ఎన్నికల ప్రచార కార్డునచ్చు వేసి అజాత శత్రువైన మా మిత్రుని ఓటమికి కూడ కారణమయ్యాను. కానీ ఈ అనుభవమంతా కాళోజీ సోదరుల ప్రోద్బలంతో నక్కలగుట్టలోని వాళ్ల

ఇంట్లోనే 1958లో 'మిత్రమండలి' అనే సాహిత్య సంస్థ ప్రారంభించడానికి పనికొచ్చింది. నేను మొదటి కన్వీనర్‌ను. పదిహేను రోజులకొకసారి ఎవరు పిలిస్తే వారి ఇంట్లో సమావేశాలు ఏర్పాటు చేయడానికి తప్ప రిజిస్ట్రేషన్లు, బ్యాంకు అకౌంట్లు లేని సంస్థగా అది నడవాలన్నది రామేశ్వరరావు గారి ఆకాంక్ష. ఇప్పటికీ ఇంచుమించు అరవై సంవత్సరాలుగా 'మిత్రమండలి' అనిర్విఘ్నంగా సాగుతున్నది. కనుక నా తొలి కవితాక్షేత్రమైనా, కార్యరంగమైనా దినమూ రాత్రీ 1957 నుంచి 60 దాకా వరంగల్ ఆర్ట్స్ & సైన్స్ కాలేజీ, 'మిత్రమండలి' అని చెప్పవచ్చు. ఆ కాలంలో మమ్మల్ని తీర్చిదిద్దిన వాళ్లు కాళోజీ సోదరులు. ప్రభావాలు ఇరివెంటి కృష్ణమూర్తి, పి.జి. లాలే (నా వరకు) ఎక్కువగా కాళోజీ నారాయణరావు. నన్ను ఆధునిక సాహిత్య పఠనంలోకి ప్రేరేపించిన వ్యక్తి ఇరివెంటి కృష్ణమూర్తి. మా ఇంగ్లిష్ లెక్చరర్ ఎంఆర్ సత్యనారాయణ షేక్స్పియర్ నాటకాలు, గురజాడ 'కన్యాశుల్కం' లలో ఉన్న విశిష్టతలు మాత్రమే కాదు పాలకుర్తి సోమనాథుని ప్రత్యామ్నాయ సాహిత్య మార్గమేమిటో కూడ 'మిత్రమండలి'లో చెప్పిన కన్నడిగుడు. మాకు ఒక పుస్తకం చదువడం కన్న దేశం తిరగడమెంత మానసిక వికాసాన్ని ఇస్తుందో చెప్పి తిప్పినవాడు కూడ ఆయనే. 'కోణార్క్‌లో శిల్పాలు అక్షరాలా దరహాసం చేస్తాయి' అనేవాడు. శిల్పం అంటే మనతో మాట్లాడే బొమ్మలనేవాడు.

1962లో ఎంఎ అయ్యేనాటికి ఒక సంకలనం కాదగినన్ని కవితలు రాసాను. అప్పటి నుంచీ శ్రీశ్రీతో ముందుమాట రాయించుకోవాలన్న కోరిక నెరవేరకుండానే ఇంక ఎదురుచూపు మానేసి '1968 మే లో తొలి కవితా సంకలనం (1957–65) 'చలినెగళ్లు', సృజన 'చలం' ప్రత్యేక సంచికతో పాటు చలంకు అంకితంగా వెలువడింది. వరంగల్ జిల్లా రచయితల సభల్లో (1968) ఈ రెండూ చూసి మా కుటుంబ మిత్రుడు, ఎంఎలో మా టీచర్ బిరుదురాజు రామరాజు గారు – ఇదేమిటి అంతా చలం మయం అని కాస్త ఆశ్చర్యంగానూ, అయిష్టంగానూ పలకరించాడు.

అప్పటికే నేను పిఎచ్‌డి రీసెర్చ్ రెండేళ్ల కాలం అసంపూర్తిగా వదిలేసి, సిద్ధిపేట ప్రభుత్వ కళాశాలలో ట్యూటర్‌గా చేరి మా మేనకోడలు హేమలతతో ప్రేమ వివాహం చేసుకొని ఢిల్లీకి వెళ్లి డిఎవిపిలో ఏడు నెలలు పనిచేసి వదిలేసి

వచ్చాను. జడ్చర్ల కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా 1965 ఆగస్ట్‌లో చేరాను. నన్ను ఢిల్లీలో జడ్చర్ల కాలేజీ లెక్చరర్ ఇంటర్వ్యూకి పంపిస్తూ నరహరి (ఎన్ఆర్ దేవరాజ్) 'యు ఆర్ డిస్టెన్డ్ టు రన్ ఎ తెలుగు లిటరరీ జర్నల్ ఇన్ తెలుగు ల్యాండ్' అని సెలవు పెట్టి కాకుండా ఉద్యోగానికి రాజీనామా చేయమని ప్రోద్బలం చేసి ట్రెయిన్ ఎక్కించాడు. అంతకు ముందు నాకు సాహిత్య పత్రిక ప్రారంభించి నిర్వహించడంలో చేతులు కాల్చుకున్న అనుభవం 'క్యాంపస్'లో ఉంది.

ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న ఆ నాలుగు సంవత్సరాలు కుందుర్తి నిర్వహిస్తున్న ఫ్రీవర్స్ ఫ్రంట్‌తో పరిచయం అనుబంధంగా మారింది. కుందుర్తి నన్ను చాల ఇష్టపడి వచన కవిత రాయడానికి ప్రోత్సహించాడు – ఎందుకంటే ఆయన కోరుకున్న ప్రక్రియ వచన కవిత – వస్తువు – సామాజిక నిబద్ధత ఆయనకు నా కవితల్లో కనిపించేది. అక్కడే అరిపిరాల విశ్వం, మంజుశ్రీ, తర్వాత దిగంబర కవులుగా ప్రసిద్ధులైన కవులు, ఎ.మురళీధర్ మొదలైన కవులంతా పరిచయమైనారు. మిత్రులైనారు. వచన కవితలోకి దిగిన తర్వాత తిలక్‌తో కలం స్నేహమై – పరోక్షంగా గాఢానుబంధం ఏర్పడింది. 'నక్షత్ర సప్తకం'గా పరిచయమైన వాళ్లలో శిష్టా జగన్నాథం కవిత్వం కొరకు పత్రిక పెడదామనే ప్రతిపాదనతో నా దగ్గరికి హాస్టల్‌కు వచ్చి శ్రీశ్రీని ప్రధాన సంపాదకుడుగా ఉండడానికి ఉత్తరం రాసి ఒప్పించమన్నాడు. రాసాను. ఆయన తిరుగు టపాలోనే అంగీకరిస్తూ 'జననం అనగానే మరణం గుర్తుకొస్తుంది. జనన మరణాలు రవీంద్రుడు చెప్పినట్లు శిశువు స్తన్యం మార్చడం వంటివి. అయినా జననం ముదావహం' అని సందేశం పంపాడు. అంతవరకే నా ప్రమేయం. మొదటి సంచిక చూస్తే అందులో సంపాదకవర్గంలో నేను తప్ప చాల పేర్లున్నాయి. కాకపోతే నా కవిత 'హిమయవనిక' అచ్చయింది. రచనల ఎన్నికలో కూడ ఏకీభావం కుదురలేదు. 'నవత' ఐదు సంచికలు (త్రైమాసికగా) వచ్చి ఆగిపోయింది. ఆఖరి సంచికలో నేను నెహ్రూపై రాసిన కవిత అచ్చయింది. 'నవత' మొదటి సంచిక ఆవిష్కరణ కొరకు నేనే శ్రీశ్రీకి రాసి రప్పించాను. కానీ లాలేగారికి ఆహ్వానం చెప్పడానికి సికిందరాబాద్ జీరాకు వెళ్లినప్పుడు ఎదురో ఇంట్లో ఉన్న గోరా శాస్త్రి నన్ను చూసి వచ్చి 'ఇంకా మీకీ శ్రీశ్రీ పిచ్చి వదులలేదు'

అని దురుసుగా మాట్లాడి మర్నాడు మాత్రం వెళ్లి ఆయనను రైలు దించుకొని తన ఇంటికే కార్లో తీసుకుపోయాడు. శ్రీశ్రీ గురించి తెలిసిన వాళ్లకు ఆ సాయంత్రం 'నవత' ఆవిష్కరణ సభకు ఆయన రాలేని స్థితిని గోరాశాస్త్రి కల్పించాడని వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను.

అయిదు సంచికలే వెలువడినప్పటికీ 'నవత' కవిత్వ పత్రికల్లో ఢిల్లీ నుంచి అబ్బూరి ఛాయాదేవి, వరదరాజేశ్వరరావులు తెచ్చిన 'కవిత' వంటి మైలురాయిగా నిలిచిపోయింది. ఇదే రోజుల్లో 1964లో క్యాంపస్‌లో 'బి' హాస్టల్‌లో నా దగ్గరికి అప్పటికింకా కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు (మంచుశిఖలు – అగ్నిజడులు)గా ఉన్న మహాస్వప్న, మానేపల్లి హృషీకేశవరావు లేదా కేశవరావు (ఉదయించని ఉదయాలు)గా ఉన్న నగ్నముని వచ్చి ఒక అపూర్వమైన ప్రయత్నంగా కవితా సంకలనం తెస్తున్నామని, కవిత అడిగారు. నేను ఇచ్చిన కవిత 'రాత్రి'యే ఆ సంకలనం పేరు కూడ అయింది. 'దిగంబర కవులు'కు కర్టెన్ రైజర్ 'రాత్రి' కవితా సంకలనం అంటాడు చలసాని ప్రసాద్. ఇదే సంవత్సరం 1964లో విశాఖపట్నం 'సాగర గ్రంథమాల' వాళ్లు కాళీపట్నం రామారావు 'యజ్ఞం' ప్రచురించి సంచలనం సృష్టించారు.

సి.వి. పేరుతో, సి. విజయలక్ష్మి పేరుతో సి. వరహాల రావు కవిత్వం కూడ మార్క్సిస్టు కమిట్‌మెంట్‌తో అప్పటికే వెలువడుతున్నది. కె.వి. రమణారెడ్డి అడవి, భువనఘోషల తర్వాత 'అంగార వల్లరి' వెలువడింది.

1964 నాటికి 1951 అనండి లేదా 56తో అనండి ఏర్పడిన వర్గ సామరస్య ధోరణి స్తబ్ధతకు దారితీసి సాహిత్య ప్రక్రియల మీదనే తప్ప, వస్తువు మీద దృష్టి పెట్టని ధోరణి ప్రబలినపుడు మళ్లీ వర్గ పోరాట చైతన్యమిచ్చే తాత్వికధోరణి, కవితాభివ్యక్తి కోసం సాహిత్య అన్వేషణ ప్రారంభమైందనుకుంటాను.

నేను 1965 ప్రథమార్థంలో ఢిల్లీలో ఉండగానే 'దిగంబర కవులు' మొదటి సంపుటం వెలువడింది. అప్పటికే కమ్యూనిస్టు పార్టీ సిపిఐ, సిపిఎంగా చీలిపోయింది. సిపిఎం నాయకత్వాన్నంతా మీసా కింద అరెస్టు చేసి జైళ్లలో పెట్టారు. చైనా యుద్ధం సందర్భంగా యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చడానికి వీళ్లంతా కుట్ర చేసారనే

ఆరోపణతో కేంద్ర హోంమంత్రి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 'శ్వేతపత్రా'న్ని ఉద్యోగ ధర్మంగా నేను అనువాదం చేసాను. వాస్తవం అందుకు భిన్నమైన వ్యక్తిగత, ఆస్తి సంబంధ విభేదాలు. అప్పటికే ఎంఎలో ఉండగా ఎంఎలో క్వార్టర్స్‌లో పరిచయమైన పిల్లలమర్రి వేంకటేశ్వర్లు పరిచయం వలన 'విశాలాంధ్ర'కు డిఎవిపి ప్రకటనలిప్పించమని ఉత్తరం రాస్తే నా ఉత్తర ప్రత్యుత్తరాలు సెన్సార్ అయ్యే పద్ధతి మొదలైంది. 'దిగంబర కవులు' తెలుగు కవిత్వంలోనే కాదు సాహిత్య రంగంలోనే కాదు, తాత్వికరంగంలో కూడ శ్రీశ్రీ తర్వాత, అభ్యుదయ రచయితల సంఘం పాత్ర ముగిసిన తర్వాత ఒక షాక్ ట్రీట్‌మెంట్. ఒక ధిక్కార స్వరం. వాళ్లు ఈ వ్యవస్థను 'కుష్ఠ వ్యవస్థ' అని ప్రకటించారు.

'మిత్రమండలి' వార్షికోత్సవాలకు ఒకసారి తిలక్‌ను, సోమసుందర్‌ను పిలిచాం. 'మిత్రమండలి' సాహిత్య జీవులమందరం తిలక్ చుట్టూ తేనెటీగల వలె మూగాం. ఆ రెండు రోజులు వేనరెి ఇంట్లో చర్చల్లో మా మధ్యన ఒక ఆధునిక సాహిత్య పత్రికను తిలక్ సారథ్యంలో వెలువరించాలనే బలమైన ఆకాంక్ష వ్యక్తమయింది. 1966 ఎండాకాలంలో వేనరెి ఇంట్లో నలుగురం సమావేశం అయి ఆధునిక సాహిత్య త్రైమాసిక ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నాం. ఆ నలుగురం – వేనరెి అనబడే వే. నరసింహా రెడ్డి (అప్పటికే వరంగల్ ఆర్ట్స్ & సైన్స్ కాలేజీలో తెలుగు లెక్చరర్ – విశ్వనాథ అభిమాని. బుద్ధిస్టు. కాని ఎబివిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు) తర్వాత కాలంలో అంపశయ్య నవీన్‌గా ప్రసిద్ధుడైన డి. మల్లయ్య (అపుడు నలగొండ కాలేజీలో ఎకనమిక్స్ లెక్చరర్) నేనీ రచనలోనే ప్రస్తావించిన గంట రామన్న అని మేం పిలుచుకునే గంట రామిరెడ్డి, నేను – నలుగురం సంస్థాపక సభ్యులుగా ప్రతి నెల పదిరూపాయలు చెల్లించే రచయిత ఎవరైనా 'సాహితీ మిత్రులు'గా చేరవచ్చునని 'సృజన' ఆధునిక సాహిత్య వేదిక పేరుతో ఒక అనియతకాలీన పత్రిక తేవాలని నిర్ణయించాం. ఈ విషయంలో తిలక్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు నడుస్తూ ఉండగానే ఆయన ఆకస్మికంగా మరణించాడు. ఆయనది చాల సున్నితమైన ఆరోగ్యం. నరాల జబ్బు బహుశా గుండె మీద ప్రభావం వేసి ఉంటుంది. అది మా కర్తవ్యాన్ని త్వరితం చేసినట్లయింది. 1966 నవంబర్‌లో కాళోజీ ప్రింటర్, పబ్లిషర్, ఎడిటర్‌గా

'సృజన' వరంగల్‌లో అచ్చయింది. శాస్త్రీయమైన దృక్పథం, ప్రయోగ దృష్టి, సమకాలీన సామాజిక స్పృహ అనే మూడింటిని ఆధునిక సాహిత్య అంశాలుగా గుర్తించి – మాలో అవగాహనగా నేను సంపాదకుడుగా వ్యవహరించాలన్న నిర్ణయంతో ప్రారంభించాం. మొదటి సంచిక మొత్తం తిలక్ సంస్మరణ సంచికే. తెలుగు సాహిత్యానికి మొత్తంగా 'భారతి'ని ఎట్లా గుర్తు చేసుకుంటారో, ఆధునిక సాహిత్యానికి, డెబ్బై నుంచి విప్లవ సాహిత్యానికి అట్లా సృజన ఒక సంకేతంగా మిగిలిపోయింది. డెబ్బై, ఎనభై దశాబ్దాలలో పుట్టిన తమ పిల్లలకు సృజన, సృజన్ అని పేరు పెట్టుకునేంతగా సృజన ప్రభావం వేసింది. 26 సంవత్సరాలు (1966–92) నడిచిన ఈ పత్రిక 67 ఫిబ్రవరిలో నేను ప్రింటర్, పబ్లిషర్, ఎడిటర్‌గా జడ్చర్ల నుంచి 68 ఆగస్టు దాకా వెలువడింది. జడ్చర్లలో ఉండగానే సుప్రసిద్ధ కథకుడు బుచ్చిబాబు చనిపోయినపుడు ఆయన సంస్మరణ సంచికగా ఐదో సంచిక పని పూర్తిగా నలగొండ నుంచి నవీన్ చూసాడు. ఆ సంచికకు ఆయనే సంపాదకత్వం వహించడం కాకుండా, అక్కడే ప్రింట్ చేయించాడు. ఏడవ సంచిక చలం సంచికగా వెలువడింది. ఇది హైదరాబాద్ నాగార్జున ప్రింటర్స్‌లో అచ్చేసినపుడు హైదరాబాద్‌లో ఉన్న శ్రీపతి ఇల్లు మా అడ్డా. ఆ సంచిక నుంచి మా స్నేహం, మా పరస్పర ప్రభావాలు ప్రగాఢమైనవి. సృజన మూడవ సంచిక నాటికే మా కాలేజీ విద్యార్థి చంద్రం రాసిన 'రక్త చలన సంగీత శృతి' ముఖచిత్ర కవిత అయింది. అంటే 1967 మే–జూలై– ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే ఆ కవితపై, మాపై అప్పటికే అసంకల్పితంగా 67 మే 23–25 నక్సల్బరీ సంతాల్ రైతాంగ తిరుగుబాటు ప్రభావం ఉంది. సృజన నిర్వహించిన వచన కవితా పోటీలో పాల్గొన్న ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ విద్యార్థుల్లో అమ్మంగి వేణుగోపాల్, ఎన్. గోపీలు ప్రథమ ద్వితీయ బహుమతులు పొంది తర్వాత కాలంలో లబ్ధ ప్రతిష్ఠ కవులయ్యారు. సృజన 7వ సంచిక చలం సంచిక కోసం నవీన్, శ్రీపతి చలం గారికి ప్రశ్నలు పంపించి అర్థవంతమైన ఇంటర్వ్యూ చేసారు. 68 మే నాటికి నక్సల్బరీ నిప్పురవ్వ శ్రీకాకుళానికి వ్యాపించి దావానలమైంది. 67 అక్టోబర్ 31న శ్రీకాకుళం జిల్లా గిరిజన మహా సభకు వస్తున్న కోరన్న మంగన్నలను మేడిద సత్యం అనే భూస్వామి కాల్చి చంపడంతో ఆత్మరక్షణ కోసమైనా సరే ఆయుధం పట్టక తప్పదు అని శ్రీకాకుళ ఉద్యమ నాయకుడు కొండబారిడి మేష్టారు సత్యంగా

పిలుచుకునే వెంపటాపు సత్యనారాయణ ప్రకటించాడు. అక్టోబర్ 31 సంఘటనను సుబ్బారావు పాణిగ్రాహి అదే పేరుతో జముక కథగా రాసాడు. శ్రీకాకుళం జిల్లా సవరలు, జాతాపులు ఉపయోగించే జముకువాద్యం (పంబ వంటిది)తో ఆయన ముగ్గురితో ఒక కథా బృందాన్ని తయారు చేసాడు. అందులో ఆయన తమ్ముడు హేమచంద్ర పాణిగ్రాహి వంతగా, తామాడ చినబాబు (బంగారుబాబు) అనే పద్నాలుగేళ్ల బాలుడు స్త్రీ వేషంతో పాల్గొనగా ఆయన కథకుడు. ఈ విషయాలు, పాణిగ్రాహి పాటలు నాకు పరిచయం చేసిన వాడు శ్రీపతి. పి. చలపతిరావు అనే టీచరు. శ్రీపతి పేరుతో కథలు, కవిత్వం రాసేవాడు. పురానా హైదరాబాద్‌లో వెంకట్రావ్ మెమోరియల్ హైస్కూల్లో టీచర్. కాని శ్రీకాకుళం జిల్లా వాడు. శ్రీకాకుళ ఉద్యమ నాయకులైన సత్యం, కైలాసం, పంచాది కృష్ణమూర్తి, తేజేశ్వర రావు, రమణమూర్తి అంతా ఆయన స్నేహితులు. కొండగాలి, అడవంటుకున్నది నవల, కథలు రాసిన భూషణం గారు ఆయన ద్వారానే నాకు స్నేహితుడు. వీళ్లలో పంచాది, తేజేశ్వరరావు తప్ప తక్కిన వాళ్లంతా ఉపాధ్యాయ వృత్తిలోంచి వచ్చిన వాళ్లే. పాణిగ్రాహి బొడ్డపాడులో పూజారి. శ్రీపతి స్వయంగా శ్రీకాకుళ రైతాంగ పోరాటానికి సంబంధించిన 'నర్తోదు' 'జనం' వంటి కథలు రాసాడు. ఒకరకంగా – 1966 చైనా శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ కాలం నుంచి – విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమకాలం నుంచి వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ కేంద్రంగా రగులుతున్న యువభావావేశానికి ఒక అసంకల్పిత వేదికగా, వైరుధ్యాల ఘర్షణతో ప్రారంభమైన సృజన – దానికి సంపాదకత్వం వహిస్తున్న నేను 1968 ఎండాకాలం ఒక మెటమార్ఫసిస్‌కు గురికావడానికి కారణమైంది. అది చలం సృజన సంచిక, చలినెగళ్లు వెలువడిన కాలం. ఆ ఎండాకాలమే వరంగల్‌లో ఆంధ్ర విద్యాభివర్ధినీ ఉన్నత పాఠశాలలో జరిగిన వరంగల్ జిల్లా రచయితల సభల్లో 'స్వచ్ఛంద కవిత్వం – సామాజిక నిబద్ధత' అనే అంశంపై మాట్లాడాను. 'కాగితం మీద అక్షరానికి కమిట్ కావడమే కవి బాధ్యత' అని చెప్పాను. ఆ సభలకు ఉద్దేశపూర్వకంగా వచ్చిన కాకతీయ వైద్య కళాశాల విద్యార్థులు హరీశ్, రమేశ్ మొదలైనవాళ్లు 'సృజన'లో 'రక్త చలన సంగీతశ్రుతి' వంటి కవితలతో పాటు భావవాద ధోరణులు గల రచనల గురించి ప్రస్తావించి నాకు మార్క్సిస్ట్ ఈస్థటిక్స్‌పై ఒక క్లాసు తీసుకున్నారు.

నేను 1968 సెప్టెంబర్‌లో సికెఎం కాలేజీ ఇంటర్వ్యూకు వచ్చిన రోజే పోచమ్మ మైదానంలో తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి బహిరంగ సభ. నాగిరెడ్డి 1967 ఎన్నికల్లో గెలిచి శాసనసభ ప్రతిపక్ష నాయకుడుగా ఎన్నికై 'శాసనసభ సాలెగూడు' అని నక్సల్బరీ ప్రభావంతో ప్రకటించి రాజీనామా చేసి నక్సల్బరీ పంథా ప్రచారం చేయడానికి వచ్చాడు. ఆ రోజు ఇంటర్వ్యూ కొచ్చిన అభ్యర్థులలో స్పష్టంగా స్థానికులకే కొలువులనే ప్రత్యేక తెలంగాణ అభివ్యక్తి ఆందోళనగా ప్రారంభమైంది.

అట్లా ఒక పదేళ్ల వ్యవధి తరువాత అంటే విద్యార్థిగా వదిలిన వరంగల్‌కు తిరిగి అధ్యాపకునిగా 1968 అక్టోబర్‌లో వచ్చాను. ఒక విధంగా పూర్తిగా మారిపోయి, లేదా స్పష్టాస్పష్టంగా ఉన్న అభ్యుదయ భావాలు, తిరుగుబాటు ధోరణులు దేశంలో ప్రారంభమైన విప్లవోద్యమంతో పదునెక్కి ఒక దిశా నిర్దేశం ఏర్పడి. 'సృజన' నాతోపాటు వరంగల్‌కు తిరిగి వచ్చింది. సృజన రెండో సంచికలో మొదటి సంచికలో ప్రచురించినట్లుగా 'మధురకవి తిలక్' అనే వ్యాసం ప్రచురించే విషయంలో నాకు అభ్యంతరం వచ్చింది. మనం ప్రారంభించినప్పుడే చెప్పుకున్నాం 'సంపాదక నిర్ణయం నీదే' అని అడిగి తీసుకున్న వేనరె జడ్చర్లకు నాకు రాశాడు. జడ్చర్ల నుంచి వెలువడినప్పుడైనా త్రైమాసిక గనుక ఒకసారైనా మధ్య కాలంలో హనుమకొండకు వెళ్లి వస్తుండేవాడిని కనుక అక్కడ కలుసుకొని స్థూలంగా నలుగురం రచనల గురించి చర్చించి నిర్ణయించుకునేవాళ్లం. జడ్చర్లలో ముఖ్యంగా మా సహ అధ్యాపకుడు పుల్లోజిరావు గారు రచనల ఎన్నికలో పాల్గొంటుండేవారు. సృజన విశ్వవిద్యాలయ విద్యార్థుల కవితా రచనల పోటీలో నిర్ణేతగా ఆయన వ్యవహరించాడు కూడ.

వరంగల్‌కు తిరిగి వచ్చినాక వచ్చిన నవంబర్ 1968 సంచిక భారతీయ సాహిత్య సమాలోచన సంచికకగా వెలువడింది. దాని కోసం శ్రీపతి ప్రత్యేకించి అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన ప్రసిద్ధ చిత్రకారుడు ఎస్వీ రామారావు బెజవాడ దగ్గర కృష్ణ చిత్రాన్ని హైదరాబాద్‌లో అచ్చువేయించి పంపించాడు.

ఇంక వరంగల్‌కు తిరిగి వచ్చిన దగ్గరి నుంచి మిత్రమండలి సమావేశంలో కలిసినప్పుడైనా, విడిగా కలిసినప్పుడైనా రచనల మంచిచెడ్డలు మాత్రమే కాదు, ప్రాపంచిక దృక్పథంతో కూడిన చర్చ ఉండాలని వరంగల్‌లో లోచన్‌తోనూ,

హైదరాబాద్‌లో శ్రీపతితోనూ ఎక్కువగా అభిప్రాయాలు పంచుకుంటుండేవాడిని. అప్పటికే 'దిగంబర కవులు' సంపుటాలు మూడు వెలువడ్డాయి. చెరబండరాజు 'వందేమాతరం', జ్వాలాముఖి 'ఓటమి తిరుగుబాటు' వంటి కవితలు ఒక స్పష్టమైన వైఖరిని తీసుకొని వాళ్లకూ స్పష్టమైన ఒక దారిని ఏర్పరిచినవి. ఇంక తరువాత ఏమిటి? అని శ్రీపతి ఇంట్లో వీళ్లతో ఎక్కువ చర్చలు జరుగుతూ ఉండేవి. నేను వరంగల్‌కు మారిన తరువాత తరుచూ నా దగ్గరికి వచ్చే పెండ్యాల కిషన్‌రావు, అప్పటికే చెన్నూరు ప్రాంతంలో ధర్మాపురం, దేవరుప్పుల, కడివెండి ప్రాంతాల్లో విప్లవోద్యమ నిర్మాణం చేస్తున్న రామనర్సయ్యతో సంబంధాల్లో ఉన్నాడు అనుకుంటాను. మా కవిత్వ ధోరణిని విప్లవం వైపు మళ్లించాలనే చర్చ చేస్తుండేవాడు. ఇటువంటి చర్చల ఫలితమే లోచన్ 'ట్రిగర్ మీది వేళ్లతో రా' కవిత. తెలుగు కవిత్వంలో స్పష్టంగా ఇది ఒక మలుపు. చైనాలో విప్లవ కాలంలో లూసున్ 'కాల్ టు పీపుల్' ప్రజలకు పిలుపు అని రాసిన వ్యాసం యువతరాన్ని ప్రభావితం చేసినట్లుగా ఈ కవిత కూడ ఎంత ప్రభావం వేసిందో ఆ తర్వాత 1970 లో విశాఖపట్నంలో శ్రీశ్రీ షష్టిపూర్తిలో గాని మాకు అర్థం కాలేదు. అయితే లూసున్ ప్రజలకు పిలుపు రాసే నాటికే అక్కడ యువకులు మావో సె టూంగ్ నాయకత్వంలో సామ్రాజ్యవాద భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో నిమగ్నమై ఉన్నారు. అటువంటి ఐదుగురు యువకుల అమరత్వం సందర్భంగా ఇచ్చిన పిలుపు అది. 1969 ఫిబ్రవరి సృజన ముఖపత్రంపై పేర్కొని వేసిన 'ట్రిగర్ మీది వేళ్లతో రా' కవిత నాటికి శ్రీకాకుళ ఉద్యమంలో కూడ అటువంటి పోరాటాలూ, త్యాగాలూ ప్రారంభమైనాయి. వరంగల్‌లో కొండపల్లి సీతారామయ్య, కెజి సత్యమూర్తి నాయకత్వంలో విప్లవ విద్యార్థి ఉద్యమ నిర్మాణం అప్పటికే పటిష్ఠమైంది. ఆ ఇద్దరూ గెబ్రియల్ స్కూల్లో టీచర్లు. సత్యమూర్తి అయ్యర్ నాయకత్వంలో ఉన్న టీచర్స్ గిల్డ్‌లో పనిచేస్తుండేవాడు. ఈ భావాలతో నాటికలూ, నాటకాలూ రాసి ప్రదర్శిస్తుండేవాడు. కనుక లోచన్‌తో ప్రత్యక్ష పరిచయం ఉండేది. ఒకసారి మిత్రమండలిలో క్రమం తప్పకుండా మిత్రమండలి సమావేశానికి వచ్చే ఒక గెబ్రియల్ స్కూల్ టీచర్‌ను ఆయన మీకు కొలీగ్ కదా, మీకు బాగా పరిచయం ఉంటుంది కదా అని అడిగాను. ఆయన

షాక్ తిన్నట్లు అయి అబ్బో ఆయనా, స్టాలిన్ అన్నాడు. ఆయన గురించి తెలుసుకోవాలనీ, ఆయనను కలవాలనీ ఆసక్తి పెరిగింది. కొద్దిరోజుల్లోనే ఆయనా, చెక్కిళ్ల అయిలయ్యతో కలిసి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అరెస్టు అయ్యాడు. అదే సమయంలో అరెస్ట్ అయిన కాళోజీ 'మీరేమిటి కమ్యూనిస్టులు. అంతర్జాతీయ శ్రామిక ప్రపంచం గురించి మాట్లాడేవాళ్లు, ప్రత్యేక తెలంగాణ గురించి అరెస్టు అయ్యారు' అని అడిగితే చెక్కిళ్ల అయిలయ్య 'అవును, మీ ప్రయాణం ఇక్కడ ఆగుతుంది. మేం ఇంకా ముందుకు మా లక్ష్యం సాధించే దాకా వెళతాం' అని చెప్పిన మాటలు ఆ తరువాత కాలంలో కాళోజీ తరచూ ప్రస్తావిస్తుండేవాడు.

నా 'చలినెగళ్లు' కవితా సంకలనం ప్రచురించిన స్వేచ్ఛాసాహితీ నెల్లుట్ల సంజీవరావు, దేవులపల్లి సుదర్శన్‌రావులు రెండవ కవితా సంకలనంగా ఒక సమష్టి కవిత్వ రచన తేవాలని, అది కూర్చొని పదిమందిమి వస్తువూ, శైలీ చర్చించి తేవాలని ప్రతిపాదనతో వచ్చారు. ఇంక అక్కడి నుంచి నెలల పాటు జరిగిన చర్చల ఫలితమే పది మంది కవుల 'తిరుగబడు' కవితా సంకలనం. హైదరాబాద్ నుంచి ఎక్స్‌రే పేరుతో శ్రీపతి, ఐ పేరుతో సృజనకు శుక్తి పేరుతో అక్షరాలు రాసిన ఉస్మానియా హాస్టల్‌లో మా మిత్రుడు కవి, సాహితీ విమర్శకుడు, చిత్రకారుడు పి.సి. నర్సింహారెడ్డి మినహా మిగతా ఎనిమిది మంది కవులు వరంగల్ వాళ్లే. వీళ్లలో టంకశాల అశోక్ బిఎ విద్యార్థి. యాదగిరి మెడికల్ కాలేజీ విద్యార్థి. ఆయన 'ఇప్పుడు వీస్తున్న గాలి' అన్న కవితా శీర్షిక ఆ తరువాత కాలంలో ఒక ధోరణిని తెలియజేయడానికి ఎందరో వాడుకున్నారు. విరసం కోసం కథలు ఎన్నిక చేసిన కుటుంబరావు, రావిశాస్త్రితో సహా. కుటుంబరావు గారు సంపాదకత్వం వహించిన 'ఇప్పుడు వీస్తున్న గాలి' కథా సంకలనం ఒకవైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది, మరొక వైపు ఢిల్లీలో జరిగిన నేషనల్ బుక్ ట్రస్ట్ పుస్తక ప్రదర్శనలో ఆ సంవత్సరం వచ్చిన ఉత్తమ పుస్తకాల జాబితాలో ఒకటిగా పేర్కొనబడింది. అది 1972 నాటి మాట. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఈ నిషేధం గురించి చాలా ఆసక్తికరమైన చర్చ జరిగింది. టీచర్స్ ఎంఎల్‌సిగా ఉన్న ఎంజె మాణిక్యరావు, కోటేశ్వరరావు లాంటి వాళ్లు ఎందుకు నిషేధించారని అడిగితే, అప్పటి హోం మంత్రి శ్రీకాకుళ ఉద్యమంలో అమరులైన

పంచాది కృష్ణమూర్తి, నిర్మల వంటి వాళ్లకి అవి అంకితం ఇచ్చారనీ, చెరబండరాజు 'చిరంజీవి' కథలో రాష్ట్రంలో మొట్టమొదటి ఎన్‌కౌంటర్‌లో పంచాది కృష్ణమూర్తితో పాటు అమరులైన ఆరుగురిలో ఒకరైన తామాడ చినబాబు బంగారుబాబు అనే పద్నాలుగు సంవత్సరాల పిల్లవాడి గురించి రాశాడని, అది చదివి వినిపించడం ప్రారంభించాడు. శాసనమండలిలో వింటున్న అందరూ ఆ అంశాలతో ఉత్తేజితులై ఇదంతా చాలా బాగుంది కదా, మీరు నిమగ్నమైన చదువుతున్నారు అని గుర్తు చేస్తే అవును, ఇది నిషేధింపబడిన సాహిత్యం, నేను చదవకూడదు అని ఆపేశాడు. కాని అదంతా శాసనసభ గ్రంథాలయం రికార్ట్స్‌లోకి వెళ్లిపోయింది. దానిని టీచర్స్ ఎంఎల్‌సి కోటేశ్వరరావు ఆ తరువాత తెలుగు విద్యార్థి సంచికలో యథాతథంగా ప్రచురించారు. ఆ రోజుల్లో విప్లవ సాహిత్యానికి అటువంటి ప్రభావం ఉండేది.

1969 చివరిలో మేం 'తిరుగబడు' కవితా సంకలనాన్ని సిద్ధం చేశాం. అప్పటికే ములుగు అడవుల్లో విప్లవోద్యమం సాయుధ దళాలుగా వికసిస్తున్నది. 'కొండల్లో కోనల్లో తిరుగుబాటు చేస్తున్న వాళ్లకు మా స్నేహ హస్తాన్ని అందిస్తున్నాం' అనే స్పష్టమైన అవగాహనతో ముందుమాట రాసి ఈ సంకలనాన్ని హనుమకొండ టౌన్ హాల్‌లో పాములపర్తి సదాశివరావుతో ఆవిష్కరణ చేయించాం. అప్పటికే విశాఖపట్నంలో 1970 జనవరిలో శ్రీశ్రీ షష్టిపూర్తి జరపాలని ప్రయత్నాలు ముమ్మరంగా మొదలై, కాళీపట్నం రామారావు, తూమాటి దొణప్ప కార్యదర్శులుగా, తెన్నేటి విశ్వనాథం, పురిపండా అప్పలస్వామిల గౌరవ నాయకత్వంతో చలసాని ప్రసాద్, రావిశాస్త్రి, తుమ్మల వేణుగోపాలరావు, టి. కృష్ణాబాయి ఒక రాష్ట్రవ్యాప్త ఆహ్వాన సంఘాన్ని వేశారు. జైలు నుంచి విడుదలైన తరువాత ఉద్యోగం కూడ కోల్పోయి సత్యమూర్తి అజ్ఞాత జీవితానికి వెళ్లిపోయాడు. బహుశా ఎక్కువ కాలం హైదరాబాద్‌లో ఎక్కడెక్కడో ఆశ్రయం పొందుతూ నిర్మాణం చేశాడనుకుంటాను. కనుక ఆయనను మొదటిసారి శ్రీపతి గదిలోనే చూశాను. ఒక భావుకుడైన, ఉంగరాల జుట్టుగల కవి, ధోతి, లాల్చీ వేసుకొని ఒక సాయంకాలం శ్రీపతి ఇంటికి వచ్చి మా చేతికి ఒక కవిత ఇచ్చాడు. అది కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో లెనిన్ శతజయంతి సందర్భంగా జరిగే కవి సమ్మేళనంలో చదవమని. అదే 'లెనిన్, నా

లెనిన్' అనే సుప్రసిద్ధ కవిత. ఇంక అక్కడి నుంచి ఆయన కవిత్వం 1980ల దాకా మమ్మలి ఊపేసింది. శ్రీశ్రీ తరువాత ఇంతగా మమ్మల్ని ప్రభావితం చేసిన మరొక కవి లేడు.

జనవరిలో అనుకున్న శ్రీశ్రీ షష్టిపూర్తి 1970 ఫిబ్రవరి 1, 2 తేదీల్లో విశాఖపట్నంలో జరిగింది. దానికి మేమంతా వెళ్లాం. అప్పటికే శ్రీశ్రీపై 170 పేజీల ప్రత్యేక సంచిక తయారు చేశాం. దీనికోసం శ్రీశ్రీ ని ఇంటర్వ్యూ చేయడానికి హైదరాబాద్ బృందావన్ హోటల్‌కి చలసాని ప్రసాదరావు ఇరవై మంది కవులను పిలిచాడు. తరువాత కాలంలో చాలా ప్రచారానికి వచ్చిన శ్రీశ్రీ ఇంటర్వ్యూ అయినా, ఇప్పటికీ ఆయా పత్రికల్లో, ఆయా సందర్భాల్లో నలుగురు దిగంబర కవులతో దిగిన శ్రీశ్రీ ఫొటో అయినా అప్పుడు చలసాని ప్రసాదరావు తీసినవే. 'నిన్న విడిచిన పోరాటం నేడు అందుకోక తప్పదు' అనే స్పష్టమైన అవగాహనతో కూడిన సంపాదకీయం, 'ఎర్ర శాలువా కప్పుకొని మా ఇంటికి ఒక రివాల్వర్ వచ్చింది' వంటి ప్రతీకలతో శ్రీశ్రీ సంచిక వచ్చింది. ఆ సంచికకు ప్రకటనలు ఇచ్చిన నాకు చిన్ననాటి నుంచి తెలిసిన ఒక వ్యాపారవేత్త, 'ఏమిటీ, పూర్తిగా కమ్యూనిస్టువు అయిపోయినట్టున్నావే' అని వ్యాఖ్యానించాడు.

ఇంక శ్రీశ్రీ షష్టిపూర్తి గురించి ఎన్నో సందర్భాల్లో వచ్చింది గనుక ఇక్కడ వివరణ అక్కర్లేదు కాని, విశాఖ విద్యార్థుల సవాల్ 'మేధావులారా మీరు ఎటువైపు?' తెలుగు సాహిత్య రంగంలో ఒక పోలరైజేషన్‌కి దారితీసింది. నాకప్పటికే చాలా సభా భయం. కనుక ఇరవై ఐదు వేల మంది హాజరైన, తెన్నేటి విశ్వనాథం అధ్యక్షత వహించిన ఆ మహాసభలో సృజనలోని నా సంపాదకీయం చదివి మొదటి సంచిక శ్రీశ్రీ చేతికి అందించగలిగాను. అంతే. ఇంక శ్రీశ్రీయే చెప్పినట్లు అప్పటి నుంచి హైదరాబాద్‌లో జూలై 4న 'విరసం' ఏర్పడే దాకా విప్లవ సాహిత్య ఉద్యమం పురిటి నొప్పులు అనుభవించింది. ఆ సభలకు వచ్చే ముందు నలుగురు దిగంబర కవులు (జ్వాలాముఖి, చెరబండరాజు, నిఖిలేశ్వర్, నగ్నముని) శ్రీశ్రీతో పాటు ఒరిస్సాలోని కటక్ వెళ్లి వచ్చారు. అట్లా ఎన్నో ప్రాంతాలు తిరుగుతూ హైదరాబాద్ కన్నా ముందు కర్నూల్ దాకా వెళ్లారు. దానినే శ్రీశ్రీ 'కటక్ నుంచి కర్నూల్ దాకా

ఒక విప్లవ యాత్ర’ అని పేర్కొన్నాడు. ఈ సభల్లో పాల్గొనడానికి విశాఖపట్నం వెళ్లే నాటికి సుబ్బారావు పాణిగ్రాహి కూడ 21 డిసెంబర్ 1969లో రంగమటియా కొండల్లో ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. పంచాది నిర్మల అమరురాలైంది. డా. చాగంటి భాస్కరరావు, డా. మల్లికార్జున్‌లు అమరులయ్యారు. డా. చాగంటి భాస్కరరావు గుంటూరు వైద్య కళాశాల విద్యార్థిగా, నక్సల్బరీ వసంత మేఘగర్జన తరువాత నక్సల్బరీ సంఘీభావ కమిటీని ఏర్పాటు చేసి నక్సల్బరీ శ్రీకాకుళ పోరాట ప్రచారం చేసినవాడు మాత్రమే కాకుండా, గుత్తికొండ బిలానికి చారు మజూందార్‌ను తీసుకువచ్చి అప్పటికే 22 ఏప్రిల్ 1969న కలకత్తాలో ఏర్పడిన సిపిఐ (ఎంఎల్) ఆంధ్ర రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేయడానికి దోహదం చేసినవాడు. నాయకత్వంలో సత్యం కైలాసాలు మాత్రమే అప్పటికి బతికి ఉన్నారు. అమరులైన మేధావులు, పాణిగ్రాహి వంటి కవి, నిర్మల వంటి మహిళా ఉద్యమ నాయకులను ప్రస్తావించి కరపత్రంలో ‘మరి వీళ్లంతా శ్రీకాకుళంలో పోరాడుతున్న ఆదివాసుల పక్షం నిలబడితే, ఇటువంటి నేపథ్యం ఉన్న మీ వైఖరి ఏమిటి’ అని సూటిగా ప్రశ్నించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన దిగంబర కవులు, వరంగల్ నుంచి వెళ్లిన మేం తిరుగబడు కవులం, అభ్యుదయ రచయితల సంఘంలో నిలువ నీరు అయిపోయిన రివజనిస్టు రాజకీయాలతో విసుగు చెంది, సుబ్బారావు పాణిగ్రాహి అమరత్వంపై తాను రాసిన కవిత ప్రచురించని ప్రజాశక్తిపై కోపంగా ఉన్న కెవి రమణారెడ్డి, ‘నూరు నక్సల్బరీలు’ కావాలనుకున్న కుటుంబరావు మేం శ్రీకాకుళ పోరాటాన్ని బలపరుస్తున్నాం అని స్పష్టంగా చెప్పుకున్నారు. ఇంక శ్రీకాకుళం గాలులు తమను తాకుతున్న రావిశాస్త్రి, కారా, చలసాని ప్రసాద్, కృష్ణాబాయి లాంటి వాళ్ల విషయం గాని, అప్పటికే సాహిత్య రంగంలో చోదక శక్తులుగా మారిన ఎన్ఎస్ ప్రకాశ్ రావు వంటి వారి విషయం గాని చెప్పనక్కరలేదు. అయితే నేను విశాఖపట్నం వెళ్లిన రాత్రి ఎవరో ఒక యువకుడు వెంపటాపు సత్యం సందేశం నిర్వాహకుల దగ్గరకు తెచ్చినట్లు నాకు అనుమానం. ఈ సభలతో మాత్రమే కాదు, ఇక్కడి నుంచి శ్రీకాకుళ ఉద్యమ సమర్థనలో ఒక ప్రత్యామ్నాయ ప్రయత్నం మొదలు కావాలి అని అందులోని సూచన అని నాకు అనిపించింది. అప్పటికే జమ్మికుంట కేంద్రంగా విద్యుల్లత

పత్రిక కూడ ప్రారంభమైంది. అక్కడ బిఎస్‌సి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు బి. విజయకుమార్, లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి దాని సంపాదకులు. మిత్రమండలి నుంచి నాకు సాహిత్య మిత్రుడు అయిన ఎం.వి. తిరుపతయ్యది మార్గదర్శకత్వం. కనుక ఇక ఫిబ్రవరి నుంచి జూలై దాకా తిరుగబడు కన్నా ఒక అడుగు ముందుకు వేసి నక్సల్బరీ పంథాలో శ్రీకాకుళ ఉద్యమ ప్రేరణతో కవిత్వం తేవాలని ప్రయత్నాలు మళ్లీ మొదలుపెట్టాం. ఆ ఎండాకాలం అంతా కోహినూరు హెూటల్ పక్క సందులో ఉన్న మా ఇల్లు, కోహినూరు హెూటలూ, బాల సముద్రంలో లోచన్ క్వార్టరూ మా కవిత్వ ప్రయోగశాలగా పనిచేసినవి. అప్పటికే శివుడుగా, లేదా నేను కవితకు అనుగుణంగా ఏ పేరు పెట్టి అచ్చువేస్తే ఆ పేరుతో సత్యమూర్తి తన కవితలు పంపించడం ప్రారంభించాడు. ఆ విధంగా జూలై 4 నాటికి 'ప్రజను సాయుధం చేస్తున్న రెవల్యూషనరీ నేటి కవి' అనే మకుటంతో 'మార్చ్' కవితా సంకలనాన్ని తయారు చేశాం. ఇందులో తిరుగుబడు కవులుగా ఉన్న కొందరు లేరు, మరికొందరు కొత్తగా చేరారు. వాళ్లలో 'సైన్యంలో చేరకు' అనే కవిత రాసి 'మార్చ్' కవితా సంకలనం నిషేధానికి కారణమైన కవితల్లో ఒకటి రాసిన పింగళి రంగారావు, 'డియర్ కానిస్టేబుల్ కామ్రేడ్' వంటి కవిత రాసిన గంట రామన్న, ఎన్‌కె కొత్తగా చేరిన కవులు. అయితే, కవుల పేర్లు ఉండొద్దని, విప్లవ కవులు అని మాత్రం పెట్టుకోవాలని, ఇది వ్యక్తిత్వాలు సంలీనమైయిన ఒక సమష్టి కృషిగా తేవాలని పెండ్యాల కిషన్‌రావు సంపాదకుడుగా తయారు చేశాం. ప్రింటింగ్ ప్రెస్ పేరు లేదు కనుక ఇది కరీంనగర్‌లో ఉన్న నిర్మల ప్రింటింగ్ ప్రెస్‌లో అచ్చువేయడానికి విజయకుమార్ ముందుకు వచ్చాడు. ఆ తరువాత కాలంలో ఇది బయటపడి ఈ ఒక్కదాని కోసమే కాదు, విరసం సంస్థాపక కార్యవర్గ సభ్యుడు అయినందుకూ, 'ఊరేగింపు' వంటి కవితా సంకలనం, 'బద్‌లా' వంటి కథా సంకలనం అచ్చు వేసినందుకు, 'విద్యుల్లత'లో ఎంవి తిరుపతయ్య 'బతుకు, 'న్యాయం' కథలు, తాడిగిరి పోతరాజు 'ఎర్రబుట్ట' కథ వేసిందనకు, ఇంకా చాలా విప్లవకర కార్యకలాపాల కోసం ఎమర్జెన్సీలో నెలల తరబడి అక్రమ లాకప్‌లో చిత్రహింసలు అనుభవించిన వాడు భాగ్యనగర్ విజయకుమార్.

ఈ కవితా సంకలనం మేం తయారు చేసే నాటికి శ్రీశ్రీ షష్టిపూర్తితో మొదలైన ఒక పోలరైజేషన్, ఒక వేడి రాష్ట్రాన్నంతా కుదిపి వేసింది. ఒకరకంగా ఆ ఎండాకాలం కొనసాగింది. ఆ వసంతం మామూలు వసంతం కాకుండా ప్రచండ గ్రీష్మంలోకి, వసంతమేఘం గర్జించడంలోకి పరివర్తన చెందే పరిణామాలు కనిపించాయి. అప్పటికే శ్రీశ్రీ జ్వాల వంటి పత్రికకు తాను శ్రీకాకుళం వెళతానని, శ్రీకాకుళం చీపురు పుల్లలతో రాదని వంటి ప్రకటనలు ఇచ్చి ఉన్నాడు. తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు 'జనశక్తి' పత్రిక పెట్టి విప్లవ భావాలు ప్రచారం చేస్తున్నారు. అందులో కాశీపతి పనిచేస్తున్నాడు. ఆయనే శ్రీశ్రీని ఇంటర్వ్యూ చేశాడు. శ్రీకాకుళ ఉద్యమాన్ని బలపరుస్తూ తెలుగు వెలుగు పత్రికలో ఎబికె ప్రసాద్ రాయడం ప్రారంభించాడు. ఆయన పత్రికా రచన జనశక్తితోటే ప్రారంభమైంది. అందుకే పార్వతీపురం కుట్రకేసులో ఉపాధ్యాయ సంఘ నాయకుడైన మార్పు బాలకృష్ణమ్మతో పాటు ఎబికె ను కూడ మొదట ముద్దాయిలుగా చేర్చారు. కనుక శ్రీశ్రీ ఎంచుకున్న మార్గాన్ని తెలుగు సాహిత్య రంగమంతా, ముఖ్యంగా అప్పటి యువకులంతా అరసంలోనూ ప్రముఖులంతా అనుసరించనున్నారనే భయంతో సిపిఐ రంగంలోకి దిగి 1955-56ల తోటే ఆగిపోయిన అరసంలోని కార్యకలాపాలను పునరుద్ధరించాలని ఒకవైపు ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి సినీరంగం లోని ప్రముఖులు అక్కినేని నాగేశ్వరరావుల ప్రోత్సాహంతో నక్షత్ర సప్తకం అని ముందు పెట్టి హైదరాబాద్‌లో అభ్యుదయ సాహిత్య వేదిక పేరుతో ఒక సదస్సు నిర్వహించడానికి పూనుకున్నది. ఇంక 1970 అంతా ఇటువంటి ప్రయత్నాలకు రెండు వైపులా కూడ శ్రీశ్రీ షష్టిపూర్తి ఒక సందర్భం. కనుక ఆ సదస్సులో బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా శ్రీశ్రీకి రెండు వేల రూపాయల పర్సు ఇస్తారని కూడ ప్రతిపాదించారు. అందులో మాకు ఇష్టమైన అంశాలపై మాట్లాడడానికి మమ్ములనే ఆహ్వానించారు. అంటే శ్రీశ్రీ మాత్రమే కాదు, కుటుంబరావు, కెవి రమణారెడ్డి, జ్వాలాముఖిలతో పాటు నాకు 'స్వచ్ఛంద కవితా, సామాజిక స్పృహ అనే అంశంపై మాట్లాడడానికి ఆహ్వానం అందింది. అప్పటికే హైదరాబాద్‌లో కెకె రంగనాథాచార్యులు సలహాలూ, సూచనలతో పైన పేర్కొన్న నలుగురు దిగంబర కవులు, నేను భవిష్యత్ కార్యకలాపాల గురించి ఆలోచనలో నిమగ్నమై ఉన్నాం. మాతో కొండపెల్లి సీతారామయ్య, కెజి సత్యమూర్తి రాజకీయ

సంభాషణలో ఉన్నారు. కనుక మేం ఈ ఆహ్వానాన్ని తిరస్కరించి, అభ్యుదయ సాహిత్య వేదికను బహిష్కరించాలని నిర్ణయించుకొని ప్రకటించాం కూడ. కాని అందరం హైదరాబాద్ చేరాలని అనుకున్నాం. మా అభిప్రాయాలు కెవి రమణారెడ్డి గారికి, శ్రీశ్రీకి తెలియజేశాం. చలసాని సరేసరి. తాను ఎట్లాగూ రావడానికి ఏర్పాట్లలో ఉన్నాడు. అప్పటికే ఆయన శ్రీశ్రీ షష్టిపూర్తి వీడియో మొత్తం తీసుకొని విజయవాడ, వరంగల్‌ల మీదుగా ఒక సాహిత్య పర్యటనలో ఉన్నాడు. కుటుంబరావు ఒక్కడే మేం ఎవరమూ చెప్పకుండానే 'కసాయివాడు భూతదయ మీద ఒక సదస్సు ఏర్పాటు చేస్తానంటే జీవకారుణ్యవాదులైన వారందరూ పొలోమని వెళ్లడమేనా. కనుక నేను రాను' అని ఉత్తరం రాస్తూ ఆ వేదిక ఆహ్వానాన్ని తిరస్కరించాడు. అభ్యుదయ రచయిత అనేవాడు తప్పనిసరిగా మార్క్సిస్ట్ అయి ఉండాలని కూడ ప్రతిపాదించాడు. వరంగల్ నుంచీ, కరీంనగర్ నుంచీ ఈ అభ్యుదయ సాహిత్య వేదికను బహిష్కరించవలసిందిగా కరపత్రాలు తయారు చేసుకొని 'మార్చ్' కవితా సంకలనంతో పాటు హైదరాబాద్ చేరుకున్నాం. ప్రొద్దటూరు నుంచి 'ప్రభంజనం' పత్రిక అచ్చువేసుకొని డా. ఎం.వి. రమణారెడ్డి వచ్చాడు. అభ్యుదయ రచయితల సంఘం కార్యవర్గ సమావేశాన్ని శ్రీశ్రీ అధ్యక్షతన జూలై 3న ద్వారకా హోటల్‌లో ఏర్పాటు చేశారు. ఆ సాయంత్రం యూనివర్సిటీ రోడ్డులో విద్యానగర్ తరువాత ఉన్న హిందీ ఆర్ట్స్ కాలేజీలో శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంగా శ్రీశ్రీ, ఆరుద్రలను పిలిచి ఆ కాలేజీ వాళ్లు ఒక సభను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ముందే ఒక పథకంతో వెళ్లిన చలసాని ప్రసాద్, హరిపురుషోత్తం సభ అయిపోయిన తరువాత ఆరుద్రను ద్వారకా హోటల్‌కు పోనిచ్చి శ్రీశ్రీని తీసుకొని, శ్రీశ్రీ ఎప్పుడు వచ్చినా ఉండే ఆబిడ్స్‌లోని మైసూర్ కేఫ్‌కు తీసుకొచ్చారు. ఇప్పటి హైదరాబాద్ యూనివర్సిటీ నిర్మాణం అయినప్పటి నుంచీ గోల్డెన్ త్రెషోల్డ్ (సరోజినీ దేవి నాయుడు తన కవితా సంకలనం పేరే ఇంటి పేరుగా పెట్టుకున్న ఆమె ఇల్లు) ఇప్పటికీ అక్కడ ఉన్న గాంధీగారు పెట్టిన మామిడి చెట్టు కింద నలువైపుల నుంచి వచ్చిన మేం చేరాం. శ్రీశ్రీని ఎప్పుడూ ఉండే ఆయన రూంలోనే ఉంచాం. ఇక్కడికి వెళ్లే ముందు నా జీవితంలో ఒక అనుభవం జరిగింది. ఈ సభలు బహిష్కరిస్తున్నానని ప్రకటించి హైదరాబాద్ వెళ్లిన నేను ఎప్పటి వలెనే రెడ్డి ఉమెన్స్ కాలేజీ ఎదురు సందులో

ఉండే శ్రీపతి ఇంటికి వెళ్లాను. మేం ఇద్దరం కలిసి మైసూర్ కేఫ్‌కు బయలుదేరుతుండగా ముందుగా బయటికి వచ్చిన నాకు ఎదురుగా నుదుట పెద్ద కాల్చిన మచ్చ ఉన్న ఒక సింహ వదనం ఉన్నటువంటి, కొంచెం గూని ఉన్న ఒక ఆయన కనిపించాడు. అప్పటికే ఆయన గురించి చాలా విన్నాను గనుక ఆయన ఎవరో పోల్చుకున్నాను. 'వెళ్తున్నారు గద, బహిష్కరణ దగ్గరే ఆపకండి. ఒక విప్లవ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేయండి' అని మాత్రమే చెప్పి ఆయన వెళ్లిపోయాడు. చెప్పనక్కర్లేదు ఆయనే కెఎస్‌గా ప్రసిద్ధుడైన కొండపెల్లి సీతారామయ్య. ఇంక ఆ చెట్టు కింద కరపత్రాలూ, ప్రభంజనం పత్రిక, మార్చ్ కవితా సంకలనం ఆవిష్కరించుకున్నాం, ఏం చేయడం అనే చర్చ రాత్రి పది గంటల దాకా సాగుతూనే ఉన్నది. కరపత్రాలు మర్నాడు ఆ వేదిక దగ్గర ఎట్లా పంచాలే, ఎవరు వెళతారు అనే చర్చలు. జమ్మికుంట కాలేజీ విద్యార్థులు విజయకుమార్, నల్లా ఆదిరెడ్డి, తిరుపతి మొదలైనవాళ్లు, ఎన్‌కె వంటి యువకులు ముందుకు వచ్చారు. ద్వారకా హోటల్ తిరిగి వెళ్లని శ్రీశ్రీ మైసూర్ కేఫ్‌కే చేరి ఉంటాడని అరసం వాళ్లకు తెలిసిపోతుంది కాబట్టి ఆయనను అక్కడ ఉంచడం క్షేమం కాదని, అటు నుంచి నాంపల్లి స్టేషన్ వైపు వెళ్లే కుడివైపు మూల మీద ఉన్న ఇంపీరియల్ హోటల్‌కు తరలిపోయాం. సుదీర్ఘమైన చర్చలు, ముఖ్యంగా శ్రీశ్రీ తాను సభకు వెళ్లి శ్రీకాకుళ ఉద్యమానికి మద్దతు ప్రకటించి, శ్రీకాకుళ విప్లవాన్ని రక్తసిక్తం చేసిన బ్రహ్మానందరెడ్డి చేతుల మీదుగా పర్స్ తీసుకోను అని ప్రకటించి వస్తానని ఆయన, అది సాధ్యం కాదని మేం. సరే నిర్ణయం అయ్యాక పెట్టబోయే రచయితల సంఘానికి ఏం పేరు పెడదాం అని అంటే, లాక్షణికవాద రచయితల సంఘం (లావారసం) అని ఆయన సూచించి, దానికి సమర్థనగా ఇవ్వాటి లాక్షణికవాదం మార్క్సిజం అని, మనది మార్క్సిస్ట్ ఈస్థటిక్స్ అని ఆయన తన సహజమైన ధోరణిలో చాలా ఆసక్తికరమైన సాహిత్య చర్చ చేశాడు. చివరకు రాత్రి పన్నెండు గంటల సమయానికి అభ్యుదయ సాహిత్య వేదికను బహిష్కరిస్తూ 'విప్లవ రచయితల సంఘం' ఏర్పడినట్లుగా ఒక ప్రకటన తయారు చేశాం. శ్రీశ్రీ అధ్యక్షుడు, కొకు, రావిశాస్త్రి ఉపాధ్యక్షులు, కెవి రమణారెడ్డి కార్యదర్శి, జ్వాలాముఖి, చెరబండరాజు, నిఖిలేశ్వర్, నగ్నముని, నేను అడహక్ కమిటీ సభ్యులుగా విరసం ఏర్పడింది. ఆ ప్రకటన తెల్లవారి ఒక సంచలనంగా పత్రికల్లో వచ్చింది. ఈ

ప్రకటనతో పాటు వరంగల్, కరీంనగర్ నుంచి తెచ్చిన కరపత్రాలు పైన పేర్కొన్న యువకులు ఆ సభలో పంచితే, అక్కడ అరసం, ప్రభుత్వం కలిసి ఏర్పాటు చేసిన వాలంటీర్లు వాళ్లని ఒక గదిలో బంధించి కొట్టడం ప్రారంభించారు. ఆ విషయం తెలిసి వేదిక మీద ఉన్న గుంటూరు శేషేంద్ర శర్మ, ఆరుద్ర వాళ్లు పంచుతున్న కరపత్రాల్లో, సాహిత్యంలో విషయాలతో మాకు ఏకీభావం లేదు. మేం ఈ సదస్సులో పాల్గొంటున్నాం. కాని ఆ యువకులకు ఆ కరపత్రాలు పంచే భావస్వేచ్ఛా, హక్కూ ఉండాలి. వాళ్లను వదలకుంటే మేం కూడ దిగిపోతాం అని హెచ్చరించడంతో వాళ్లను వదిలేశారు.

అట్లా నా జీవితంలోనూ, తెలుగు సాహిత్య జీవితంలోనూ ఒక మలుపు అనదగిన విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. ఆ సంఘం ఏర్పాటులో సంస్థాపక సభ్యుణ్ని అయ్యే ఒక చారిత్రక కర్తవ్యాన్ని కాలం నా మీద పెట్టింది. చలసాని ప్రసాద్ అయితే విరసం ఏర్పాటు దాకా చెప్పి రెస్ట్ ఈజ్ హిస్టరీ అంటాడు.

అట్లాగే నా ఈ ప్రసంగం ఇక్కడి దాకా వచ్చి చూసుకునే వరకు గంటంపావు అయింది. ఇంక ఇక్కడ ఆపేస్తాను అన్నాను. అధ్యక్షత వహించిన సి. నారాయణరెడ్డి గారు 'ఇది మొదటి భాగం' అన్నారు. ఇప్పటికి ఇది నా పరిణతి ప్రసంగంలో మొదటి భాగం.

❖ ❖ ❖